భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

ఏప్రిల్ **1963**

సంపుటము **40** : : సంచిక 4

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1963

*



శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు
25-వ పుణ్యావర్థంతి : చైత్రశుద్ధ ద్వాదశి శుక్రవారం 5-4-63

దేశోద్ధారక ప్రశస్తి

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

శ్లో॥ దేశోద్ధారక మాంధ్రదేశ వసతా
సౌభాగ్య సంధాయకం
విశ్వస్వం స్వమనన్య సాధ్య
గురు సౌదార్యేణ సంధాయకం
ఆంధ్రాయాన్, సహజాన్
స్వభావ మధురైర్వాక్యై
స్సమారాధకం
కాశీనాథకులేందు మానతశిరా
వందేయ నాగేశ్వరం.

కం. బుద్ధిమనోవాక్కర్మల
సద్ధర్మము నల్పినట్టి
సచ్చరితునకున్
శ్రద్ధాంజలి నిడుదును న
న్నద్ధుడనై కాశినాథ
నాగేశునకున్.

*

శోభకృత్ - స్వాగతము

శ్రీ అక్కపెద్ది సత్యనారాయణ

స్వాగతము నీకు శోభకృత్ వత్సరమ్మ!
స్వాగతము నీకు మంగళస్వామి! రాజ!
స్వాగతము మంత్రిమణి! మంద! శనిమనీషి!
స్వాగతము సైన్యపతి! నీకు వంగుకాల!

మీ రాజ్యంబున చీనిమందలకు సామీచీన్యమెట్లుండునో!
మా రాజ్యంబును ముట్టడింతురటవే! మాయల్ ప్రపంచించి వి
స్తారాస్త్రప్రచయంబుతో విషశిఖల్ ధారాప్రపాతంబుగా
నారంభింతురె మృత్యువాత్యలు లయాహంకారహుంకారులై!

మహిజుడు రాజు, మందమతి మందుడు మంత్రియు కేమి కావలెన్
దహన విహార్చులేకురియు తల్లడమంది ప్రజల్ భయార్తులై
తహతహలాడి పోవుదురు తాదృశ సంకటముల్ హరించి ఓ
సుహృదయమూర్తి! శాంతినిడి శోభకృదబ్దము పేరు నిల్పుమా!

కాలము సర్వకారణముగా వచియింతురు ద్రష్టలెల్ల, పో
గాలమువచ్చి కయ్యమునకై యుబలాటము పొందుచీను లి
య్యాలము సర్వనాశమని యాగరు దుర్దశప్రోత్సహింపగా
ఈలయవేళ మాకు జయమిమ్ము నవాబ్దమ! సాధుశబ్దమా!

స్వస్తి భారతధర్మ సమస్తమునకు
స్వస్తి నగరాజ శిఖర సర్వస్వమునకు
స్వస్తి దేవతానిలయ ప్రశస్త భువికి
స్వస్తి విద్యావివేక కృతాస్నప్తమతికి.

అర్ధశతాబ్దపు ఆంధ్రకవిత్వము:

జాతీయ రచనలు

శ్రీ డాక్టర్ పాద గోపాలకృష్ణమూర్తి

6

వందేమాతరోద్యమము నవ్యకవిత్వావిర్భావానికి కొంత కారణమైనదని మనవిచేశాను. అంతవరకు దేశీయుల వ్యవహారంలో 'వంగ దేశమూ, పాంచాలమూ, మహారాష్ట్రమూ' అంటూ విడివిడిగా ఉండిన రాష్ట్రాల నన్నిటినీ రంగరించి 'మాతృదేశము' గా కూర్చి అర్చించినది వందే మాతరోద్యమమే. దీనిని తమ శ్రేయస్సుకు విరోధినిగా గుర్తించి బ్రిటిషు వారు 'వందేమాతరం' అన్న పలుకునే నిషేధించారూ, భారతీయ తత్వానికి అనుకూలమే కావడమువల్ల ఇది—ఆంగ్లులకు వ్యతిరేకోద్యమంగా విజృంభించింది. బహిరంగంగా ప్రభుత్వాన్ని వ్యతిరేకించలేకపోయినా, 'దేశసేవ చేయండి' అన్న దాని ప్రబోధపు నీడలో మాతృదేశ సంకీర్తనమూ, దైన్య స్థితీ వర్ణించి ప్రజలను ఉత్తేజితులను చేసినారు కవులు.

గురజాడవారు అట్టి కవులలో ప్రథములు. 'దేశమును ప్రేమించుమన్నా' అన్న వారి గేయము వందేమాతరోద్యమ ఫలమే. దీనిలో ధ్వని రూపంగా కాక మిత్రసమ్మితంగా ఉపదేశపూర్వకంగానే మాటలతోకాక చేతలతో ప్రజకు మేలు చెయ్యమనీ, ఒళ్లువంచి పాటుపడి దేశిసరుకులు నింపమనీ, వెనక్కి చూడక ముందుకి అడుగు వెయ్యమనీ, ఐకమత్యం నేర్వమనీ, దేశాభిమానమంటే దేశీయుల యెడ నభిమానమనీ, కవిత్వ మన్నది దేశీయులను ప్రబోధించాలనీ చెప్పారాయన. స్వాతంత్ర్యము వచ్చిన ఈనాడు కూడా ఆ మాటలకు వాడి తగ్గలేదు. ఈనాడున్నూ, దేశీయులు నేర్వవలసిన వవే. దేశ స్వాతంత్ర్యము కోసము యుద్ధము అవసరమని ఆయన గుర్తించారు. "ఉసురులకు విసిగితివో ? యుద్ధము కలదు, దేశము కొరకు పోరుము" అన్న అంతర్వాణిని పలికించారు గాని తమకు కాలము దాటిపోయిందని విచారించారు. వ్యక్తుల దౌర్జన్యాన్ని రాజుల దౌర్జన్యాన్నీ 'మాన్యంబులియ్య సమర్థుడొక్కడు లేడు, మాన్యములెర్రుప సమర్థులంత' అని ఉపాలంభంగానూ 'పదుగురు కోతి వెంబడి సంచరింపరే, వాహకుల్లేరే శవంబునకును' అని తిట్టుకవిత్వములోనూ మొరబెట్టుకునే దశనుండి 'అన్యాయానికి ఎదురు తిరగండి' అని తోడి వారిని ప్రబోధించే స్థితికి కవిని సానబెట్టి, వందేమాతరోద్యమము గురజాడద్వారా తెలుగులో వినబడింది.

అయితే, భారతదేశాన్ని మొత్తంగా ప్రబోధించ యత్నించిన మొదటి ఉద్యమము—1857 స్వాతంత్ర్య యుద్ధం తర్వాత—వందేమాతరోద్యమమే కావడము చేతనూ, "వందే మాతరం (మన్దే రాజ్యం)" అన్న నినాదాలను ప్రభుత్వము నిషేధించి ఉండుటచేతనూ ఆ ఉద్యమము తెలుగు దేశములో ఎక్కువగా వ్యాపించలేదు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రము ఏర్పడాలన్న ఉద్యమము నై ఉద్యమానికి ఛాయగా నైతే నేమి, ఆంధ్రులకు, అపరజులకు లభించగల సౌకర్యాలు మాత్రమే లభిస్తున్నాయన్న అమర్షమువల్ల నైతేనేమి, వేరు తన్ని పెరిగింది. నెల్లూరులో 1913 లో జరిగిన ఆంధ్ర సభలో ప్రత్యేకాంధ్రరాష్ట్ర తీర్మానము ఉదయము నెగ్గక పోతే, రాయప్రోలు సుబ్బారావుగారు 'నిండారబారు నఖండ గోదావరి దాగిన చాళుక్య నాగరికత, పల్లె పదాల జీవము నిల్పి కొన్న పల్నాటి వీరుల రక్తనాళ పటిమ, పాడైన పెనుకోట గోడల దీర్ఘ నిద్రలు వోవు కాకతి ప్రాభవమ్మో, కదలేక యేడ్చు తుంగాభద్ర కెరటాల మునిగిన ప్రాజ్య సామ్రాజ్య భరమూ, ఆంధ్రుల హృదయాలు వినేటట్టుగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి కంఠంలోంచి పలికితే మధ్యాహ్నసభలో ఏకగ్రీవంగా ఆమోదింపబడిందట. గ్రంథాలయ సర్వస్వమనే పత్రిక రాయప్రోలువారి శంఖారావాన్ని తెలుగువారి కందించింది. మృదువులైన పదాలూ, మెత్తని ప్రవాహశయ్యా, మనస్సు ద్వారా హృదయానికి చేరగల వస్తుధ్వనీ అది మేల్కొల్పగల భావ విభూతీ ఆనాటి రాయప్రోలు రచనలలో మేళవించాయి. అవిన్నీ పుంఖాను పుంఖాలుగా వచ్చాయి. దేశీయోద్యమము ఆంధ్రోద్యమంగా రూపు దాల్చింది. కృష్ణవేణీ హరితసస్య పృథివీ, గౌతమీ పుణ్య కల్యాణ కంఠసీమా, తుంగభద్రా తరంగరంగమూ శమీ పూజలతో, పూనవ్వులతో, ఆటపాటలతో ముఖరితము లైనాయి. జాతి బ్రతికియుండిన నాటి చైతన్య మననము నవచైతన్య స్ఫురణమూ భావావేశమునూ కూడా

కలిగిస్తుంది. రాయప్రోలువారి పద్యాలు ఈ రెండు ఫలాల్నీ పండించి, దేశమంతటా అందించాయి. వీరి "శ్రీలు పొంగిన జీవగడ్డయి, పాలుబారిన భాగ్యసీమై" అన్న గేయము వాచ్య ప్రబోధముతో సంతుష్టి చెందక 'సూత్ర యుగముల శుద్ధ వాసన క్షాత్ర యుగముల చండ శౌర్యము' అను కండగల చిక్కని తెనుంగుల కలిపి పాడి, గురజాడవారి నిసర్గవాణిని కూడా మరపించి తాను విసపడినది. దువ్వూరి రామిరెడ్డి గారు స్వాతంత్ర్య రథము, భారతమాత అని చాలా పద్యాలు రాశారూ, Battle of Blenhemను జ్ఞప్తికితెచ్చే కొండ వీటి కథ వ్రాశారు. దేశీ ప్రబోధమూ, రాష్ట్రీయ ప్రబోధమూ, జాతి ప్రబోధమూ త్రిశూలాపు మొనలవలె నిక్కి వాడిదేరినవి. బెసెంటమ్మ 'హోం రూల్' ఉద్యమమూ గాంధి మహాత్ముని సహాయ నిరాకరణోద్యమమూ అసంతృప్త భారతీయ హృదయాలకు చిచ్చు ముట్టించాయి. ఎండ కన్నెరుగని నారీమణులూ, లేత శరీరపు విద్యార్థులూ, నోరులేని కర్షక జనమూ ఉప్పెన కెరటాలవలె ఆంగ్ల పాలనమీద పడ్డాయి. ఈ సంరంభలో కోటి గొంతులు విచ్చి మ్రోగాయి. బలిజేపల్లి లక్ష్మీకాంతముగారి 'స్వరాజ్య సమస్య' అన్న పద్యాల పుస్తకము చదవవలసిన గ్రంథము. 'సకల రత్న ప్రభాచటులాంబరంబైన హిమనగం బాత పత్రముగ మెరయ, చేరి భాగీరథీ సింధునదీ తటుల్ వింజవీచీ చామరములు వీవ, ప్రాక్పశ్చిమాగ్ర భూముల గొల్చి గభీరవారి ధీశ్వరులు కైవార మొనగ, ఆర్య సంతతి యుదాత్తాను దాత్తముల్తైన స్వరముల స్వస్తివాచనము లిడగ ముప్పదియు మూడుకోటుల ముద్దు సుతులు, సమత తనయాజ్ఞ శిరసావహింప, సింహాసద్వీప పీఠికాసీన యగుచు, కరుణ జగమేలుగాత మా భరతమాత' అని దేశ మాతృస్తవమునే కాక 'గౌతమీ కృష్ణవేణీ తుంగభద్రాది పావనోదక ముగ్గుబాల త్రావి, నన్నపార్యాది మాన్య కవిత్రయముచేత నల్లనల్లన మాటలాడనేర్చి, ఆంధ్రరాష్ట్ర స్థాపనాచార్యవర్యుడౌ విన్నవర్ధను భుజాపీఠి నెక్కి, ఆంధ్రసేవాపరాయణ కృష్ణరాయాదిపతులచే సకల సంపదల బొదవి, కడుపు చల్లగ గాంచి పెక్కండ్ర సుతుల బాహు విక్రమతేజః ప్రభావధనుల నిస్సమాన మహోన్నతి వెగడినట్టి ఆంధ్రమాతా నమస్కార మమ్మ నీకు' అని ఆంధ్ర మాతృస్తవమును అందముగా చేసినారు బలిజేపల్లివారు. వారి నాటక కవిత్వము రసభావ సమంచితము. నదీ ప్రవాహ సదృశము. ఆ సుందర సంస్కారము దేశ సేవకు పూనినట్లయితే లోకులు బ్రహ్మరథము పట్టరా? ప్రతీ సభలోనూ ప్రార్థనా పద్యాలు ఈ రెండుగానే వెలసినవి. ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణగారి 'రసపుత్ర విజయములోని' 'అల హిమాద్రియు వింధ్య మాల్యావళియు చుట్టు పెట్టని గోడలై పెంపుమీర, అలిమించు కైబర్ బోలాన్ కొండకనుమలు ద్వారంబుల విధాన తనరుచుండ', అన్న పద్యమూ ఇతరుల పద్యాలూ వీటి యెత్తు నందుకోలేదు. నాటికి నేడు జాషువా కవి 'సగరమాంధాత్రాది షట్చక్రవర్తుల యంకసీమల నిల్చి నట్టిసాధ్వి, బుద్ధాది ముని జనంబుల తపంబున మోద బాష్పము ల్విడిచిన భక్తురాలు, కాళిదాసాది సత్కవి కుమారుల గాంచి కీర్తి సందిన పెద్ద గేస్తురాలు, కమలనాభుని వేణుగాన సుధాంభోధి మునిగితేలిన పరిపూతదేహ, సింధు గంగానదీ జల క్షీరములను కురిసి బిడ్డల బోషించుకొనుచున్న పచ్చి బాలెంతరాలు మా భరతమాత, మాతలకు మాత సకల సంపత్సమేత' అంటూ సాధ్వి, భక్తురాలు, గేస్తురాలు, బాలింతరాలు అని స్త్రీమూర్తి అందపు చాయలను గుప్పెత్తే వరకూ ఆ పద్యాల్ని మరపించే పద్యము రాలేదు.

దేశము యొక్క ప్రస్తుత దీన దశను వర్ణించడము ద్వారా కరుణా, తద్వారా ధర్మామర్షమూ కలిగించడము దేశీయ కవిత్వానికి రెండో ఆయుధము. ఓలేటి నారాయణమూర్తిగారు దుర్గాదాసై 'విశ్వ విఖ్యాత మా విశ్వేశ్వరుని గుడి కటకటా తల్లిలో గలసిపోయె' నని రంగస్థలమునీద అరుస్తూంటే ప్రేక్షకులలో కలకలము పుట్టేది రసపుత్ర విజయనాటక ప్రదర్శనాలలో. "సూత్రయుగముల శుద్ధ వాసన క్షాత్రయుగముల చండ శౌర్యము చిత్రదాస్యముచే చరిత్రల చెరిగిపోయెర తమ్ముడా" అని వింటే గుండె గుబగుబలాడుతుంది. 'అచ్చరలొచ్చి నచ్చున గాయలాడుకుండే రాజ్యములో రయ్యో కొయ్యోడ, కిన్నరులొచ్చి కీర్తనపాడే కీర్తివంత రాజ్యములో రయ్యో కొయ్యోడ' అని పాడితే వెర్రి గొల్లడు కూడ ఉగ్రరూప లాగుతాడు. దీనికి తోడు 'నూరుమంది మలబార్వాసులను, కూరినా డొక పెట్టెలోన, గాలి, దూరనీయడు ఇంచుకైన, నోట, నీరు పోయుడు దేవునాన' అంటూ పరపాలకుల దౌర్జన్యాలను గరిమెళ్ల సత్యనారాయణవలె దండ గుచ్చితే ఈ ధర్మామర్షము అగ్నిపర్వత మవుతుంది.

చారిత్రిక క్షేత్రాలూ, పుణ్యక్షేత్రాలూ శిథిలమైనా యని చూపడము దేశము మళ్లై తిరిగి కృశించినదని చెప్పడమూ, అన్యాపదేశముగా 'దేశాన్ని నీవు పునర్నిర్మించవలెనోయ్' అని చెప్పడమూ అవుతుంది. 'అది తటాకము కాదాంధ్ర కుమార అరివీర దుస్సాధ్యమైనట్టి పరిఘ, అద్ది కుంకుమముగా దాంధ్ర కుమార తెలుగు నెత్తుటి గడ్డ దేరలిన దుమ్ము' అని శేషాద్రి రమణకవులూ, 'కుక్కలు చింపు విస్తరిగ కూలిన యోర్గలు కోటకంటివే, ముక్కున నూపిరుండియును

మాతృక వినబడు గల్గ నాంధ్రుడా' అని వానమామలై వరదాచార్యులూ 'గడ్డి మొలిచెం బురి చారల గద్దెమీద' అని జాషువా, 'శిలలు ద్రవించి యేడ్చినవి జీర్ణము లైనవి తుంగభద్ర లోనల, గుడి గోపురమ్ములు సభాస్థలులైనవి కొండముచ్చు గుంపులకు' అని కొడాలి సుబ్బారావూ పలికినప్పుడు మనలో పుట్టే కలవరము కార్యదీక్షతోగాని సద్దుకోదు. పద్మనాభ యుద్ధమును స్మరిస్తూ 'భయద దాస్య విశృంఖలా బంధితుడవు, ఓయి! జీవచ్ఛవాంధ్రుడా! ఒక్కమారు ఒలుక నిమ్మిటు నింత రవంత బాష్ప మలినధార స్వాతంత్ర్య సంప్రాప్తి కొరకు' అన్న పురిపండావారి పలుకు అందుకు సాక్ష్యమే కదా? .... చారిత్రిక క్షేత్రాలు ఒకప్పుడు ఉన్నతదశలో ఉండినవని కీర్తించడము ధ్వనిపూర్వకముగా ఈనాటి దుర్దశను నిర్దేశిస్తూ కలత పెట్టడమే అవుతుంది. దేవులపల్లి రామానుజరావు ఓరుగల్లును గురించి 'అల్లని స్వేచ్ఛకై వెల్నారి వెరజాణ పఠియించె నిచటనే భారతంబు' అన్నప్పుడు తిక్కన మహాకవి సద్యత్నము మెఱుపు కొట్టుతుంది. కొండవీడులో 'గజపతి ప్రౌఢోగ్ర కరిఘటాకుండా నిధూతాంబు విచయ బిందూత్కరము' ద్వారా విశ్వనాథవారు ఆ 'మోహంపు టురిత్రాడు దుర్గ' ప్రాచీన శోభను చూపిస్తున్నారు. 'వరదరాజమ్మ కంబముపొంత నిలిపిన మగని పేరిటి సుధామల సరస్సులో' జాషువాగారు విజయనగరపు రత్నాల విపణివీథిని ప్రతిఫలింపజేసినారు. ఈ పూర్వోన్నత్యానికి పోరును ఈనాటి దైన్యము. రెండూ రెండు చక్రములై దేశసేవా శకటమును నడుపవలెనని రచయితల కోరిక.

ఈ సంరంభములో వచ్చింది విశ్వనాథవారి ఆంధ్ర ప్రశస్తి. ఆ రావడము సభలలో తుఫానులాగ క్షణక్షణావరోహణాలతో, కంఠ గాద్గదికతతో, ఉరుములతో, ఆపులతో, పరువులతో వచ్చింది. ప్రబోధమూ, సంగీతమూ, కవనమూ, వాచికాభినయమూ చేరి తెలుగువారికి ఒక వింత ఘోషగా వినబడింది ఆంధ్ర ప్రశస్తి. ఉత్సాహపూరితు లాంధ్రులు విని హర్షించారూ, అనుకరించారూ, ఆనందించారు. ఆనాటి తీవ్రవాదుల దేశభక్తి గేయాలూ, పద్యాలూ చేసిన అపాయకర వాచ్య ప్రబోధ వాతావరణంలో అరచాటుగా దేశభక్తిని ఉద్బోధించే ఈ ఖండకావ్యాలు యువకులకు ప్రచ్ఛన్నాయుధాలయాయి. అందరూ విన్నారూ, వినిపించారు.

ఈనాడు ఆ ఉద్వేగమూ సంరంభమూ లేవు. రచనలు సముద్ర తరంగాల్లాగ వచ్చాయీ ఉద్యమాలు ఝంఝామారుతాల్లాగ పోయాయి. రచనాదర్శాలు బోనులో కెక్కాయీ సమర్థించినవారు సమర్థించారూ, విమర్శించినవారు విమర్శించారు. ఈనాటి తత్వంతో వెనక్కి చూసి పరీక్ష చేసుకోవలసి వస్తోంది మనం ఆంధ్ర ప్రశస్తిని. కాలాన్నిబట్టి ఆ కావ్యానికి వచ్చిన ప్రశస్తి జారిపోతుంది ఈనాటి సమీక్షలో. అంటే, అది తప్పనిసరి.

ఆంధ్ర ప్రశస్తిలో తెలుగునాటి చరిత్రలో కవికి నచ్చిన భావఘట్టాలను ఇతివృత్తముగా గ్రహించి రచించిన ఖండకావ్యాలు పంధ్రెండున్నాయి. 'ఆంధ్ర విష్ణువు' శ్రీకాకుళము రాజధానిగా ఏలుతూ సరదార్ల విన్నపాలు విని—శ్రీశైలం ప్రాంతాలలో విధ్వంసము కలగజేస్తూ ఉండిన—నిశుంభుడనే రాక్షసుణ్ణి ఆంధ్రవిష్ణువనే రాజు చంపిన కథ. దీపకర్ణి మహారాజు వేటకు పోయి ఒక యక్షుని వల్ల శాతవాహన కుమారుణ్ణి పొందడము 'శాతవాహనుడు'. మాధవవర్మ మహారాజు తన కుమారుడు పేదరాలి కొడుకు దుర్మరణానికి కారణమైనాడని అతని మరణదండన నామోదించుట 'మాధవవర్మ'. 'నన్నయభట్టు' భారతావతరణ దృశ్యము. 'ప్రోలరాజు కథ' కాకతి ప్రోలరాజును అతని కుమారుడే అయిన రుద్రుడు తెలియక పొడిచిన కథ. 'చంద్రవంక యుద్ధము', 'యమదంష్ట్రిక', పల్నాటి యుద్ధమూ, రాయచూరు ముట్టడీ నాటి కథలు. కొండవీటి పొగమబ్బులు, ముఖలింగము, వేగిక్షేత్రము అన్నవి కవి ఆయా క్షేత్రములను దర్శించినప్పుడు ఆయనకు కలిగిన భావాలు. కాబట్టి ఆంధ్ర ప్రశస్తిని కథాకావ్యాలూ, భావకావ్యాలూ అని రెండు భాగాలుగా చూసుకోవచ్చును మనము. కథాకావ్యాలు ఏదో కథను వినిపించేవి. ఇవి మొదలుపెట్టిన దగ్గరనుంచీ చివ్వరి వరకూ చదువరి అపేక్షను పోషిస్తూ లాగి చివ్వర, వాటి పరిణామ సౌందర్యమువల్ల సద్యః పరనిర్వృతిని కలిగించాలి. చివరిదాకా వినాలని ఆసక్తి కలిగిస్తూ చివ్వర విన్న ఫలాన్ని కలిగించని కథకు ప్రయోజన మేమిటి? సత్యనారాయణగారి కథా కావ్యాలలో మాధవవర్మ మనలను పట్టి లాగుతుంది చివరి వరకూ. విజయవాటిక కోటవీథిలో రాజపుత్రుడు కొత్తగా కొన్న తురంగములు పూన్చిన రథముమీద వాహ్యాళి పోతాడని రాజభటులు ప్రజను వీథి పక్కలకు ఒత్తుతూన్నారు. నిమేషమంద మెఱుములుఱుములై వచ్చి రాసుతుని స్యందనము కదలి దాటిపోయినది. తచ్చక్ర ఘట్టితాంగుడయి నెత్తురోడికలు గట్టి పడినాడు ఒకడు. అంతలో సూర్యుడు అస్తమించినాడా అస్తగిరి గహ్వర స్థితాంధకారము కృష్ణసర్పమువలె దిక్కులన్నిటినీ ఆక్రమించినది. మరునాడు పేదరాలు కొడుకు శవాన్ని తీసుకువచ్చి చూపి న్యాయమో,—జరిగిన అన్యాయానికి ఇంకా కలిపి—అన్యాయమో చెయ్యమని కోరి రాజా ధర్మాసనము ముందు పడి చచ్చిపోయింది. ప్రాడ్వివాకులను ధర్మ

నిర్ణయము చేయుమని కోరినాడు మాధవవర్మ. వారు 'ప్రాణమ్ము ప్రాణమును బదులు కోరుననీ, 'స్మృతికి భూమీజాని సుతుడనీ కాడనీ లేదు' అనీ అన్నారు. తీర్పు వినినంత సేపు ధాత్రీపతి మోము కనుతుదలనైనా కదలిక కలుగలేదు. తీక్ష్ణ మార్తాండమూర్తి ఆకాశమధ్య సౌధాగ్రము చేరేడు. కృష్ణవేణి ఇంద్రకీలాద్రి ఒడ్డు తాకి మొరసినది. ధర్మాసనమున నున్నపు డెంత గంభీరుడో, దిగి అంత దుఃఖదళితుడైనాడు రాజు. నాటి దివసాంతమున యువరాజు మేనిరక్తము అసృగుదిత ప్రవాహమై పారింది. నటశివ నూపుర రవాను కారి చిటచిటచిట నినదోద్భట కనకము విజయవాడలో వర్షము కురిసినది. కథలోని పాత్రల భావమునూ, చదువరి భావమునూ రంగరించి కథలోని ప్రకృతి వర్ణనమువల్ల ధ్వనింప జేయడము సత్యనారాయణగారి ప్రత్యేక శక్తి. తీర్పును విని విజయవాడ ప్రజా సచివులూ మాత్రమే కాక తీక్ష్ణ మార్తాండమూర్తి ఒడ్డులొరసి ఎగసే కృష్ణవేణి కూడా ఉద్రిక్తులౌతారు. ప్రకృతి చైతన్యానికి తమ కథతో గల సానుభూతిని విశ్వనాథవారు పద్యకావ్యాల్లో కంటె ఏకవీర, వేయి పడగలు, వంటి గద్య కావ్యాలలో ఎక్కువ ఉపయోగించుకున్నారు. చివరకు వీరి చేయి సంస్కరించిన 'వక్రరేఖ' (మువిమాణిక్యంవారి నవల)లో కూడా ఈ రకపు భావధ్వని మ్రోత వినపడుతుంది పలుమార్లు. వచనములో రచయిత వాక్యాన్ని ఇష్టము వచ్చినట్లు వంచి నిశితము చేయగలడు. పద్య మనగానే గణాలూ, యతులూ, ప్రాసలూ తెచ్చే నిర్బంధాలూ సంప్రదాయాలు మోసుకొచ్చి మన ముందు పడవేసిన ఉత్ప్రేక్షలూ సమాసాలూ, దూరాన్వయాలూ, పాదపూరణావసరమూ, భాషా—, అన్వయ—, వ్యతిక్రమాలూ ప్రవేశించి కవిని చెప్ప గలిగినట్లుగా చెప్పవలసి వచ్చినట్లుగా చెప్పనివ్వవు. కవి వచన పద్ధతిగా ఉన్న రచనను పద్యశయ్యలో ఇమిడ్చి లాగితే ఛందస్సు సమకూర్చగల అందపుగతి చెక్కుకుపోయి పద్య సౌందర్యము నష్టమవుతుంది. సత్యనారాయణగారి అసంఖ్యాక పద్య రచనలలో ఈ చికాకులన్నీ కానవస్తాయి. 'ప్రవహించినావు, నైశ్చల్యము, నైష్ఫల్యము, ముర్మురించు, పావిత్ర్యము, నైర్మల్యంచె, శీతలింపించె, ప్రతిఫలింపించె, తెండా, ఆంధ్యము, పట్టుబడలేనేలేదు, ఎరిగిలేను, ప్రహ్వీకరింపబడియె, వెల్ల రేగు, (శోకాతి విషణ్ణులై) మనెదరు, మృగీమదము వంటి పదాలు వచన రచనలో వాడరు వారు. మరి పద్యాలలో ఎందుకు వచ్చాయన్నమాటా ? 'కాషాయ రమ్యవల్కల హుతాశన క్రియా సంపిహితాశ్వత్థ సామిధేని' అంటూ అలంకార సాధన కోసము అల్పపు పోలికనైనా సరే ఉపయోగించడమూ, 'గంగాంభోజాలూ కృష్ణవేణీ ప్లవన్నీరేజాలూ పెన్నానదీ సముత్పన్న కైరవాలూ కళింద తనయా వ్యాకోచ (!) నీలాంబుజాలూ సాగరమేఖలా చారు కుచద్వయీ జాయి ఆంధ్రావని చక్రవర్తి' అంటూ లేని పదార్థాల్ని చూచి వచ్చినట్టు వర్ణించడమూ కవిగారి ఆ ప్రాచీనాచారాభిమానాన్ని తెలుపుతాయి గాని తెలుగుకవి పట్టిన సౌందర్యహారతికి ఒక స్నేహబిందువునైనా చేర్పవు. సౌందర్యము వర్ణించడానికి కలము పట్టినవాడల్లా యక్ష తనయేందు జయంత వసంత కంతుల వరకూ వెళ్లిపోవచ్చును కల్పాంతముదాకా ! వెళ్ళలూ౦డదమేనా అని ! కుపిత శంకరనేత్ర కుహరాగ్ని దగ్ధ మన్మథ దేవునకును ప్రాణ ప్రతిష్ఠ యట ఋషికన్య. మన్మథుడు మగవాడు, ఈమె ఆడది, ప్రాణము స్త్రీయా ? నాకు తెలియదు. "సిద్ధఖేచర యక్ష కాంతలా సౌగు ప్రాకార మార్గమనుసరించెదరు" ట ! ఎవరి కోస మనుసరిస్తారూ ? వారికి ఆలయాలా మన్నా ? భూలోకానికి దిగకపోతే నాటినుంచి నేటి వరకూ వారికి దిక్కేదీ ! కవుల లట సామగ్రిలో అల్లిపెట్టిన దంతా కనిత్సమే ! గౌతమీ పుత్ర శాతకర్ణి సైన్యములో "కంచు రథాలపై తెలుగువారన్నన్న యొక్కొక్కడే మాపన్ గల్గను ముష్టిఘాతముల దిజ్మత్త ద్విపేంద్రములన్" ట ! ఈ రకపు గొప్పతే టప్పాలు కొట్టుకుంటూ ఎన్ని శతాబ్దాలు నడుపుకు వచ్చారు ప్రబంధ కవులు తెలుగు కవిత్వాన్ని ! చుట్టుచూపు వచ్చిన ఈనాడు కూడా, సమకాలిక నాగరిక జాతులకు చూపడానికి తెలుగు కవిసమ్రాట్టుల కవితా సామగ్రి యిదేనా ? కొండవీటి పొగమబ్బులు 'దగ్ధాంధ్రరాజ్య నిత్యవిధూత ధూమములు, 'బురుజు కొమ్ముల వీడిపోలేని రెడ్లకీరితి' యట, 'దాగ్ధావదాంధ్ర స్వతంత్రకారమ' యట. పోయే మబ్బులకు పోయే వాటన్నిటితోనూ పోలికే ? వస్తు సామరస్య మవసరములేదు ! సంస్కృత సమాసాలు భావాలు తక్కువై నీరసపు టాలోచనలు యొముకల్లాగ పొడుచుకు వస్తూంటే అవి తోచకుండా కప్పిన బొంతల వలె పనికివచ్చాయి తెలుగు కవులకు. ఆ సమాసాలను వాడుటే గొప్ప అని నేటి కవులు కూడా భావించడము తెలుగు సరస్వతి దురదృష్టము. 'హిమక్షితిధర కన్యకా సౌందర్యధనుడు శ్రీశైలరాజు' ఆంధ్రపతిచేత సేవింపబడ్డాడట నిశంభునిమీది దండయాత్ర సందర్భములో. ఆంధ్రరాజు శ్రీశైలస్వామిని సేవించడము చుట్టూ ససానపు మెత్తలేనో ? తెలుగులో వ్రాసిఉంటే కనబడును భావముయొక్క సత్తువ. "సముద్భవ నినాద బధిరి తాశాచయంబులు పగిలిపో" పు వట్లుగా నిశంభునిపై పిట్టపిడుగు పడిందట. "సముద్భవ నినాదము" రణోద్భవ నినాదము కాదు ! సముద్భవము ! సంస్కృత రక్ష

లేదు! ''దైత్యాధిపునకు'' 'దైతేయేంద్ర' 'దైత్యేంద్రుడు' అన్నమాట లున్నాయి. ఉన్నవా డొక్క దైత్యుడేనే? వీడి ఆధిపత్యాన్ని నిరూపిస్తూ పారిపోడానికేనా దైత్యేతరులు లేరు! 'పురరాజ్య లక్ష్మి' ట. పురరాజ్యము! 'అమృత వాసనాలహరి' అవును. అసలే లేని నదీ నీరేజముల నుంచి వచ్చేది అమృతవాసనాలహరీ కల్లోలమే కదా? 'అహిత మహావహిమ', వాక్కుల కోలాహలంలో అర్థము వినబడ నియ్యవు సమాసాలు.

విశ్వనాథవారి కథా కావ్యాలు 'మాధవవర్మ' పాటి లాగవు చదువరిని. కారణము వారి రచనా వైశిష్ట్యమూ స్వేచ్ఛనూ. తను ఊహలను పరుచుకుంటూ ముందుకు వెళ్లిపోవడమే కాని అవి చదువరికి పట్టునా? అని తామే చదువరులై ఆయన చూసుకోరేమో అనిపిస్తుంది నాకు. వా రుపయోగించే విభక్తులు ఒకదానికి బదులు ఇంకొటి తయారవుతూంటాయి, వ్యూహాలు చప్పగా తేలిపోతాయీ పరుషంగా ఎబ్బెట్టుగా ఉంటూంటాయీ, కవిగారి వ్యాఖ్యానాన్ని పలుకుతాయి పాత్రలు. ''అనుపలు కాంధ్రవిష్ణని ముఖాగత మయ్యెనా లేదో దాని వించునె సరదార్లు దైత్యుడు నిశుంభుడు చచ్చెను జచ్చెనంచు లోననుకొనుటొండె బాగుగ దదానవ దివ్య జయారవ ప్రతిధ్వనితమయ్యె నాంధ్ర సభాభవనంబు సాంద్రమై'' అన్నారు. సత్యనారాయణగారు ఈ కావ్యమును సభాముఖాన వినిపించినప్పుడు, 'నిశుంభుడు చచ్చెను చచ్చెనంచు' అన్న మాటలు మహాఝంకారంతో సరదార్లు పలికినట్లే గట్టిగా పలుకుతారు. తీరా చూస్తే (కిరాత) సరదార్లు లోననుకున్నమాటలు అవి! పైకి వచ్చినవి 'తదానవ దివ్య జయారవములు'. అనుకున్నవారు కొత్తవారైన కిరాత సరదార్లు అయి అన్నవారు రాజు తత్త్వము తెలిసిన శ్రీకాకుళపు సరదార్లు అవడము శోభ. 'సాతవాహనుడు' లో యక్షుడు దీపకర్ణితో ''నీ వలినాక్షి శక్తిమతి నిద్రితశయ్యను సర్వశిష్టయై ప్రాణములం ద్యజించుట శుభ ప్రతిపాదకమయ్యె నేటికిన్'' అని మహా యెబ్బెట్టుగా పెండ్లి దివిటీ సామ్యముగా చెప్తాడు. ''శక్తిమతిపోయిన నాటనుండి నీకు, పాపము, ఆశాకిరణమే లేదు. ఇదుగో ఈనాటికి బాలుడు'' అని యక్షునిచేత అనిపించే నేర్పు విశ్వనాథ వారికి లేదనను నేను, ఎవ్వరూ అనరు! లేనిదల్లా లక్ష్యము. తాము అన్నది ఎటు లాగుతోందో రెండోసారి చూసుకో రనుకుంటాను. లేకుంటే, శక్తిమతి తొంగలి రెప్పలను ఆ బాలునికి అమర్చిన వా(ం) యక్షునిచేత నామెను తగలేయిస్తారా? దీపకర్ణి బాలునితో సన్నమాటలలో ''ఈ రాఘవుండు గడింపని దీ కీర్తి, వంశకర్తగుట సామాన్యంబె లే రెందఱయ్యెన వంశ్యుల్ రఘువంశమ్మైన యది కాదా, ఆ మహారాజుపై'' నన్నవి కవిగారి వ్యాఖ్యానపు టాలోచనలు, దీపకర్ణి నోట పుత్రలాభ సమయంలో—ఉపాధ్యాయుని బోధనలు—ఇవి రాణించవు. 'గౌతమీపుత్రలో' 'అనుచు గుసగుసలాడి నా రాంధ్రభటులు' అని, 'కొంద అవి జయారావములందు మునిగె' నన్నారు. ఈ చప్పని ఊహ ఎందుకో?

సత్యనారాయణగారికి కథాకావ్యాలు తీర్చడములో శ్రద్ధ ఎంతో, భావ కావ్యాలు తీర్చే శ్రద్ధా అంతే. అయితే కథలో పేలవ వస్తువూ పేకింగు సమాసాలూ దాటుకు పోతామూ మొత్తపు కథ కలిగించగల ఫలశ్రుతి అనుభవము వాటివల్ల ఎక్కువ నష్టము కాదు. భావాల్ని నిశ్రేణిగా అమర్చి చదువరికి కూడా ఆ భావాలు కలగడానికి చేసే భావ కావ్య రచనలో కవిగారి భావలహరి నిరంతరాయంగా భావౌన్నత్యాన్ని సాధిస్తూనే పోవాలి గాని పేలవపు టాలోచనలు ప్రవేశించరాదు. కథాకావ్యం కంటె భావ కావ్యం సాంద్రతరముగా ఉంటేనే దాని రచన సార్థకము అవుతుంది. లేకపోతే, ఏ ఘట్టములో రచన పలచనైతే అక్కడ కవి కనబడిపోతూ చదువరి తన్మయతకి విరుపులు ఏర్పడతాయి. 'వేగి క్షేత్రము' లో 'ఏరాజు పంచెనో యిచట శౌర్యపు పాయసమ్ములు నాగులచవితినాళ్ల' అన్నారు. నాగులచవితికి పాయసము పంచే ఆచారము తెలుగునాట లేదు. మరి మన మెరుగని ఆచారపు భుజాలమీద నిలబడి పొందవలసిన భావ సౌందర్యాన్ని ఆచార వ్యతము దాటేసి పొందగలగడము ఎలాగ సంభవించగలదూ? 'ఏ యొజ్జి సంజలో వెలమి పల్లవ రాజరమణులు కాళ్ల పారాణు లిడిరో' అన్నారు. ఏమీ? పల్లవ రాజరమణులు ప్రతీ దినమూ పారాణి పెట్టుకుంటూనే ఉండరూ? యొజ్జిసంజ శుభాశీర్వాదానికి ఒక యొజ్జి సంజ ప్రత్యేకత ఏమున్నదీ— ఏ యొజ్జిసంజ అనడానికి? అయితే రాణులు ముత్తయిదువల కాళ్లకు మాత్రము పర్వదినాల్లో పారాణి పెట్టి మొక్కుతారు. అప్పుడు ఎర్రసంజ 'ఆ పారాణి యెరుపు రాణులచేతా మరుటా కాలా చిరకాలము నిల్చెనాక' అంటే శోభ. 'ఏ యొజ్జి సంజలో వెలమి పల్లవరాణి రమణుల కాళ్ల పారాణు లిడెనో' అనో అంతకంటె బాగానో తీర్చి ఉండవలసినదేమో? నాలుగో పాదములో మూడు పాదాలతోనూ చూపిన కారణపు మిష ఏమీ సూచించకుండానే 'ఏ రెండు జాముల ఘనుని వేడిమి వచ్చి కలిసిపోయెనో త్రిలింగ ప్రభువుల' అన్నారు. కవిగారు కలిపి పామన్నారనా కలిసిపోయింది? వీరి సీసపద్యాల పాదాలు

మూఘు వడిచేసరికి నాలుగోది ఇంకోదారి తీస్తుందా అనిపిస్తుంది 'ముఖలింగమూ' 'వేగిక్షేత్రమూ' చదివితే.

కవియొక్క భావాలు కవిత్వము కావు. చదువరులకు కూడా ఆ భావాలు కలగడానికి చేసిన రచన కవిత్వము. సత్యనారాయణగారు ఛందో బందోబస్తును మించి 'రచించే' యత్నము ఒకపటాన ఎక్కువగా చెయ్యరేమో అనిపిస్తుంది నాకు. ఒక ఉదాహరణము చెప్తాను చిత్తగించండి. 'శృంగారవీథి' లో రాధ "అమ్మదులోజముల్ మృదుశ్రీ చరణాంకితంబులుగ (కృష్ణుడు) నృత్యముచేసె నకింకిణీధ్వనిన్" అన్నది. వజ్రము దొరికింది సత్యనారాయణగారికి! కృష్ణుని పాదాలవలెనే వారి రచనాకన్య రాధాస్తన మండలీ శృంగార వీథిలో నృత్యము చేయబోయింది. అయితే యిక్కడి అందమంతా శ్రీకృష్ణుని నాట్యములో కాదు. ప్రభువు కాళియుని పడగలమీద కూడా కింకిణీధ్వనితో నృత్యము చేసినాడు. అందమంతా, స్వామి నృత్యముచేసిన సుందర రంగపు తెరవెనుక రాధ హృదయపు టానందములో ఉన్నది. అది శృంగార వీథిలో దారితప్పిన కవిగారికి అక్కడ స్ఫురించలేదంటాను. అయితే ఈ ఊహ పరిణతికి రాలేదన్న తపనలో పక్కవై పక్కవై చివరికి 'వేయి పడగలు' లో 'నీ చరణ యుగంబు నాదు చన్నుల మీద మోపి బాధ హరింపు వరింపు మాధవా' అన్న గిరిక ప్రార్థనగా పునీతమై వచ్చినది. రాణి తన కులమును నిందించుకొన్న దన్నారు. సత్యనారాయణగారు ధన్యులు. ఆయన కూడా తన పౌరుషమును నిందించుకునే ఉంటారు. కృష్ణశిరసి మండనమైన ఉదార పదపల్లవమును మించిపోయి పరాంకోటినందిన రాధికాస్తనమండలాంకిత బాలకృష్ణ మృదుశ్రీ చరణ పల్లవములు ఆనంద కందములు అవెకూ కవికీ మనకూ కూడాను! .... భావ కావ్యాలు క్లుప్తముగా ఉంటాయి కనక దిద్ది తీర్చి అతి జాగరూకతతో నడిపితేనే కాని అవి చదువరిని చివరిదాకా లాగవు. సత్యనారాయణగారిది ఉఱుములా మెఱుపులా తత్వము. కావ్యాన్ని వెన్నెలలో నావ ప్రయాణంగా నడిపించడముకన్న జరాలున జలధారలలో కిన్నెరసానినివలె—పల్లటీలు కొట్టించడము ఆయనకు ఎక్కువ ఇష్టము. అందువల్ల వెన్నెలరాత్రిని కంటె మెఱుపుల రాత్రిని ఎక్కువ స్ఫురింపజేస్తాయి వారి రచనలు. మెఱుపుకూ మెఱుపుకూ నడిమి చీకటిని పోలిన ఊహాలూ ఆలోచనలూ పాఠకుణ్ణి ఈడుస్తాయి కానీ లాగవు. ఆంధ్రవిష్ణువు వృషత్కశేఖరము హృదయమున నాటు నింతలోన నిశుంభ దైత్యాధిపునకు లోచనాంతములందు మార్తాండ నీలోత్పల బంధు కాంతులూ అవ్యుజ్జ్వలమైన వక్షస్థలమునందు చారు కౌస్తుభ మణిచ్ఛవులూ, గర్భగోళమున విశ్వవహన భారమూ, హృద్వీథిలో అఖిల వేదాంత విద్యాశ్రయ వైరాగ్య విస్ఫూర్తి కలిగినవట. విష్ణువైన ఆంధ్రవిష్ణువి బాణము స్పృశించి హృదయభేదనము చేయు నింతలోన నిశుంభునికి సాలోక్య సామీప్యముల బాధ లేకుండా పూర్తి సారూప్యత కలిగిపోయినది. వాల్మీకాదులు విష్ణుశస్త్రహతులకు సారూప్యత చెప్పలేదు. విశ్వనాథవారు (వారి సొమ్మేం పోయిందీ?) ఇచ్చేశారు. ఇది వారి సందరినీ దాటుకుపోయిన మెఱుగని స్తోత్ర పాఠకులు అనవచ్చును. ఇక విష్ణుదేవుని గతి చూడండి: లక్ష్మీకుచ కుంకుమారుణ కరమును అవతార వంశాంకురాల తర్పణాలకు వాడించారు విశ్వనాథవారు. యాక్కురారే! విశ్వనాథవారికి తర్పణ కర్మలంటే ఉన్న ప్రీతి ఆ ప్రభువుని కున్నదో లేదో మరి! ఇదొక కొత్త గుణము మెఱిసింది స్వామికి పిరి పేకవ్ ధర్మమా అని! 'చెలియలికట్ట' లో పశ్చాత్తప్తురాలైన రత్నావళి కూడా తద్దినాల కోసమే అర్థిస్తుంది. తన అభిమానాలనూ అలవాట్లనూ తన చేతబడిన పాత్రలకు ఆరోపించడము శ్లాఘనీయమైన గుణము కాదేమో? 'అకూత లన్నన్న చంపవు చంపునున్" అన్నప్పటి 'అన్నన్న' 'కుమారాభ్యుదయము' లో (దేవతల) అన్నన్న పురుగుల కన్న గనాకష్టమైతిమే యని దుఃఖ మందువారు' అనడములోనూ, ఆంధ్రప్రశస్తిలో 'అన్నన్న ఒక్కొక్కడే గుద్ది చంపు మత్తద్విపంబులన్' లోనూ వేరై కవిగారి అలవాటుగా కనబడిపోతుంది .... ఇలలోనూ కలలోనూ లేని ఊహాలు వాటి దారిని అవి వెళ్లిపోతాయి గాని చదువరులను పలకరించవు. కోటలూ పేటలూ వంటి మానవ నిర్మాణాలకే పౌరాతన్యము మనం లెక్కవేసుకుంటున్నాము. సత్యనారాయణగారు వేంగి క్షేత్రములోని గాలి పౌరాతన్యమును తలచుకొని నిర్విణ్ణులైనారు. సూర్యబింబమే సాంద్రవాయుగోళ మంటున్నారు వైజ్ఞానికులు! అయితే గాలి పౌరాతన్యము ఆంధ్రప్రశస్తికి చాలా ముందుది. "ప్రాక్సముద్రమం దానిన నీరు పశ్చిమ మహాంబుధి ద్రావుము' అన్నారు శాతవాహనుణ్ణి. వాడు పాపము మేఘవాహనుడేనా అయినాడు కాడు, మేఘము సముద్రమునుంచి గ్రహించిన నీటిని త్రాగేవాడు! ఇప్పుడు ప్రాక్సముద్రమూ పశ్చిమ మహాంబుధీ లభించాయి అతనికి నీరు త్రాగడానికి. కవి మనసులోని వూహ మాటల్లోకి రానక్కరలేదా? ఉజ్జ్వలతకు లెక్కపెట్టని ఆలోచనలూ ఆవేశము నిల్పని భావాలూ కవి కల్పించిన కొత్త సమయాలూ ప్రవేశిస్తే కవి స్ఫురణా రచనాగుణస్ఫురణా కల్పించవా పాఠకులకు? (ఆంధ్ర విష్ణువులో నాలుగో పద్యమూ, శాతవాహనుడులో నాలుగో, పదో, పండ్రెండో పద్యాలూ, మాధవవర్మలో పేదరాలి మొదటి పద్యములో రెండో సగమూ, ఆఖరిది కాని చివరి పద్యములో మొదటి పాదమూ, వేగి క్షేత్రములో ఎనిమిదో పద్యమూ చూడండి.) చిత్ర మేమిటంటే ఈయనకు శక్తివంతమైన రచన చెయ్యడమూ బాగా తెలును! "పాడిన గీతమే మరల పాడెదం గూడిన భావమే మరి గూడెద వేమి సేయవలె గుండియ శోషిలి దుఃఖ

వేదనల్ గడిచె నా హృదంతర ముఖరంబున మహా తొలినాటి కీర్తి రవళించిన నాడు వాక్కు తెగబారెడు మహోత్తు పథాల నెంబడిన్'' అంటూ వినేవారి మనస్సును కళ్లెము బిగిచ్చి పట్టినట్లు పట్టగలరు. ''నా జాతి పూర్వ ప్రథా జీవరహితమై శక్తి నాడులయందు చచ్చిపోయె, నా మాతృభూమి తేజో మహ శ్చ్యుతమ ప్రబ్రహ్మక్షత్ర తేజంబు సంటగిలిపి, నా మాతృభాష నానా మిశ్ర భాషల యౌద్ధత్యమును పలు సహించి .... నా తల్లివేం నేనాటి వాచారముల్ పై మొరుంగులు మాచి భ్రమసిపోయె, ఏమి మిగిలిన దీనాటి కిట్లు పొంగు పొలయు పల్నానదీ గభీరోదకముల దైన్య గర్భ చారిత్రముల్ దక్క భిన్నగిరి శిఖర దుర్గ పరిదీనగీతి దక్క'' అని గుండె పిండగలరు. 'దగ్ధాంధ్రరాజ్య నిత్య విధూత ధూమమ్ము మహె గొండ బురుజుల కెలన లేచి' న కొండవీటి పొగమబ్బును చూపిస్తారు. 'గజపతి ప్రౌఢోగ్ర కరిఘటాశుండా విధూతాంబు నిచయ డిండూత్కు' రాన్ని 'అలకనవా పాత్రు సంటిరాజిన కృష్ణ రాయ బాహోగ్ర జాగ్రన్మహోగ్నిని స్మృతికి తెస్తారు. ''సాయం సమారంభ వేళాలోచిస్సుల మందవాయు మృదు లీలా వీచికా శ్రేణులలో సౌరాష్ట్రేష్టుల శేషదుర్గ శిఖరాంచన్మౌళి భాగంబుపై తారామార్గ మలంకరించిన త్రైలింగరాజ్య ధ్వజ స్ఫారోదంచిత లోహితచ్ఛటల'' ను కళ్లకు కట్టి చూపిస్తారు. శక్తి కావలసినంత, శ్రద్ధ మాత్ర మంతంత. అందుకే వారి రచనలలో శిఖరాల పక్కన లోయ లుంటాయి. చదువరికి ప్రయాస, పరీక్ష! కొడాలి సుబ్బారావుగారు విశ్వనాథ వారికి ఏకలవ్య శిష్యులు. విశ్వనాథ 'వేగి క్షేత్రము' వంటి ఖండ కావ్యాలవల్ల ప్రాభావితులై 'హంపీ క్షేత్రము' రచించారు. వారి పద్యాలలో పెక్కులు ఎత్తుగడ, అన్వయక్రమములలో కూడా విశ్వనాథవారి పద్యాలను అనుసరించినవి కలవు. అయితే విశ్వనాథవారి దూరపు మాటలూ, వాక్యాల మడతలూ, విమార్గ గమనాలూ వీరు అనుకరించలేదు. కామరాజుగడ్డ శివయోగానందరావుగారితో చేరి వీరు కొన్ని తొలి రచనలు చేసినా హంపీ క్షేత్రముతోనే వీరి ప్రతిభాప్రకాశము జరిగింది. హంపిని దర్శించి, ఆ శిథిలాలలో కాళ్ళు నొప్పులెత్తేవరకూ తిరిగి ఆ క్షేత్ర దుర్దశకు వనవి వనవి తమ కన్నీటికి గుండె లయను చేర్చి నైసర్గిక పథాలలో నడిపించారు తమ కావ్య కన్యకను. వీరి చూపులో 'ఒక కొండరాజు పేరోలగంబున గట్టు కొలిచియుండిన లాగు' కుదిరింది, శిలలు ద్రవించి యేచిడ్చినవి, నాడు మండిన మంటతో తిమ్మరుసు కచ్చేరి మసీదుగ మారింది, బాకుపోటున చిమ్మబడిన నెత్తురు జల్లు రాజవీథిని వెల్ల వేసినది, 'లంజదిబ్బ' రాకాసి రేడంటరాని మంటను చూపినది, కొండకోనలు వాల్మీకి యమృతంపు వాన చినుకును శబ్దించినవి, కిన్నరాంగనా పాదముల 'పారాణి చిక్కన నెమటలో కరగి' చార పోసినది. హంపీక్షేత్ర రంగమున శతాబ్దాల గమనములో తెరలెత్తిన గాథలు ఈయన మనోరంగమున వరుసగా తెరల దించుకొన్నవి. 'హంపీస్థాపన' లో శివ

'కంబుల బొబ్బటలంగ జెబ్బలుల్ చాక నిల్చిపోయిన చోట బ్రహ్మ విద్యాఫల ప్రాప్తి ప్రథలజిమ్ము విద్యారణ్య మాధవ స్వామి హక్కరాయలను ప్రతిష్ఠ జేసెనట. విద్యారణ్యులు' తెల్గు భువన ప్రశయంబును కద్దుకట్ట వేసిన మహనీయుని'కి అంకితములైన పద్యాలు. 'కనకాభిషేకము' తలమీద గోప్పొడు మంత్రైన ఉట్టు లింగకాయ బొట్టు లేక ఎంత్రివేష మాప హించిన శ్రీనాథ కవిరాజుకు ప్రౌఢరాయల మందిరమున జరిగిన ఉత్సవగాథ. సుబ్బారావుగారు కవిసార్వభౌమునికి తమ రూపము నూహించినారు! కనుకనే శ్రీనాథుని నోట వీరి నోట వలెనే 'పూర్వాంధ్రరాజ్య సంపూర్ణ శౌర్యానల ప్రత్యక్ష పుణ్య ప్రభావములు, 'హిందూ మతోద్ధరణోందూదయ వికాస చారితాధ్యాత్మ ప్రచారము' లూ వెలువడ్డవి. వాదములో ఓడిన డిండిమభట్టు ఢక్క పగిలించగా 'పంచయంబులునై విరళీకృతంబులై కదలెను శబ్దముల్.' 'రాజ్య ప్రదానము' లో కృష్ణరాయలకు ఎదురుతిరిగిన నాగమనాయుని మీద అతని కొడుకు విశ్వనాథ నాయకుని విజయమును వినిచి, కవిగారు వాస్తవముగా రాజు విశ్వనాథ నాయకునిపైన చూపిన అనురాగమును పొడిగించి నాగమ నాయకునికి కూడా పంచినారు. ప్రభుసేవను చెయ్యడములో విశ్వనాథుడు నొక్కిపెట్టినప్పటికీ, నరపాలుని సభలో కట్టు తెగి 'సలసల వేడి నెత్తురులు చారలు గట్టిన' కన్నీటి బొట్లు కవిగారిని ఈ అతిక్రమణానికి కూడా పెట్టినవని ఊహిస్తున్నాను. 'తల్లికోట యుద్ధము' లో 'శంభుస్వామి వైరాగ్య దీక్షా నాట్యంబులు .... జేష్ఠాదేవి సంచారముల్' మహదాంధ్రరాజ్య లయమూ వర్ణించబడినవి. తక్కిన నాలుగూ ఆనెగొందె కాప్ప, పశ్చాత్తాపము, పాణిగ్రహణము, కృష్ణరాయలు, విజయనగరపు కథలు. కొడాలివారు కవిగా కాక ఆంధ్రుడుగా విచారించారు, తెలుగునాటి రాజకీయ పతనానికి. అయినా కావ్యము వ్రాయడములో నైసర్గిక నిర్వేదాన్ని మించి చూసే యత్నము చేయలేదాయన. కనుకనే ముక్కు మూసుకొని చెట్టుల గుట్టల బట్టి' 'ఇతడటయ్యా రెడ్ల కవిరాజు' 'వేదాలు తలక్రిందు నెలిగించినాడంట' 'రాజుకై కొడుకు పరాభవించిన తండ్రి' 'కాదందురా చేతకాని మాట' 'యువరాజు చావగానే తన కబ్బునా పదవి ?' 'అయ్య కొరకు పడిన శ్రమ' వంటి వ్యవహారపు జాతీయములు తరుచు వినబడతాయి ఈయన కథా కావ్యాలలో. భావ కావ్యాలలో సత్యనారాయణగారి వలెనే ఈయన, నదీ ప్రవాహము వలె భావాల్ని ప్రవహించనియ్యక వేటికి వాటిని విడదీసి యుస్తారు. అవి ఇంచుమించు చాటు పద్యముల ధోరణిలో నడిచినవి 'హంపీ క్షేత్రపు' తొలి భాగములో. భావావేశములో సాంద్రమైనవే అయినా ఖండకావ్యములుగా తీర్చక శ్లోజప్పులు వలెనే వాటిని తీర్చినారు కవిగారు. కావ్యాల్లో కథాకూడా రసవంతముగా కథ సాగుతున్నప్పుడు దండవలె గుచ్చినా, రెండు రెండు తునకలను చేర్చడములో చుక్కలు ఉపయోగించారు. కనుక ఖండకావ్య రచనోద్యోగమునకు కాక కథనోద్యోగముకే సుబ్బారావుగారు పూనుకొని యుండిరనిపిస్తున్నది.

జా తీ య ర చ న లు

తుమ్మల సీతారామమూర్తిగారి రాష్ట్రగానము 1938 లో వచ్చింది. పత్యవాక్కులు శ్రీ చౌదరిగారు 'తెలుగులెంక' అన్న చిన్న పేరును స్వీకరించిన నిగర్వ చూడామణి. 'తెలుగు దేశము, తెలుగుభాష, తెలుగు చరిత్ర, తెలుగు ప్రజ, తెలుగు సంస్కృతి అనినంతనే, వారికి ఒడలు పులకరించును. మరి రాష్ట్రగానమును గొంతువిప్పి ఆయన ప్రబోధించినారంటే దాని శక్తి కేమి లోటు ?

'కుల తత్త్వమును చుట్టుకొని యార్షత్వంబు దింప వైకమత్యము సర్వ మారిపోయె', 'పరవీర్యలుంటాక బాహాబల ప్రౌఢిగల బాలచంద్రుడు లీ గడియ లేరు' 'తన కళాలిప్స కద్దము నోచె రాణించు గర్వించె భువనైక శిల్పవీథి' 'కైవల్య కల్యాణ ఘంటాపథము గన్న యోగి వేమన్న సి యొడిని గురికె' వంటూ నిసర్గ సుందరమైన శైలితో సూటిగా చెపుతుంది వీరి కవితాకన్య. వీరు సంప్రదాయముచే ప్రాచీనులే యైనా స్వాతంత్ర్య వర్ణనమువల్ల నవీను లైనారు. సమకాలిక చర్య లను నిసర్గ సుందరమూ సూటియైన పలుకులతో వివరించి నారూ, దేశీయుల వెన్ను చరిచినారూ ముందుకు నెట్టి నారు. సెలయేరువలె వీనుల విందై వేగవంతమై చల్లగనే ప్రవహించే వీరి రాష్ట్రగానము ప్రాతస్మరణీయము. దాని ప్రతి పద్యములోనూ వీరే. విశ్వరంగముపై నిలిచి చేతులు జోడించి "నీ రమణీయమూర్తి కమనీయ వచస్స్ఫురణంబు వాత్సల్యగౌరవ మద్వితీయ రసికత్వ విభూతి విశిష్ట శౌర్య విద్యా రుచిరత్వ మెంత కొనియాడిన మత్కవితా పిపాస చల్లార దదేమి తల్లి ! ఇది యారక మారక యుబ్బి, నిల్చుతన్" అంటు న్నారు. "తథాస్తు" అని దీవించునుగాక తెలుగుతల్లికి తల్లి.

శ్రీనివాస సోదరుల ఓరుగల్లు కోట 1942 నాటిది. 'ఇన్నాళ్లకును నాడని లక్పుదళ పద్యము' వంటి శిల్పములూ, వేణుగోపాల ప్రతిమా, నందికేశ్వరుడూ, , దేవాలయములూ, నర్తకీ ప్రతిమలూ గురించి పద్యాలు వ్రాశారు. ఒక నర్తకి 'ఒక్కటే మచ్చు నాట్యము నొలుక' బోసెనట. 'ఏమి చూచిన యానందమే యువంత ?' అని యామె నడిగి ఆ శిథిల శిల్పపు కిటికీలోనుంచి నాటి సభా భవనాల చైతన్య శోభను ధ్వనిస్తున్నారు. ఓరుగంటి ప్రతి శిలా శబ్దించే 'ఆంధ్ర నాగ రకత విజయపు చరిత్ర చదివికొన జేతగాని' జడుని చూచి నవ్వుతున్నారు. క్రీడాభిరామమునాటి కోలాహలము కవుల దృష్టి ముందూ (వారి లేఖినీ నర్తనముతో మన ముందూ) సాక్షాత్కరిస్తోంది ఓరుగల్లు కోటలో. ఈ చైతన్యమంతా 'నిజం బొ ! నిద్రబోవుచునుంటినో ... మేలుకొని యుంటినొ!' అని అనుమానించి 'నాదు మిత్రులెల్ల నన్ను వంచించి యెటు వోయినారో, యిపుడు !' అన్న తన్మయభావము వల్లనే తన్మ యత్వాన్ని స్ఫురింపజేస్తున్నారు. 'తెలివిగలిగి కనులు తెరచి చూచెడులోన, స్వర్గలోకము తెరచాటు కేగె.' 'ఇంద్రావ నథము వందనారామ మెదుట గన్పట్టినపుడు' వీరి మది యైరావతంబు కొరకు' తపించినదట. ప్రతాపేంద్రుడు ప్రాతస్స్వప్నము పేరుకు కాపారము తన చిత్త కమలమును నేడు ముచ్చ ముడిగించుకొని మూగదైనదట. గణపతిదేవుడే స్వయ ముగా కదలిరాగా, 'భేరికా భాంకృతి పెలంగి పృథివి రజము గగనమును గప్పె, అదవుల నగరులై, ఉద్గత క్రుద్ధకాల సర్పోత్కరముపు బుసలు కొట్టెనట 'విక్రమ సింహపురి యుగస్త !' బంభర రసికావతంసములు ! మాటలు నేల ? ధ్వని ప్రధాను లౌదురు గద ! .... తరి లోదన గ్రోలుడు తెల్గు వెల్గునన్.

దేశీయ కవిత్వానికి మణిమకుటము నిన్న వచ్చిన 'తుది విజయంమనది నిజం.' కాళోజి గుండెలో పేరుకున్న జన తాభిమానము 'గొడవ' నుండి రణభేరిగా మారినది. 'కన్య కుమారీ కన్నులు రుద్రాక్షలు—ఎందులకని ? ఉత్తరదిశలో ఉఱుములు—ధనుష్టంకార టంకారము—ఏమిటి కథ?— వాయవ్యములో అరుపులు. మీనాక్షి రక్తాక్షిగ మారినదే, ఎందుకు ? లస్త్రాద్రిలో ఆర్తి. కామాక్షి కన్నులలో క్రోధా గ్నులు—కారణ మేమిటి ?—ఉదయాద్రిలో అవమానము. చాముండీ రణచండిక హుంకరించె—లేపాక్షి బసవయ్య లేచి కాల్ద్రవ్వుచుండె—నందీశ్వరు గంగడోలు నిండ రక్తము చారలు!' 'ఇల పుట్టిన నాటినుండి ఇలవేల్పుగ నిల్చి మనల ఇరుగుపొరుగు దుండగాల కొరగాకుండగ కాచిన హిమవంతుని కాపదయట, పదపదపద ఆదుకొనగ. ఆంధ్రావళి అండదండ అస్సాముకు లందింపగ, పయ్యర్లకు తోడ్తోడుగ నాయర్లను నిలిపివుంచ, బదరీనాథుని రక్షకు మధురను కంచిని కదుపగ, కాశ్మీరమునకు జంటగ కన్యకుమారిని నిలుపగ, బిహారీల రణభేరిగ మహా రాష్ట్రము హుంకరింప, గురుగోవిందుని గర్జన ఘూర్జరు లను కదలింపగ, కర్ణాటక చాముండియె కలకత్తా కాళి కాగ, కైలాసము పిలుపును విని కాకతి చిందులు త్రొక్కగ, ఏడు కొండ లెలుగెత్తుచు, హిమవంతుని పురికొల్పగ, శ్రీనగరము చేయూతకు శ్రీరంగము ఎగిరి దుముక, శ్రీశైలము గంతు లిడుచు శీత నగము నాదుకొనగ, కంటము కుంచె కదలింపుము.' 'సరిహద్దును కాపాడే జైసేనా జైహింద్, లద్దాకును కాపాడే లచ్చన్నా జయ్‌హింద్, ఈశాన్యము రక్షించే ఎంకన్నా జయ్ హింద్, ప్రాణాలకు లెక్కించని పంజాబీ జైయ్‌హింద్, అర చేతిలో తల ఉన్న అస్సామీ జయ్‌హింద్, సాదోబా జయ్‌హింద్, మదోజీ జైహింద్, మల్హారూ జైహింద్.' 'చిరుతిండ్లను మానుకొన్న చిట్టి చేతుల చిల్లర, రేసుకోర్సు మానుకున్న లక్షా తార బ్యాంకునోటు, పేకాటలు మానుకున్న చీకటన్న పాతరలు' బిచ్చగాడు దులుపుకొన్న లచ్చిపారాణిపైస, మంత్రాంగం చేతి పొదుపు మహిమతో మిగిలిన కోట్లు, నీ కెంతో ఉత్సాహం' ప్రోత్సాహం కానున్నది కనగలిగిన కాళోజీ 'ముందంజ వేయవలసిన సమయాన ఇజాలు అడ్డుపడతాయా తమ్ముడూ' అంటూ, ఈ యశ్రుఝురులతో ఇరులతో రొదలతో సొదలతో విసముతో పిగ్గుతో బ్రదికే జనాన్ని 'హిమవంతుని కాపదయట పదపద పద మంటున్నాడు. పదండి ముందుకు, పదండి నుముందుకు, పదండి, పదండి పైపైకి.

పాతకథ

శ్రీ వాకాటి పాండురంగరావ్

ఒంటిగంటయినట్టుంది—అని చాపమీద పక్కకు పొర్లింది పార్వతి. చేతిగాజొక్కటి పుటుక్కు మన్నది. ఆ గాజు ముక్కల్ని ఏరి పక్కకు పెట్టింది. ఒంటిగంటయినట్టుంది—అని పార్వతి అనుకుంది కదూ, అంతమాత్రంచేత సరిగ్గా ఆవేళకు ఏదో పెద్దపనుంటుందని అనుకోనక్కర్లేదు. ఒంటిగంటంటే, ఆఫీసులో ఆయనకు టిఫినువేళయిందని గుర్తుకు రావడమన్నమాట. ఈ గుర్తుకు రావడం అన్నది చాల గొడవయిన అంశం. గుర్తుకొచ్చే విషయాలు సముద్రపు ఒడ్డున అలల్లా వస్తాయి; చైనా సైనికుల్లా నిరంతరంగా వస్తాయి .... ఒంటిగంటంటే ఆయనకు టిఫినువేళ .... కాని తను ఇవాళ ఆయనకేమీ టిఫిన్ చేసివ్వలేదు. ఎందుచేత ? ఏదయినా చెయ్యడానికి పిండి లేదు గనుక, నూనె లేదు గనుకా. పోనీ పచ్చడీ అన్నమయినా పెట్టుకెళ్లమంది తను. 'అబ్బే, వద్దులే, ఏదో కేంటీన్‌లో తింటాలే—' అన్నారాయన .... కేంటీన్ అనేసరికి ఓ రెండువేల యుగాలకు ముందొక సాయంకాలం ఆయన మల్లెపూల పొట్లంతోపాటు తెచ్చిన జాంగిరీల పొట్లం, గుర్తుకొస్తుంది .... పొర్లి పడుకుంది పార్వతి. పడుకోలేక లేచింది. కూచుంది. మళ్లీ పడుకుంది.

"ఒంటిగంటయిందోయ్ సూర్యం !" అన్నాడు సీ—త్రీ ......" "నాకు పనుందోయ్, నువ్వెళ్లు ...." అన్నాడు సూర్యం అనబడే సీ—టూ. సీ టూ—అంటే కూచునే స్థలం మాత్రం కాదు. కన్‌స్ట్రక్షన్ సెక్షన్—క్లర్క్—నెంబర్ టూ అని అర్థం. అయినా గుమాస్తాలకి పేర్లెందుకు—నెంబర్లు చాలు! ఒంటిగంటయిందని సీత్రీ చెప్పక్కర్లేదు సూర్యానికి. అతడి కడుపే చెప్పింది. కాని ఏం చెయ్యడం ? జేబులో ఉన్న మూడు నయాపైసలతో హోటలు కెడితే కాఫీకప్పు వాసనయినా చూడనివ్వరే ....! ఈ భూప్రపంచమ్మీద తన స్థిర చరాస్తులన్నీ కలిపి రొఖ్ఖరూపేణా మూడు నయాపైసలని తెలిస్తే నలుగురిలో తను చులకనయిపోడూ—మరి ఇదంతా ఒక్క పెద్ద నాటకమాయె, అందులో తన దొక వేషమాయె, పాత్రోచితంగా అభినయించకపోతే అభిమానం అనే ఆ రసం రసాభాసయిపోదూ ? అందుచేత సీ త్రీ చెప్పినా, ఆకలి చెప్పినా, అవతలి గదిలో కొందరు కమ్మటి టిఫిన్లు తింటున్నా—సూర్యం కుర్చీకే అతుక్కుని కూర్చున్నాడు. పైపెచ్చు తన ముందర టేబిలుమీద ఒక పెద్ద కాగితాన్ని పరుచుకుని కూచున్నాడు. దాన్నిండా గళ్లూ, అంకెలూ ఉన్నాయి. వైకుంఠ ఏకాదశినాడు అచ్చతాకే పరమపదసోపాన పటము—దానిలా ఉంది ఆ కాగితం. అదొక సాంవత్సరిక స్టేటుమెంటన్నమాట. ఆ ఆఫీసులో ఆ స్టేటుమెంటుని తెంచన్‌గా తయారుచేయగలవాడు సూర్యం ఒక్కడే. ఆ గర్వం—సూర్యం కూడా—పడతాడు—కాని వెంటనే అనుకుంటాడు— ఛ.... ఇదేమిటి, ఇంత కష్ట పెద్ద కార్యాలు సాధించవలసిన వాడిని, కేవలం అజ్ఞాతవాసంలో ఉన్న కారణపురుషుడిని, ఎప్పుడో రాబోయే దేనికోసమో పుట్టినవాడిని, నే నెక్కడ—ఈ స్టేట్‌మెం టెక్కడ, నే నెక్కడ ఈ బోడి ఆఫీ సెక్కడ—అని అనుకుంటాడు సూర్యం. అనుకుని ఆ స్టేట్‌మెంట్‌లో అక్కడో పదం ఇక్కడో అంకె వేస్తాడు. ఇప్పటికి తన చేతిమీదుగా వెళుతున్నది ఇది ఆరో స్టేటుమెంటు. ఈ స్టేటుమెంటుల్లో ఒక చిత్రముంది. ఇవి కావాలని ఎవరు ఎందుకు అడుగుతారో సూర్యానికి అర్థమవదు. అందులో తాను వేసేదల్లా అబద్ధాల అంకెలు. ఇలాటివన్నీ ఏ ఢిల్లీలోనో ఒక పెద్దాఫీసులో చేరతాయి—పూర్వజన్మ కర్మలన్నీ చేరినట్టు, అప్పుమీద అప్పు చేరినట్టు... కాని ఈ అంకెలమీదనే దేశం ఆధారపడి ఉంది మరి. ఏ పార్లమెంటులోనో ఒకాయన ఆవరిస్తూ అడుగుతాడు— "ఫలానా సంవత్సరంలో మొత్తం ఎన్ని కేసులు పట్టుకున్నారు. ఎన్ని వదిలేశారు ?" ఆవళంగా గౌరవనీయులైన మంత్రి ఓ పెద్ద బృహత్ స్టేట్‌మెంటు నుండి ఇట్టే తపతపమని అంకెలు చదివేస్తారు. ఆ అంకెల్ని గొప్ప రిపోర్టర్లు నవ్వుకుంటూ రాసుకుని గొప్పగొప్ప పత్రికలకి పంపిస్తారు. గొప్ప గొప్ప పత్రికల సంపాదకులు నవ్వుకుంటూ పెద్ద పెద్ద శీర్షికలతో అచ్చు వేయిస్తారు. ఎందు చూచినా ఈ అంకెలే ఈ శీర్షికలే కనిపించేసరికి పత్రికలు చదివే కుటుంబరావూ, అప్పారావు వాటిని వేదవాక్యాలని నమ్ముతారు. దరిమిలా మన దేశం ఇన్ని కిల్లోమీటర్లు ముందుకొచ్చింది, ఇన్ని మిలిమీటర్లు పైకి లేచింది, అని స్వాతంత్ర్య గణితంలోకి పోతారు. కాని ఆ అంకెల తమాషా అంతా వాటి వెనక ఉన్న సూర్యానికి తెలుసు. అతడు కూడా నవ్వుకుంటాడు పత్రికా సంపాదకుడిలా ....

పాత కథ

ఏదయితేనేం, ఆపూట టిఫిన్ వేళయిపోయింది. దోసె మాడిందనో, బాసుందిలో తీపు తగ్గిందనో మిగతావాళ్లందరూ ఆఫీసు సీట్లకు మళ్ళీ అతుక్కుపోతున్న వేళకు, సూర్యం కాస్త ఆకలినీ, కాస్త స్టేటుమెంటునీ ఆరగించి, ఆవేళకు అయిందనిపించాడు. అలా అనిపించడంలో ఓ సుగుణం ఉందిసుమండీ—ఒకవేళ సూర్యం జేబులో డబ్బు ఉందనుకోండి, టిఫిన్ వేళప్పుడు టిఫినే చేశాడనుకోండి—కనీసం ఓ యాభై పైసలయినా అవునా ? ఇప్పుడు చూడండి, సూర్యం బాబు ఆ యాభై పైసల్నీ ఇంచక్కా ఆదా చేసుకున్నాడు మరి ! అలా ఎక్కడా, ఎక్కడా సూర్యుళ్లూ, చంద్రుళ్లూ ఇలా పొదుపు చేయబట్టే కదా, ధరల స్థిరీకరణ మొదలయిన పెద్ద సమస్యలు బలిసేది ! సూర్యం స్టేటుమెంటు అయింది. రెండున్నర కొట్టింది గడియారం.

గడియారం మోగడం వినడం ఒక్కటి పార్వతి. ఇంకా పక్కమీదనుంచి లేవలేదు. రెండుసార్లు లేచి కూచుంది. కాని మళ్లీ పడుకుంది. ఏం చెయ్యాలి గనక—పిల్లలా పాపలా ! పిల్లలంటే పార్వతి కడుపులో లావా మరుగుతుంటుంది. పుట్టి ఏడాది రెండు నెలలు పెరిగింది ఇందిర. ఎంత అందమో, ఎంత తెలివో ! దాయని కంటే సరి దానితోనే లోకం ..... ఆ కూనను చూసి బాధలన్నీ మరిచిపోయేవారు. కాని హఠాత్తుగా ఆ సంతోషాన్ని లాగేసుకున్నాడు దేవుడు. డాక్టరు చెప్పిన మందు ఖరీదుని డబ్బు తెచ్చేలోగా, రేపొద్దున్న సంక్రాంతి అనగా ఇవాళ సాయంకాలం వెళ్లిపోయింది ..... ఛ.... ఇదేమిటి, వద్దనుకున్నా ఈ ఆలోచనలన్నీ ఎందుకు రావాలి—అని మనస్సుని విదిలించుకుంటూ లేచింది పార్వతి. గది బయటికి వచ్చింది. ఆ మామిడిచెట్టుమీద గండుపిచుకలు హడావిడిగా తిరిగేస్తున్నాయి. తలెత్తి చూసింది పార్వతి. నల్లటి పిట్ట ఒక్కటి ముచ్చటగా కూచుని ముక్కుతో ఎంతో ఒడుపుగా చిగుళ్లను కాబోలు తుంచుకుని తింటూంది .... కిసలయము, నవవత్సరము అని చిన్నప్పుడు చదువుకున్న పదాలేవో గుర్తుకొచ్చాయి పార్వతికి. చిన్నప్పుడంటే ఏ పదేళ్ల కిందో కాదు, పట్టుమని మూడేళ్లయినా కాలేదు పార్వతి మెట్రిక్ పరీక్షకు కూర్చుని ఫేయిలయి. ఆశలూ, ఎదురుచూడడాలూ లేని రోజులవి. నిరాశలూ, ఎదురుచూసినవి రాకపోవడాలూ లేని రోజులవి. ఏరోజు కారోజు—నిండుగా—ఒక మంచి చిన్న కథలా ఉండిన రోజులవి. రేపుకోసం నిట్టూర్పే ఇవ్వాళలు లేవు ఆరోజుల్లో .... కాని అవి గడిచి తను చాల దూరం వచ్చేసినట్లుంది—అని పార్వతి ఏవేవో అనుకుంటూ ఉండగా 'ఏమండోయ్' అని పిలిచింది పక్కింటి జయమ్మ. తిరిగి చూసింది పార్వతి. జయమ్మ హైస్కూలు టీచరు. పెళ్లి కాలేదు. ఆమె దగ్గర చాలా బోలెడు అనేకమయిన చీరలున్నాయి. నెలలో ముప్ఫై రోజులూ, ఒకరోజు కట్టిన చీర మళ్లీ కట్టకుండా గడుపుతుంది ఆవిడ. ఒక్క చీరలతోనే ఆడదాని జీవితం నిండిపోదనుకోండి. అయినా తన కున్నవి నాలుగు చీరలే అన్న తలపు ఏమంత అందం చెప్పండి .... ఆ జయమ్మ—అన్నిచీరలున్న జయమ్మ, అవన్నీ చాలనట్టు (బహుశా ముప్ఫైయొక్క రోజులున్న నెలలో ఆఖరిరోజు కోసమేమో?) ఎవడో మూటలవాడొస్తే వాడిని పిలిచింది. బేరమాడుతూంది. పార్వతిని పిలిచి ఫలానా చీర బాగున్నదా అని అడిగింది. భేషుగ్గా ఉందన్నది పార్వతి. తనే గనక కొనుక్కునేట్టయితేనా ఎంత చక్కటి చీర ఎన్నుకునేదో. తన అభిరుచులు ఎంతో నాజూకుగా ఉంటాయని అంటుంటారు ఆయన. ఆచరణలోకి తర్జుమా చేయబడని అందమైన ఆలోచనలెన్నో పార్వతి బుర్రలో దాగిఉన్నాయి—మట్టిలో గింజల్లా. అవి లే ఎప్పుడో మొక్కలయి, తీగెలయి, పువ్వులవుతాయి. కనీసం అవ్వాలని పార్వతి ఆశ .... ''మీరో చీర, అదిగో, ఆ సిలుం గళ్లది తీసుకోకూడదూ—'' అంది జయమ్మ. ''మీ తెల్లటి ఒళ్ళికి ఎంతో బాగా నప్పుతుంది'' అని కూడా అంది నల్లటి జయమ్మ .... ఆ క్షణాన తన తెల్లటి ఒళ్లని కప్పిన మాసిపోయిన వూదారంగు చీర చూడ్డానికి సిగ్గేసింది పార్వతికి. అయినా అలాటి ఘట్టములనేకముల నారితేరిన మూర్తి గనక—'అబ్బే—ఆయన లేకుండా నేనేదీ కొననండీ—'' అంది. జయమ్మకు 'ఆయన' అంటూ లేడుగా. అంచేత ఆ అంశంలో తనో మెట్టు పైన ఉంది ! అదొక చిన్న సంతృప్తి—ఎడారిలో నీటి చుక్కలా.

అయిదుకు పది నిముషా లుందనగా చేతిలో కలాన్ని అవతల పడేశాడు సూర్యం. గుమాస్తాగా ఆపూట కిక అస్తమించేద్దామని అతడి ఉద్దేశం. తను అప్పుడే రాసి ముగించిన ఉత్తరం మళ్లీ ఒసారి చదువుకున్నాడు. అందులో ఆ రెండో పేరాలో ఆ వాక్యం ఎంత బ్రహ్మాండంగా కుదిరిందో అని క్షణం మురిసాడు. మరుక్షణం .... ప్చ్ .... జనం ఆకేరాని సభలో మంచి పాటలు పాడేయవలసి వచ్చిన పాటకుడిలా ఫీలయ్యాడు. ఎంతో కష్టపడి నేర్చుకున్న ఈ ఇంగ్లీషు, ఈ వాక్యాల సొంపు, ఆఫీసులు ఇంకా 'ఎఫిషియంట్' గా పని చేయడంమీద తనకున్న వూహాలు ఇవన్నీ ఇక్కడ వృథా అయిపోతున్నాయే అనుకున్నాడు. రేపటినుండి ఇంత చక్కగా పనిచేయకూడదు. కొంత దాచేసుకోవాలి. పని చేసినకొద్దీ తిప్పలెక్కువ. పని చేసినకొద్దీ పని కూడా ఎక్కువే. అని

నేర్చుకోవడానికి ఆరేళ్ళు పట్టింది. పనితన్నా, తెలివితన్నా, ఇంగ్లీషు గ్రామరుకన్నా పెద్దవాళ్లని మెప్పించడం ముఖ్యం. హెడ్‌క్లర్కు వేసిన 'జోకు'ల మేకులు నవ్వుతూ మింగాలి. తను రాసిన అద్భుతమయిన ఉత్తరం ఆఫీసరు చేతిలో చిత్రవధకు లోనవుతున్నప్పుడు ఆయనగారి స్పెల్లింగులు చూడ్డం మానేసి 'ఇంత చక్కటి హేండ్‌రైటింగ్ ఎలా వచ్చిందిసార్ మీకూ—?' అని ఆశ్చర్యపోగలగాలి. సెక్షన్ హెడ్డు అబ్బాయి బడికెళ్లి జీతం కట్టి రావాలి. ఆఫీసరుగారి 'ఫామిలీ' సినిమాకు వెళ్లేట్లయితే ముందస్తుగా వెళ్లి టిక్కట్లు అవీ ఏర్పాటుచెయ్యాలి. ఆవిధంగా నడుచుకో గలిగితే చాలు, ఆఫీసులో కాలక్షేపం అయిపోతుంది. అప్పుడు ఎక్కువ పని (కొండొకచో అసలు పనే) చెయ్యకపోయినా ఫరవాలేదు. ఎవ్వరూ ఏమీ అనరు. ప్రమోషన్లు సక్రమంగా 'క్యూ' తప్పకుండా వస్తాయి. అని సూర్యానిక్కూడా తెలుసు. అనుకుంటే అతడూ చెయ్యగలడు. కాని అతడు ఇంకెవరో ఎవరో కాదుగద, అతడు సూర్యం కద. ఇంకో అయిదేళ్లల్లో ఐ. ఏ. ఎస్. లాంటి అడ్డదారిని పడి ఆఫీసరవబోయేవాడు కద. గుమాస్తాలూ, ప్యూన్లూ కూడా మనుష్యులేనని వాళ్లకి కూడా గౌరవమిచ్చి కొంగ్రొత్త సాంప్రదాయాలు నెలకొల్పబోయేవాడు కద—అతడు పైవిధముగ ఎటుల చేయును? అంటే చేయడు, అనడం కష్టం—అటుల చేయుట అతగాడికి చాలా కష్టము, అని చెప్పుకోవచ్చును .... చేతిలోని కలాన్ని కింద పడేసి గుమాస్తా సూర్యం మనిషి సూర్యమయి పోదామని బురఖా తీసేస్తుండగా ఆఫీసరుగారు పిలిచారు. చేదు మాత్రని గొంతులోకి తోసినట్లయింది సూర్యానికి. అయితేనేం నడిచాడు మహరాజులా. ఆఫీసరు వారి గదిలో నిలిచాడు. రూపాయలు రెండు వందలు ఖరీదుచేసే కుర్చీలో సగం పడుకున్నట్లు కూచుని అడిగాడు ఆఫీసరు—"ఏమిటి ఈ చెత్త నోటు?" ఆయన నోట్లోని పైపు నోట్లోనే ఉంది. భయభక్తులతో ఒంగి ఆ ఫైలు గమనించాడు సూర్యం. ఎవరో ఆడకూతురు శ్రీకాకుళంలో గుమాస్తాగా ఉంది. కాకినాడలో మొగుడున్నాట్ట, బదిలీ కావాలని రాసింది. సాధ్యమయినంత వరకు భార్యాభర్తల్ని ఇద్దరినీ ఒకేచోట ఏడిపించమని ఒక రూలు ఏడిచింది. సూర్యం ఆ రూల్‌ని ఉదాహరిస్తూ, ఆ అమ్మాయి మహజరు మేరకు కాకినాడ వెయ్యవచ్చని రాశాడు. హెడ్‌క్లర్కు సంతసించాడు కూడా. ఏదో చెప్పబోయాడు సూర్యం. కాని పైపే మాట్లాడింది. "నీ ఇష్టం వచ్చినట్లు నోట్ రాయడానికి నువ్వేమీ డైరెక్టర్‌వి కాదోయ్. ఆమాటకొస్తే డైరెక్టరువి కాబోవు కూడాను. నువ్వో గుమాస్తావి .... అది గుర్తుంచుకో .... ఆ అమ్మాయి ఉత్తరం అక్కడ ఉంచి నోరు మూసుకుంటే ఆ ఆర్డరేదో నేనివ్వగలను—" అని ఫైలు విసిరేశాడు—పైపరు—మనిషి సూర్యం గుండెల్లో పాముల పుట్టయ్యి అభిమానం బుసలు కొట్టగా, గుమాస్తా సూర్యం ఒంగి ఆ ఫైలుని తీసుకున్నాడు. బయటికి వచ్చేస్తుంటే "ఇదిగో చూడూ! ఆ స్టెనోతో చెప్పి రెండు కాఫీలు తెప్పించూ—" అన్నాడు పై ఆఫీసరు. స్టెనోకు ఆమాట చెప్పి వచ్చి తన సీట్లో కూచున్నాడు సూర్యం. ఆ అమ్మాయి రాసిన ఉత్తరాన్ని గనక అలాగే ఫైల్లో పెట్టి పంపించి ఉంటే—"ఎందుకోయ్ మీరంతా ఉండడం? ఆ కేసు గురించి చిన్న నోటు రాసి పంపలేవూ" అన్నమాట వచ్చి పేరుతుంది. తను చేసిన తప్పేమీ లేదు. కాని తిట్లు వచ్చాయి. తను గుమాస్తానే, తనకు ఆ విషయం తెలుసు. తేలు కుట్టినట్లు అప్పుడప్పుడూ ఆ విషయం నెమరు కొస్తుంది. అప్పుడు తనలోపల వెయ్యి కాగడాలు మండుతాయి. తను చదవాలనుకున్న ఇంజనీరింగూ, చదివి ప్యాసయిన ఫస్టుక్లాసు ఇంటరూ కలిసి నవ్వుతాయి. నిజం వెలుతురు భరించని అలవాటు మగతలో పడి, నలుగురిలో ఒక్కడుగా పడి, అంతులేని అప్పుల్లో పడి, చావలేని బ్రతుకులో పడి, మనస్సనేది ఉండగా ముసుగు కప్పేసుకుని, కడుపు మాత్రం ఉన్న ఒక మనిషిగా బ్రతకాలనుకుని అది మచ్చికవుతున్న క్షణంలో చెళ్లున కొరడా తగులుతుంది—మాంచి నిద్ర వస్తున్నప్పుడు ఎవరో తట్టి లేపినట్లు. "నువ్వు గుమాస్తావి" అన్నాడు ఆఫీసరు. నువ్వు నెలకు తొంభై రూపాయలవి. నువ్వు ఒలికిపోయిన సిరావి. నువ్వు మూసేసిన ఫైలువి .... నువ్వు పనికిరాని పాత రూలువి .... అన్నట్లు. పైపెచ్చు తోటి మనిషిమీద ఎంత వాత్సల్యమో—"నువ్వు నీ జీవితమంతా గుమాస్తావే!" అని ఆశీర్వదించాడు సహృదయుడు. అవతలి మనిషి ఏడుపు తెలియని అజ్ఞానమూ, నెల తిరిగేసరికి వెయ్యి రూపాయలొస్తుందన్న అహంకారమూ అర్థంకాలేదు సూర్యానికి. సముద్రం పొంగి పొంగి మీద కొస్తున్నపుడు ఎంత దూరమని పరుగెడతావు? శక్తి ఉంటే, నీకు తెలిసివుంటే—ఈదుతావు. లేకపోతే మునుగుతావు. అధికారం అంటే పంచమహాసముద్రాల కన్న పెద్దది. ఆ రాశి ముందర నువ్వొక పూచికపుల్లవి. నువ్వు లేకపోతే అది ఉంది. కాని అది లేకపోతే నువ్వు లేవు.... ఉలలి మధ్య అయిదుస్వర కొట్టినట్లు వినిపించింది. కొందరు వరండాలో—అదే తమ క్లబ్బు—కూర్చుని కేరమ్స్ ఆడుతున్నారు. సూర్యం ఎంగిలి మింగాడు. చేదుగా ఉంది.

సరిగ్గా ఆరింటికి జయమ్మ లైటువేస్తుంది. కాని పార్వతి అలాచెయ్యలేదు. ఎందుకూ అంటే పార్వతివాళ్ల

వాటాలో ఎలక్ట్రిక్ దీపాలు లేవు గనుక. పార్వతికాస్త నిదానించి ఏ ఆరున్నరకో ఏడింటికో వెలిగిస్తుంది లాంతరు. రోజుకొక అరఘంట ఎక్కువచొప్పున లాంతరు ఒకనెల రోజులపాటు వెలిగితే కిరసనాయిలుకో రూపాయిపావలా ఎక్కువ అవుతుంది— అన్న లెక్కలు పార్వతికి బళ్ళో చెప్పలేదు. బడివిడిచింతర్వాత ఆమే నేర్చుకుంది ప్రైవేటుగా. ఆ పూటకూడా నెమ్మదిగా లాంతరుతీసి చిమ్నీని తుడవడం ప్రారంభించింది పార్వతి. ఈ పనయింతర్వాత మొహం కడుక్కొని బొట్టు పెట్టుకోవా లనుకుంది పార్వతి. చేతిలోని చిమ్నీ ఉత్తి పుణ్యానికే టప్పు మంది. ఒకపక్క విరిసింది. కొనబోతే దానిఖరీదు ఏ అర్ధ రూపాయో వుంటుంది. ఎంతో ఓపికగా లేచింది పార్వతి. చాదుగిన్నెలో ఒకచుక్క నీళ్ళుపోసి తెచ్చింది. పాతకాగితంముక్క వొకదానిని వేలుపొడుగున చింపి, దానికోపక్క చాదును పూసింది. విరిసినచోట చిమ్నీమీద ఆ కాగితాన్ని అతికించింది. సగం తుడిచిన చిమ్నీని ముట్టుకుంటే ఎక్కడ రెండయిపోతుందో నని అలాగే బిగించి దీపం వెలిగించింది. అగ్గిపెట్టెలో ఇంకా ఆరే పుల్లలున్నాయి. అంటే మూడురోజులు రావచ్చు అను కుంది పార్వతి. సూర్యం నెలకు రెండు అగ్గిపెట్టెలని తెస్తాడు. నెలంతా ఆ రెంటితోనే గడవాలి. ఒక్కరోజు ముందుగా అగ్గిపెట్టె అయిపోయిందంటే అతడికి కోపం వస్తుంది. ఆ కోపంలో నుండే దీపాలు అవీ వెల్గించుకోవచ్చు. అది చవక కూడాను. అగ్గిపెట్టెల విషయంలో అంత ఖరారుగా వున్నందు వల్ల ఆయనను లోభి అనకూడదు అంటుంది పార్వతి అంత రంగం. దరిద్రం అని నోరువిడిచి చెప్పడానికేమో ఇదిగా వుంటుందాయె.... అందుకనే కుంపటి అంటించితే, ఆ నిప్పులో ఓ కాగితం అంటించి దీపం వెల్గిస్తుంది పార్వతి. దీపమేముందర వెలిగించివుంటే దానినుండి కుంపటి రాజవేస్తుంది పార్వతి. అప్పటికే అగ్గిపెట్టె అయిపోతే జయమ్మదగ్గర ఓ నాలుగు అగ్గిపుల్లలు తీసుకొస్తుంది. అంతేకాని అగ్గిపెట్టె అయి పోయిందని మాత్రం సూర్యానికి చెప్పదు. ఆ మాటకొస్తే సూర్యం తలచుకుంటే ఇంకోఅగ్గిపెట్టె కొనలేడనా, కాదు, కానీ... అగ్గిపెట్టెల దగ్గరకూడా ఆలోచించవలసినంత ఐశ్వర్యంలో వున్నాంకదా అన్నతలపు అంత ప్రశాంతమయినదేమీ కాదుగా.. అందుకని సూర్యం ఆ విషయం ఆలోచించడు. పార్వతి ఆ ఊసె త్తదు. వాళ్ళిద్దరిదీ అంత ఆదర్శమయిన దాంపత్యం ! పాలవాడొస్తే పాలుపోయించుకుంది పార్వతి. జయమ్మకూడా పాలుపట్టింది. జయమ్మ ఎగ్జిబిషన్‌కు వెళ్ళింది. కుంపటిమీద పాలుంచి మొహం కడుక్కుంది పార్వతి. బొట్టు పెట్టుకుంది. తెల్లచీర కట్టుకుంది. పాలగిన్నెదించి, జయమ్మకని తీసుకున్న పాలని కుంపటిమీద పెట్టింది. పొద్దుటి చారున్నాయి. అవి వేడిచేసి, ఇన్ని బియ్యం వుడికించి, రెండు అప్పడాలు నిప్పుల మీద కాలిస్తే చాలు, ఆనెల్లో ఇరవై మూడు రోజులయిపోతాయి.

ఏడయిపోయింది.... ఇంకా రాదేం వెధవబస్సూ అను కున్నాడు సూర్యం. అప్పటికతడు అరఘంటాయి నిల్చున్నాడు బస్‌స్టాపులో. ఒకబస్సు రానేవచ్చింది కాని, స్టాపులో ఆగలేదు. అవును, మహానగరంలోని బస్సులన్నీ అంతే. ఆగవలసిన చోటుకో అరఫర్లాంగు కవతల, ఎవరూ పరుగెత్తుకొచ్చి ఎక్కలేనిచోట ఆగుతాయి. అలాగ ఆపమని కండక్టర్లకూ డ్రైవర్లకూ రహస్య మయిన ఆదేశాలున్నాయట !.... అదేదో అధికారికి రాసి కనుక్కుంటాను అనుకున్నాడు సూర్యం. వెంటనే ఇయిదు పైసల కార్డు ఆరుపయిసలయిన కథ గుర్తుకొచ్చింది. వెంటనే కాళ్ళకింద భూమి లాగేసినట్లయింది, ఇచ్చితంగా అప్పిస్తానన్నవాడు ఇంకోవూరు వెళ్ళినట్లు అయింది. చెరవీడిన వాడిలా చరచర అడుగులువేసుకుంటూ నడిచాడు సూర్యం పెద్దబజారుకు. ఏదో మంచివేళ కాబట్టి తన ఆర్థిక పరిస్థితి చటుక్కున గుర్తుకొచ్చింది. లేకపోతే, జేబులోవున్న మూడు నయాపైసలతో బస్సెక్కేవాడు.... అన్న ! అందరూ తనవేపే చూస్తున్నట్లనిపిస్తే ఇంకాస్త వేగంగా నడిచాడు సూర్యం. టపటప నడిస్తే పాతిక నిముషాల్లో పెద్దబజారు వచ్చింది— రాక ఏం చేస్తుందనుకోండి ! పెద్దదయినా చిన్న దయినా బజారు అంటే సూర్యానికి కొంచెం దడపుడుతుంది. తప్పుచేసిన కుర్రవాడు హెడ్‌మాష్టారు ఎదిరలో నిల్చున్నట్లు వుంటుంది. అందులోనూ పార్వతిపక్కనవుంటే శాపగ్రస్తుడూ దైవోపహతుడూ వగైరా సమాసాలన్నీ అతడే అవుతాడు. మరయితే ఎల్లాంటివాడు నోరుమూసుకుని ఇల్లుచేరక మూడు న. పై.లతో పెద్దబజారుకు రానేల ? అందరూ బజారులో ఏదో ఒకటి కొనడానికి వస్తారు. సూర్యం అందుకు వ్యతిరేకంగా ఒకటి అమ్మడానికి బజారుకువచ్చాడు. ఇదేమిటి సూర్యానికి ఏమన్నా రోజూ ఇలా అమ్మడం అలవాటా ? అబ్బే కాదు. ఆ మాటకొస్తే అతడు అలాచేద్దామనుకోవడం ఇది మొదటి సారి.... అంతకుముందురోజు రాత్రి రెండింటికి మెలకువ వచ్చినప్పుడు, అప్పటినుండి అయిదింటిదాకా నిద్రరానప్పుడు, సూర్యం బుర్రలో వుడికిన అనేకములయిన— ఆలోచనల్లో అతి దారుణమయినది— ఒక పుస్తకాన్ని పాతపుస్తకాల షాపు వాడికి అమ్మితే ఒకటో రెండో రూపాయలు వస్తాయన్నది. పుస్తకం అంటే సూర్యానికి బ్రాందీలాంటిది. నల్లమందు లాంటిది. అమ్మ ఒడిలాంటిది. పక్షికి రెక్కల్లాంటిది. తను చచ్చి పోయేలోగా వెయ్యిపుస్తకాల లైబ్రరీ సేకరించాలని సూర్యం

యొక్క జీవితాశయం. రేపో ఎప్పుడో హఠాత్తుగా తను కాయా అవీ కొన్నప్పుడు మదరాసుకెళ్ళి పెద్దపెద్ద పుస్తకాల షాపుల్లోకి దర్జాగావెళ్ళి, కారు నిండిపోయేటట్లు, షాపులవాళ్ళు భ్రమించి పోయేటట్లు కొన్నివందల పుస్తకాలు ఒక్కసారే కొనేసుకు రావాలన్నది— సూర్యం చాలాకాలంనుండీ పెంచుకుంటున్న ముచ్చటయిన కలల్లో ఒక్కటి. కాని ఇప్పటికి, సంపాదన ఆరంభించిన ఆరేళ్ళలోనూ కొన్న పాతిక పుస్తకాలలోనూ, సంస్కృత శ్లోకం మేరకు పరహస్తగతమయినవి పోగా అతడి దగ్గర మిగిలినవి ఏ పన్నెండో వుంటాయి. అందులో ఒకదానిని, అసలుధర ఆరు రూపాయలయిన మూడు వందల పేజీలదానిని తీసుకుని, పాతపుస్తకాల వాడికమ్మితే రెండురూపాయలయినా వస్తాయని పెద్దబజారుకొచ్చాడు నెలలో ఇంకా ఏడురోజులు గడవాల్సిన సూర్యం. వాడెవడో టెరిలిన్ షొక్కావాడు, ఆపిలు కొనుక్కొని కొరుక్కొని తింటున్నాడు. అలా వీధిలో నిల్చుని తినేవాళ్ళంటే— మధ్యాహ్నం ఉపోషం చేసిన సూర్యానికి మహాకోపం. ఆతడికోసం ఆపిలు పారదనా, దానిని తినేవాడిమీదనా అని అడగడం బాగుండదు. ఈలోపుగా సూర్యం పాత పుస్తకాలషాపులు వరసగా వున్న ప్రాంతం చేరాడు. తన కూతురుని తగనివాడికి దాసిగా అమ్మేస్తున్నట్లు అనిపించింది. రోడ్డుమీద తన్నుపడేసి, తనమీదే జనమూ బస్సూ ఆవులూ మేకలూ, నడిచిపోయినట్లనిపించింది. మరి వేరే దారిలేదు. ఎరిగిన వాళ్ళందరిలోనూ తను అప్పడిగి పుచ్చుకోనివాడులేడు. నాలుగయిదుసార్లు ఆ దుకాణాల వెంబడి అటూఇటూ తిరిగాడు. ఎట్టకేలకు మొండిధైర్యం తెచ్చుకున్నాడు. చెమటలు పోస్తుండగా ఒక దుకాణంముందు ఆగాడు. ఒకటిరెండు పుస్తకాలు చూసినట్లు నటించాడు. హఠాత్తుగా తలెత్తి ఆ దుకాణం వాడిని— "మీరు మా దగ్గర్నుంచి పాతపుస్తకాలు కొంటారేమిటి ?'' అని చాల నిర్లక్ష్యంగా వాటివాణిలో తనకు పనిలేదన్నట్లు అడిగాడు. కొంటామన్నాడు వాడు. తటాలున జేబులోని పుస్తకంతీసి వాడిచేతిలోకిచ్చాడు సూర్యం. ఆ పుస్తకాన్ని తనకే అమ్మడంలో ఈ సూర్యం అనబడే పురుషుడు చేస్తున్నత్యాగం ఏమీ అర్థం కానున్నట్లు ఆ పుస్తకాన్ని ఇటూ అటూ చూశాడు దుకాణంవాడు. ఏ రూపాయో ఇస్తానంటాడు కాబోలు వెధవ, ముందర రెండున్నర కనుక రెండు రూపాయలయినా ఇమ్మని ఖచ్చితంగా అడగాలి అని తర్కించుకున్నాడు సూర్యం— హఠాత్తుగా దుకాణంవాడు తనచేతికి పుస్తకం ఇచ్చెయ్యటంతో ఏమీ అర్థంకాలేదు సూర్యానికి... "ఇది అమ్మడు పోదండీ, నాకొద్దు ఏ దయినా డిటెక్టివు నవల్సుగాని, సోషల్స్టడీస్, లెక్కలూ, వాచకాలుగాని, గైడ్లుకాని తెండి..'' సిగ్గుతో, అక్కసుతో, కోపంతో, అవమానంతో— చేతిలో ఆరుదు రూపాయల పుస్తకంతో వెళ్ళిపోతున్న సూర్యానికి దుకాణంవాడి సలహాలు వినపడలేదు.

ఎంగిళ్ళుతీసి కంచాలూ, వంటగది కడిగి, అంట్లు తోమేసరికి పదయింది పార్వతికి. పక్కవాటాలో తాళంతీసిన చప్పుడయింది. జయమ్మ వచ్చిందికాబోలు. ఆవిడకని పోయించుకున్నపాలు తీసుకెళ్ళి ఇచ్చింది పార్వతి. ఎగ్జిబిషన్లో వెండి ఫిలిగ్రీహారమూ, లక్ష్మీ డిజైన్చీర— పార్వతికి నచ్చిన సిమెంటు రంగుమీద అతి నాజూకయిన ఎంబ్రాయిడరీవున్నదీ— దంతంలో చేసిన వేణుమాధవుడి విగ్రహమూ— అంగుళం ఎత్తుది పదహారు రూపాయలట— అన్నీ కొనుక్కొచ్చింది జయమ్మ. చూపించింది పార్వతికి.... భోజనం ముగించి పరుపుమీద పడుకుని వున్నాడు సూర్యం. కళ్ళు మూసుకుని వున్నాయి. కాళ్ళు పీకుతున్నాయి. ఇవాళ తారీకు ఇరవైమూడు— అనుకున్నాడు సూర్యం. ఆ గదిలో లాంతరులేదు. వీధిదీపం వెలుతురు కిటికీకి ఎదురుగావున్న గోడమీద పడుతూంది. 'నువ్వెప్పుడూ గుమాస్తావే' అన్నాడు ఆఫీసరు... 'ఏం వోయ్, టిఫినుకు రావేం?' అంటాడు సేత్రి. ఎక్కాల్సినచోట ఆగదు వెధవబస్సు. ఆగినా ఎక్కలేడు తాను. 'ఈ పుస్తకం అమ్మడుపోదుసార్' అంటాడు అంగడివాడు. పొర్లిపడుకున్నాడు సూర్యం. కళ్ళల్లో ఒకటి రెండు చుక్కల నీళ్ళంటే తలగడలాగేసింది. అంతకే ఆశ్చర్యం వేసింది తనలో ఇంకా తడివుందా అని.... పాదాలమీద చల్లటి చేతులు తగిలేసరికి వులిక్కిపడ్డాడు. పార్వతిపనంతా ముగించుకుని వచ్చింది కాబోలు. కాళ్ళు పడుతూంది..... చీకట్లోనయినా పార్వతికళ్ళు ఎంతందంగా వున్నాయో అని మొదటిసారిగా చూసినంత ఆనందంతో నిండిపోయాడు సూర్యం. వెధవది.... ఆ పుస్తకాన్ని షాపువాడు వద్దనడమే మంచిదయింది రెండు రూపాయలకేమిటి ఎక్కడయినా అప్పుతేవచ్చుకాని అంత మంచిపుస్తకం సులభంగా దొరకదే! "నేనెప్పుడూ గుమాస్తాగనే వుండనోయ్ చిన్నయ్యా.... చూస్తూవుండుమరి—'' అని చెబితే బాగుండును.... లేచి కూచున్నాడు సూర్యం. పార్వతిని దగ్గరకు తీసుకున్నాడు. నగలూ చీరలూ అక్కర్లేదుగాని ఈ అదృష్టాన్ని మాత్రం వుంచు భగవంతుడా అనుకుంది పార్వతి.

చీకట్లోనయినా పార్వతికళ్ళు ఎంతందంగా వున్నాయో అని మళ్ళీ అనుకున్నాడు సూర్యం.... ఆ ! ఆ మాటకొస్తే వెధవది, ఎప్పుడూ వుంటుందేమిటి ? రేపొద్దుటికి ఈ చీకటి పోదా, వెలుతురు రాదా— అనుకున్నాడు సూర్యం.

పెద్దన తాత్త్విక దృష్టి

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

ప్రబంధం అనగానే శృంగారం జ్ఞాపకం వస్తుంది. ఇతర ప్రబంధాలకువలెనే 'మనుచరిత్ర'కు కూడా ఇంతవరకూ ఆస్వాదనమూ, విమర్శనమూ, శృంగార రస దృష్ట్యానే జరిగాయి. వరూధినీ ప్రవరుల కథమీదికే అందరి దృష్టి మళ్ళుతుంది సహజంగా. కాని, ఆ ఘట్టం పూర్తయి ప్రవరుడు(లేక మాయా ప్రవరుడు) రంగంనుంచి తప్పుకోగానే తర్వాత కావ్యం రసవంతంగా లేదనిపించటం, శృంగారం ఈ కావ్యంలో రసాభాసమైనదా, లేదా అని సందేహించటం జరుగుతుంది. ఎంత సరిపెట్టుకున్నా, ఇతర శృంగార కావ్య కర్తలతో పోల్చితే పెద్దన 'కవితా పితామహత్వం' కేవలం ఒక రసపుత్త్ర ఘట్టంమీద, లేకపోతే భాషామాధుర్యం, శయ్యాసౌకుమార్యం వగైరా గుణాల మీదా ఆధారపడిందేనా? అన్న శంక కూడా కలుగుతుంది. 'మనుచరిత్ర' కావ్యంలో వస్త్వైక్యత లోపించిందనే కొందరి అభిప్రాయం. "ప్రథమ ప్రయత్నముగుటచే వస్త్వైక్యత లేకపోయినది. ప్రబంధమునకుబట్టని పెద్ద కథను దీసికొనెను.తన నూతన ప్రయత్నమునకు భంగము కలుగునని పెద్దన భయపడి కథావస్తువు ఎక్కువగా దీసికొనెను. వేరు వేరు కథల గూర్చిన కావ్యము జంట యైనదికాని, మనుచరిత్రమేక ప్రబంధము కాలేక పోయినది" (కీ. శే. వంగూరి సుబ్బారావు: ఆంధ్ర వాఙ్మయ చరిత్రము) ఈ విధమైన సందేహాలకీ, అసంతృప్తికీ కారణం పెద్దనను కేవలం శృంగార కవిగా ఉపలక్షించటమేననిపిస్తుంది. వరూధినీ ప్రవరుల ఉదంతాన్నిదాటి కావ్యాన్ని సమగ్రంగా చూడలేక పోవటానికి మన హ్రస్వ దృష్టే కారణమేమో! పెద్దన ప్రతిభలో వ్యక్తిత్వంలో లోపం లేదేమో అనే వూహను సోపపత్తికంగా వెలిబుచ్చటానికే ఈ వ్యాసం.

కవి స్వతంత్రుడు, ద్రష్ట అంటూ అనుశ్రుతంగా చర్విత చర్వణంగా చెప్పుకోవటమేగాని, ఆ విధంగా పెద్దన వంటి కవిని మనం అర్థం చేసుకోవటానికి ఎంతవరకు ప్రయత్నం చేస్తున్నాము? అనేది మొదటి ప్రశ్న. కవి స్వాతంత్ర్యము జీవితాన్ని గూర్చిన అతని దృక్పథంలో, అనుభూతికి అతను చేసే వ్యాఖ్యానంలో వ్యక్తం అవుతుంది. (**Poetry is the criticism of life-Matthew Arnold**). ఇతరులకంటె విశిష్టంగా దర్శించగలిగి, గంభీరమైన ఆత్మానుభూతిని విశ్వజనీనమైన సత్యంగా, సౌందర్యంగా కావ్యంలో మూర్తీభవింపజేయుటవల్లే కవి ద్రష్ట, స్రష్ట అనిపించుకుంటాడు. సమకాలీనమైన విశ్వాసాలూ, జీవిత వైఖరీ ప్రతిఫలిస్తూనే కాలాతీతమైన సత్యాన్ని ద్యోతకం చేసే గుణం కలిగి ఉంటుంది అతని కావ్యం. కావ్యంలో ప్రాణంవంటి ఈ గుణాన్నే "ధ్వని" అంటారు. విశ్వ జనీనమైన సత్యమేదో అది అందరికీ అన్ని కాలాలవారికీ ఒక్కతీరుగానే కనిపించకపోవచ్చు. విమర్శనమూ వ్యాఖ్యానమూ ఒక పరంపరగా వృద్ధిపొందుతూ, మళ్ళీ నిత్య నూతనంగా ఉండటానికి అందువల్లే అవకాశం ఉంటుంది. కావ్యంమీద ఆసక్తి సన్నగిల్లక పోవటమే ఆ కావ్యంలో ప్రాణం ఉండటానికి గుఱుతు. అమరవీణవలె ధ్వని ప్రతిధ్వనుల్ని కాల గహ్వరంలో ఎడతెగకుండా నినదింపజేసే కావ్యమే నిజమైన కావ్యం. దాన్ని స్వతంత్రుడూ, ద్రష్టా అయిన కవే సృష్టించ గలుగుతాడు.

"ఏకటాంగాను, సంఘమునగాను గల శౌర్యములు గలిగి సత్ప్రపంచలపై, ఇతర జాతులపై దండయాత్రలు వెడలి జయము గాంచినప్పుడు ల విజయ ఫలము ననుభవించువారు భోగపరాయణు లయ్యెదరు. వైరాగ్యము పొందుటకైన లభింపదు. గృహస్థ జీవితమే ఆదరణీయమగును. మతము అభ్యాస వశమున అర్థములేని ఆచారముగ మారియుండునేగాని, దైనందిన జీవితమునందు దాని యావశ్యకత అంత ముఖ్యముగ దోపదు. కృష్ణరాయల రాజ్య కాలమునం దొకప్పు డిట్టి పరిస్థితులు సమకూడినవి. పెద్దన హృదయమును వంశ పారంపర్యముగ వచ్చు ఆచార ప్రీతి యొక వంకకు, నూతన గతులు మరొక వంకకు ఆకర్షింప జొచ్చినవి. ఈ గుంజులాటయే వరూధినీ ప్రవరుల వ్యవహారమునందు మనకు గోచరించును..... తన మనమును ఆందోళన పరచుచున్న భావ యుద్ధమును ద్వైధీభావమును ప్రతిఫలింపజేయుటకు అనువైన కథనే కవి ఏర్పరచుకొనెను. మూర్తీభవించిన రెండు ఆదర్శములు మన కన్నుల ఎదుట పొడకట్టుచున్నవి. ఒకటి : హృదయములేని నైతిక కర్మకౌశల్యము, రెండు : భోగలాలసత్వము. మొదటి దానియందు ఆచార పరాయణత్వమును రెండవదానియందు మానుషత్వమును గని. కవి ఈ రెండు ప్రకృతులను సృజించి శీల పోషణమునందు తారతమ్యము జూపించి యొకదాని కొకటి భిత్తిగ నొనరించెను." (కీ. శే. దువ్వూరి రామిరెడ్డి: పెద్దన—సమకాలీన భావ ప్రతినిధి: వ్యాసములు) సమకాలీన పరిస్థితులకు పెద్దన తీసుకున్న కథావస్తువునకుగల సంబంధ మెటువంటిదో రామిరెడ్డిగారు గుర్తించిరి. కాని, పెద్దనలోని 'గుంజులాట' ఎటువంటిదో, దాని తుది ఫలిత మేమిటో, దానికి తాత్త్విక సమన్వయమేదైనా పెద్దన చెయ్యగలిగాడో లేదో కావ్యాన్ని సమగ్రంగా చూచి, విచారించే ఓర్పు ఆయనకు లేకపోయింది

కారణం రెడ్డిగారి దృష్టి కూడా వరూధినీ ప్రవరులనూ, శృంగారాన్నీ దాటి మిగిలిన కావ్యభాగంమీద ప్రసరించక పోవటమే! తనలోని భావ సంఘర్షణలు పెద్దన ఏవిధంగా రాజీ పడ్డాడో ఊహిస్తూ, పెద్దన వ్యక్తిత్వాన్నిగూర్చి రెడ్డిగారు యిచ్చిన తీర్పు ఇలా వుంది: "రాజాశ్రితుడు. పూర్వాచార ప్రియుమైన పండితాభిప్రాయమును బొత్తిగా నిరసించుటకు వీలు లేనివాడు. అందువలన పండితలోకమునను సంతృప్తిపరచుటకు ప్రవరుని అవిధముగ (పాషాణ హృదయునిగ) జిత్రించెను. జీవితయాత్ర సునాయాసముగ జరిగిపోవుట కిట్టి రాజీయే అవసరమేమో!... కర్మసాక్షియగు సూర్య భగవానుడు ప్రవరుని పాషాణ హృదయత్వమునకు వెక్కసపడి రోష భీషణ స్ఫురణ వహించెను.... ప్రవరుడు క్రూరుడు—మహాసురాధముడు—అహంకారయుతుడు—సెభాష్! పెద్దనా, ముసుగులో దాగుకొని నీ లక్ష్యమును వెళ్ళబుచ్చినావు! కసిదీర్చుకొన్నావు! ఈ సహానుభూతియే, ఈ హృదయ వైశాల్యమే నిన్ను మహాకవి పట్టమునకు అర్హుని జేయు చున్నది." పెద్దన వ్యక్తిత్వమును గూర్చిన పై తీర్పు 'కవి'య్యైన వాని కెవనికీ గౌరవప్రదంకాదు. పెద్దనవంటి మనిషి జీవయాత్రకోసం లౌక్యంగా రాజీ పడ్డాడనీ, తన స్త్రీలోలుర బుద్ధిని ముసుగులో దాచుకొని పైకి ధర్మపన్నాలు చెప్పాడనీ అనుకోవటం సహేతుకమనుకొం టున్న మన ప్రాస్వ దృష్టికి తార్కాణం.

పెద్దనలోని భావ సంఘర్షణని గుర్తించటం సద్విమర్శనము. పెద్దన వ్యక్తిత్వాన్ని ఆయన తాత్త్విక దృష్టినీ, 'మను చరిత్ర' కావ్య ప్రయోజనాన్నీ అర్థం చేసుకోవటానికి అది మొదటి మెట్టు కూడా. కాని, శృంగార రస నిరూపణా ప్రయత్నం విరమించి, 'మను చరిత్ర' కావ్యాన్ని సమగ్రంగా ఆకళింపు చేస్తేగాని, పెద్దనలోని భావ సంఘర్షణకు పరిణామమేమిటో, దానికి ఆయన చేసిన సమన్వయ మేమిటో తెలుసు కోవటం సాధ్యంకాదు. విమర్శకులు సంఘర్షణ ఫలితంకోసం కావ్యం చివరి ఆశ్వాసం చూడటం సబబుకాని, ద్వితీయాశ్వాసాంతమో, తృతీయాశ్వాసమో వెదకి అంతమాత్రంతో నిర్ణయానికి రావటం ఏమి న్యాయం?

2

వరూధినీ ప్రవరుల సంవాదము చాల ప్రసిద్ధమైన కావ్యభాగం. శృంగారం మాట అటుంచి, ఆ ఇద్దరి వాదాలలో ముఖ్యాంశాల్ని అర్థం చేసుకునే ప్రయత్నంముందు జరగాలి. వరూధిని సూటిగా "ఇంక నీపయింజిక్కె మనంబు నాకు" అంటూ తన వలపు ప్రకటిస్తుంది. దానికి ప్రవరు డిచ్చిన మొదటి సమాధానం : తాను ఆహితాగ్ని వ్రతుడై జీవితం గడుపు తున్నాడు. తనకు గృహస్థ కర్మా చరణం చాల ముఖ్యం అని. అందుకు వరూధిని సవాలు: "నైష్ఠికుడౌటవలన ఇహలోక భోగములకు వెలియౌట లేదా? అది మంచిదా? యజ్ఞకర్మలకు ఆశించే ఫలం మాత్రం అప్సరలతో సుఖించుటే కదా?

"కులటతయే వ్రతముగను
నళనాయాసమున నింద్రియ నిరోధమునన్
గ్రుళు గరలు యూర్మి వంపుట,
నశరీర స్వర్గ సుఖము గనుకొని యుండన్?"

ప్రవరుడి తర్కాన్ని సూటిగా ఎదుర్కొంటుంది. అతని రెండవ సమాధానం: "నీవన్నది నిజము, కాముకుడైనవానికి....అకాముడిది గణించునె?" అంటూ తనకు కామంలేదని ధ్వనిస్తాడు. అంతటితో వూరుకోక కాముకులైనవారిని గట్టిగా విమర్శిస్తూ, "బ్రాహ్మణు డింద్రియవశగతి....చెడు బ్రహ్మానందాధి రాజ్య పదవిచ్యుతుడై" అంటాడు. దానికి వరూధిని 'బ్రహ్మానందం' అంటే ఏమిటి? అని తర్కిస్తుంది. వేద ప్రమాణమైన 'ఆనందో బ్రహ్మ' అనే వాక్యానికి యోగశాస్త్ర పరంగా వ్యాఖ్యానం సూచిస్తుంది.

"ఎంతే దెంటము గంపించు రసించే నేకాగ్రతన్
నిర్వృతిన్
డెందుం గుంభగత ప్రదీప కళికా శ్రీ దోపనెందెంటు బో
తెందే నింద్రియములన్ సుఖంబుగను నా యుండే పర
బ్రహ్మ'మా
నందో బ్రహ్మ' 'యటన్న ప్రాజమవు సంతుర్బుద్ధి
నూహింపుమా!"

ప్రవరుడి మూడవ సమాధానం : "నీవు కామ శాస్త్రోపాధ్యాయిని నావచించెదవు.....అగను సూత్ర పంక్తికివె పో మీ సంప్రదాయార్థముల్!........ నాకు అరణులు, దర్భలు, అగ్నులే ప్రియములు.........ఒడల్ తిరమే? చెప్పకు మిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాల పై దేనియల్!"

పై తర్కంలో వరూధినిదే పై చేయి. ప్రవరుడు వాదంతో దిగకుండానే, 'నీతో ఏమిటి వాదించేది?' అన్న ధోరణిలో తను నైష్ఠికుడనీ, ఇంద్రియ సుఖాన్ని వర్జించటమే తనకు శ్రేయమనీ, అగ్ని దేవుడిమీదే తన ధ్యాస అనీ తన సంగతి, తన ధర్మమూ అసలు తర్కించటానికే వీల్లేని విషయాలుగా మాట్లాడాడు. వరూధిని లేవ దీసిన ప్రశ్నలకు ప్రవరుడి నుంచీ జవాబు లేనేలేదు. వరూధిని అతని నిర్దాక్షిణ్యాన్ని సహింపలేక, వలపు తీవరించి చివరకు బలవంతంగా కౌగలించుకుంటుంది. ప్రవరుడు మొరటుగా గోరు దిగబడే లాగ పొమ్మంటూ, త్రోసివేస్తాడు. మార్కండేయ పురాణంలోని ప్రవరునికీ, పెద్దన తను సృజించిన ప్రవరునికీ చాల పెద్ద భేదమే చూపించాడు. అక్కడ వరూధినికి తర్కించే శక్తి చాల తక్కువ. 'ఇక్కడేవుండి సుఖించ రాదా?' అని మాత్రమే అంటుంది. దానికి సమాధానంగా అక్కడి ప్రవరుడు మంచి తాత్త్వికుడుగా, "ఈ త్రిజగంబు హవ్య ప్రతిష్ఠితంబు" అని చెబుతూ, శరీరాన్ని ఏమాత్రం తుచ్ఛమైన దానిగా తీసి

పారెయ్యడు. అంతేకాదు వరూధిని కౌగలించుకోగా "అంటకంటకు వన్ను మృగాక్షి! నీకు సదృశుడగువాని నన్యుని వెదకి కొనుము" అని మెల్లగా హితవు చెబుతాడు. చివరకు "మతి నాకు రతి జనింపదు నీదెస, నిరతము నాదెస భజింపు నీవును విరతిన్" అంటూ సలహా యిస్తాడుకాని, ఇంద్రియ సుఖము అనేదే పాపము అనే ధోరణిలో మాట్లాడడు. పరిశీలిస్తే పెద్దన సృష్టించిన వరూధిని మూలంలోని వరూధినికంటె ఎక్కువ పాండిత్యాన్ని చూపిస్తుంది. పెద్దన సృష్టించిన ప్రవరుడు కూడా మూలంలోని ప్రవరునికంటె కోపిష్ఠి; తన విశ్వాసాల్నిగూర్చి ఇతరులు తర్కిస్తే సహనముతక్కువే అతనికి.

పెద్దన చేసిన మార్పులకు కారణమేమిటి? నైష్ఠికుడూ, ఆహితాగ్నియైన ప్రవరుడు శరీరం నిత్యం కాదంటూ బ్రహ్మానందాధి రాజ్యపదవి శరీర బాహ్యమైనదిగా, వ్రతాదులతో వైదిక కర్మలతో వైరాగ్యభావంతో పొందదగినదిగా అగ్నిదేవునిద్వారా ఆ అభీష్టసిద్ధి పొందటమే మార్గమంటూ, తన ధర్మాన్ని నిర్వచించాడు. వరూధిని "సశరీర స్వర్గ సుఖము" సాధ్యమంటూ, కేవలం "కామ శాస్త్రోపాధ్యాయునిగా కాదు, యోగ శాస్త్రోపాధ్యాయునిగానే సూచిస్తుంది. ఇది పెద్దన చేసిన మార్పు. "ఎందేడెందము కందళించు......" అన్న పద్యంలో యోగ శాస్త్ర జ్ఞానం ఇమిడివుంది. వేద ప్రమాణంగా రచింపబడిన తంత్ర శాస్త్రము మనస్సులో పెట్టుకునే పెద్దన ఆ పద్యం వ్రాసి ఉండాలి. "శ్రీ తత్త్వ చింతామణి"లో 'షట్చక్ర నిరూపణ' ప్రకరణములోని ఈ క్రింది శ్లోకాలని చూడండి:

"ధ్యాయేద్యోహృది పంకజం సురతరుం శర్వస్య పీఠాలయం
దేవస్యానిలహీన దీపకళికా హంసేన సంశోభితం
భానోర్మండల మండితాంతర లసత్కింజల్క శోభాధరం
వాచామీశ్వర ఈశ్వరోఽపి జగతాం రక్షా వినాశేక్షమః
(26)

యోగీశోభవతి ప్రియాత్ప్రియతమః కాంతా కులస్యానిశం
జ్ఞానీశోఽపి కృతీ జితేంద్రియ గణోధ్యానావ ధానక్షమః
గద్యైః పద్యపదాది భిశ్చ సతతం కావ్యాంబుధారావహో
లక్ష్మీరంగణ దైవతః పరపురే శక్తః ప్రవేష్టుం క్షణాత్",
(27)

హృదయ స్థానానికి సంబంధించిన అనాహత చక్రాన్ని గూర్చి హృదయంమీద ధ్యానం నిలిపే యోగికి కలిగే సిద్ధులను గూర్చి ఉల్లేఖింపబడింది ఈ శ్లోకాల్లో—అనిలహీన దీపకళికవలె హంస (జీవాత్మ) హృదయ పంకజంలో నిల్చి ధ్యానమగ్నుడయ్యే యోగికి కలిగే సిద్ధులు: బృహస్పతినిబోలు వాక్ఛక్తి; దానితో ఈశ్వర శక్తివలె జగత్ స్థితి లయ కారణమైన శక్తి. కాంతలకు ప్రియాతి ప్రియుడు కావటం జితేంద్రియత్వం ధ్యానావధాన పరత్వం, గద్య పద్య రచనాశక్తి, లక్ష్మితో ప్రకాశించటం, ఇతరులలో ప్రవేశించే శక్తి అని చెప్పబడినవి. ఇవన్నీ మహాకవి లక్షణాలని వేరుగా చెప్పనవసరంలేదు. నైష్ఠికుడైన ప్రవరుణ్ణి "నువ్వు కవివలె యోగివై ఇహపరాలు రెండూ సాధించగూడదా?" అని ప్రశ్నించింది వరూధిని. పై యోగ శాస్త్ర దృష్ట్యా.

వరూధిని ప్రవరుని తనూ విలాసం మాత్రమే చూచి వలపు చెందలేదు. వైదికుడూ గృహస్థుడూ అయిన బ్రాహ్మణుడని తెలియగానే కవియైన యోగి కాకూడదా అన్న ఉద్దేశంతో యోగ శాస్త్రాన్ని ఉల్లేఖిస్తూ, తన కోరికను మన్నించటానికి ప్రవరున కేమీ అసాధ్యం కాదనే సూచించింది. నిజానికి వరూధినికి 'ముని ముచ్చు' అంటే ఈసడింపు. జితేంద్రియత్వంలేని వైరాగ్యంతో 'ఇనుపకచ్చడాలు' కట్టుకుని తపస్సు చేసేవాళ్ళు యోగులు కారనీ, వాళ్ళు 'తామరస నేత్ర లిండ్ల బందాలనీ,' వాళ్ళంటే ఆమెకు తక్కువ చూపు. ప్రవరుడు యోగి అనే ఆమె అభిప్రాయ పడింది. అట్టి వానిని రంజింపజేయలేక పోయినందుకు అతనిమీద మరీ గౌరవభావం పెంచుకుని విరహంతో తపించింది.

వరూధినికి ప్రవరుడి మొరటుతనం, దయాశూన్యత ఆశ్చర్యం కలిగించింది. 'కృపార హితాత్మక' అని బోధిస్తూ—

"చేసితి జన్నముల్ తపము చేసితినంటి, దయా విహీనతన్
చేసిన పుణ్యముల్ ఫలము సెందునె? పుణ్యము లెన్నియేనియుం
జేసినవాని సద్గతియే చేకురు భూత దయార్ద్రబుద్ధికో
భూసురవర్య! ఇంత దలపోయవు నీ చదువేల చెప్పుమా?"

అని ప్రశ్నించింది వరూధిని. భూత దయార్ద్ర హృదయం లేనివాడు ధార్మికు డెట్లా? అన్నది మరొక పెద్ద తాత్త్విక విషయం. ప్రవరుడు పండితుడేకాని, కవి కాడని "భాషా పర శేష భోగి" అనటంలోనే పెద్దన సూచించాడు. పోతే ప్రవరుడు ధర్మాన్ని చేపట్టాడు. కాని, అతనిధర్మం ఇంకా పరిపూర్ణతను, పరిణతిని చెందలేదన్నమాట! అతని వైరాగ్యమూ, నిగ్రహమూ కూడా లోప భూయిష్టమేకాని లోపరహితం కావన్నమాట. ఏమంటే 'ధర్మం' అనే దానికి సంప్రదాయం ప్రకారం చాల విశిష్టమైన అర్థం ఉంది. సౌకర్యంకోసం ఆర్థర్ ఆవలన్ ధర్మాన్ని గూర్చి వ్రాసిన మాటల్ని ఉల్లేఖిస్తున్నాను:

"The pre—requisites of all Yoga are the eight limbs or parts, Yama, Niyama, and others. Morality, religious disposition and practice, and discipline (Sadhana), are essential pre - requisites of all Yoga which has as its aim the attainment of the Supreme Experience. Morality (Dharma) is the expression of the true nature

of being. The word Dharma, which includes both ethics and religion, but has also a wider Context, comes from the root 'dhri', to sustain, and is therefore both the sustainer and the act of sustaining. The Universe is sustained (Dharyate) by Dharma and the Lord who is its Supreme Sustainer is embodied in the eternal law and is the Bliss which its fulfilment secures. Dharma is thus the law governing the universal evolution, or the path of outgoing (Pravrithi), and involution, or the path of return (Nivrithi). And only those can attain the liberation to which the latter path leads who by adherence to Dharma cooperate in the Carrying out of the universal scheme. For this reason it is finely said "Doing good do others is the supreme Duty" (పరోపకారోహి పరమోధర్మః)" Arthur Avalon: The Serpent Power.

ధర్మం అంటే వ్యక్తి స్వభావానికీ, అతనినైతికాదర్శానికీ, విశ్వాసాలకూ అన్వయించే పదం. అంతేకాదు, సృష్టి స్థితి లయ కారణమైన భగవచ్ఛక్తికీ, న్యాయానికీ అన్వయిస్తుంది. కాబట్టి ఈ ప్రత్యేకార్థాలన్నీ సమన్వయం చెందే మోక్షం సాధింపబడటానికి వ్యక్తిధర్మం సృష్టి ధర్మంతో అనువర్తించి ఏకం కావాలి. అందుకే పరోపకారం పరమ ధర్మం అవుతుంది. ప్రవరుని ధర్మ ప్రవృత్తి ఇంకా సకామ కర్మానుష్ఠాన దశలోనే వుందికాని, నిష్కామ కర్మాచరణంగా పరిణామం చెందలేదు. అందుకే 'దర్భలు వగ్నులు' తనకు ప్రియమైనవని చెబుతూ తమ ఇంటికి వెళ్లాలనే కోరికను అగ్ని దేవునికి నివేదించి, అతని ద్వారా తీర్చుకున్నాడు. * ధర్మార్థ కామములనే మూడింటినీ సకామ కర్మతో సాధించవచ్చుకాని, చివరిదైన మోక్షము, 'బ్రహ్మానందాధిరాజ్య పదవి' నిష్కామ కర్మవల్లనే సిద్ధిస్తుంది. ప్రవరుడు ఇంకా అంతదాకా వెళ్ళలేదు. అందుకే అతనిలో కోపం, అసహనం, దయాశూన్యత కనిపించాయి.

వరూధిని గంధర్వ స్త్రీ. హిమవన్నగ ప్రదేశానికి చెందినది.

"హిమకుధ రోత్తర స్థిత మహీధర మధ్యమునందు బొల్పుదే
శముఖిల్లి రమ్యముల్ దివిజ సాధ్య వియచ్చర సిద్ధ కిన్నరా
శ్రమములు, సర్వకాల బహు సౌఖ్యకరంబులు, క్షుత్తృషామయ
శ్రమ రహితమ్ము లుత్సిత సౌరభ సంగి సమీర హృద్యముల్.
స్వర్గ భువనమ్ముకంటె నిరర్గళ సుగుణముల కాశ్రయ ముత్తై భౌమ
స్వర్గము అనంగ నొప్పు నిసర్గ సుఖములను దదియు శైలాంతరముల్.
ఇందు లేకుండు పుణ్య పాపార్జనములు, పుణ్య ఫల భోగుల్ మంద్రు పురుషు లెల్ల
భారతాది చతుర్దిశా సత్రమేరు కర్ణికా స్థితి నిట్టి భూకమల మమరు"

(మార్కండేయ పురాణము 4 ఆశ్వా.)

పుణ్య పాపార్జనముల కతీతురాలైన వ్యక్తి వరూధిని. ఆమె ప్రకృతి వంటిది. ప్రవరుడో కర్మ భూమినుంచి వచ్చిన వాడు: "హిమగిరి దక్షిణంబున మునీశ్వర పొల్పగు భారతాఖ్య వర్షము విను కర్మ భూమి యది........" ప్రవరునికి పుణ్య పాప విభేదము ముఖ్యము. వరూధినికి అది తెలియనే తెలియదు. కాని ప్రవరుణ్ణి చూడగానే ఉచితానుచిత విచక్షణ కూడా కోల్పోయింది. అతణ్ణి గూర్చి గొప్పగా వూహించింది ఆమె. వరూధినిని సామాన్య మానవకాంతగా, కేవలం మోహ వివశయైన ముగ్ధగా అనుకోవడం మన పొరపాటు. కీ. శే. కట్టమంచి రామలింగారెడ్డి గారనుకొన్నట్లు (కవిత్వ తత్త్వ విచారము'లో) వరూధిని "మనోహారిణి యగు ముగ్ధరాలు" కాదు. దువ్వూరి రామిరెడ్డిగా రూహించినట్లు (పై నుదహరించిన వారి వ్యాసంలో) ఆమె "కన్యక" కూడా కాదు. 'అనన్యకాంత' మాత్రమే. పెద్దన పొరపాటు చేయలేదు.: "వరూధిని రతి కన్నెరికపు రతియు బోలె గడు నింపొసగెన్" అని పోలిక మాత్రమే చెప్పి నిర్ధారణ చేయకుండా విడిచాడు. ఆమె గంధర్వ స్త్రీ కావటమే అందుకు కారణం.

సంప్రదాయాన్నిబట్టి వరూధినీ ప్రవరుల సంవాదాన్ని, వాళ్ల వ్యక్తిత్వాల్ని ఎలా అర్థం చేసుకోవాలో పై విచారణవల్ల తెలిసింది. శృంగారంమీదే దృష్టి నిలిపి వాళ్లని ఈ కాలపు స్త్రీ పురుషులుగా వూహించుకోవడం పొరపాటు. పెద్దన మూలంలోని వ్యక్తులకు భిన్నమైన వ్యక్తుల్ని ఎందుకు సృష్టించినట్లు? వరూధినీ ప్రవరుల సంవాదంలో కవి తనలోని భావ సంఘర్షణని ప్రతిఫలింప జేయటమే అందుకు కారణం. కథావస్తువుని ఎన్ను కోవడంలో కవి యీ అవకాశం చూచుకొనే ఎన్నిక చేస్తాడు. కథా, కథలోని పాత్రలూ తన హృదయావిష్కరణ చేసేందుకు అనువుగా ఉండేట్లు చూస్తాడు. అయితే వరూధినీ ప్రవరుల సంవాదం వ్యక్తం చేసిన కవి హృదయ మేమిటి? అదే ఇప్పుడు విచారింపదగిన అంశం.

3

భోగ పరాయణత్వము ఎక్కువగావున్న వాతావరణంలో నిత్యమూ మసలుతున్నవాడు పెద్దన. స్వతహా మంచి సౌందర్య

---

* పురుషార్థాలలో మొదటిదైన 'ధర్మం' అంటే నైతికాదర్శాలూ, విశ్వాసాలూ అనే అన్వయం.

పిపాస, రసికత కలిగిన వ్యక్తి. అయినా ఆత్మతత్త్వమూ ధర్మ సంస్థితమై, జాగరితమై సముజ్జ్వలంగానేవుంది పెద్దనలో. పెద్దనతోనేకాదు, కృష్ణదేవరాయలలోనూ ధర్మదీక్ష, తత్త్వ జిజ్ఞాస, దైవభక్తి తేజోవంతంగానే భాసించాయి. లేకపోతే, "ఆముక్తమాల్యద" వంటి కావ్యం పుట్టిఉండదు. పెద్దనలోని విశిష్టత ఏమిటంటే ఆయన, మిగతా కవులూ రాజాశ్రితులైన పండితులూ చూచినట్లు భోగ ప్రవృత్తినీ, ధర్మ దీక్షనూ విడదీసి, సందర్భోచితంగా పడకటిల్లు వేరు దేవాలయంవేరు అనే ధోరణితో చూడలేక పోవటమే. ఆ రెండింటికీ సమన్వయ మెట్లా సాధ్యం? రెండింటికీ మూలమైన ఆత్మ పదార్థాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి? అన్న సమస్య ఆయన్ని వేధించింది.

పెద్దన మనస్థితికి క్రింది పద్యం దర్పణంలాంటిదని పిస్తుంది నాకు.

"ఓ సరసీరుహాక్షి! వినవో రతి నౌగిట నీవు వేర్చు నిం
పౌసుర భర్తకైన గలదా? వలదంచు బెనంగ నేను స
న్న్యాసినె యొక్కటే తహతహన్మన సొగ్గడు కేళిపై 'ననా
శ్వాసిత దుఃఖితే మనసి సర్వమసహ్య' మనానెరుంగవే!"

ఇంద్రియ సౌఖ్యం అనుభవిస్తూన్న వేళలోనే చటుక్కున అనాశ్వాసిత దుఃఖంతో నిండిపోతుంది మనస్సు. సర్వ మసహ్యమై పోతుంది కారణం తెలీకుండానే! తర్వాత ఆలోచిస్తే ఇది ఎటువంటి వైరాగ్యం? అని నవ్వు కూడా వస్తుంది. పై పద్యం మాయా ప్రవరుడు చెబుతూంటే 'అంతా నాటకం' అని మనకు అనిపించినట్టే, పెద్దన కూడా తనకు ఇంద్రియ సుఖానుభూతి మధ్య తరచు సంభవించే వైరాగ్య భావాన్నిగూర్చి ఆత్మ పరీక్ష చేసుకుంటూ, "అంతా నాటకం! నేనేమి సన్న్యాసినా?" అనుకొని ఉండాలి. అయితే కంపళించిన డెందమూ, ముఖంవైపు మళ్ళిన ఇంద్రియాలూ, కుంభగత ప్రదీప కళికాశ్రీదోప ఏకాగ్రత వహింపలేకపోవటం ఎందువల్ల? సుఖంలో పొడసూపే అనాశ్వాసిత దుఃఖానికి కారణ మేమిటి? తనలో ఈ ద్వైధీభావ మేమిటి? సమన్వయము ఎలా లభిస్తుంది? ఇది జీవుని పరిదేవనము, మామూలు భావ సంఘర్షణకాదు. ఈ స్థితే పెద్దన తత్త్వ జిజ్ఞాసను కేవలం పాండిత్య ప్రకర్షగాకాక, తత్త్వాన్వేషణగా రూపొందించి ఆత్మ సాక్షాత్కారంవైపు ఆయన్ని ఉమ్ముఖుణ్ణి చేసిఉండాలి.

పెద్దనలోని సంఘర్షణ వరూధినీ ప్రవరుల సంవాదంగా కావ్య వస్తువులో వ్యక్తమైంది. ప్రవరుడు పెద్దనలోని వైరాగ్య ప్రవృత్తి. మాయా ప్రవరుడు సమయముకోసం వేచివుండి అవకాశం జారవిడవకుండా భోగించే లాలస ప్రవృత్తి. ఈ రెండూ ఒక వ్యక్తిత్వంలోనివే. వీనికి అన్వయం సాధ్యమా?

ప్రవరునికీ, మాయా ప్రవరునికీ గల భేదం వరూధినికి తెలీదు. ఆమెకు ప్రవరుడిమీదే మనస్సు లగ్నమైంది. ఆమెకు ప్రవరుడే మరుసటిరోజూ కనిపించాడు. రతి సమయంలో కన్నులు మూసికొన్నా, ఆమె మనోనేత్రంముందు ప్రవరుడే ఉన్నాడు. అంతేకాదు. ప్రవరుడు తన్ను నిరాకరించిన సమయంలో ఉద్దీప్తమైన అతని మూర్తి (అగ్నిదేవుడు అతని దేహంలో సన్నిహితుడు కావటంవల్ల) 'ఉత్తప్త కనక ద్రవ ధారా గౌరంబగు' తనుచ్ఛాయతో వెలిగిన ప్రవరుని మూర్తే ఆమె మనస్సులో నిలిచివుంది.

"......తత్ప్రవరదేహ సమిద్ధ శిఖిదీప్తి శాంబరీ మహిమచే
సంగ్రహించి
నట్టి గంధర్వమూర్తి సౌఖ్యానుభూతిఁ జలనమేదిన
మాన సాబ్జమున నిలువ
వెలసెఁ దేజోమయుంబైన వృద్ధి నట్టి చేటి గర్భంబు"

అని చాలా స్పష్టంగా వివరించినాడు పెద్దన. గంధర్వునితోడి సౌఖ్యానుభూతి ప్రవరుని తేజ పొంశకు కేవలం వాహిక అయింది. ప్రవరుడు ఆత్మగా, మాయా ప్రవరుడు శరీరముగా వరూధిని అనుభూతిలో అభేదభావం కల్పించినాడు పెద్దన.

ఇది పెద్దనలోని ద్వైధీభావానికి తాత్కాలికంగా ఒక ఏర్పాటు—శరీరము భోగాసక్త మౌతుంది, ఆత్మ వైరాగ్యంతో పరాఙ్ముఖత్వం వహిస్తుంది. దీనికి ఫలితం, పరిణామం ఏమిటి?

4

ఫలితం స్వరోచి. "స్వరుచి స్ఫురణను శశి భాస్కర పావక తారకా ప్రకాశము తెల్లిప్ప వివశములు సేయు"టవల్ల అతనికి ఆ నామధేయము. వరూధినీ ప్రవరుల వర్ణనలలోనూ, తర్వాతా పెద్దన తెలుపు ఎరుపు కాంతుల్నీ శశి భాస్కరుల్నీ సూచిస్తూ రావటం గమనింపదగిన విషయం. ప్రవరునిలో చివర భాసించిన కాంతి పావకుని కాంతి. కాబట్టే స్వరోచి శరీరంలో వరూధినీ ప్రవరులు ఇద్దరూ ఉపస్థితు లయ్యారు.

కాని, జీవితం ప్రథమ భాగంలో స్వరోచి అచ్చంగా వరూధిని బిడ్డ, స్వరోచిలో శారీరక ప్రవృత్తి ప్రధానం, దానితోపాటు కరుణార్ద్రత—ఇవి రెండూ వరూధినికి చెందిన లక్షణాలు. స్వరోచి ఉద్ధృతమైన శరీరబలంతో ప్రకృతిని భేదించే ప్రవృత్తి కలవాడు. "గ్రుద్దున్ గోత్రాచలంబుల్......అనుపమ బలుడై యౌవనారంభ వేళన్" అన్న పద్యంలో ఆ ప్రవృత్తి వర్ణింపబడింది. దానివల్లే ఆటవికులకు రాజవుతాడు. అతనికి వేటమీద తమకం హెచ్చు.

పెద్దనకూ వేటమీద ప్రీతి. కృష్ణదేవరాయలతో వేటకువెళ్ళే వాడనటానికి మను చరిత్రలోని చక్కని వర్ణనలే సాక్ష్యం.

ఆత్మ నిర్లిప్తంగా పరాఙ్ముఖమై, వూరుకుంటే, శరీరం నియమ రహితంగా విజృంభిస్తే ఏమౌతుంది? ప్రకృతి భోగవాంఛకు భుక్తం అవుతూ ఉంటుంది. దాని పరిణామ మేమిటి?

పరిణామం : స్వరోచికి రాక్షసుడు మ్రింగబోతూవున్న గంధర్వ కాంత మనోరమ ఆర్తనాదం వినిపిస్తుంది. మనోరమ కెందుకీ ఆపద? ఆమె చేసిన తప్పేమిటి?

"పూసరవెల్లి చందమున నొక్కట చీరనతొలు దేఱగా
మీసలు గడ్డముం జడలు మేనుదరంబును వీనులున్ జరా
ధూసరమైన రోమ తతితో బెనగంబడి దూది రాశిగా
జేసిన రీతి నున్న యొక జీర్ణ ముని౦గని కౌతుకంబునన్
ఇతని వదన కుహర మెద్ది నేత్రద్వయం
బెద్ది కర్ణ యుగళ మెద్ది యనుచు
బూచివోలె నున్న వాచంయముని హాసము
బాల్య చాపలమున బట్టుటయును"

ధర్మం కాలభారంతో ముక్కూ మొహమూ తెలీని రాశిగా ఆచార పరతంత్రమై ధూళి ధూసరితమై పోయినప్పుడు బుద్ధి (మనోరమ) ఏం చేస్తుంది తడివి చూడక? బుద్ధి క్రొత్తగా వివేచన ప్రారంభిస్తుంది, ప్రాచీన ధర్మోల్లంఘనం చేస్తుంది కూడా ఒకప్పుడు. ఇక ఆమెను మ్రింగబోతున్న రాక్షసుడెవ్వడు? అసురభావం పొందిన ఇందీవరాక్షుడనే గంధర్వుడు. (ఇంద్రియ ప్రవృత్తి). ఈ రాక్షసుడు మూర్తీభవించిన తృష; అడ్డం ఆకలేని భోగాసక్తి:

"అభ్రమండలి మోచునందాక నూరక పెరిగి నచ్చే
మేను నరవరేణ్య!
యవధి భూధర సానువందాక నూరక పఱచినట్లే మేను
పార్థివేంద్ర!
యబ్జ భూభువనంబు నందాక నూరక యెగసినట్లే
మేను జగదధీశ
యహిలోక తలమంటు నందాక నూరక పడిన యట్లపు
మేను ప్రభువతంస!

యఖిల జగములు మ్రింగునంతా కలియును
నబ్బ లేడును జెడ గ్రోలునంత తృషయు
నచల చాలన చణమైన యదటు గలిగె
ననురభావంబు నను జెందు నవసరమున"

శరీర తృష్ణా విజృంభణాన్ని చక్కగా వర్ణించి అసుర భావమంటే ఏమిటో చూపాడు పెద్దన. ఈ శరీర తృష్ణకు చిక్కి కబళింపబడుతున్న బుద్ధి మనోరమ. ఇంతకూ మనోరమ ఇందీవరాక్షుని కొమార్తే, ఎవ్వరో కాదు. తత్త్వపరంగా చూస్తే 'బుద్ధి', 'ఇంద్రియ జ్ఞానము'ద్వారా స్వరూపం దిద్దుకునేదేకద! అందుకే మనోరమ యిందీవరాక్షుని కూతురు. నియమం లేకపోవటంతో యింద్రియ ప్రవృత్తి, ధర్మం గ్రహించలేకపోవటంతో బుద్ధి రెండూ స్థితిచెడి చివరకు శరీర తృష్ణలో బుద్ధి విధ్వంసమయ్యే పరిణామం కలిగిందని భావం.

స్వరోచిలోని ముఖ్య గుణం దయ. "........కరుణ పొడమగ నయ్యో యేవూనిని కెవ్వనిచే నేమాయెనో!" అనుకుంటూ మనోరమను రక్షించటానికి వస్తాడు. తృషా మూర్తియైన రాక్షసునితో అతను యుద్ధం చేసిన పట్టు చూడండి. పారిపోతున్న అనుచరుల నుద్దేశించి "ఆత్మకుం బేద తనంబు మేలె! మరి మృత్యువు, డాగెడిచోట లేదొకో?" అంటూ ప్రబోధిస్తాడు. తృష్ణ అజేయంగా విజృంభించటానికి ఒక కారణం మనిషిలో మృత్యువంటే కలిగే భయమే. "బుద్ధీంద్రియ క్షోభములకు బెట్టని కోట......సకల సుగుణ ప్రధానంబు, సకల కార్య జాల సాఫల్యకరణైక సాధనంబు ధైర్య గుణ"మని అంటాడు స్వరోచి. చివరకు "పావక బాణం బేపున సంధించి రాక్షసుని మళ్ళీ గంధర్వునిగా చేస్తాడు. బుద్ధీంద్రియ క్షోభను (మనోరమా ఇందీవ రాక్షుల విపరీత స్థితిని) ఆవిధంగా ధైర్యంతో, ధర్మం, (పావకబాణం) సాధనంగా చక్కబెట్టాడు స్వరోచి. ప్రవరునిలో లోపించిన దయాగుణం ప్రాతినిధికగా స్వరోచి ఇప్పుడు జిజ్ఞాసచేసి, ధర్మ నిరూపణం చేస్తున్నాడన్నమాట.

స్వరోచి మనోరమను వివాహం చేసుకుని, ఆయుర్వేదం తెలుసుకుంటాడు. ఆయుర్వేదంతో మనోరమ చెలులైన విభావసి, కళావతులకు స్వస్థత చేకూర్చి వివాహం చేసుకుంటాడు. పెద్దన మూలంలోని 'విభావరి' పేరుని విభావసి'గా మార్చటం గమనింపదగిన విషయం. విభావసి అంటే సూర్య సంబంధి, మృగపక్షి భాషలను స్వరోచికి దత్తం చేస్తుంది. కళావతి ఆమె చరిత్ర ప్రకారం చంద్ర కళా పోషిత. మనోరమ పావక బాణంతో ఇందీవరాక్షునినుండి రక్షింపబడి సంగ్రహింపబడింది. ఈవిధంగా ముగ్గురినీ వివాహం చేసుకోవటంతో స్వరోచిలో శరీరద్యుతులుగానేకాక, ఆధ్యాత్మికంగా కూడా సూర్య చంద్ర పావక ప్రకాశాలు భాసిస్తాయి.

మనోరమ బుద్ధికి ప్రతీక అయినట్లే విభావసి మనస్సుకూ, కళావతి చిత్తానికీ ప్రతీకలు. స్వరోచి శాస్త్రాలనూ, కళలనూ ఆకళింపు చేసుకుని విజ్ఞానవంతు డౌతాడు. కళావతి, ఉదంతములో ఎంతో అర్థస్ఫూర్తివుంది. ధ్యాన సమాధి భంగం కావటంతో అందులో లీనమైన చిత్తంపొందే వికారమే కళాసృష్టికి మూలం. (బ్రహ్మర్షి తపోభంగం కావటంతో లతవికీ అప్సరకూ జన్మించింది కళావతి) అంతేకాదు. కళలను గూడ భోగాసక్తే (గంధర్వుడు) తస్కరింపజూచింది. కళాసృష్టి తపస్సువంటిదనే సంప్రదాయం పోయింది. కాని, కళలను పార్వతీదేవి రక్షించింది. పద్మినీ విద్యను ప్రసాదించింది. ఇది యోగ విద్య. కళలలో నిక్షిప్తము. కవి సాధనలో యోగి అనే పెద్దన నిశ్చితాభిప్రాయం.

ఇప్పటికి పెద్దనలోని ద్వైధీభావం పొందిన పరిణామం ఏమిటి? ఆత్మ పరాఙ్ముఖత్వాన్ని వదలి, బుద్ధి, మనస్సు, చిత్తము, శరీరము—వీని వ్యాపారాల్ని జిజ్ఞాసలో లిప్తం కావలసి వచ్చింది.

అందువల్ల విజ్ఞానం పెరిగింది. ఇదంతా కరుణా ప్రవృత్తి వైరాగ్యంమీద సాధించిన విజయమే. శరీరంవేరు, ఆత్మవేరు. దేనికదే అంటూ శరీరాన్ని వదలి పెట్టడానికి వీల్లేదని తెలిసింది. అయితే వైరాగ్యం మాటేమిటి? ఎంత విజ్ఞానం సంపాదించినా, ఆ "అనాశ్వాసిత దుఃఖం" మాటేమిటి?

5

స్వరోచి సాధించిన సమన్వయాన్ని హంస పొగడినా చక్రవాకి ఇలా నిశితంగా విమర్శిస్తుంది:

"పలువురయందు నొక్కనికి బ్రాతియు నొక్కని యందు జూడ న
గ్గలమగు ప్రేమ పల్వురకు గల్గుట యద్భుత మట్లు గాన యి
ప్పొందులయందు గూర్మి పస వీనికి నేమియులేదు, వీని యం
దలవడగల్గు దీ జలరుహాక్షులకుం బ్రియుఁ డెవ్విధంబునన్!
మనుజేశుడు కొలిచిన పరి
జనములతో నిష్టగోష్ఠి సలిపెడిచో నె
ట్లను రాగమట్లు కూరిమి
వనితలు పెక్కండ్ర యందవశ్యము పతికిన్
ఈ వెలత లీ మహీశు న
హీనగతిం దగిలిరేవి నితఁడొక లేమం
దానెలమి గూడునెడ నే
మానిని ప్రాణేశుమీది మమతమెలంగున్?
కావున దాసీనికరము
కైవసమై సంచరించు క్రమమున విద్యా
ప్రావీణ్య వైభవోన్నతి
చే వచ్చినవారి వీరిజెప్పకు మింకన్.
తగులు నెవ్వడొక్క తరుణికి నొకనికి
మెలత వలచునదియు మేలనంగ
నప్పుగాని పెక్కువనితలపై గూర్మి
గలుగుననుట బొంకుగాదె తరుణి!"

స్వరోచికి ముగ్గురి భార్యలమీదా ఆసక్తి వుండటం, యిది భోగాసక్తిగాని ప్రేమకాదంటుంది చక్రవాకి. అంతే కాదు యిది ప్రభువునకు పరిజనములమీద వుండే ఆసక్తి వంటిది, వీళ్ళు దాసీలుగాని ప్రియురాండ్రుకారు అంటుంది. అసూయా, సపత్నీ మాత్సర్యం తగులని వీళ్ళసంబంధం ప్రేమ సంబంధం ఎట్లా అవుతుంది ? అని ప్రశ్నిస్తుంది. వీళ్ళ 'విద్యాప్రావీణ్య వైభవోన్నతి' చాటిచెప్పే పరిజనం మాత్రమే అంటుంది. ఇక్కడ ప్రేమనుగూర్చిన జిజ్ఞాస ప్రారంభం.

స్త్రీ భోగవస్తువా ? అని ప్రశ్నించిన పెద్దన సమకాలీన జీవితధోరణిని నిశితంగా విమర్శించాడనే చెప్పాలి. కాని ఆయన కవి; సంస్కర్తకాడు అని గుర్తుంచుకోవాలి.

వరూధినీ ప్రవరుల సంవాదంతో ప్రారంభమైన సమస్య యీ పట్టున ఒక కొలిక్కి వచ్చింది. ప్రవరుడు దయా శూన్యుడు, అతని అహంభావము శరీరాన్ని నిరాకరించే వైరాగ్యంద్వారా వ్యక్తమైంది ("అరిగె మహీసురాధముడహంకృతితో" అనే విమర్శ అంగీకరించినా, స్వరోచిదయార్ద్ర హృదయుడు, యిప్పుడతని అహంభావము మాత్రం, ముగ్గురిని పెండ్లి యాడి వాళ్ళమీద భోగాసక్తి కలిగివుండటంలో వ్యక్తం కావటంలేదా అన్న విమర్శ ఎదురవుతోంది. ఒకదానికొకటి సమాధానం. ఎటూ మిగిలింది అహంభావం.

వరూధినికి ప్రవరునిమీద కలిగినభావం ఎటువంటిది? ఆమె గంధర్వ కాంత కావటంతో ఆమె ప్రకటించిన భావాల్లో భోగాసక్తే వ్యక్తమైంది. ప్రవరుడు తిరస్కరించి వెళ్ళిన తర్వాతకాని ఆమెవలపు నిశ్చితమైన పత్నీధర్మమైన ప్రేమగా మారలేదు. అలామారటం ఆమె చెలికత్తెలు గుర్తించి వ్యాఖ్యానించారుకూడా : "పూత నసించినంటి వలపుం బచరించు కులంబు నీతికిన్ లేలగదమ్మ యిత్తెఱగు ?" చంద్రుడు ఆమెకు యమధర్మరాజులాగా కనిపించటంలో ఎంతో స్వారస్యంవుంది. అందులో పెరుగుతూ తరుగుతూవుండే వలపూనిర్దిష్టమై నిశ్చలమైన పత్నీధర్మమూ ఒకటి కావటం సూచింప బడింది. ఎప్పుడోకాని శ్లేషవాడని కవిపెద్దన, ఎంతో చక్కగా ఉపయోగించుకున్నాడు శ్లేషను. అందులో చంద్రునికీ యమధర్మరాజుకీ అభేదం చెబుతూనే ధర్మం వరణీయమంటూ "ధర్మపద మొక్కడెక్కుడా ధన్యునందు" అని ముగించడం ఎంత సమంజసంగావుందో గ్రాహ్యము. ఆ విధంగా వరూధినిలో భోగలాలస ప్రేమగా మారింది అనే విషయాన్నికూడా జ్ఞాపకం తెస్తుంది చక్రవాకి స్వరోచినిగూర్చి చేసిన విమర్శ.

ఈ పట్టున స్వరోచిలో ప్రప్రథమంగా వైరాగ్య భావం పొడసూపుతుంది. అంటే స్వరోచిలో ప్రవరుని అంశ ప్రస్ఫుటం కావటానికిదేమొదలు. కాని భోగాసక్తిదే ప్రాబల్యం కావటంతో 'మానరాని తమకంబున' నూఱేండులు గడుపుతాడు.

తర్వాత ఒక మగలేడి చేసిన వ్యాఖ్యానం మళ్ళీ అతనిలో వైరాగ్యభావాన్ని రేకెత్తిస్తుంది. "నేను స్వారోచినే, పంచే జాక్షులతోడ నెల్లపుడు దర్పసూఫూర్తి గ్రీడింప ?" అన్న లేడిమాటలువిని విరక్తితో "అరయ నిట్టి రోతలకు నాలయముల్ జలజాక్షు లేటికిన్ వీరలతోడి సంగమింక వీడెద నంచు" గట్టిగా అనుకున్నామళ్ళీ "వివేకము చొప్పుదక్కి" ఆరునూరు దేవమాన సంవత్సరాలు భోగిస్తూనే గడుపుతాడు స్వరోచి.

ఒకసారి వేటలో అడవిపందినిచూచి బాణము సంధిస్తూ వుండగా, ఒక ఆడులేడి పరుగెత్తివచ్చి మనుష్యభాషలో అంటుంది :

"నృప ! యీ క్రోడము నీకే
యపకారము సేసె, దీని కలుగఁగ వేఁటా
కృప మదిఁ జొనుపక ? నాపై
నిపుడీ శరమేసి నిగ్రహించుట యొప్పున్"

'నిగ్రహించుట' అని వాడటంలోని ధ్వని గమనింపదగినది. స్వరోచి దయాగుణము— మనోరమాదులైన స్త్రీల మీద ప్రసరించిన విధంగా జంతుజాలముమీద ప్రసరించలేదు. భోగలాలసత్వానికే దోహదమయ్యే దయాగుణం "భూత దయార్ద్రబుద్ధి" ఎలా అవుతుంది ? 'దయ' అనేది ప్రవృత్తి కావటంకంటే నివృత్తి, నిగ్రహం కావటం ముఖ్యంకాదా ?

ప్రవరునిగూర్చి ఆదిలో వరూధిని చేసిన మరొక విమర్శ 'కృపా రహితాత్మక' అనే ఆరోపణకు—ప్రతి విమర్శ ఎదురవుతోంది. కృప అంటే భోగ లాలసత్వమా? వేటమీద తమకం నిగ్రహించుకోలేని వ్యక్తి దయార్ద్ర హృదయుడు ఎట్లా అవుతాడు?

యువతుల్ని వాళ్ళు కోరినంతమాత్రాన దయతో స్వీకరించి భోగ ప్రవృత్తి పెంచుకోవటంకంటె, వేటమీద తమకాన్ని నిగ్రహించుకొని, ప్రాణిహింస మానుకోవటం నిజమైన దయాగుణం అని గుర్తించిన స్వరోచిలో వైరాగ్యభావం దయాభావంతో సమ్మేళనం చెందుతుంది. అదే సర్వ భూతములందు ప్రేమ. అదే అహంకార రాహిత్యం కూడా.

వరూధిని భోగాసక్తి ప్రవరుడి వైరాగ్యమూ పరస్పరము ఘర్షణ పడ్డాయి ప్రారంభంలో. భోగాసక్తి పత్నీ ధర్మమైన ప్రేమగా వైరాగ్యము సర్వ భూతములందు ప్రేమగా పరిణామం చెందటంతో, రెండింటికీ గమ్యం ప్రేమ భావమని ఇప్పటికి అన్వయం కుదిరింది. ఈ ప్రేమే అహంకార రాహిత్య సమన్వయం. స్వరోచి జీవితంలో ఉత్తర భాగంలో ప్రవరుని అంశ ప్రస్ఫుటం కావటంతో సిద్ధించింది. వరూధినీ ప్రవరులకు వారసుడు స్వరోచి.

స్వరోచిలోని దయా ప్రవృత్తి మానవులనుంచి జంతుజాలంమీదికీ, వృక్షాదులమీదికీ విస్తృతమై, 'ఆత్మ వత్సర్వ భూతాని' అన్న ఆత్మ సాక్షాత్కారంతో అతను భగవద్గీతలో చెప్పిన కర్మ సన్యాసయోగి అయ్యాడు.

"యోగ యుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః
సర్వ భూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే.

6

"వల్లీమతల్లి లావణ్య సర్వస్వంబు విమలాంగరేఖ నావిర్భవింప
మంజుల మంజరీ మహిత సౌభాగ్యంబు పరివృత్త కుచవృత్తి బరిణమింప)
పల్లవచ్ఛద చారు భావాను భావంబు మృదు హస్తలీల మూర్తీభవింప
రమణీయ ముకుళ విభ్రమ భాగధేయంబు కర రుహస్ఫూర్తి సాక్షాత్కరింపఁ
జేసి మృగియై వహించు వక్షోద్వయంబు
భాసురంబుగ దనయంక పాళిలోన
మించు క్రొమ్మించు నువమించు మలతయగుచు
నిలుచు నవ్వన దేవత నృపతి జూచి......"

భోగ ప్రవృత్తి నిగ్రహం ద్వారా (దయనుంచి ఉద్భవించిన నిగ్రహం) ప్రేమగా మారటంతో మృగ పరిరంభణం స్త్రీ పరిరంభణంగా ప్రకృతిదేవి పరిరంభణంగా మారిన దృశ్యం వర్ణించిన పై పద్యంలో కేవలం కవిసమయాలుగా అర్థం పోగొట్టుకొన్న పోలికల్ని పెద్దన తాత్త్విక దృష్టి కవి హృదయాను భావాలుగా పునరుద్ధరించి కవి ద్రష్ట కావటం అంటే ఏమిటో నిరూపించింది. అంతేకాదు, ఇది ప్రాణికోటికి సామాన్యమైన లైంగిక ప్రవృత్తియొక్క పరిణామాన్ని సూచిస్తుంది కూడా—జంతు సహజమైన మైథున వాంఛ గంధర్వుల్లో వలపుగా, మానవుల్లో దాంపత్య ధర్మంగా, యోగుల్లో సమస్త భూత ప్రేమగా భాసిస్తుంది—మను చరిత్ర కావ్యంలో వ్యక్తమయ్యే పరిణామక్రమం ఇదే!

ఇక్కడ వరూధిని లేవదీసిన ప్రశ్నల్లో ముఖ్యమైన దానికి సమాధానంవుంది. "ఎందే డెందము కందళించు......" అన్న పద్యంలో వరూధిని సూచించిన యోగ నిర్వృతి కేవలం స్త్రీ సౌందర్యంలోనేకాదు. సర్వ సృష్టి సౌందర్యంలోనూ, యోగ నిర్వృతి సాధించటం ఉత్తమ పద్ధతి అని. ఇంద్రియ నిగ్రహం జితేంద్రియత్వం అనేది ఇంద్రియాలనుంచి పరాఙ్ముఖత్వంకాదు. అది దయాగుణం విస్తృతం కావటంతో వాంఛ ప్రేమగా మారటంతో సిద్ధించే ఆత్మానందానికి ఫలితమేనని గుర్తించిన పెద్దనలో కవి హృదయానుభవ వేద్యమైన సుఖానికీ, ఆధ్యాత్మిక వైరాగ్యానికీ పరస్పర వైరుధ్యం నశించింది. పెద్దనలో ద్వైతీభావానికి లభించిన తుది సమన్వయం యిదే!

సమకాలీన పరిస్థితుల దృష్ట్యా, సామాన్య మానవుల మనస్తత్వం దృష్ట్యా, స్త్రీ పురుష సంబంధం ఏకప్రియాను రక్తిగా మారి దాంపత్య ధర్మంగా సాంఘిక వ్యవస్థయైన గార్హస్థ్యానికి పునాదిగా భాసించటమే కర్తవ్యమని నిరూపించాడు తన కావ్యంలో పెద్దన. స్వరోచి సామాన్య మానవునికి ప్రతినిధి. అతనిలో చివర కర్మసన్న్యాసదృక్పథం ఏర్పడినా, అతను గార్హస్థ్యాన్ని వదలకుండా వన దేవతను స్త్రీ రూపంలో 'ఏక చిత్తంబు తోడ' వివాహమాడి స్వారోచిష మనువుకు తండ్రి అవుతాడు. పెద్దన ఇక్కడ మూలానికి భిన్నంగా చేసిన మార్పు—స్వరోచిని తపస్సుకుపంపి అతనికి భగవత్సాక్షాత్కారం కలిగించక పోవటం— గమనింపదగింది.

'మను చరిత్ర' కావ్యారంభంలోనే, సన్న్యాసం, కంటే గార్హస్థ్యం, వైరాగ్యంకంటె ప్రేమ ఉత్తమమైనవనే ఉపోద్ఘాతం పెట్టాడు పెద్దన. "కెలకుల నున్న తంగేటిజున్ను గృహమేధి" అంటూ సిద్ధుడు పొగడటమేకాదు. "సనువు నిగ్గులు దేరు పాప

జన్నిదమొప్ప బ్రమథాధిపతి ఇంటపెత్తెరింగె....'' వంటి పద్యాలలోనూ గృహస్థ ధర్మాన్ని ఉగ్గడించాడు పెద్దన. అంతేకాదు

''విలయ కృశాను కీలముల వేడిమి బోడిమి మాలి వెల్మిడిన్
గలసిన భూతధాత్రి మరి క్రమ్మర రూపయినిట్టి యోషధుల్
మొలువగ జేయునట్టి నయముం బ్రతి కల్పము నెట్టు గాంచు నీ

చలిమల వల్ల నుల్లసిలు చల్లదనంబును నూనకుండినన్' బూదియై పోయిన సృష్టి మళ్ళీ ఎట్లా రూపం సంతరించుకోవటం? అగ్నివంటి వైరాగ్యంతో నిరాకృతమైన రూప గుణ సౌందర్యాదులు మళ్ళీ మంచువంటి చల్లని ప్రేమతో స్వీకృతం కావటం ముఖ్యం అనే భావాన్ని నొక్కి పలుకుతున్నాడు పెద్దన. ప్రవరుడు అగ్ని నుపాసించి వరూధినిని తిరస్కరించి వెళ్లటం, స్వరోచి వన దేవతను ప్రేమానుభూతితో స్వీకరించటం—'మను చరిత్ర' మొదలూ, తుదీ రెండూ ధ్వనించాయి ఈ పద్యంలో అనుకోవచ్చు.

వరూధిని సూచించిన ''ఎందే డెందము కందళించు...'' అన్న యోగ సాధన శైవుల సమయాచార, తాంత్రిక మార్గమునకు చెందినది. పెద్దన శైవం వదలి విశిష్టాద్వైతం స్వీకరించినవాడు. కారణం 'లయ యోగం' కంటే కర్మ, జ్ఞాన యోగ మార్గాలు ఆయనకు శ్రేష్ఠంగా కనిపించటం. కావ్యాదిని పెద్దన శివుణ్ణి ప్రార్థించిన తీరు చూస్తే ఈ సంగతి స్పష్టమౌతుంది.

''ఉల్లమునందు నక్కటిక యూనుట మీ కులమందు గంటి మం
చల్లన మేల మాడు నచలాత్మజ మాటకు లేతనవ్వు సం
ధిల్ల గిరీటి పాశుపత దివ్యశరార్థ్యుని జేయు శాంబరీ
భిల్లుడు.........''

భిల్లుడైన శివుడు ''అక్కటిక'' మూనుటే విశిష్టాద్వైతములోని విశిష్టతగా భావించినవాడు పెద్దన. అద్వైతంలో, మాయావాదంలో ఆ 'అక్కటికము' ఆయనకు కనిపించలేదు. పై పద్యంలో భిల్లునివలె వేటగాడైన స్వరోచి ఉదంతమూ అతనికి చివర కల్గిన అక్కటికమూ కూడా ఎలా ధ్వనించాయో గ్రాహ్యం.

స్వరోచి పుత్రుడు ''తేజోనిధి''. స్వరోచిలో 'విరళములైన' శశి భాస్కర పావక తారకా ప్రకాశములు స్వరోచి పుత్రునిలో తేజస్సుగా రూపొందినవి. స్వారోచిషుడు పరిపూర్ణుడు. మహాపురుషుడు. ''శాంతి దాంతి దయా సత్య శౌచ నిరతుడై యుకామత జిర తపం బాచరించె''నట. వరూధినీ ప్రవరపౌత్రునిలో ఆ యిద్దరిలో బొడసూపిన లోపములు పూరింపబడినవి. అందుకే అతనికి విశిష్టాద్వైతమూర్తి, ''శేష భూత సమస్త శేషి'' అయిన విష్ణుమూర్తి సాక్షాత్కారం కలిగి, మనువుగా నియమితుడౌతాడు.

7

ఇంద్రియ సుఖము, ధర్మము, దయ, ప్రేమ, వైరాగ్యము వీని తాత్త్విక నిరూపణమూ సమన్వయమూ పెద్దన 'మను చరిత్ర' కావ్యం. సమకాలీన జీవన ధోరణికి, తాత్త్వికుడూ, ధర్మజ్ఞుడూ అయిన కవిగా, జీవితంమీద ఆసక్తి, గౌరవమూ కలిగిన మేధావంతుడుగా పెద్దన వ్యాఖ్యానం చేశాడు. అది ఆయనలోని ''అనాశ్వాసిత దుఃఖానికి'' ఫలితం. ఆయన వలపునకూ, ప్రేమకూ చూపిన విభేదం ప్రబంధ కవుల నుండి మనం సాధారణంగా ఆశించేదికాదు. ఉదాత్త శృంగారానికి శ్రీకారం చుట్టిన నవ్య కవులకు పితామహుడు పెద్దన. శృంగార తత్త్వ నిరూపణకూ, ప్రకృతిమీద ఆసక్తికీ నవ్య కవులలో మొదటివాడూ, వారికంటె ఎంతో వ్యక్తిత్వపు నిండుదనమూ, గాంభీర్యమూ కలిగినవాడు పెద్దన.

'మను చరిత్ర' కావ్యార్థము శృంగార రస దృష్ట్యా నిరూపించే ప్రయత్నం అసమగ్రమైన పరామర్శగానే అంతం అవుతుంది ఎప్పుడూ. శాస్త్ర దృష్ట్యా 'మను చరిత్ర' లో నిరూపణ మౌతున్న ప్రధాన రసము శాంతము. ''శాంత రస మనగా తృష్ణాక్షయ రూపమగు సుఖము పరిపోషము నొందినట్టి స్థితి'' అను నిర్వచనము నంగీకరించినచో మను చరిత్రములో శృంగార (వరూధిని) వీర (స్వరోచి) రసములు క్రమముగా అహంకార రాహిత్యము నొందుటచే శాంతములో సంతర్భావించినవని వేరుగా చెప్పనక్కరలేదు.

''ధర్మార్థ కామ మోక్షేషు వైచక్షణ్యం కళాసుచ
కరోతి కీర్తిం ప్రీతించ సాధు కావ్య నిషేవణం!''



నేను ఇప్పుడు చేయగలిగిన సహాయమేదైనా వుందా?

దేశ ఆంతరంగిక రక్షణకు ప్రతి భారతీయ మహిళ ఇప్పుడు చేయగలిగింది చాలా వుంది. మహిళా వ్యవస్థల ద్వారా రక్షణ కృషిలో పాల్గొనండి. చేయవలసింది ఎంతో వుంది. జాతీయ రక్షణ నిధికి విరాళాలివ్వండి, విరాళా లిచ్చేటట్లు ఇతరులను ప్రోత్సహించండి. రక్షణ సర్టిఫికేట్లు కొనండి. ఇదేగాక మీరు క్రమశిక్షణ, ప్రవర్తన, దృక్పథం మొదలైన వాటిలో స్వయంగా చేయవలసిన కృషి ఇంకా వుంది.

- *వ్యర్థ వ్యయం మానండి; అనాలోచితంగా కొనడం మానండి; అధిక ధరలను చెల్లించవద్దు.*
- *బంగారం కొనవద్దు. దేశావసరాలకు మీ బంగారం యివ్వండి.*
- *మీరు ఏపని చేస్తున్నా దృఢతర దీక్షతో పనిచేయండి; సమర్థంగా చేసిన ప్రతి పని జాతీయ కృషిని, భారతదేశ స్థితిని శక్తివంతం చేస్తుంది.*
- *అలసత్వం వదిలి ఆచరణకు పూనుకోండి.*

అప్రమత్తులై వుండండి

—జాతీయ రక్షణ కృషిలో పాల్గొనండి

DA-62/F7

విజయలక్ష్మి

కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహకవి

(గత సంచిక తరువాయి)

నాలుగవ ప్రకరణము

రామేశముగారికి జనకుని సంపాదనమువలన గలిగిన యాస్తి పది ఎకరముల భూమియు, మూడువేల రూపాయాలు రొక్కమును. రొక్కము లోకులకు బదుళ్లిచ్చుటచే, మూడువేల రూపాయిల విలువగల పత్రములుగలవు. రామేశముగారు తమ తండ్రిగారిక్కి బాకీయున్న పెద్దమనుష్యులను బిలిపించి సొమ్మి ఇచ్చివేయుమని యడిగిరి. ఒకటిరెండు మాసములలో నిచ్చి వేయుదుమని వారుచెప్పిరి. ఉత్తరక్రియలు ముగిసినతరువాత రామేశముగారు తల్లిని భార్యను, మేనత్తయైన రాజమ్మను వెంట బెట్టుకొని, దండ్రిగారి సామాను బండ్లమీద వేయించుకొని నరసాపురము వెళ్లిరి. బాకీదారులు మూడుమాసములు లోపుగ రామేశముగారికీయవలసిన సొమ్ము ఇచ్చివేసిరి. ఆ సొమ్ముతో భూములు గొనవలయునా ? మరి ఏమిచేయవలయునని తల్లి గారితో నాలోచించిరి. అప్పుడు రత్నమ్మగారు కుమారునికి నీక్రింది సంహానిచ్చిరి "అబ్బాయి, పదిఎకరముల భూమి నీకున్నది. దానివలన నీ కేటేట నైదారుపుట్ల ధాన్యము వచ్చుచున్నది. అది మనభోజనమునకు సరిపోవును. నీ సంపాదనమువలన మనకు గావలసిన పైఖర్చు గడచును. కాబట్టి ప్రస్తుతము భూములు గొనవద్దు. మనమద్దె గొంపలలోనుండి మిక్కిలి యిబ్బంది పడుచున్నాము. ఆచంటలో మీ నాన్నగారు గట్టిన మంచి పెంకుటిల్లున్నది. కాని నీ విక్కడనే యుందువుగాని యాచంటలో నుండబోవు. అందుచేత స్వగృహమొకటి ఈగ్రామములో సంపాదించుట మంచిది. నీతోడి ప్లీడర్లకు స్వగృహములున్నవి. నీకు గృహములేకపోవుట అప్రతిష్ఠగనుండును. కాబట్టి నేదేని యిల్లమ్మకమునకున్నదేమో కనుగొని తక్షణ మీసొమ్ము బెట్టి యిల్లు గొనుము. ఇల్లుకొనగ సొమ్ముమిగిలిన పక్షమున భూమిగొనవచ్చును. మీ నాయనగారి మాసికములు పెట్టినప్పుడు స్వగృహేయని సంకల్పముచెప్పుట మంచిది. గృహమువంటిది మరియొకటిగాదు. అద్దెగొంప యెప్పటికైన నెరువుగొంపయే. అద్దెగొంపలో మనము నిర్భయముగ నుండజాలము. వారి కేకారణముచేతనైన మనమీద నాగ్రహము వచ్చినప్పుడో, వారికెక్కువ యద్దెవచ్చునని తోచినపుడో మనలను వెళ్లుమని చెప్పుదురు. అప్పుడు చెంబులు ముంతలు పుచ్చుకొని మనమెక్కడికి పోగలము? అప్పుడు మనకు వీలైన యిల్లు దొరకవచ్చు, దొరకకపోవచ్చు. చెట్టుక్రింద గాపురము చేయుగలమా ? దైవానుగ్రహమువలన నీకు బిడ్డలు కలుగగలరు. ఒకవేళ సొమ్ముచాలకపోయిన పక్షమున ఆచంటలోనున్న మనయిల్లు విక్రయింపుము. మనఇల్లు మిక్కిలి సౌఖ్యదాయకమైనది. ఫల వృక్షములతో మిక్కిలి విశాలమైన దొడ్డిగలదు. మంచి నూయిగలదు. ఇల్లంతకు గచ్చుగలదు. విశాలమైన వీథి యరుగులున్నవి. ఆచంటలో భాగ్యవంతులైన కమ్మవారు చాల మందిగలరు. తగిన సొమ్మునిచ్చి వారెవ్వరైన ఇల్లుకొనగలరు. నే చెప్పవలసినమాట చెప్పినాను. మీద నీ యిష్టము," అత్తగారు చెప్పినట్లే కనకదుర్గమ్మగూడ గృహము సంపాదింపుడని భర్తకు హితోపదేశము చేసెను. తల్లియొక్కయు భార్యయొక్కయు హితోపదేశములు రామేశముగారియొక్క మనస్సునకు నచ్చెను. ఆ దినములలో మునసబు కోర్టుసమీపమున నొక యిల్లు అమ్మకమునకు వచ్చెను దానివెల మూడువేం రూపాయాలు. కనకదుర్గమ్మయు రత్నమ్మగారును ముందుగావెళ్లి ఆ గృహముచూచివచ్చిరి. సర్వవిధములచేతను సుఖకరముగా నున్నదని చెప్పి తక్షణమే యదికొనుమని రామేశముగారిని హెచ్చరించిరి. రామేశముగారుగూడ స్వయముగవెళ్లి ఆ గృహమును జూచి సొమ్ముసిద్ధముగ నున్నది గనుక తక్షణమే ధనమిచ్చి గృహము తమపేర వ్రాయించుకొనిరి. రామేశముగారు మంచిముహూర్తముం బెట్టించి బంధువులను రావించి గృహప్రవేశము జేసిరి. చూచినవారందరు రామేశముగారిల్లు చాలాబాగున్నదని మెచ్చిరి. ఆచంటలోని గృహమమ్మకుండగనే గృహ సంపాదనమైనదని రత్నమ్మగారు మిక్కిలి సంతసించిరి. ఆచంటలో నున్న యిల్లెట్లున్నదో నరసాపురములోని యిల్లు గూడ నట్లే యున్నదని కనకదుర్గమ్మ బంధుగులతోఁ జెప్పి సంతసించెను. ఈ యిల్లుఁ గాలువకు గూడ సమీపముం దుండుటచే నీటి సదుపాయము హెచ్చుగ నుండెను. అసహ్యావేదనమైన నవవైధవ్య దుఃఖ మనుభవించుచున్న రత్నమ్మగారికి నూతన గృహము గొంత మనశ్శాంతిఁ గలిగించెను. దొడ్డి విశాలముగ నుండుటచే రత్నమ్మగారు పాదులను బెట్టించి తానే స్వయముగ నూతి నీరు తోడి యా మొక్కలకు పోసి కూరలు పండించి మగని వియోగదుఃఖమును మరచుచుండెను. రాజమ్మ పెద్దది యగుటచే మునుపటి యోపిక లేకపోయినను నూరక యుండుట కిష్టములేక పగటిపూట మాత్ర మెట్లో వంట చేయుచుండెను. రామేశముగారు, మేనత్త గూడ తన తండ్రి వలన దనకు సంక్రమించిన పిత్రార్జితమైన ధనములో నొక భాగమేనని తలంచి, తల్లితోబాటు రాజమ్మను గూడ మిక్కిలి

యాదరణముతోను, గౌరవముతోను సంరక్షించుచుండెను. రామేశముగారి తల్లికి నెలకు రెండు రూపాయిలును, మేనత్తకు ఒక రూపాయి, భార్యకు రెండు రూపాయిలును యిచ్చు వచ్చి నట్లు వాడుకొమ్మని ఇచ్చుచుండెను.

ఆయనకు రాబడి హెచ్చుగా నుండుటచే నిది యొక లెక్కలోనిది గాదు. రాజమ్మకు నత్తవారి వలన వచ్చు భరణ మేమియు లేకపోవుటచే నామె కేవిధమైన వెలితియు లేకుండ జేయవలెనని రామేశముగారి యభిప్రాయము. దుర్గమ్మయు తన యత్తగారికి నెంత వినయముతో పనిచేయు చుండెనో మగని మేనత్తకు గూడ నంత విధేయురాలై నుప చారము చేయుచుండెను. ఇట్లు దినములు జరుగుచుండగా నొక సంవత్సర కాలము జరిగెను. మరుచటి సంవత్సరము ప్రవేశింపబోవుచుండెను. ఆ సంవత్సరము శ్రీరామనవమికి గొం దరు బ్రాహ్మణ వితంతువులు గొందరు వైశ్య వితంతువులు భద్రాచలమునకు పయనమయిరి. గోదావరి పద్ద నీరు కాసులవల్ల జీవించునట్టి కృష్ణమూర్తి యను నొక వైదిక బ్రాహ్మణుడు భద్రాచల యాత్రికులను వెంటబెట్టుకుని తీసుకొనివెళ్లి యాత్ర చేయించి తీసుకొని వచ్చుటకు సమకట్టెను. అతడు తనకు యాత్రాఫలము దక్కుటయే గాక వారా క్షేత్రమున యిచ్చు నట్టి దానధర్మములు దనకే దక్కునని యాశపడి నావనికి బూనెను. భద్రాచలము వెళ్లవలసిన బ్రాహ్మణ వితంతువు లలో రాజమ్మకు గొందరు పరిచితు లుండుటచే వారి ప్రోత్సా హముచేతనో, స్వయముగ తనకు గలిగిన కుతూహలము చేతనో, దానుగూడ భద్రాచలము వెళ్లదలచి తన సంకల్పము మేనల్లునితో జెప్పెను. ఆ మాటలు విని రామేశముగారు మేనత్తతో నిట్లు జెప్పిరి. ''అత్తా నీవీ ఏడు వెళ్లవద్దు. మనవాం డ్రెవరైన వెళ్లినపుడు వెళ్లవచ్చును. పై జనముతో వెళ్లుట నా కిష్టములేదు. ఏ జబ్బు చేసినను నిన్ను జూచువా రుండరు. నీవు ముందునాటికి వెళ్లవచ్చును.'' అనవుడు రాజమ్మ యిట్లనియె. ''అబ్బాయి నా కేమియు భయము లేదు. అక్కరకు వచ్చువారు చచ్చిపోవుదురు గాని నావంటిది చావదు. అంతమాట పుట్టి నే చనిపోయిన పక్షమున నా కొర కేడ్చువా రెవ్వరు, కొడుకులా ? కూతులా ? అన్నదమ్ములా ? అక్కచెల్లెండ్రా ? దిక్కుమాలిన పక్షిని. నే నేమైనను సరే యాత్రకు మాత్రము బంపుము. ముందునా డెవరో ? నే నెవరో ? .... అంతవరకు నేను బ్రతుకుదునో లేదో. కంఠములో ప్రాణ ముండగనే యీ ఘటమును భద్రాద్రి జేర్చి శ్రీరాముల వారి దర్శనము చేయవలెనని యున్నది. నామాట త్రోసి వేయకు నాయనా . మా యన్న నాకు నిన్ను జూపి పోయి నాడు. మేనల్లుడవైన నీవే'', కొడుకువైన నీవే, నని కన్నుల నీరు పెట్టుకొనెను. ఆ పలుకులు విని రామేశముగారు జాలిపడి ఆమెను యాత్రకుబంపదలిచి కూడవెళ్లదలచిన నీరుకాసుల కృష్ణమూర్తిని బిలిపించి నామెను జాగ్రత్తగా దీసుకొని వెళ్లి, తీసుకొని రమ్మని యాతనికి నప్పగించి మేనత్తను పయనము జేసెను.

భద్రాద్రి వెళ్లదలచినవారు సంవత్సరాదినాడు రాజ మహేంద్రవరములో నావలు, తొట్టి పడవలు నెక్కి గోదావరి మీద బయనముచేసి చైత్రశుద్ధ మందష్టమినాటి రాత్రికి భద్రాచలము జేరుదురు. అందుచేత నీటికాసుల కృష్ణమూర్తి వితంతు మండలమును వెంటబెట్టుకొని ఫాల్గుణ బహుళ ద్వాదశినాడు పడవనెక్కి రాజమహేంద్రవరమునకు బయలు దేరెను. త్రయోదశినాడు వారు రాజమహేంద్రవరము జేరి చతు ర్దశినాడు నమావాస్యనాడు రాజమహేంద్రవరములో నొక సత్రములో బసచేసి వండుకొని తిని చైత్రశుద్ధ పాడ్యమి నాడు మధ్యాహ్నము పడవలలో నెక్కి బయలుదేరిరి. ప్రతి వితంతువు దనకు గావలసిన ఉప్పు, పప్పు, చింతపండు, మిర్చి, యటుకులు మొదలగు సరకులను కొంచెము నేయి, నూనె లను, నిస్తరాకులను వంటపాత్రలను వెంట దీసికొని వెళ్లెను. రాజమ్మయు మేనల్లు డిచ్చిన పది రూపాయిలు మూట గట్టుకొని కావలసిన సామగ్రిని దక్కినవారితోపాటు సరకులను తీసికొని భద్రాద్రికి పయనమయ్యెను. నావలు నడుపువాండ్రు ప్రతిదినము నుదయమున నెనిమిది గంట లగునప్పటికి నావల నేదో యిసుకతిప్పకు చేర్చి వంట చేసుకొనుటకై వితంతువు లను వెళ్లమందురు. వారు దిగి వంట జేసుకొను నప్పటికి వేసవికాల మగుటచే ఎండ తీవ్రమై ఇసుకతిప్పలు నిప్పుల కుప్పలవలె నుండుసుగదా ? కాళ్లు నెత్తి మాడుటచే యాత్రి కులు వండుకొనలేక, కొందరు వండుకొనియు దినలేక, కొందరు తీవ్రమైన ఎండ బాధ పడలేక ఎట్టెటో పడవలో పడు చుండిరి. ఆకలిబాధకు దాళలేక కొందరు వితంతువులు సాయం కాలమున జల్లగ నుండును గనుక నిసుక తిప్పలలో నేదో పిండి జేసుకొని తినియో, యటుకుల నానవేసుకొని తినియో తిప్పలు పడుచుండిరి. ఎట్టెటో నీటికాసుల కృష్ణమూర్తి నీటి గండము లేకుండ యాత్రికుల నష్టమినాటి రాత్రికి భద్రాద్రి జేర్చెను. అచ్చట యాత్రికుల నిమిత్తము ప్రభు త్వమువారు వేయించిన పందిళ్లలో యాత్రికులు బసచేసి పండుకొనిరి. రాత్రి నిద్రపట్టక పోవుటచే నొక వితంతువు గోవిందనామాలును, మరియొక వితంతువు లంకాయాగమును, మరియొకర్తె కుశలవ కథను గట్టిగా పాడజొచ్చిరి. అందు చేత నిద్ర వచ్చువారిక్కి గూడ నిద్రపట్టకుండెను. మొనగాడైన కృష్ణమూర్తిచేత నొక కర్ర పట్టుగొని యా పందిరి చుట్టును నడుమ నడుమ దిరుగజొచ్చెను. నవమినాడు శ్రీ రామాలయములో స్వామివారి కళ్యాణము మహా వైభవము ముతో జరిగెను. ఆ దినమున స్వామివారి దర్శనము చేయ దలచినవారు మిక్కిలి శ్రమపడిరి. ఆలయ మిరుకుగా నుండుటచే యాత్రికు లొకరి నొకరు గెంటుకొని, మోచేతు లతో పొడుచుకొని తన్నుకొని, గుద్దుకొని దర్శనముపేరు దేవు డెరుగు, బ్రతికి బయటపడిన చాలునని ఎట్టెటో ప్రాణ ములు దక్కించుకొని బయటపడి, దేవుని జూచి కొందరు, జూడక గొందరు బసకుం పోయిరి. ఆ దినమున దేవునికిఁ గల యలంకారములన్నియు నర్చకులు సింగారింతురు. అప్పుడు

సీతారాముల విగ్రహములు మిక్కిలి దర్శనీయములై యుండును. తీర్థవాసులు వేళకు నిద్రాహారములు లేకుండుటచేతను, సరియైన భోజనము దొరుకక వడపప్పు, యరటిపండ్లు, కొబ్బరికాయలో చలిమిడియో దిని కాలక్షేపము చేయుటచే వారి దేహారోగ్యములు చెడెను. కొందరు జ్వరపీడితులైరి. కొందరికి గ్రహణి పట్టెను. కళ్యాణమైన నాల్గవనాడు, విశూచి జాడ్యము బయలుదేరెను. అమ్మవారి ధూములు వచ్చినవని యాత్రికులు భయపడి ప్రయాణములు కాజొచ్చిరి. కాని జాడ్యము కారుచిచ్చువలె నలుదెసల వ్యాపించెను. కొందరు పడవ నెక్కి బోయిరి, కొందరు పర్ణశాలకు బోయిరి. వెళ్లినవారు త్రోవలోనే జచ్చిరి. కొందరు పర్ణశాలలో మృతినొందిరి. వైద్యసహాయములేకపోవుటచే గొందరు నల్లమందు మ్రింగి కడుపుబ్బి జచ్చిరి. కొందరు కర్పూరము మ్రింగి స్వర్గస్థులైరి. పడవలలో నెక్కినవారు జాడ్యపీడితులై నిసుకతిప్పలలో దిగి దిక్కులేక మరణించిరి. రాజమ్మయు పడవనెక్కి వ్యాధిపీడిత యగుటచే నొక యిసుక తిప్పమీద చాపవేసుకొని పండుకొనెను. ఆమెకు స్మారకము లేనపుడు మంచినీళ్లు పోయుదునని చెప్పి పడవదిగి వెళ్లి ఆమె కడ క్షణముసేపు కూర్చుండినట్లు కూర్చుండి నీటికాసుల కృష్ణమూర్తి నామె కొంగున నున్న మూట విప్పి పది రూపాయలు దీసికొని తన బొడ్డు కొంగున మూట గట్టుకొనెను. ఇసుకతిప్పలు శవములతో నిండిపోయెను. ఇన్ని మాటలేల గోదావరి కిరుప్రక్కల పీనుగులపెంట యయ్యెను. శవములను దినుటకు రాబందులు, నక్కలు, కాకులు మెండుగ వచ్చి శవములపై బడుచుండెను. రాజమ్మత్త ఎప్పుడు ప్రాణములు విడిచెనో తెలియదు. కుళ్లిపోయిన శవముల కంపు పడవలలో గూరుచున్నవారికి గొట్టుచుండెను. పడవవాండ్రు జాడ్యపీడితులలో బ్రతికియుండగనే కొందరిని, పోయినవారిని కొందరిని గోదావరిలో పడవైచిరి. అందుచే గోదావరి గూడ శవములతో నిండెను. చేపలు, మొసళ్లు తినివేయగా మిగిలిన కళేబరములతో శవములు గోదావరి రేవులలోనికి కొట్టుకొని వచ్చెను. కృష్ణమూర్తి జాడ్యపీడితుడుగాక ఎట్టెటో బ్రతికి దొరికినవి గొన్ని, దొంగిలించినవి గొన్ని మొత్తము పాతిక రూపాయలు చేత బట్టుకొని తాను దీసుకొని వెళ్లిన యాత్రికుల బంధుగులతో వారి చావు వార్తలు చల్లగ జెప్పెను. నిజముగా దుఃఖము గలవానివలెనే ఏడ్చుచు రామేశముగారింటికి వెళ్లి రాజమ్మత్త మరణవార్త వినిపించెను. రామేశముగారు చాల దుఃఖించిరి. అత్తాడుబిడ్డల చావుల కంతగా విచారించెడివా రుండరుగాని రత్నమ్మగారు తన యాడుపడుచు చావునకు నిజముగా దుఃఖించెను. కర్మ చేయుట మానగూడదని రామేశముగారు తల్లిని బిలిచి ఇట్లనెను. "అమ్మా, రాజమ్మత్త యత్తవా రెవ్వరో చెప్పు. నీ వెరిగినంతవరకు నామె చరిత్ర నా కెరిగింపుము. ఆమె ఎడమచెవి కొంత కోసినట్లుండెడిదేమి? కురుపేసి శస్త్రము చేయుటచే నట్లయ్యెనా? పుట్టుకలోనే యట్లుండెనా ? ఆమెకు జ్ఞాతు లెవరైన గలరా ?" అని యడుగుటయు రత్నమ్మగారు కుమారునకిట్లు బదులు చెప్పిరి. "అబ్బాయి, ఆమె యత్తవారింటిపేరు తాడేపల్లివారు. వారి నివాసస్థానము కలిటము, ఈమె వివాహము మీ తాతగారు మహా వైభవముతో చేసిరట. పెండ్లియైన నెల దినములకే పాము గరచి మగడు మృతి నొందెనట. నేను కాపురమునకు వెళ్ళునప్పటికే నామె ముండమోసెను. పుణ్యస్త్రీగా నున్నప్పుడు నే నామెను జూడలేదు. కాని యీమె అగ్నిహోత్రమువంటి మనిషి. పరపురుషునితో మాటాడి ఎరుగదు. ఆమె కిరువది సంవత్సరములు నిండిన తరువాత మీ తాతగా రామెకు కేశఖండనము చేయించుటకై యాకెన్న శంకరప్పగారి నిచ్చి రామేశ్వరము బంపిరి. ఆపని యైనతరువాత వా రిరువురు కుంభకోణము వచ్చిరట. అప్పుడా గ్రామమునందు మశూచికము విశేషముగా నుండెనట. రాజమ్మకు గూడ మశూచికము గనబడెనట. సర్కారువారు మశూచికము తగిలినవారిలో విదేశస్థులను, కావేరియొద్దన పాకలు వైచి వాటిలో మంకమంచములు వేసి వాటిమీద రోగులను పడవైచి కొందరి కావలివాండ్రను కాపు పెట్టిరట. దయావతులైన పురస్త్రీలు కొందరు బ్రాహ్మణులకు గంజి యన్నము దెచ్చిపెట్టుచుండిరట. రాజమ్మ రోగము మిక్కిలి హెచ్చెను. ఒకనాటి రాత్రి యామె జీవింపదని నిశ్చయించి కావలివాండ్రు గుఱ్ఱుపెట్టి నిద్రపోయిరి. ఆమె చలనము లేక మంచముమీద పడియుండుటచే పీను గనుకొని యొక నక్క రాజమ్మ చెవి పట్టుకొని పీకెనట. అందుచే నామె చెవిలో గొంత ముక్క యూడెను. అప్పుడు రాజమ్మ చావలేదు. కనుక, అమ్మయ్యో యని కేకవైచెను. ఆ కేక విని కావలివాండ్రదరిపడి లేచి నక్కను దూరముగ దోలి, నా వార్త సర్కారు వైద్యులకు జెప్పిరి. మరునా డుదయమున వైద్యులు వచ్చి యా చెవికి గొంత చికిత్స చేసిరి. ఆమె క్రమముగా మశూచికము దిగజారుటచే బ్రతికి కావేరీస్నానము చేసెను. శంకరప్ప రాజమ్మ పాకలో నున్నంత కాలము కుంభకోణములోని సత్రములలో భుజించి, రాజమ్మ యారోగ్యస్నానము చేసిన తరువాత నామెను వెంటబెట్టుకొని యాచంట వచ్చి ఆమెను మీ తాతగారికి అప్పగించెనట. మీ తతాగారు శంకరప్పవల్ల నామె చరిత్ర విని ఆశ్చర్యపడి క్షేమముగా తన బిడ్డను యింటికి తీసుకొని వచ్చినందుకు సంతసించి పది రూపాయ లాయనకు బహుమతి జేసిరట. నాటినుండి రాజమ్మ మన యింట నుండెను. ఆమెకు బావలు గాని, మరదులుగాని, సంతతిగాని ఉన్నట్లు గనబడదు. ఎందుచేతనో వారికి మనకు రాకపోకలు లేవు. భరణ మిచ్చుటకు వారి కేమియు నాస్తి లేదు. వారి గోత్రమేదో నాకు తెలియదు. మేనత్తగనుక నేదో విధముగ కర్మ నాచరించి చేయుము". అద్భుతమైన నామె చరిత్ర విని రామేశముగారిట్లనిరి "పీనుగనుకొని నక్క పీకినతరువాత గూడ నామె బ్రతుకుట జూడ" "అడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు, రక్షింతుడు మందిరమున జచ్చు"నని భాగవతములో బమ్మెర పోతరాజు చెప్పినమాట నిజమని తోచుచున్నది, అనిచెప్పి రామేశముగారు బ్రాహ్మణులను రావించి తొమ్మిదవనాడు కర్మ నాచరించిచేసిరి. రత్నమ్మగారు చిరకాలము రాజమ్మ

గారితో గలిసి ఏకగృహములోనుండుటచే ఆమెలేకపోవుట రత్నమ్మ గారికి మిక్కిలి విచారము కలుగజేసెను.

అయిదవ ప్రకరణము

తన కుమారునకు సంతానము కలుగలేదనియు, వంశ వృద్ధి యగుటలేదనియు రత్నమ్మగారు విచారించుచుండిరి. మనుమలను, మనుమరాండ్రనుజూచి ఎత్తుకొని ముద్దాడి కృతార్థురాలుగావలయునని నామె యెంతో కుతూహలం పడ జొచ్చెను. మా రామేశము కడుపున నొకకాయు కాయుగూడదా యని రాజమ్మత్త పలుమారనుచుండును. కాళ్లను గజ్జెలుకట్టుకొని నా మనుమలు నా నట్టింట వెన్నడేని చిందులు ద్రొక్కుదురా యని రత్నమ్మగారు తన్ను జూడవచ్చిన యమ్మలక్కలతో పెక్కు మారులు తన కోరిక వెడలగ్రక్కుచుండును. ఆమె కోరికలు హెచ్చినకొలది కుమారునకు సంతానప్రాప్తి దూరమగుచుం డెను. ఇట్లు గొంతకాలము వెళ్లగా గొన్నినాళ్లకు దుర్గమ్మ గర్భవతి యయ్యెనన్నమాట పుట్టెను. భర్తయు, నత్తగారును దుర్గమ్మ కన్నియంగరక్షలు చేయజొచ్చిరి. రామచంద్రయ్య గారును వారిభార్య సీతమ్మయు, తమకుమార్తె గర్భవతియయ్యె నన్నమాట విని సామ్రాజ్యాధిపత్యము వచ్చినట్లు సంతసించిరి. ముందుగా రామచంద్రయ్యగారు మినువ సున్నియుండలు రెండు వందలు నూడిదనిచ్చి యవి నరసాపురములో నొక ముత్తయి దువుచే పంచిపెట్టించి బిడ్డను దొడ్డిపట్ల దీసికొనిపోయిరి. మరల రెండువందల మిఠాయి ఉండలు చేయించి కోడలికి నూడిద బంపి దొడ్డిపట్లలో పంచిపెట్టుమని రత్నమ్మగారు కోరిరి. సీతమ్మగారట్లే చేసిరి. కూతునకీ మొదటిపురుడు తమ ఇంటనే పోయవలెనని రామచంద్రయ్యగారును సీతమ్మయు సంకల్పిం చిరి. కాని రామేశముగారు వారి కోరిక నిరాకరించిరి. రామేశము గారొకసారి దొడ్డిపట్ల వెళ్లి పురుడు నరసాపురములోనే పోయుట తనతల్లి కిష్టమనిచెప్పి భార్యను పంపుమని యడిగిరి. అపుడు రామచంద్రయ్యగా రిట్లనిరి "అబ్బాయీ రామేశము, నే నొక మాట చెప్పెద వినుము. ఆడుపిల్లకు మొదటి పురుడు పుట్టిం టనే పోయుట చిరకాలమునుండి మనలో నొక సాంప్రదాయ ముగ నున్నది. దానికి వ్యతిరేకముగ మీరిపుడు చేయుట భావ్యము గాదు. అత్తవారెంత భాగ్యవంతులైనను, వారింట నెన్ని సౌకర్యము లున్నను నాడుపిల్ల కష్టసమయమైన పురిటి దినములలో తన తల్లిదండ్రులవద్దనే నుండగోరును. పిల్ల తన కష్ట సుఖము లను, తన కోరికలను, దాచకుండ మర్మమువిడిచి తల్లితో చెప్పుకొనును. అత్తగారిరవద్ద ఆమెకెంత చనువున్ననూ కోడ లత్తతో జెప్ప మొహమోటపడును. కాబట్టి పురుడు పుట్టింటనే జరుగుట మంచిది. మా ముద్దు చెల్లింపుము. మీ తల్లిగారు మా బిడ్డయెడ మిక్కిలి దయగలదనియు, మీ ఇంటనేలోపము జరుగదనియు నే నెరుగుదును. అయినను లోకాచారము అతిక్ర మించుట సమంజసముగాదు. నీవు సమస్తము నెరుగుదువు. ఇంతకన్న నే చెప్పవలసిన దేదియులేదు. మాకైన నిదియొక్క టియే ముచ్చటగదా ?" అనవుడు రామేశముగారు మామగారితో నిట్లనిరి, "మామగారూ, మీ మాట కడ్డముచెప్పినానని నా మీద నాగ్రహమువద్దు. మీ పిల్లను మా అమ్మ వెన్నప్పములాగున పెంచుచున్నది. ఏమైన లోపమున్నదేమో పిలిచి మీ అమ్మాయి నడుగుడు. అరచేతిలో నిమ్మపండువలె నేనును నామె నాడించు చున్నాను పురిటిసమయము స్త్రీలకు గొప్పగండము. అందు చే, గట్టివైద్య సహాయమున్నచోటనే పురుడుపోయుట మంచిది. దొడ్డిపట్ల పల్లెటూరు. తగిన నింగ్లీషు వైద్యులుగాని తెనుగు వైద్యులుగానిలేరు. బాలింతరా లనగానే మనవాండ్రు వేడిచేయవలెనని మంచి ఇంగువ, వెల్లుల్లి మొదలైనవి లెగబెట్టు దురు. దాహమైనచో మంచినీళ్లివ్వరు. మంచిగాలి తగులనీయరు. పల్లెటూరి మంత్రసానులు మోటముండలు. కానుపు సరిగ చేయించెడి నేర్పు వారికడ నుండదు ఎన్నెమ్మ కథలు చెప్పు టయేగాని మరి ఏమియును మనవారికి తెలియదు. అట్లయిన స్త్రీలు దొడ్డిపట్లలో పురుళ్లు పోసుకొనుటలేదా ? బిడ్డలు తల్లులై సుఖముగా నుండుటలేదా ? యని మీ రడుగ వచ్చును. ఎవరి ధైర్యము వారిది. ఎవరి భయములు వారివి. కాబట్టి మా యమ్మగారి మాటను త్రోసివేయక పిల్లను బంపుడు" అని యూరకుండెను. అంతలో సీతమ్మగారు వచ్చి "నాయనా, మే మైదవ మాసమున పిల్లకు పువ్వులు ముడి పించవలెనని యున్నది. ఆ ముచ్చట మా కన్నుల బడినదాక నైన మా బిడ్డను మా దగ్గర నుంచుడు. అత్తవారు సర్వాధి కారు లన్నమాట నే నెరుగుదును. ఈ చిన్ని వరము మా కివ్వండి. నేను మీ యమ్మగారికన్న చిన్నదానను గనుక నామెకు నమ స్కారముజేసి బ్రతిమాలుకొని అడిగినానని చెప్పుడు." ఈ ప్రసంగము ముగిసిన తరువాత రామేశముగారు భోజనముచేసి యత్తమామల నొద్ద సెలవు దీసుకొని పిమ్మట భార్య యున్న గదిలోనికి బోయి ఆమెను పిలిచి "మా యింట పురుడు పోసు కొనుటవలన నీ కేమియు భయములేదు, వేయి వరాలు ఖర్చు పెట్టియైన నీకు క్షేమముగ పురుడు పోయించెదను. బెంగ పెట్టుకొనకు. పువ్వులు ముడిపించిన తరువాత నేనో, మా యమ్మయో వచ్చి నిన్ను దీసుకొని వెళ్లెదము. నరసా పురములో నున్న యాసుపత్రి గంగమ్మ మిక్కిలి తెలివిగలది. మిక్కిలి మంచిది. నా కోరికమీద నది మన యింటికి రెండు సారులు వచ్చి నిన్ను పరీక్షించి అంతయు సరిగా నున్నదని చెప్పలేదా ? సుందరరావుగారి భార్య మహలక్ష్మమ్మగారు మొన్ననే సుఖముగా పురుడు పోసుకుని బారసాల చేసుగోలేదా ? ఆమె నీ స్నేహితురాలే గదా ? గంగమ్మ తెలివితేటలను గురించి ఆమె నడుగుము. ధనలక్ష్మి కంటె, ధైర్యలక్ష్మి గొప్పది. నీవు ధైర్యముగా నుండుము. అంతయు నమ కూరును" అని భార్యను బుజ్జగించి ఆమెకు పది రూపా యల నిచ్చి రామేశముగారు బయలుదేరి నరసాపురము వెళ్లి తల్లితో దొడ్డిపట్లలో జరిగిన యావద్వృత్తాంతము నవిస్తర ముగ చెప్పెను. "రామచంద్రయ్యగారి కొకతెయే పిల్ల గనుక పువ్వులను ముడిపించు వరకు బిడ్డ నచ్చట యుంచుటయే

మంచిది. తల్లిదండ్రుల ముచ్చట మాత్రము దీరవద్దా ? ఆపని ముగిసిన తరువాత మనము దుర్గమ్మ నిక్కడకు దీసికొనివచ్చి మనము గాజులు బెట్టించుకొందము. దానితో మఖయుల ముచ్చటలు దీరిన వగును." అని యొడంబడి యూరకుండెను. చూలింతరాలికి దినములు సుఖముగా గడచుచుండెను. మంచిలినుండి బంధుగులు వచ్చి సూడిదల నిచ్చిరి. మరియు నితర బంధుగులు గూడ యథాశక్తిగా బలు రకములగు పిండివంటలు జేసి బంపిరి. దుర్గమ్మ లోకానుభవము గల పడతి గనుక సూడిదలు జబ్బుచేయునటులదినక మితముగా నుపయోగించి, దేహారోగ్యమును కాపాడుకొనుచుండెను. క్రమక్రమముగా నాలుగవ మాసము వెళ్లి ఐదవ మాసము ప్రాప్తించెను. సీతమ్మ వైభవముతో పువ్వులు ముడిపించెను. అప్పటికి రత్నమ్మగారు కూడ దొడ్డిపట్ల వెళ్లిరి. తల్లితండ్రులతోబాటు రత్నమ్మగారు గూడ తన్మహోత్సవమును వీక్షించి పరమానంద భరితురాలయ్యెను. పిమ్మట రత్నమ్మగారు నరసాపురము వెళ్లుటకు పయనమై వెళ్లునపుడు వియ్యంకుని వియ్యపురాలిని బిలిచి నిట్లనియెను. "అన్నగారు, వదినెగారు, నేనొక మనవి చేయదలచుకొన్నాను. చిత్తగించండి. పిల్ల పురుడు మీయింట పోయనిచ్చినాము గామని మీ మనసునకుం గొంత నొప్పి కలిగియుండవచ్చును. కాని పురుడు మీ సన్నిధానమందే జరుగుటకు నేనొక యుపాయము జెప్పెదను. వినుడు. పురిటి దినములు సమీపించినపుడు ముందుగ మీ కడకు మా యబ్బాయినో, గుమాస్తానో పంపించెదను. వానితో గూడ మీ దంపతు లిద్దరు రండి. పురుడు వెళ్లినదాక మీరు మా యింట నుండి పురుడుపోసి రెండు తలలు ఏర్పడిన తరువాత బారసాల గూడ చేయించి మీ యూరు మీరు రావచ్చును. కాని మా యన్నగారు మాయింట భోజనము చేయగూడదని నియమము పెట్టుకొన్నారు గదా ? ఆ నియమమునకు భంగములేకుండ మీరు కాపురము, మాత్రము మా యింటనుండి మీ సరుకులు మీరే తెచ్చుకొని మీరే వండుకొని తినవచ్చును. మా యబ్బాయితో నే నాలోచించియే మీకీ మాట చెప్పుచున్నాను. ఈ ఏర్పాటు మా పిల్లవానికి గూడ సమ్మతమే." అనవుడు రామచంద్రయ్యగా రిట్లనిరి. "అక్కగారు, మీ యింట నుండుటకు మా కేవిధమైన యభ్యంతరము లేదు గాని, నా కిక్కడ కొంత సొంత వ్యవసాయ మున్నది. పాడి పశువు లున్నవి. ఎడ్లున్నవి. నే నిక్కడ లేకపోయిన పక్షమున వ్యవసాయము సాగదు. పాలేరులు సరిగా చేయరు. పశువులు చెడిపోవును. ఐనను మీరు సమయమునకు వర్తమాన మంపుడు. వీలునుబట్టి మే మిరువురము వచ్చుటకు ప్రయత్నించెదము. వీలుగాకున్నచో నే నిక్కడనే యుండి మీ వియ్యపురాలిని పంపెదను". ఆ పలుకులు విని సరేయని రత్నమ్మగారు పయనమై నరసాపురము వెళ్లిరి.

పిమ్మట సీతమ్మ రామచంద్రయ్యగారితో నిట్లు బలికెను—"ఏమండీ ! నన్నొక్కదానిని బంపెదనని మీరు రత్నమ్మగారితో సెలవిచ్చిరి. పరదేశమున క్రొత్త యింట నే నొక్కతెను నుండగలనా ? ఆదిగాక మీ కిక్కడ దక్షత ఎవరు ? ఈ గ్రామములో నొక్క పూటకూళ్ల యిల్లయినను లేదు. మీరు స్వయముగా వంట చేసుకొందురా ? చిన్నప్పటి నుండియు మీకు వంట యలవాటు లేదుగదా కూరలేక, పప్పులేక యత్తెసరు వేసుకొని యుడికీ యుడకని మెతుకులు రెండుపూటలా తిన్నచో మీకు జబ్బుచేయక మానునా? మానవుని దేహములుగాని లోహములు గావు. కాబట్టి మిమ్ములను విడిచిపెట్టి వెళ్లజాలను. మీ శరీరము గష్టపడినచో నాకీ ప్రపంచ మెందుకు ? కూతురు పురు డెందుకు? నేను ఇక్కడనే యుండెదను. ఇక్కడ నొక దైవము అక్కడ నొక దైవమును న్నాడా? మన యల్లుడును వియ్యపురాలును మిక్కిలి మంచివారు. పురుడు జాగ్రత్తగనే పోయుదురు. వెళ్లదలచిన నిశ్చయము వెళ్లెదము". ఆ పలుకులు విని 'సరే అప్పటి స్థితిగతులనుబట్టి ఎట్లు వీలో అట్లు చేయుదము. ఆ ప్రసంగము కట్టిపెట్టు'మన్నారు రామచంద్రయ్యగారు.

కాలము సరిగ వెళ్లుచుండెను. మంచి ముహూర్తము జూచి రామేశముగారు దుర్గమ్మను నరసాపురమునకు తీసుకొని వెళ్లిరి. క్రమక్రమముగా దుర్గమ్మకేడవమాసము చొరబడెను. సుముహూర్త మేర్పరచి రత్నమ్మగారు కోడలికి గాజులు పెట్టించుటకై ప్రయత్నించి ఆ మహోత్సవమునకు రమ్మని దుర్గమ్మ తల్లిదండ్రులకు వర్తమాన మంపిరి. గర్భవతియైన స్త్రీకి గాజులు పెట్టించుట ఆడువాండ్ర ముచ్చటయేగాని మగవాండ్ర ముచ్చట గాదని రామచంద్రయ్యగారు వెళ్లక తగవ సన్నాహముచేసి, సీతమ్మను బంపిరి. రామచంద్రయ్యగారు రానందుకు సణుగుకొనుచు బలవంతముమీద సీతమ్మ వెళ్లెను.

గాజులు పెట్టించుటకు సుముహూర్తము నిశ్చయించిరి. పట్టణములో నున్న న్యాయవాదుల యొక్కయు, ఉద్యోగస్తుల యొక్కయు, భార్యలను రత్నమ్మగారు పిలిపించి వారి కానాటి పగలు భోజనము పెట్టి మధ్యాహ్నము దుర్గమ్మకున్య వచ్చిన ముత్తయిదువలకును గాజులు దొడిగించి గౌరవించి బంపిరి. సీతమ్మ కూతురుయొక్క గాజుల మహోత్సవము కన్నుల పండువగా జూచి యానందించెను. ఆ మరునాడే నామె దొడ్డిపట్లకు వెళ్లెను. వెళ్లునపుడు రామేశముగారును, రత్నమ్మగారును, పురిటికి రమ్మని సీతమ్మగారితో మరీ, మరీ, చెప్పిరి. దుర్గమ్మ గూడ తల్లిని రమ్మని బతిమాలెను. క్రమముగా దుర్గమ్మకు నవమాసములు నిండెను. ఆసుపత్రి మంత్రసాని తరచుగా వచ్చి దుర్గమ్మను జూచి పరీక్షించి సలహా నిచ్చుచుండెను. పదియవ మాసము ప్రవేశించెను. ఎప్పుడో దుర్గమ్మ ప్రసవించునని రామేశముగారు అత్తమామలకు వర్తమాన మంపిరి. రామచంద్రయ్యగారు, భార్యను వెళ్లుమని చెప్పిరి. భర్త యొక్కడే దొడ్డిపట్లలో నుండి కష్టపడునని సీతమ్మ వెళ్లుట కిష్టపడలేదు. అప్పుడు రామచంద్రయ్య. గారు పెనుగొండ వెళ్లి తన భార్య సోదరుడైన సమయమంత్రి సర్వేశ్వరుడుగారిని జూచి యిట్లు చెప్పెను. "బావా!

మా యమ్మాయి పురిటి నిమిత్తము నేనును, నా భార్యయు నరసాపురము వెళ్లవలసి వచ్చినది. పురిటికి నా యింటికి బంపుమని నే నెంత బ్రతిమాలినను, నా యల్లుడు, నా వియ్యపురాలును బంపుటకు వీలులేదని చెప్పి మమ్మే అక్కడకు రమ్మని మోటపట్టు బట్టిరి. అల్లునకు, వియ్యపురాలికి కోపము తెప్పించితిమా బిడ్డకు సౌఖ్య ముండదన్నమాట నీ వెరుంగుదువుగదా ? అందుచేత మేము వెళ్లక తప్పదు. ఇంటిలో నా కెంతో కామాట మున్నది. గాదెలో ధాన్యము లున్నవి. పాడి పశువు లున్నవి. ఇళ్లు గదలి వెళ్లుటకు వీలు లేదు. మీ యప్పగారిని వెళ్లమంటే నేను వండుకొని తిని కష్టపడుదునని ఆమె వెళ్లుట కిష్టపడుటలేదు. అందుచేత, నీవు నీ భార్యయు మా యూరు వచ్చి మా యింట నెల దినము లుండుడు. నీవీ యుపకారము జేసిన పక్షమున మే మిద్దరము నరసాపురము వెళ్లి పిల్లకు పురుడుపోసి వచ్చెదము. ఈ కోరిక గోరుటకై నేను నీ కొరకు ప్రత్యేకముగా వచ్చితిని''. అనవుడు సర్వేశ్వరుడు ''బావా, మే మిద్దరము వచ్చిన పక్షమున మా యమ్మ యొకర్తె మా యింట నుండలేదు. ఏమి చేయుటకు నాకు తోచకున్నది. పోనిమ్ము. మా యమ్మను మా తమ్ముని మీ యింటికి బంపెదను. మీరు వచ్చువరకు వా రిరువురు మీ యింటనుండి మీ యిల్లు జాగ్రత్త పెట్టుదురు'' ఆ పలుకులు విని సరేయని రామచంద్రయ్య అనెను. గారు దొడ్డిపట్లు వెళ్లిరి. వారు వెళ్లిన మూడు దినములకు రామచంద్రయ్యగారి యత్తగారును రెండవ కొడుకును దొడ్డిపట్లు వచ్చిరి. వారి కిల్లప్పగించి, రామచంద్రయ్యగారును భార్యయు నరసాపురము వెళ్లిరి.

అది యాశ్వయుజ మాసము. దేవీ నవరాత్రములు ప్రారంభమయ్యెను. రామేశముగా రెప్పటియట్లే నవరాత్రములలో దేవీపూజలను, బ్రాహ్మణ సంతర్పణములను చేయ నారంభించిరి. శుద్ధ నవమినాడు రాత్రి దుర్గమ్మకు నొప్పులు ప్రారంభమయ్యెను. ఆ రాత్రి మంత్రసాని వచ్చి దగ్గరే యుండెను. విజయదశమినాడు రామేశముగారు దేవీపూజ ప్రారంభించు వేళకు దుర్గమ్మ సుఖముగా ప్రసవించెను. ఆడు శిశువు గలిగెను. ఆమాట విని రత్నమ్మగారు మగపిల్లవాడు గలుగలేదని మూతి విరచెను. అప్పుడు సీతమ్మ ''వదినగారు, ఏపిల్ల అయితే నేమండీ పుట్టిన పిల్ల బాగుండిన చాలదా ? కుమారుడు మరియొకసారి కలుగకూడదా ?'' అని ఆమెను సమాధాన పరచెను. దుర్గమ్మకు మూడు లంఘనములు కట్టిరి. రెండవ నాడామెకు, దాహము కాగా గర్భమున నామెకు వాతము గలదు. మంచినీళ్లు పోయగూడదని వాదించి దాహము తీరునట్లు నీళ్లు పోయరైరి. అప్పుడు రామేశముగారు వైద్యుని యొద్దకు వెళ్లి అడుగగా నాయన ఇట్లు చెప్పిరి : ''అయ్యా, మన దేశములో బాలింతరాలిని మనవాండ్రు మంచినీళ్లివ్వక చిత్రవధ చేయుదురు. అది రోగమువలన పుట్టిన దాహమైతే దాని నణచుట కౌషధ మీయవలెను. గాని దాహ మీయకపోయిన పక్షమున మనిషికి రోగము రాదా ? ప్రాణము పోదా ? అది మూర్ఖత. కాబట్టి మీరు తక్షణ మింటికి పోయి ఆమెకు కావలసిన వేడినీళ్లివ్వండి. దాహమైనపుడు నీ తియ్యనందువ జబ్బు చేయునుగాని యిచ్చినందున జబ్బు చేయదు. ఈ విషయమున మీ రాడువాండ్ర మాట వినక నా సలహా వినుడు. అతి లంఘనములు కట్టుటవలన దాహమైనపుడు మంచినీ రియ్యకపోయినందున సమయా సమయము లెరుగక శీతము శీతమని మిక్కిలి వేడి మందులు కుప్పుట వల్లను మనలో బాలింతరాండ్ర కెన్నో ప్రమాదములు గలుగుచున్నవి.''

ఆ సలహా విని యింటికి వచ్చి ఆ మాటలు తన తల్లికి, నత్తగారికి చెప్పి దుర్గమ్మకు దాహము తీరునట్లు వేడి మంచినీ రిప్పించిరి. దాహముతీరి దుర్గమ్మ సుఖముగా నిద్రించెను. సీతమ్మ కూతురి పురిటి గదిలో కూర్చుండి విసుగు లేకుండ ఎన్నెమ్మ కథ లెన్నోసారులు చెప్పెను. పురుడు పది దినములు సుఖముగ గడచెను. పదునొకండవనాడు రత్నమ్మగారు బారసాల చేసుకోవలసినదని కుమారునితో చెప్పెను. స్నానమైన తరువాత వారి పురోహితుడు పుణ్యాహవచనము చేయించి బారసాల ప్రయత్నము చేసెను. బంధుమిత్రుల యొక్కయు, బ్రాహ్మణుల యొక్కయు సమక్షమున రామేశముగారును, దుర్గమ్మయు పీటలమీద కూర్చుండి బారసాల జేసికొనిరి. సీతమ్మయు, రత్నమ్మగారును మనుమరాలి యొక్క బారసాల జూచి యానందము హొందిరి. ఆ సమయమున రామచంద్రయ్యగారు కూతునకు, అల్లునకు విలువగల వస్త్రములిచ్చి, నేదో యాభరణములు మనుమరాలికి జేయింపుమని నేబది రూపాయలు కట్నము చదివించిరి. నామకరణ సమయము వచ్చినపుడు రత్నమ్మగారి పేరు పెట్టమని రామచంద్రయ్యగారు సలహా చెప్పిరి. అప్పుడు రత్నమ్మగారు ''నాపేరు వద్దు నాయనా, విజయదశమినాడు లక్ష్మీపూజ జరుగుచున్నపుడు పుట్టినది గనుక ''విజయలక్ష్మి'' అని పేరు పెట్టుడు. ఆ పేరు మంచిది. జయప్రదమైనది'' అనిరి. ఆ పలుకులు విని నచ్చట నున్నవా రందరు బాగున్నది, బాగున్నది, ఆ పేరే పెట్టుడు అని నైక్య కంఠముగా బలికిరి. విజయలక్ష్మి యని పేరు స్థిరమయ్యెను.

ఆరవ ప్రకరణము

విజయలక్ష్మి తల్లివలెనే పచ్చని శరీరచ్ఛాయయు, గుండ్రని మొగమును, విశాలమైన కన్నులును గలిగి, తుమ్మెద రెక్కలవంటి తల వెండ్రుకలతో చూపరులకు ముద్దుల మూటగట్టుచుండును. పిల్ల కొంచెము లావుగ నుండుటచేతు జూడవచ్చినవా రెత్తుకొనుటకు వీలుగ నుండును. తల్లియు యుగ్గు పెట్టి నీళ్లుపోసి కన్నుల కాటుక దిద్ది మొగమున బొట్టు పెట్టి తొట్టెలో పండుకొనబెట్టినా ? బాలిక ఎంతో దర్శనీయముగా నుండును. రత్నమ్మగారును, రామేశముగారును మిక్కిలి చక్కగా నున్న ఆ బిడ్డను చూచి

విజయలక్ష్మి

మురియుచుండిరి. దుర్గమ్మ మాట చెప్ప నక్కరయే లేదు. తాతగా రిచ్చిన నేబది రూపాయలు పెట్టి వలుచని బంగారు మురుగులు చేయించిరి. రత్నమ్మగారు మనుమరాలి కాళ్లకు వెండి కడియములు, గజ్జెలు చేయించిరి. శుక్లపక్ష చంద్ర బింబమువలె విజయలక్ష్మి నానాటికి వృద్ధి పొందుచుండెను. బిడ్డ క్రమక్రమముగా పాక నేర్చెను. ఏది గనబడిన నది నోట బెట్టుకొనుటచే బిడ్డకు నన్నప్రాశనము చేయదగు సమయము వచ్చినదని రత్నమ్మగారు కుమారునితో చెప్పిరి. ఆడుపిల్లకు సరి నెలలలోను, మగపిల్లవానికి బేసి నెలలోను అన్నప్రాశనము చేయవలెనని మనలో నొక శిష్టాచార ముండుటచే దానిం బట్టి ఎనిమిదవ నెలలో విజయలక్ష్మికి కన్నప్రాశనము చేయ నిశ్చయించి, సుముహూర్తముపెట్టి యానాటికి రమ్మని రామేశముగారు మామగారికి జాబు వ్రాసిరి. రామచంద్రయ్యగారు వెండిగిన్నె నొకటి చేయించి భార్యను వెంటబెట్టుకొని యానాటికి నరసాపురము వచ్చిరి. రామేశముగారు ముఖ్యులైన మిత్రులను బిలిచి క్షీరాన్నముతో భోజనములు పెట్టి కూతునకు రామచంద్రయ్యగారిచేత అన్నప్రాశనము చేయించిరి. విజయలక్ష్మి కిల కిల నవ్వుట, గోడలు పట్టుకొని లేచి నిలుచుట, విద్దెములు చేసి కూలబడుట, మరల లేచుట మొదలైన చేష్టలు చేయుటచూచి తల్లియు, నాయనమ్మయు మహానంద భరితు లగుచుండిరి. అమ్మా, తాత, యను మాట లుచ్చరించుట క్రమక్రమముగా వచ్చుచుండెను. పిమ్మట వచ్చియు రాని మాటలు, దోరపండు ముక్కలవలె నెంతో రుచిగా నామె నోట వచ్చుచుండెను. పిమ్మట నేడాది వెళ్లునప్పటికి బాలిక నడువనేర్చెను. బిడ్డ నెత్తుకొని యాడించుటకు నెలకు రెండు రూపాయల నిచ్చి పేదరాలైన నొక శూద్ర బాలికను పెట్టెను. బాలిక ఆ సేవకురాలి యొద్ద చనవు గలిగి యాడుకొనుచుండెను. రామేశముగారు సాయంకాలము కచేరీ నుండి వచ్చునప్పటికి విజయలక్ష్మి తప్పటడుగులు మెల్ల మెల్లగా నిడుకొనుచు నడిచి తండ్రి కెదురుగ బోయి ముసి ముసి నవ్వులు నవ్వుచు నెదురుగ నిలువబడును. తండ్రి కూతు నెత్తుకొని కౌగలించుకొని ముద్దులాడి లోపలికి దీసి కొనిపోవును. ఈవిధముగ నింటిలో నందరికి విజయలక్ష్మి చేష్టలు కాలక్షేపముగ నుండెను. రామేశముగారి కొరకు వచ్చినవారు సహితము విజయలక్ష్మిని ఎత్తుకొని ముద్దాడకుండ వెళ్లరు. భాగ్యవంతులైన పార్టీలు వచ్చినపుడు ముద్దాడి రూపాయియో, రెండు రూపాయిలో చేతిలో బెట్టి పోవుచుందురు. ఈవిధముగ విజయలక్ష్మికి కొన్ని రూపాయలు ప్రోగుపడెను. ఆ సొమ్ముతో రత్నమ్మగారు మనుమరాలికి బంగారు మొగలిరేకు, తమలపాకు మొదలగు చిన్నచిన్న తొడవులు చేయించిరి. క్రమక్రమముగా విజయలక్ష్మికి మాటలన్నియు వచ్చెను. లక్కపిడతలు, లక్కబొమ్మలు మొదలగువవి దీసికొని నిరుగుపొరుగువారి యిండ్లకుబోయి వారి పిల్లలతో నాడు కొనుట నేర్చెను. క్రమక్రమముగా గచ్చకాయలు, దాగుడుమూతలు, గుజ్జనగూళ్ల యాటలు నేర్చెను. ఎవ్వరింటికి వెళ్లినను విజయలక్ష్మి వారి పిల్లలతో కలహమాడక మంచిపిల్లయనిపించుకొనుచుండెను. ఆమెకు పువ్వులమీద నాసక్తి మెండు. మల్లెపువ్వులు, గులాబిపూవులు, చేమంతి పువ్వులు మొదలైన వెవరియింట దొరకునో వారి యింటికి బోయి వారి పిల్లలతో కొంతసేపు పాడుకొని కొన్ని పూవులు తెచ్చుకొని తల్లిచేత జడలో పెట్టించుకొనును. పువ్వులు లేని జడ ఆమెకు పనికిరాదు. ముద్దబంతిపువ్వు లైనను సరే రేఖబంతి పువ్వులైనను సరే, కడకు గన్నేరు పువ్వులైనను సరే నామె కిష్టమే. పిల్ల యందముగ నుండుటచేతను, దినదినము పువ్వులు తలలో ముడుచు కొనుట చేతను, రామేశముగారి మిత్రు లామెను చూచినపుడు ''పుష్పవల్లి'' యని పిలుచుచు వచ్చిరి.

అయిదు సంవత్సరములు దాటిన తరువాత, రామేశముగారు విజయలక్ష్మికి విద్యాభ్యాసము చేయింపదలచి అచ్చట బాలికా పాఠశాలలో నున్న నొక నుపాధ్యాయుని బిలిచి నాతని చేత నక్షరాభ్యాసము చేయించి నాతని కొక పంచెలచాపు నిచ్చి యా బడిలోని నాడుపిల్లలను రావించి వారి కందరకు మిఠాయి బంచిపెట్టించి పలకలు గొనియిచ్చి బంపిరి. ఆ మరునాటి నుండి పలకయు, మొదటి పాఠ పుస్తకమును పుచ్చుకొని ప్రతిదినము రెండుపూటలు విజయలక్ష్మి బడికి పోవుచుండెను. పోయి యచట నల్లరి చేయక తోడి పిల్లలతో గలహమాడక జాగ్రత్తగా నక్షరముల నేర్చుకొనుచుండెను. ఉపాధ్యాయుని శ్రద్ధ వల్లను, బాలిక బుద్ధి విశేషము వల్లను రెండు మాసములలోనే యక్షరముల, గుణింతముల, నేర్చి ఆమె చిన్నచిన్న పేర్లు వ్రాయజాలెను. అంతట రామేశముగారు వేమన పద్యములను, సుమతీశతకములోని పద్యములను, నామెకు మెల్ల మెల్లగ నేర్పి, ఆమెచేత వల్లింపజేసి వాటి యర్థము దానే స్వయముగ తీరికగల సమయములయందు చెప్పుచుండెను. అట్లామె శతకములలోని పద్యములను, రమారమి నేబది యిరువదింటిని కంఠపాఠము జేసెను. రామేశముగారు కుమార్తెకు తెనుగుబాసతో గొంత పాండిత్యము కుదురునట్లు చేయవలెనని సంకల్పించి తాను చెప్పుటకు తీరిక లేనందున మిషనువారి పాఠశాలలో నాంధ్రోపాధ్యాయుడైన శాస్త్రిగారిని పిలిపించి తన కుమార్తె కాంధ్రభాషలో గొంత ప్రవేశము కలిగింపుమని కోరి శాస్త్రిగారికి నెలకు మూడు రూపాయలు జీత మేర్పాటు జేసిరి. ఆయన ప్రతిదినము సాయంకాలము వచ్చి భాగవతములోని కుచేలోపాఖ్యానమును, భారతములోని సావిత్రీ చరిత్రమును, నామెకు రెండు మాసములలో నర్థ సమేతముగ జెప్పెను. పిమ్మట నుపాధ్యాయుడామెకు శ్రీమద్భాగవతములోని గజేంద్రమోక్షమును, ప్రహ్లాద చరిత్రమును, వామనావతార ఘట్టమును చెప్పెను. అందులోని ముఖ్యములైన పద్యములను, మనోహరములైన పద్యములను విజయలక్ష్మి వల్లించి పితామహి యొద్దను, తల్లి యొద్దను చదివి వారిని సంతోష పెట్టుచుండును. ఉపాధ్యాయుడు గట్టి పారాణికి దగుటచే బాలికచే పద్యములను

శ్రావ్యముగను, రాగవరుసగను చదివించుచుండెను. విజయలక్ష్మి కంఠము సహజముగ మధుర మగుటచే నామె ఏది పాడిన నది శ్రోతలకు శ్రవణానందకరముగ నుండెను.

విజయలక్ష్మికి నాలుగు సంవత్సరములు వచ్చునప్పటికి రామేశముగారికి పుత్రుడు కలిగెను. ఆయన ప్రతి సంవత్సరము భాద్రపద శుద్ధ చతుర్దశినాడు తప్పక అనంతపద్మనాభ వ్రతము చేయుచుండును. ఆ వ్రత మాయన కుటుంబములో లేకపోయినను రామేశముగారు తద్వ్రతము చేయ సుబలాట పడి ఎవ్వరినో ఆశ్రయించి తోరము తెచ్చి కట్టుకొని ఏటేట వ్రతము చేయుచుండెను. పుత్రిక గలిగిన నాలుగవ ఏట అనంతవ్రతమునాడే కుమారుడు గలుగుటచే నందనునకు అనంత పద్మనాభరావు అని పేరు పెట్టెను. వంశవృద్ధికరుడగు మనుమడు గలుగుటచే రత్నమ్మగారు సంతోషించి కుమారునిచే మనుమని బారసాల మిక్కిలి వైభవముతో చేయించెను. పుత్రోత్సవ సందర్భమున రామేశముగారు రమారమి మూరు రూపాయలు వ్యయము జేసిరి. రామచంద్రయ్యగారును సీతమ్మయు దొడ్డిపట్ల నుండి బారసాలకు వచ్చి దౌహిత్రుని యాభరణముల నిమిత్తము నూరు రూపాయల నిచ్చిరి. కూతునకు నందను డుదయించినాడు గనుక రామచంద్రయ్యగారు మునుపటి నియమమువదలిపెట్టి యల్లునియింట స్వేచ్ఛగా భోజనము చేయ నారంభించిరి.

విజయలక్ష్మి శాస్త్రిగారివద్ద నాంధ్రభాష నేర్చుకొనుచు బడిలో నొజ్జయొద్ద గణితము, దేశ చరిత్రము, భూగోళము మొదలగునవి గూడ మిక్కిలి ఆసక్తితో నేర్చుకొను చుండెను. శాస్త్రిగారు విజయలక్ష్మిచేత అమరములోని శ్లోకములు గూడ వల్లింపజేయుచుండిరి. ఆ శ్లోకముల నామె తప్పులు లేకుండగ స్వచ్ఛముగ శాస్త్రిగారి కప్పగించసాగెను. కాల మిట్లు జరుగుచుండగా విజయలక్ష్మికి ఎనిమిదవ ఏడు వచ్చెను. రామచంద్రయ్యగారు దొడ్డిపట్ల నుండి ఏదో పని మీద నరసాపురము వచ్చి అల్లుడు, కూతురు, వియ్యపురాలు నుండగ నిట్లు చెప్పిరి. "అక్కగారూ! మీతో నేనొకమాట చెప్పదలచుకొని వచ్చినాను. అల్లుడుగారు, మా యమ్మయియు నా పలుకులు శ్రద్ధగా వినవలెనని నా కోరిక. మన విజయలక్ష్మి కిప్పుడు జరుగుచున్న దెనిమిదవ యేడు గదా? "అష్టవర్షాద్భవేత్కన్యా" అని శాస్త్రములో చెప్పినారు కనుక పిల్లదానికి వివాహ ప్రయత్నము చేయవలెను. సంబంధముల కొరకు వెదుకమంటే నేను నడుము కట్టుకొని వెళ్లి తిరిగి తిరిగి ఏదో సంబంధము తెచ్చెదను. మీ యిష్టమైన పక్షమున నేను రేపే బయలుదేరి వెళ్లి తణుకు తాలూకాలోనో, నరసాపురము తాలూకాలోనో గల నియోగి కుటుంబములను శోధించి సాంప్రదాయకుడైన వానిని, విద్యావంతుడైన వానిని నీ కల్లునిగ దెచ్చెదను. పిల్లమీద మీ కెంత ప్రేమయో నాకు నంతే ప్రేమగదా? మీ యమ్మగారు పెద్ద దైనది. నేనును వృద్ధుడనే. మేమిద్దరము నుండగా విజయలక్ష్మి వివాహము చేసిన పక్షమున మేము ధన్యులమయ్యెదము. కాబట్టి నామాట త్రోసివేయక వరాన్వేషణ నిమిత్తము సమ్మతించి నన్నుబంపుడు."

ఆ పలుకులు విని రత్నమ్మగారు కుమారు నుద్దేశించి "అబ్బాయీ, మీ మామగారు చెప్పిన మాటలు వింటివిగదా? పిల్ల కెనిమిదవ ఏట వివాహము జేయుట పెద్ద కుటుంబములలో సాంప్రదాయము. నాకు మా తండ్రి ఎనిమిదవ ఏటనే పెండ్లి చేసెను. నీ భార్య వివాహమునాటి కెనిమిదేండ్ల పిల్లయే. ఈ యీడున వివాహము జేసిన పక్షమున నెంతో ముద్దుగ నుండును. గుర్రములాగున నెదిగిన తరువాత వివాహము చేసిన పక్షమున ముద్దుగ నుండదు. పైగా మన పిల్ల సన్నముగా నారపేసులాగున నుండక కొంచెము బొద్దుగా నుండును. అందుచేత నిది పెండ్లియీడే". మామగారి యొక్కయు, తల్లి యొక్కయు మాటలు విని రామేశముగారు మెల్లగా నిట్లు నుడివించిరి, "మామగారూ, మీ అభిప్రాయమును మా అమ్మ అభిప్రాయమును నాకు దెలిసినవి. పిల్ల కిప్పుడు తొందర ఏమి. కట్టు దప్పిపోయినదా? అతి బాల్య వివాహముచేయుట నా కిష్టములేదు. దానికిప్పుడు పెండ్లిచేయుట బొమ్మలపెండ్లి వలె నుండును. పెండ్లి ఏమో ఎరుగని అజ్ఞానదశలో బాలికలకు వివాహము చేయుట మహా గొప్ప దురాచారమని నా అభిప్రాయము. పెండ్లికుమారుడు కావలసినవాడనియో, వారికిని మనకును, నోటికిని చేయికి ఎంగిలిలేని సంబంధమనియో, భూమి చాలనున్నదనియో, విద్దె ఎరుగని మొద్దునో, బుద్ధి లేని మూర్ఖునో, ఏ ద్విపాద పశువునో మనవారు తీరికగా గూర్చుండి ముసలమ్మల ముచ్చట దీర్చుటకో, తమ ముచ్చట దీర్చుకొనుటకో, మోమాటపడియో బాలిక నెవనికో యొకని కిచ్చి పశువు మెడలో పలుపు గట్టినట్లు మంగళసూత్రము గట్టింతురు. వివాహమననేమో పెండ్లికూతునకు దెలియదు. పెండ్లి కుమారునికి దెలియదు. అతి గంభీరమైన యా మంత్రార్థము పురోహితునకు తెలియదు. కన్యాప్రదాతకు తెలియదు. పురోహితునకు ముందు మాట తొణకనప్పుడు భజంత్రీలు, భజంత్రీలు అని యరచును. ఆ మంత్రార్థము నే నొకనిచే జెప్పించుకొని విన్నాను. వేయి రూపాయలు వరదక్షిణ యిచ్చి పెండ్లిచేసినవాని పిల్లకును, మరణమునకు సిద్ధముగా నున్న ముసలివానికి వేయి రూపాయిలు పుచ్చుకొని పిల్ల నిచ్చినవాని పిల్లకును పురోహితుడు సమాన మంత్రమునే చెప్పును. మంత్రమునుబట్టి జూడగా కన్యాదానమునకును, కన్యా విక్రయమునకును భేదమే గనపడదు. గంగలో నిసుకదెచ్చి సప్తఋషి మండల పర్యంతము ప్రోగుజేసి, వేయేండ్ల కొక్క ఇసుకరేణువు చొప్పున దీసిన నెన్నివేలేండ్లకా రాశి తగ్గునో నన్ని వేల ఏండ్లు కన్యాప్రదాతయొక్క పూర్వులు, పది తరముల వరకు వాని సంతతివారు, పది తరముల వరకు అప్పుడు జరుగుచున్న కన్యాప్రదానమువలన శాశ్వత బ్రహ్మలోక నివాసు లగుదురని ఆ మంత్రములో నున్నది. కన్యా విక్రయము చేసినవానికి గతులే లేవని శాస్త్రములు ఘోషించుచున్నవి. సొమ్మిచ్చి చేసికొన్న పెండ్లాము హవ్య కవ్యములకు పనికిరాదని ధర్మశాస్త్రములో నున్నది. అది పాటించువా రెవ్వరు లేరు."

విజయలక్ష్మి

అని కంఠమెత్తి రామేశముగారు గొప్ప యుపన్యాస ధోరణిలో చెప్పి వెండియు నిట్లనిరి, "పిల్లకు నే నింకను విద్య చెప్పించవలె ననుకొనుచున్నాను. "వివాహో విద్య నాశాయ" అని లోకోక్తి గలదు. వివాహముతో విద్య చెడిపోవునని దాని అభిప్రాయము. కావున నేను వివాహము నిమిత్తము విద్య మానిపించను. మనలో మగ పెండ్లివారు, తాము గొప్ప మహరాజులని, ఆడు పెండ్లివారు తమకు బానిసలని తమ యాజ్ఞా ప్రకారము వర్తింపవలసినవారని మనోగర్వము కలిగి యుందురు. పెండ్లియైన తరువాత మా కోడలికి విద్య చెప్పించవద్దని వారు మనకు హుకుములు పంపించవచ్చును. వారి తాబేదారులవలె నారి హుకుములు మన్నింపవలెను. లేనిచో రంగము చెడును. అంతటినుండి వారును మనమును బలవద్విరోధుల మగుదుము," అని ఏదో ఇంకను చెప్పబోవు చుండగ, రామచంద్రయ్యగా రల్లని మాట కడ్డము వచ్చి "నాయనా . పొయ్యిదగ్గర కూర్చుండి వంట చెయ్యవలసిన ఆడపిల్లకు విద్య ఎందుకు? మగవారివలె నుద్యోగము చేయునా ? యూళ్లేలునా ? విద్యాభ్యాసము నిమిత్తము వివాహము చేయుట మానువానిని నిన్నొక్కనినే జూచినాను. నా మాటలు నీకు నచ్చని పక్షమున నీకు మిత్రులైన న్యాయవాదులతోను మరికొందరు ఉద్యోగస్థులతోను చెప్పు, వారే మందురో చూడు. "తా బట్టిన కుందేటికి మూడే కాళ్లనిన మూర్ఖవాదము చేయుట పదిమందిలో తల యెత్తుకొని తిరుగు నీవంటివానికి తగదునుమీ," అని బదులు చెప్పిరి. ఆ ప్రత్యుత్తరము రామేశముగారికి నచ్చకపోవుటచే చివాలున లేచి 'మీ కెవ్వరికి కోపము వచ్చినను సరే, పండ్రెండు వత్సరములు వచ్చు వరకు వివాహము చేయను.' అని ఆవలకు వెళ్లిరి. అప్పుడు రామచంద్రయ్యగారు 'పండ్రెండు సంవత్సరము నిండు నప్పటికి మనపిల్ల పెద్దదగును. ఇక మన మందరములు గంగా ప్రవేశము చెయ్యవలసినదే. ఇక నాకు సెలవిండూ. నే పోయివచ్చెద' అని తన మూట చేత పుచ్చుకొని, భోజనము చేసి వెళ్లండి అన్నగారు అని రత్నమ్మగారరచుచున్నను వినక విసవిస నడచి వెళ్లిరి. వియ్యంకుడు వెళ్లిన తరువాత రత్నమ్మగారు కుమారుని పిలిచి "నాయనా ! మీ మామగారు కోపగించి భోజనము చేయకుండా వెళ్లినారు. ఆయన మన క్షేమము గోరువారు గనుక నీతో నొక్కి చెప్పినారు. నీ వాయనతో మృదువుగ మాటలాడక కఠినముగ మాట్లాడినావు. ఆయన చెప్పినట్లు పండ్రెండు వత్సరములు వచ్చు సరికి మన పిల్ల పెద్దది కాదా ? అట్లయిన నప్రతిష్ట గాదా ? సాటి నియోగములో మనము తల ఎత్తుకొని తిరుగ గలమా ? అందులో మన యాచంటవా రంటే సామాన్యులా? మీ పెద్దలు దేశపాండ్యాలని మీ నాయనగారు చెప్పుచుండెడి వారు. పోలవరము జమీందారులు గూడ మన యాచంట వారితో వియ్య మందినారు. మీ మామగారు చెప్పినట్లు పిల్ల చదువుకొని ఉద్యోగము చేయునా ? యూళ్లేలునా ? నీవు చెప్పింపదలచుకొన్న చదువు నీ కుమారునికి చెప్పించుకో. వాడేదైన గొప్ప ఉద్యోగము చేయగలడు. అంతేగాని ఆడుపిల్ల చదువు కొరకు నీవింత వంతగించుట యెందుకు ?" అని మందలించెను. అంతట రామేశముగారు తల్లి కిట్లనిరి: "అమ్మా, మామగారు భోజనము చేయకుండగ కోపగించి వెళ్లుటకు నేనేమి తప్పు చేసినాను ? ఆయనను నేను దూషించినానా ? అనగూడనిమాట లన్నానా ? ఆయన అభిప్రాయ మాయన చెప్పినారు. నా యభిప్రాయము నేను చెప్పినాను. చదువుకొనుట జ్ఞానము కొరకు గాని ఉద్యోగము చేయుట కొరకుగాదు. వూళ్లేలుటకు గాదు. జ్ఞానము మొగవారి కెంత యవసరమో, ఆడువారికి యంతే యవసరము. జ్ఞానము నీళ్లవంటిది. గాలి వంటిది. అవి పురుషులకేగాని, స్త్రీల కక్కరలేదా ?" అనవుడు రత్నమ్మగారు రామేశముగారిని జూచి "అబ్బాయీ, నీవు కొంచెము నిదానించవలెను. అమ్మాయి కిపుడు వచ్చిన చదువు చాలును. అది చాకి పద్దులు వ్రాయగలదు. సంత ఖర్చులు వ్రాయగలదు. లెక్కలు వేయగలదు. ఆడు పిల్లకీ చదువు చాలదా ? అన్న మెక్కువ తిన్నప్పుడు అజీర్ణము జేసినట్లు ఆడుపిల్లకు మిక్కిలి చదువు చెప్పించిన పక్షమున నది పాడైపోవునేమో యని నా భయము. ఇప్పటికి దానికి వచ్చిన జ్ఞానము చాలును. ఈ ఏడు కాకపోయినను ముందునాటికైనా దాని వివాహమునకు నీవు ప్రయత్నము చేయవలసినదే. మనకు సంబంధములు కొచ్చర్లకోటవారితోను, తల్లాప్రగడవారితోను, ద్రోణమురాజు వారితోను, పెద్దాడవారితోను మొదటినుండియు గలవు. వారిలోనైన, మరి యెవ్వరిలోనైన మంచి పెండ్లికొడుకులు దొరుకకపోరు. కాళ్లు సాచుకొని మన మింటిలో గూర్చున్న పక్షమున సంబంధములు మన కాళ్ల ముందరకు వచ్చునా ? నాలుగు చోట్లకు వెళ్లవలెను. వాకబు చేయవలెను. వెదుకవలెను. అప్పుడేదో యొకటి దొరుకకపోదు." తల్లి చేసిన యుపదేశము విని కుమారుడు సరే. మన మాలోచించుకుని ఏదో యొకటి చేయుదములే, యని యావలకు వెళ్లెను. ఆ సాయంకాలమున విజయలక్ష్మికి పాఠము చెప్పుటకై శాస్త్రిగారు వచ్చిరి. కావ్యము లారంభించవలెనని తన యొద్దనున్న తాటి యాకులమీద వ్రాయబడిన మొల్ల రామాయణము తెచ్చి విజయలక్ష్మి కిచ్చి చదువుమనెను. తాటియాకుల పుస్తకము నేను చదువలేనండి యని 'విజయలక్ష్మి' పుస్తకము క్రింద పెట్టెను. అయ్యవారు "విజయలక్ష్మి మన పుస్తకములన్నియు నించుమించుగ తాటియాకులవేగాని అచ్చు పడలేదు. అచ్చు గావలెనన్న చదువు సాగదు. తాటియాకుల పుస్తకము చదువుట మెల్లగా నలవాటు చేసుగో. దీని తరువాత గట్టు ప్రభువు చేసిన కుచేలోపాఖ్యానమును, పిమ్మట శంకరకవి చేసిన హరిశ్చంద్రోపాఖ్యానమును నీకు జెప్పెదను. దానితో గొంతవర కాంధ్ర సాహిత్యము కుదురును. అమరము చదువుచున్నావు గనుక నాంధ్రనామ సంగ్రహము గూడ వారమున కొకటి రెండు పద్యముల చొప్పున వల్లించుచుండుము. ఆ పుస్తకము నీకు రేపు దెచ్చి యిచ్చెదను. రేపు సాయంకాలము నేను వచ్చునప్పటికి మొల్లరామాయణమునందు బాలకాండము లోని పది పద్యములు చదివియుండుము. నేను వచ్చి అర్థము

చెప్పెదను. అర్థము చెప్పిన తరువాత వర్ణింపవచ్చును.'' ఆ మాటలు విని విజయలక్ష్మి చిత్తమా లాగే చేసెదనని మెల్ల రామాయణము చేతబుచ్చుకొనెను.

మరువాడు సాయంకాలము శాస్త్రిగారు వచ్చి బాల కాండలోని పది పద్యములకు నర్థము జెప్పి యవి వర్ణింపు మని విజయలక్ష్మి కాజ్ఞాపించెను. అది య్యైన తరువాత రామేశము శాస్త్రిగారితో నిట్లు ప్రసంగించిరి. ''శాస్త్రి గారూ, నాకొక సంశయము గలిగినది. అది మిమ్మడిగి తెలుసు కోవలెనని యున్నది. ఇదిగో మనవిచేయుచున్నాను. సావధాన ముగ వినుడు. అమ్మాయీ, నీవు లోపలికి వెళ్లి మీ మామ్మను, మీ యమ్మను దీసికొనిరా, యని యామెను బంపి శాస్త్రి గారితో నిట్లు జెప్పెను. అయ్యా మీరు గొప్ప పండితులు, ధర్మశాస్త్రములు సాంప్రదాయములు మీకు బాగుగా దెలి యును.'' ఇంతలో రత్నమ్మగారును, దుర్గమ్మయు వచ్చి దూర ముగ గూర్చుండిరి. అంతట రామేశముగారు తన వెనుకటి ప్రసంగమునందుకొని శాస్త్రిగారి నుద్దేశించి యిట్లనిరి. ''అయ్యా. మాకొక గృహ కలహము గలిగినది. అదేదన, మా విజయలక్ష్మి కిప్పు డెనిమిదవయేడు. దాని కిప్పుడు వివా హము చేయుమని మా మామగారు పట్టు బట్టుచున్నారు. మా యమ్మగారు కూడ నా మామగారితో నేకీభవించినారు. పిల్లకు బండ్రెండు సంవత్సరములు వచ్చినదాక నేను వివా హము చేయనని స్పష్టముగ జెప్పినాను. ఈలోపుగ బిడ్డకు విద్య చెప్పింతునని గూడ మనవి చేసినాను. ఆడదానికి విద్య ఎందుకు ? మానిపించుమని మామామగారు చెప్పి కోపించి వెళ్లి పోయినారు. మీ యభిప్రాయ మేమిటి ? ఆడవాండ్రకు విద్య చెప్పించవచ్చునా ? కూడదా ? మన పెద్దలు పుర్వకాలమున స్త్రీలకు విద్య చెప్పించిరా ? లేదా ? చెప్పగూడదని ధర్మ శాస్త్రములలో నెక్కడైన శాసించిరా ? మా యమ్మగారును, నా భార్యయు వినునట్లుగ స్పష్టముగ మీ యభిప్రాయమును చెప్పుడు.'' అని యడుగుటయు దక్షిణామూర్తి శాస్త్రిగారు రామేశముగారి కిట్లు ప్రత్యుత్తర మిచ్చిరి. ''పంతులుగారూ, మీకు గలిగిన సందియము ముఖ్యమైనదే. నాకు దోచిన మాటలు చెప్పుచున్నాను వినుండు. నేను పూర్వాచార పరాయ ణుడ నైనను, బాల్య వివాహము నా కిష్టములేదు. నా కుమా ర్తెకు గూడ పదునొకండవయేట బెండ్లి జేసినాను. ధర్మ శాస్త్రములో ''అష్టవర్షా భవేత్కన్యా'' అని యున్నమాట నిజమే. దానింబట్టి కన్యాదానముం జేయ దలచినవారు సరిగ నెనిమిదవ యేటనే జేయుట మంచిదని తలచుచున్నారు. అది విధిగాదు. కన్య రజస్వల గాకమునుపు గృహస్థుడు తన వీలును బట్టి వివాహము చేయవచ్చును. ఈనాడు జరుగు వివాహము లలో నన్నియు నెనిమిదవయేట జరుగుచున్నవా ? మొన్న సీతాపతిరావుగారి కుమార్తెకు బండ్రెండవ యేటనే వివాహ మైనది. వివాహమైన నెల దివములకా పిల్ల రజస్వలె నది. ఆయన కేమి చిక్కు సంభవించినది. రజస్వలైన తరువాత వివా హము చేయకూడదని మన ధర్మశాస్త్రములలో నున్నది గాని యెనిమిదవ యేటనే వివాహము చేయవలెనని విధి లేదు. ఒకరికి వీలుగ నుండవచ్చును. మరి యొకరికి వీలుగ నుండక పోవచ్చును. గృహ యజమానుడు తన వీలును, స్థితిగతులను జూచుకొని కూతునకు వివాహము చేసుకొనవచ్చును. ఇక విద్య మాట చెప్పెదను. వినుడు.

''స్త్రీలు విద్యాగంధములేక పట్టి పశువులవలె నుండవలె నని మన ధర్మశాస్త్ర కర్తల యభిప్రాయం కాదు. పూర్వకాల మున మన స్త్రీలు సంస్కృతభాష చదువుకొని పాండిత్యము కల్గి గ్రంథములు రచియించినట్లు గూడ నున్నది. మన తెనుగువారిలో కూడ మొల్ల యను నామె రామాయణము రచియించినది. తరిగొండ వెంకమ్మగారు కూడ ''వెంకటాచల మహత్మ్య'' మని యొక కావ్యము వ్రాసెను. ఇంకను రాజకన్య కలు పెక్కండ్రు చక్కగా చదువుకొని రాజ్యము లేలినట్లు మన గ్రంథములవల్ల తెలియుచున్నది. గణపతిదేవుని కుమార్తెయైన రుద్రమ్మదేవి యోరుగల్లు సామ్రాజ్యమును ముప్పది సంవత్సర ములు నిరాఘాటముగా పరిపాలించి కీర్తిగాంచినది. ఆమెను గూర్చి యీతప్పు నెవరు చెప్పలేరు. వీరిమాట యటుండనిండు. వేదములోని కొన్ని సూక్తములను స్త్రీలే రచియించిరి. వేదము లోని జ్ఞానకాండమునకు నుపనిషత్తులనిపేరు. అందు బృహ దారణ్యకోప నిషత్తని యొకటిగలదు. అదిమిక్కిలి రసవంత ముగా నుండును. జనక మహారాజునకు గురువైన యాజ్ఞ వల్క్య మహామునిచరిత్ర మందున్నది. ఆ మహామునికి మైత్రేయి, కాత్యాయని, యనినిరువురు భార్యలుగలరు. ఆ మహాత్ముడు చిరకాల మా భార్యలతో కాపురముచేసి తన జీవితశేషమును గాఢ తపస్సుచేసి వనములో గడుపవలెనని నిశ్చ యించుకొని భార్యల నిద్దరను బిలిచి యిట్లు వచించెను. 'సుందరులారా ! నేను తపోవనమునకు బోయెదను. నేను కొంత ధనమార్జించితిని. ఆ ధనము మీ యిద్దరకు బంచియిచ్చి వెళెదను చేకొను'డని చెప్పగా 'మీ చిత్తమువచ్చినట్లు చేయు డని, కాత్యాయని తనభాగము తానుపుచ్చుకొనెను. మైత్రేయి మాత్రము ధనముపుచ్చుకొనక ధనముకంటె నెక్కువవెలగల బ్రహ్మవిద్యను దన కుపదేశింపుమని వేడుకొనెను. ఆమె వేడి కోలువిని కరుణించి యాజ్ఞవల్క్య మహాముని స్త్రీలకీ బ్రహ్మ విద్య ఎందుకని ఆమె ప్రార్థనమును త్రోసిపుచ్చక బ్రహ్మ విద్య నామెకు బోధించెను. ఆయన భార్యకు జేసినయుపదేశ భాగ మును మైత్రేయీబ్రాహ్మణ మందురు. అది యద్వైత సిద్ధాంతబోధకము. శ్రీమచ్ఛంకర భగవత్పాదులు మిగిలిన యుపనిషత్తులతోబాటు దానికిగూడ మనోహరమైన వ్యాఖ్యా నము రచియించిరి. బృహదారణ్య కోపనిషత్తు నేను సవ్యాఖ్యాన ముగ గురుకులవాసము జేసి చదువుకున్నాను. ఆ యుపనిషత్తు లోని చిత్రమింకొకటి చెప్పవలెను. జనకమహారాజు యజ్ఞము చేసి యజ్ఞానంతరమున గొప్పసభచేసి కురుపాంచాల

దేశముల్లైన బ్రాహ్మణులను, మరికొందరను బిలిచి కొమ్ములకు బంగారు తొడుగులను వేసిన వేయి గోవులను నిలువబెట్టి, బ్రహ్మవిద్యా పారంగతులైనవారీ గోవులను దోలుకొని పోవచ్చునని చెప్పెను. తక్కినవారందరు మన మిందుల కర్హులమగుదుమా, కామాయని వితర్కించుకొనుచుండ, యాజ్ఞవల్క్యుడులేచి యా గోవులను దన యింటికి దోలుకొనిపొమ్మని తన శిష్యున కాజ్ఞాపించెను. ఇతడే గొప్పవిద్యావంతుడాయని సభవారికి యాజ్ఞవల్క్యునిమీద కోపము వచ్చెను. అందులో గొందరు మహామునితో వాదమారంభించిరి. ఆ చేసినవారిలో నొకస్త్రీ యుండెను. ఆమెపేరుగార్గి. ఆమె యాజ్ఞవల్క్య మహామునిని మహాకఠిన ప్రశ్నవర్షముతో ముంచెత్తెను. యాజ్ఞవల్క్యుడా జడివానకు జడియక గడుసుతనముచేత నేవో పెంకి ప్రత్యుత్తరములుచెప్పి పరువు దక్కించుకొనెను. స్త్రీలకు వేదాధికారము బ్రహ్మవిద్యాధికారము లేదని మనలో మిక్కిలిపెద్దలైనవారు గూడ పలుకుచుందురు. అదినిజముకాదు. అదినిజమైన పక్షమున యాజ్ఞవల్క్యునివంటి బ్రహ్మవేత్త తన భార్యకు బ్రహ్మవిద్య బోధించుటెట్లు తటస్థించును ? గార్గి వంటిస్త్రీ మహాసభలో యాజ్ఞవల్క్యునివంటి వేదాంత విద్యాపారంగతుని దన విషమ ప్రశ్నలతో గడగడలాడించుటెట్లు తటస్థించును? కాబట్టి స్త్రీలకు లౌకికవిద్యయు వైదికవిద్యయుగూడ నేర్చుకొనుటకు సంపూర్ణాధికారముగలదు. మీ కవకాశమున్న పక్షమున నే నొకసారి బృహదారణ్య కోపనిషత్తు దెచ్చిచదివి మీకు వినిపించి యర్థముచెప్పెదను. దానితోమీకు సంతుష్టి కలుగవచ్చు.'' ఆ యుపన్యాసమువిని రామేశముగారు మిక్కిలి యాశ్చర్యపడి దక్షిణామూర్తి శాస్త్రిగారి సంభాషణము తన అభిప్రాయమున కనుగుణముగానే యున్నదని సంతోషించి, 'శాస్త్రిగారూ, మీరు మహోత్కృష్టములైన విషయములుపదేశించి నన్ను ధన్యునిజేసిరి. జన్మమెత్తిన తరువాత యిటువంటి పవిత్రమైన యుపన్యాసమును నేనువిని యెరుగను. బ్రహ్మవిద్యాంధుడనైన నేను నేడెన్నో క్రొత్త సంగతులను నేర్చుకొంటిని. ఎల్లప్పుడు దావాలతోను, వాది ప్రతివాదులతోను విశేషించి కూటసాక్ష్యములతోను కాలక్షేపముచేయునట్టి మేమెక్కట ? వేదాంత విద్యయెక్కడ ? నేనొక చిన్నప్రశ్న మడుగగా దానికుత్తరముగా మీ రమృతవర్షము గురిపించినారు' అని ప్రశంసించిలేచి శాస్త్రిగారి పాదములకు రామేశముగారు నమస్కరించిరి. పిమ్మట శాస్త్రిగారు రామేశముగారివద్ద సెలవుబుచ్చుకొని స్వగృహమునకు బోయిరి. (సశేషం)

మన్మథుఁడు

సీ. పృథుల విశ్వంభరా రథమున కెదురుగాఁ
బూన్పించె నెవాఁడు పువ్వుదేరు
కాంచనాచల కార్ముకమునకు సాటిగా
జేపట్టె నెవ్వాడు చెఱకు విల్లు
న విరళ పాశు పతాస్త్రంబునకు వాఁడి
మిగిలించె నెవ్వాడు చిగురుఁదూపు
నతులి తామరదాన వారి బలంబుల
గెలిపించె నెవ్వాఁ డయ్యళి బలంబు
గీ. నట్టి జగజెట్టి మన్మథుఁడ ఖిలలోక
ములకు వెఱఁగొంగ జీవుల మూలకంద
మతని యిలుసొచ్చి వెడలని యలఁడు గలఁడె?
యతని యమ్ములఁబడ కున్న యతఁడెఁ గలఁడే?

—నన్నచోడకవి కళావిలాసము.



సముద్రతీర దృశ్యము (శిల్పి. ఎడ్మండ్ ఎలియన్)[1]

కామన్‌వెల్త్ చిత్రకళాప్రదర్శన

శ్రీ ఎస్. వి. రామారావు

శ్రీ రామారావుగారి జన్మస్థలము కృష్ణాజిల్లా గుడివాడ. బి. యే. బీ. కాం పట్టముపొంది. మద్రాసు ప్రభుత్వ శిల్ప కళావిద్యాలయములో కళాభ్యాసముచేసిరి. కామన్‌వెల్త్ విద్యార్థుల ఉపకార వేతనాల పథకముకింద బ్రిటన్‌లో ఉన్నత శిల్ప కళాభ్యాసానికి వెళ్లిరి. ఇటువంటి ఉపకార వేతనము ఆంధ్ర విద్యార్థికి లభించడము ఇదే ప్రథమము. ఇది ఆయన లండన్‌లో కామన్‌వెల్త్ చిత్రకళాప్రదర్శనము చూచి వ్రాసిన వ్యాసము—సం.

మానవుడు చంద్రుణ్ణి చూచేందుకు వెళ్తున్నాడు. దానికి కావలసిన సరంజామాఅంతా ఎప్పటినుండో సేకరిస్తున్నాడు. ఎంత సాధించినా ఇంకా సాధించవలసింది మిగిలిపోతూనే వుంది. ఎంతవరకు ఇలా పయనం సాగిస్తాడో ఎవరికి తెలుసు? ఇలా నిరంతర శ్రమతో పోరాడుతున్న జీవికి శాంతి ఎక్కడ? ఎవరిస్తారు? ఎవరూ యివ్వరు. అతనికి అతనే సృష్టించుకోవాలి. తను వున్న ఈ ప్రపంచాన్ని, తను చేస్తున్న ఈ ఎడతెగని శ్రమని మరచిపోయి మరోలోకంలో పయనించే అవకాశాన్ని వెతుక్కోవాలి. అంటే తను చూచేదికాక, చూడలేనిదాన్ని సృష్టించుకొని, తద్వారా ఆనందాన్ని అనుభవించాలన్నమాట. అందుకే

కామన్‌వెల్త్ చిత్రకళా ప్రదర్శన

అనేక రకాల ప్రయత్నాలు చేశాడు. కళలను సృష్టించుకున్నాడు. ఈ కళలన్ని సత్యానికి, దృషి కి అందనివి. అయినా, అతని వూహకు అందేవి. ఊహకు అందడంవల్లనే కండ్లుమూసుకొని (తెఱచివున్నా) మానసికంగా ఆనందిస్తున్నాడు. అదే శాంతి అతనికి. ఈ శాంతి కరువైనప్పుడు అతను ఏమి చెయ్యలేడు.

మానవుడు రాతియుగంనుండి మానసిక శాంతికి కృషి చేశాడు — తను వున్న ప్రపంచానికి దూరంగా వెళ్లాలని, దూరంగా ఉండాలని. అందుకే గుహల్లో, రాతి ముక్కలతో, దొరకిన రంగు రంగుల మట్టితో చిత్రాలను తన వూహకు అందినవి, అందనివి గూడ చిత్రించి కాసేపైనా తాను వున్న పరిసరాల్ని మరచిపోయాడు. ఇలా తన్ను తాను మరచిపోయి ఆనందించే స్థితి మానవనైజమేమో. రక రకాల నృత్యాలను, అలంకారాలను, సంగీతాలను, వాద్యములను, చిత్రాలను, శిల్పాలను, నాటకాలను, కథలను సృష్టించాడు. ఈ సృష్టి ప్రతి యుగంలోను మార్పు చెంది, ఆ యుగానికి చరిత్రగా నిలచింది. అందువల్లనే ఏ యుగపు కళలను చూచియైనా ఆ యుగపు జీవితాలను, చరిత్రలను చదువగల్గుతున్నాము.

మనం ఉన్నది అధునాతన యుగం. ఈ యుగపు కళలనుచూస్తే మన యుగ లక్షణాలు అవలీలగా తెలుస్తాయి. శాస్త్ర విజ్ఞానం జీవితపు అన్ని రంగాలలోను ప్రవేశించింది. యంత్రమయమైపోయింది జీవితం. ముఖ్యంగా ఈ శాస్త్ర విజ్ఞానం, పాశ్చాత్య దేశాలలోని ప్రజల జీవితంలో ప్రథమ స్థానం అలంకరించింది. ప్రజలు యంత్రాలలో ఒక భాగంగా అయిపోయారేమో అనిపిస్తుంది. వారి కళల్లో ముఖ్యంగా శిల్పం, చిత్రలేఖనాలలో ఈ యంత్రాల ప్రభావం విపరీతం. యంత్రాల భాగాల రూపాలు ఈ కళలకు మూలములై ఒక క్రొత్త ఆకారాలకు దారితీశాయి. ఉదాహరణకు రైలు ఇంజను పైకప్పు రేకుతీసిచూస్తే ఎన్నో గొట్టములు భారుగా సాగిపోతూ, యంత్ర భాగాల్ని కలుపుతూ పోతుంటాయి. మధ్య మధ్య గుండ్రని, బల్లపరుపు ఆకారాల దిమ్మలు కదులుతూ వుండే భాగాలు, ఒక క్రొత్త ఆకారాలకు దృశ్యాలకు నిలయాలు. వీటి నన్నిటిని చిత్ర లేఖనంలోకి మలచారు. అసలు భాగాలకంటే చిత్రించిన భాగాలు సజీవరూపాలై ఉత్తేజాన్ని, ఆహ్లాదాన్ని కలుగ చేస్తాయి. ఇలా యంత్రాలనుండి, ఆది మానవుడు చిత్రించిన గుహాలయాలలోని రేఖా చిత్రాలనుండి, అడవిజాతి వారి అలంకారాలనుండి మరల ఒక క్రొత్త కళను, ఈ అధునాతనయుగపు భావాలకు జోడిస్తూ, సృషించారు పాశ్చాత్య చిత్రకారులు. కంటికి కనిపించే ప్రతి వస్తువులోను ఒక రమ్యతను, మన జీవితానికి సంబంధించే బంధాన్ని వెలికితెచ్చే ప్రయత్నంలోవున్న ఈ పాశ్చాత్య చిత్రకారులను యావత్ ప్రాక్‌దేశము అనుకరిస్తున్నది. ఈ విషయం ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న "నేటి కామన్‌వెల్త్ దేశాల చిత్రకళా ప్రదర్శన" చూస్తే తెలుస్తుంది. ఈ కామన్‌వెల్త్ భవనాన్ని ఎలిజబత్ రాణి ఈ నెల మొదటివారంలో లాంఛనప్రాయంగా తెరచింది.

కామన్‌వెల్త్ ఇన్‌స్టిట్యూట్ ముఖ్యోద్దేశ్యము కామన్‌వెల్త్ దేశాలమధ్య అవినాభావ సంబంధాలను పెంపొందించడానికి, కామన్‌వెల్త్ యొక్క ఆశయాలను విపులీకరించడానికి ఏర్పడింది. ఈ ప్రదర్శనల కొరకు ఒక అధునాతన భవనము లండన్‌లో నిర్మింపబడింది. ఇందులో అన్ని కామన్‌వెల్త్ దేశాలు వారి వారి జీవితాలను, సంప్రదాయాలను, వివిధ రంగాలలో జరుగుతున్న అభివృద్ధిని, వారి గత నాగరికతలను చిత్రాలద్వారా నమూనాలద్వారా ప్రదర్శించారు. ఇది ఎప్పుడూ తెరచే ఉంటుంది. ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది మన కామన్‌వెల్త్ దేశాల జీవిత రంగంలో. మన భారతదేశపు విభాగం ఎంతో రమ్యంగా చూపబడింది. మన చిత్తరంజన్ రైలు ఇంజను, తాతా ఎలక్ట్రిక్ రైలు ఇంజన్, హిందుస్తాన్ కారు, జీపులు, లారీలు, ట్రాక్టర్లు, పెరంబూరు కోచ్ ఫ్యాక్టరీలోని రైలు పెట్టె, ఆటమిక్ రియాక్టర్లు అన్ని చిన్న చిన్న నమూనాలుగ చేసి ప్రదర్శించారు. మన నాగరికతను ఎంతో మనోహరంగా శిల్పాలతో ఏర్పాటు చేశారు.

ఈ దేశాల ప్రదర్శనలన్ని చూచి పై అంతస్థుకు అనగా 3 వ అంతస్థుకు వెళ్తే అక్కడ జరుగుతున్నది చిత్రకళా ప్రదర్శన. వెళ్ళగానే మనకు ప్రముఖ ప్రపంచ శిల్పకారుడు హెన్రీమూర్ బ్రహ్మాండమైన "Standing Figure" స్వాగతం చెప్పుతుంది. షుమారు ఇది 8 అడుగుల కంచు శిల్పం. చుట్టు రెండు గ్రహామ్ సదర్‌లాండు చిత్రాలు, రెండు పాస్ మోర్ చిత్రాలు ఉన్నాయి. ప్రవేశించగానే ఎదురుగా బ్రిటిషు చిత్రకారులవి, కుడివైపు భారతీయ చిత్రకారులవి, ఎడమవైపు కెనడా చిత్రకారులవి చిత్రాలు, శిల్పాలు ఉన్నాయి. తరువాత ఇతర దేశాల వారివి ప్రదర్శించబడ్డాయి.

ఈ ప్రదర్శన విభాగం చాలా ఇరుకు. చిన్న హాలులో ఎన్నో చిత్రాలు, శిల్పాలు ప్రదర్శించారు. ఒకదానిమీద మరొకటి ఉన్నట్లుగవుండి, ఏది సరిగా చూడలేని స్థితిలోవుంది. చిత్రాలయితేనేమి, శిల్పాలయితేనేమి మొత్తం 188 ప్రదర్శించారు. క్యాటలాగు చాల చక్కగా ప్రింటు చేశారు. కాని ధర 7½ షిల్లింగులు. కామన్‌వెల్త్ ఇన్‌స్టిట్యూట్‌కు కళా విభాగానికి సలహాదారుగావున్న ప్రసిద్ధ కళా విమర్శకుడు ఎరిక్ న్యూటన్, "కొన్ని దేశాలు వారి వారి కళాకారులకు ఈ కళా ప్రదర్శనలో తగు ప్రాతినిధ్యము సరిగా ఇవ్వలేదని భావించవచ్చు. కాని, వున్న కొద్ది స్థలంలో సాధ్యమైనంతగా అన్ని దేశాల చిత్రకారుల చిత్రాలను ప్రదర్శించడానికి ప్రయత్నం చేశాము. బ్రిటన్ ముగ్గురు చిత్రకారులవి మాత్రమే ప్రదర్శించింది. ఎంతోమంది ప్రసిద్ధులున్నా స్థలాభావంవల్ల మా కళాకారుల సంఖ్యను తగ్గించాము. శిల్పాలు ఎంతో బరువు, పెద్దవి అవడం వల్లను, దూర దేశాలనుండి తెచ్చి ప్రదర్శించడం ఎంతో కష్టసాధ్యమైనది గనుకను, ప్రదర్శించవలసినన్ని ప్రదర్శించలేకపోయాము" అని చెప్పారు. అయినా సాధ్యమైనన్ని రాతి శిల్పాలు, దారు శిల్పాలు, దంతముతోను చేసిన విగ్రహాలను ప్రదర్శించారు.

మన భారతీయ విభాగంలో 22 మంది ప్రదర్శించారు. శిల్పాలు చిత్రా లున్నాయి. ముఖ్యంగా అందరిని ఆకర్షించినవి అవినాశ్‌చంద్ర, ఎఫ్. ఎన్. సుజా చిత్రాలు. వీ రిద్దరి పేర్లు తప్పితే మరో భారతీయుని పేరు అసలు ఏ పేపరుగాని, ఏ విమర్శకుడుగాని తలచలేదు. ఈ పై చిత్రకారు లిద్దరు ప్రస్తుతం లండన్‌లోనే సుమారు 7, 8 సంవత్సరాల క్రితం నుండి ఉంటున్నారు. వీ రిద్దరు ఇండియాలో నేర్చుకున్నవారే చిత్రకళను. అవినాశ్ నాకు మిత్రుడు. బాగా తెలిసిన వ్యక్తి. అతని చిత్రాలలో రంగుకు ప్రాధాన్యత ఉంటుంది. దాని కంటే కొన్ని సమయాలలో ఆకారానికి ప్రాధాన్యత ఉంటుంది. "కల్పఫల" అనే చిత్రం (81" × 54") నిలబెట్టిన ఇనుప స్థంబాలకు బోల్టులు బిగించినట్లువుంది. ఇతనికి చిత్రంలోని Subject— కంటే technic ముఖ్యం. F. N. సూజా చిత్రం "Landscape in Green" అనేది ఎంతో మనోహరంగావుంది. తెల్లని ఇండ్లమధ్య ఎర్రని బాట పాగిపైకి పోతున్నది. పాశ్చాత్యదృశ్యానికి భారతీయ పద్ధతిని జోడించినట్లున్నది ఈ చిత్రం. ఇతనిచిత్రాలు బలమైన వేగాన్నిచూపే వికృత ఆకారమయాలు. వాటికి పెట్టింది పేరు ఈయన. అటువంటిది ఏమి ఈ చిత్రంలో కనుపించదు. ప్రస్తుతం ఎఫ్. ఎన్. సుజా **one-man-show** జరుగుతున్నది లండన్‌లో. ఎంతో పేరు తెచ్చింది ఆయనకు.



నాయిక (శిల్పి : జార్జి కీట్సు)[2]

ప్రముఖ ఆంధ్ర చిత్రకారులు శ్రీ కె. శ్రీనివాసులు గారిది "Earth and Life" అనే చిత్రం, చిన్నది వున్నది. ఎంతో రమ్యంగా, ముచ్చటగావుంది. నేలమీద పరున్న అమ్మాయి ఎంతో దీర్ఘంగా ఆలోచిస్తున్నది. ఏకాంతముగా పసుపుగా వెలుగుతున్న అర్ధ చంద్రుని మసి బూసిన కాంతిలో. జీవికి, భూమికివున్న సంబంధాన్ని చూపుతున్నది చిత్రం. ఇటుక రంగు, నలుపు రంగు మిళితమైన రంగులో చిత్రించారు అమ్మాయిని, నేలను.

ప్రసిద్ధ చిత్రకారులు మరిద్దరివి నాకు నచ్చినవి. మోహన్ సమంత్, సయ్యద్ హైదర్ రజాలు. ప్రపంచపు ముఖ్య పట్టణాలలో వీరు తమ చిత్రాలను ప్రదర్శించారు, ఇంతకు ముందు. రజారంగుకు ప్రాధాన్యత ఇస్తాడు. సమంత్ దిరూపానికి ప్రాధాన్యత—కండ్లు మిరిమిట్లు గొలిపే రంగు రజాదయితే వెలిసిపోయిన బూడిదరంగు సమంత్‌ది.

Tinted Trio అనే, దక్షిణ దేశపు స్త్రీలను చిత్రించాడు సంతానరాన్. వెలిసిపోయిన ముదురు ఆకుపచ్చని రంగులో, మెరుస్తున్న ఆభరణాలలోని రాళ్ళతో బాగుందీ చిన్న చిత్రం. ప్రసిద్ధ చిత్రకారుడు సతీష్ గుజరాత్ "Sen" అన్న చిత్రం ఎంతో నిరాశను కలుగ చేసింది. ఎంతో బలము తీక్షణతవున్న అతని చిత్రాలు ఎన్నో ఉన్నాయి. అవన్ని వదలి పెట్టిచిన్న తెల్లని రంగుమధ్య గీతలున్న చిత్రం ప్రదర్శింపబడింది. ఏమాత్రం గుజరాత్‌కు న్యాయం కూర్చేదిగాలేదు చిత్రం. రామ్‌కుమార్ **Spring** అన్న చిత్రం మనోహరంగా **abstract** పద్ధతిలోవుంది. కలర్‌లేదు. **Spring** లేదు. కాని, బూడిదరంగు ఆకారాలలో ముచ్చటగావుంది. ధ్రువపాలి **Christ and cross** అన్న శిల్పం ఎక్కువ వివరాలు లేకుండా భావయుక్తంగావుంది. మిగిలినవారు శిల్పాలు నున్నగా, నాజూకుగా బరోడా స్కూలు పద్ధతిలో ఉన్నాయి. అంతగా చెప్పుకోతగ్గ శిల్పమేమి భారతీయ విభాగంలోలేదు. రాఘవ కన్వేరియా **Calf** అన్న శిల్పం ముచ్చటగా ఎగురుతున్న దూడను మలచబడింది కంచులో. మహమద్ యాసిన్ "Shenai" అన్న చిత్రం అతని పద్ధతిని పూర్తిగా వ్యక్తపరచేదిగాలేదు. భారతీయ విభాగంలో శిల్పాలుకాని, చిత్రాలుకాని మొత్తం 10 (Abstract) పద్ధతిలో వున్నాయి. మిగిలిన వాటికి సబ్జెక్ట్ ప్రాధాన్యత. మన భారత దేశ మానవుల పేరు తెచ్చేవిగాలేవు మనవారి చిత్రాలు. ఎవరు సెలక్టు చేశారోగాని మనవారి చిత్రాలను, ఇక్కడ ఎవరికి నచ్చలేదు ఒక సుజా, అవినాశ్ చంద్ర చిత్రాలు తప్ప.

కెనడానుండి 17 చిత్రకారుల చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. కెనడా, పశ్చిమ దేశాల కళా పద్ధతులను చాలవరకు జీర్ణించుకున్నది చిత్రకళలో. మనం వీరి చిత్రాలు చూస్తే ఏ యూరప్ దేశాలవారి చిత్రాలనో, అమెరికన్ చిత్రాలనో


కామన్‌వెల్త్ చిత్రకళా ప్రదర్శన

చూస్తున్నట్లుంటుంది. నూతనత్వం తొణికిసలాడుతుంది చిత్రాలలో. ఇక్కడ ప్రచురించబడిన చిత్రం ఎడ్మన్డ్ ఎలెన్ **"Shore – Line"** 1 అను చిత్రం. చిత్రమంతా బూడిదరంగులో చిత్రించబడింది. అక్కడక్కడ పసుపు, ఆకు పచ్చని కలిసిన రంగు మెరుస్తుంటుంది. మధ్య బలమైన తెల్లని బద్దీలవంటి కుంచె రేఖలు పడవలను తెలుపుతుంటాయి. ఒడ్డున పడివున్న (చిందర వందరగా) పడవలను ఎంతో గొప్పగా చూపించాడు చిత్రకారుడు. ఆకారానికిగల వివరాలకు పోకుండా, ఆకారాన్ని చూచాయగా చూపడంలో సఫలీకృతుడయ్యాడు. ఈ చిత్రాన్ని నేషనల్ గ్యాలరీ ఆఫ్ కెనడావారు కొనగా, దీన్ని తెచ్చి ఇక్కడ ప్రదర్శించారు.


కెనడా దేశపు చిత్రకారులందరివి ఆబ్‌స్ట్రాక్ **(Abstract)** చిత్రాలే. వారిలో యూరపు దేశాలలోని చిత్రకారులకు వున్న సహజ తృష్ణ, కృషి లేదు. స్పెయిన్ దేశపు ప్రసిద్ధ చిత్రకారుడు మరో అమెరికా దేశపు స్టూవార్ట్ డేవిస్ చిత్రాల అనుకరణలు కనిపిస్తాయి. ఏవో అధునాతన చిత్ర కళా పద్ధతిలో చెప్పాలనే ఆవేదన వుంది. కాని చెప్పలేక పోతున్నారు. బలవంతమైన కృషి కనిపిస్తున్నది వీరి చిత్రాలలో. సహజత్వంలేదు కాని త్వరలో కెనడానుండి ఏదో క్రొత్త పద్ధతి రావచ్చును. అందరు కాకలు తీరిన చిత్రకారులే. ఎప్పుడో ఒకప్పుడు క్రొత్తగా చెప్పగలరు విషయాన్ని.

ఉత్తమ చిత్రాలను ప్రదర్శించింది ఆస్ట్రేలియా. ప్రదర్శనలోని అన్ని దేశాలకంటే ఎంతో ముందుకు పోయింది. మొత్తం 22 చిత్రాలతో మొత్తము ప్రదర్శనకు నిండు తెచ్చింది. దాదాపు అందరు ప్రపంచంలోని ముఖ్య కేంద్రాలలో ప్రదర్శించినవారే. దేశాలన్ని తిరిగినవారే. **Paris** లో జరుగుతున్న నిరంతరకృషి ఆస్ట్రేలియాలో కూడ జరుగుతున్నది—ఎంతోమంది ఎన్నోరకాల నూత్న పద్ధతులలో భావాలను వ్యక్తపరుస్తున్నారు.

లారెన్స్ డాస్ ప్రదర్శించిన **"Mandala"** అన్న చిత్రం **(Abstract)** పద్ధతిలోవుంది. గుడ్డపేలికలను సన్నగా చేసి, అతికించబడివుంది చిత్రం క్రిందనుండి సగం వరకు. ఈ సన్నని పేలికలకు, రక రకాల రంగులు పెయింటు చేయబడివుంది. పైన ఎర్రని గుండ్రని కొక్కెము చిత్రించబడింది—



ఈ మాదిరిగా. ముదురు నలుపు ఇటుక రంగుతోవుంది చిత్రం మొత్తం. పైన ఎర్రని కొక్కెము ఎంతో నిండుగా వుంది. చిత్రాన్ని ఎంతసేపు చూచినా తనివి తీరదు. వర్ణ మిశ్రమము అమోఘంగావుంది. దీనికి వ్యతిరేకమైన చిత్రం మరొకటి ఎర్విన్ లివ్‌చే చిత్రించబడిన **Bunyip country** అన్న చిత్రం. దీనిలో విచిత్రం పాత **Plywood** చెక్క కాన్వాస్‌కు అతికించబడి ఉండడం. దానిమీద గుడ్డను మడతలుగా పెట్టి అతికించబడ్డది. వాటిపై పెయింటు వేశాడు నానారంగులలో చిత్రకారుడు. మసిబూసిన రంగు **Plywood**కు, తెల్లని రంగు మడచిన గుడ్డలకు, ఎంతో బరువును తెచ్చింది. చూడగానే నిలబెట్టే చిత్రం "48 × 60" సైజులోవుంది. మరొక అందమైన చిత్రము లూయిస్ జేమ్స్ చిత్రించిన **East of the moon** అన్న చిత్రం. చిత్రమంతా **Yellow ochre** రంగులో చిత్రించబడివుంది. రాలిపోయిన పువ్వులవలె, బహు చిన్న నక్షత్రాలవలె మెరసే రంగుతో చిత్రించాడు చిత్రకారుడు. గుంపు గుంపులుగా చీకటి ఆకాశంలో మెరసే తెల్లని నక్షత్రాల్లాగా ఈ చిత్రంలో ముఱుక **Yellow ochre** రంగులో ఎన్నో రంగు రంగుల చిన్ని పువ్వులు మెరుస్తుంటాయి. ఒక సంగీతాన్ని విన్నట్లుగావుంది చూస్తుంటే చిత్రాన్ని.



గ్రీకు స్త్రీమూర్తి (శిల్పి: హెన్రీమూర్)3

ఇలా ఎన్నో రకాల చిత్రాలు, ఒకదాని కొకటి సంబంధం లేనివి ఉన్నాయి. ప్రాక్ దేశాల్లో ఆధునిక చిత్ర కళలో ముందడుగు వేసిన దేశము ఆస్ట్రేలియా అని చెప్పక తప్పదు.

ఇంగ్లండు కున్నస్థానాన్ని చిత్ర శిల్ప కళల్లో వేను వేరే చెప్పవలసింది ఏమిలేదు. **Henry Moore** యొక్క **Standing Figure** 3 ఎంతో గంభీరత్వాన్ని తెచ్చింది ప్రదర్శనకు. నిలుచున్న ఈ ఆకారం గ్రీకు స్త్రీ రూపాన్ని గుర్తుకు తెస్తుంది. నాజూకుగావున్న మెడ ఎంతో సోయగాన్ని తెచ్చింది. శిథిలమైపోయిన విగ్రహాన్ని పురాతన వస్తు శాస్త్ర

జ్ఞుడు భూమినుండి వెలికి తెచ్చినదిగావుంది. రూపం విరూపమైనా, రూప లక్షణాలు అవగతము అవుతుంది. మానవ ఆకారానికిగల అందాన్ని, బలాన్ని, గొప్పతనాన్ని, హుందాని తెలియ పరుస్తుంది. కాని, ఈ శిల్పం జానెడు స్థలంలో బంధింపబడి వుంది ఈ ప్రదర్శనలో. ఈ శిల్పాన్ని విడిగా మైదానంలో ఉంచి చూడాలి. హెన్రీమూర్ చిత్రాలను, శిల్పాలను మొత్తం 50 కు పైగా Oxford లోని అష్మోలియన్ మ్యూజియమ్‌లో ప్రదర్శించారు నెలక్రితం. ఒక పుణ్య స్థలాన్ని దర్శించే యాత్రికునిలా వెళ్ళాను, ఈ ప్రదర్శన చూచేందుకు. హెన్రీమూర్ తన శిల్పాలు ఆరుబయట ఉంచేందుకు చేసినవిగాని మ్యూజియములలోను, ఇండ్లలోను బంధించేందుకు గాదు అని పదే పదే చెప్పారు. అందుకే ఆయన తన ఇంటికి వున్న విశాలమైన తోటలో శిల్పాలను తయారు చేస్తారు, అందరిలా స్టూడియోలలోకాదు.

విక్టర్ పాస్‌మోర్ Relief Construction అన్న చిత్రాన్ని Linear Motif అన్న చిత్రాన్ని ప్రదర్శించాడు. ఒక్కొక్కదాని ధర 10,000 పౌండ్లు. సైజు 48" × 48" మరొకటి 60" × 60" విచిత్ర మేమంటే రక రకాల ఆకారాలుగల కర్రలను ఒక చెక్కకు వివిధ కోణాలలో బిగించి, భావాన్ని వ్యక్తపరుస్తాడు ఈయన. ఈ బిగించిన కర్రముక్కలకు వివిధ రంగులు వేస్తాడు. బిగింపబడిన బల్లపరుపు చెక్కకు నల్లరంగు వేస్తాడు. మధ్య మరొక విశాలమైన చతురపు తెల్లని రంగుగల బల్లను బిగించాడు. మరొక Linear Motif అన్న చిత్రంలో తెల్లని బల్లపైన సన్నని రంగు రేఖలను చిత్రించాడు అంతే. విమానంమీదపోతూ క్రింద చూచినట్లుగ, లేక కొండమీద నిలబడి క్రింద గ్రామాన్ని చూచినట్లుగా ఉంటుంది ఈ చిత్రం ఒక కర్రముక్కకు మరొకదానికి గల మధ్యదూరం రకరకాల ఆకారాల ముక్కలు, వాటి కోణాలు కలిసి ఒకవిధమైన Design ను సృష్టిస్తాయి. బహు విచిత్రమైన భావాలను రేపుతాయి ఈతని చిత్రాలు. చిత్రాలు కాదు relief అంటే అనవచ్చునేమో. ఇంతవరకు ఎవరు చెప్పని ఒక పద్ధతిని వ్యక్తపరచాడు పాస్‌మోర్. ఇటువంటి చిత్రాలకు వస్తుతఃచూచి ఆనందించవలెనుగాని, మాటలలో చెప్పడం కష్టం. ఎందుకంటే ఇది బహు నూతన విచిత్ర రూపంతో కూడుకున్న చిత్రం. గ్రహం సదర్‌లాండ్‌వి "Owl in Tree Form", "Ancestor" అన్న రెండు చిత్రాలున్నాయి. దాదాపు ఒకే రంగులో (ఆకుపచ్చని రంగులో) పెయింటు చేశాడు రెండు చిత్రాల్ని. బ్యాకుగ్రౌండు అంతా ఖాళీగా వుండి, నిలబడివున్న రాతి ముక్కలులాగా ఉన్నాయి ఆకారాలు. ఈయన చిత్రాలు ఎంతో అందమైన, ముతక పసుపురంగు, ఆకుపచ్చని రంగులలో ఉంటాయి. కాని, ఇప్పుడు కాంతిహీనమైన రంగులలో వివిధ కోణాకారాలతో నిండిన చిత్రాలను చిత్రిస్తున్నారు. రంగు ఎలా ఉన్నా, ఈయన చిత్రాలను ఇట్టే గుర్తు పట్టవచ్చును. ఆయన Style ఏమాత్రము మారలేదు. రంగులలో కాంతి తగ్గింది అంతే. కుంచెను నడిపే విధానం అద్భుతం. చిన్న చిన్న ముక్కల రూపంలో రంగు పూసిన స్థలాలకు బలమైన నల్లని గీతలమధ్య యిమిడ్చి, ఆకుపచ్చని విశాలమైన మైదానంలాంటి బ్యాక్‌గ్రౌండ్‌లో ఉంచుతాడు. ఈయన చిత్రాల్ని చూస్తే నాకు శిల్పాలను (ఆఫ్రికా దేశపు) చూచినట్లున్నది. ఒక్కొక్కటి ధర 2,250; 1,650 పౌండ్లు.

బ్రిటిషు కళాకారులైన హెన్రీమూర్, గ్రహామ్‌సదర్‌లాండ్, విక్టర్ పాస్‌మోర్‌లు ప్రత్యేకంగా ఈ ప్రదర్శన కోసమని చేసారు శిల్పాలు, చిత్రాలు.

సిలన్ మంచి చిత్రాలను ఉంచింది. ప్రముఖ చిత్రకారులు జార్జి కీట్సుని ఒక రేఖా చిత్రము, ఒక వర్ణ చిత్రము ఉన్నాయి. రేఖా చిత్రం మనం Illustrated weekly లో తరచు చూచేలాంటిది. Nayika 2 అనే వర్ణచిత్రం (యిచ్చట ప్రచురించబడినది) ముతుక రంగులలో చిత్రితమైనది. ఇటుకరంగు శరీరం, ఎరుపుచీర, నీలం బ్యాక్‌గ్రౌండ్, ఆకుపచ్చని మొక్కల ఆకులు పెనవేసుకుపోతున్న లతలాంటి రేఖలతో ఎంతో నిండుగావుంది. ఎందువల్లనో చిత్రములో స్తబ్ధత ఆవరించి వుంది. సంతోషం, చలనంలేదు. నిండైన స్త్రీ చాల గంభీరంగా ఉండి, ఏదో చెప్పబోతున్నది. రనిల్ దెరనియాగల అనే యువ చిత్రకారుని "Boy & Bull" అనే చిత్రం అద్భుతంగావుంది. Kokoska నడిపే క్లాసులో కొంత కాలం ఉండడంవల్ల ఆయన ప్రభావం విపరీతంగావుంది. అయినా వర్ణ మిశ్రమంలో, ఆకారాన్ని, మలచడంలో దిట్ట. సిలన్‌కు పేరుతెచ్చే మరొక గొప్ప చిత్రకారుడు, మరొక యువ శిల్పి తిస్సరణసింగే "The God that is half woman" అనే శిల్పాన్ని ప్రదర్శించాడు. ఈ పై చెప్పిన ఇద్దరు యువకులు లండన్‌లో శిక్షణ పొందినవారే చిత్ర శిల్పకళలలో. గొప్ప మార్పును వీ రిద్దరు సిలన్ కళారంగంలో తెస్తారంటే సందేహం లేదు.

సైప్రెస్ చక్కటి చిత్రాలను ప్రదర్శించింది. డయామాన్‌టిస్ అనే చిత్రకారుని Trouble అన్న చిత్రం బాగుంది. ఈ చిత్రంలో విచారం తొణికిసలాడుతున్నది. ఈ చిత్రం మనకు మన అమృతషెర్ గిల్ చిత్రాలను జ్ఞాపకం తెస్తుంది. ముదురు నీలం, ఎరుపు రంగులతో బాగుంది. జార్గియో అనే చిత్రకారుని "Stadt Zonder Hart, Roterdam" అన్న చిత్రం ఎంతో బాగుంది. ప్రపంచ ప్రసిద్ధ శిల్పకారుడు Zadkin శిల్పాన్ని రోటర్‌డామ్‌వద్ద ఉంచారు. దాన్ని చిత్రించాడు. శిల్పానికి వెనుక నది, నదిలో ఓడలు ఎంతో రమ్యంగాఉంది.

న్యూజిలాండ్ అంతా Abstract చిత్రాలను ప్రదర్శించింది. Subject కు ప్రధాన్యత యిచ్చేది ఒక్కటిలేదు.

కామన్‌వెల్త్ చిత్రకళా ప్రదర్శన

హాంగ్‌కాంగ్ రెండు మూడు మోడరన్ చిత్రాలను ప్రదర్శించింది. కాని ఏమి బాగుండలేదు. చైనీసు పద్ధతిలో వేసిన చిత్రాలు బాగున్నాయి. లై మింగ్ చిత్రించిన "Vulture" అన్న చిత్రంలో గ్రద్దలో తీక్ష్ణతను, రేఖలలోని గరకు, నూది మొనలాంటి పద్ధతిని మెచ్చుకొనవలసివుంది.

పాకిస్తాన్ అన్నీ అధునాతన చిత్రాలను ఏడింటిని ప్రదర్శించింది. అన్నీ దాదాపు అనుకరణలే. అమెరికన్ చిత్రకారులు **Klein** కు, **John Marin** నీటిరంగుల చిత్రాలకు నమూనాలుగ ఉన్నాయి.

నైజీరియా, సెర్రలియోన్, ఘనా, నార్తరన్ రొడీషియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, సింగపూర్, మాల్టా, మలయా, జమైకా, ఈస్ట్ ఆఫ్రికా (టాంగనికా, ఉగండా, కెన్యా, జాంజిబార్), బ్రిటిషు గయానాలు చిత్రాలను ప్రదర్శించాయి. ఈ దేశాలవారి చిత్రాలలో ఒకటో రెండో చెప్పుకోతగ్గవి ఉన్నాయి. అంతా చాల, చాల నాసి రకమైన చిత్రాలను ప్రదర్శించాయి.

మొత్తంమీద చిత్రాలు నిరాశను కలుగచేశాయి. మొట్టమొదటి సారిగా ఇంత పెద్ద ఎత్తున దాడి జరిగి కామన్‌వెల్త్ చిత్రకళా ప్రదర్శన గురించి ఒక కాలంలో ఆరు, ఏడు అంగుళాల కంటె ఎక్కువ ఏ పేపరు వ్రాయలేదంటే లండన్‌లో ఎంత సరుకులేని చిత్రాలో గ్రహించగలరు. చిత్రాలలో అధునాతనత్వాన్ని (పాశ్చాత్యులది) తేవాలని ఎంత నాసికరకపు నమూనాలను (పాశ్చాత్య చిత్రాలకు) తయారు చేశారో కామన్‌వెల్త్ దేశపు చిత్రకారులు ఈ ప్రదర్శన తెలుపుతుంది. ఆస్ట్రేలియా అందరి మన్ననలను పొందింది. గ్రాక్ దేశాలన్నీ స్వంతంగా ఒక భావాన్ని బలమైన, నూత్న పద్ధతిలో చెప్పాలంటే చాల కాలం పడుతుందనిపించింది. 85% చెడ్డ చిత్రాలలో మిగిలిన చిత్రాలు మినుకు మినుకుమనే ఈ ప్రదర్శననుండి, ఇంత దూరం రెండు రూపాయలు ఖర్చు పెట్టి ఎందుకు వచ్చానా అనిపించింది. లండన్‌లో ప్రముఖుల ఎందరి ప్రదర్శనలో చూచిన నాకు.

దశావతారములు క్రమాలంకారము

సీ. శ్రుతి సుధాత్మో భక్త సురజననీ వధూ
మల్ల శంకర ధర్మ మహిత బుద్ధిఁ
గగ, కూర్మ, కిటి, నర, మృగ, కుబ్జ, రామ రా
మానంత, బుద్ధ, కల్క్యాఖ్య వ్యాయముల
నముచి, మందర, కుదానవ బలార్జున పంక్తి
ముఖముష్టిక స్త్రీ విముక్త ఖలులఁ
దద్పుచ్ఛ, కర్పర, దలష్ట్రాగ్ర నఖ పద
పరశు, బాణ, హాలాంగ, ఖురపుటములఁ
గీ. జెరివి, తాల్చి, యెత్తి, చీరి, బంధించి, ని
ర్జించి, యేసి, యేర్చి, చెఱచి, మట్టఁ
గడగుచున్న శౌరి కరుణా విధేయుఁడై
మనల కోర్కులిచ్చి మనుచుఁగాత

సూరయ-కన్నప్ప చరిత్ర.

"నృత్య రత్నావళి"

శ్రీ నే. శ్రీ. కృష్ణమూర్తి

(గత సంచిక తరువాయి)

తంజావూరు సరస్వతీ మహల్ పుస్తక భాండాగారమున B. 11540 : D1067 L. యను సంఖ్యానూచితమైన వ్రాతప్రతి * 'నృత్య రత్నావళి నాట్యలక్షణ' మని యున్నది. ఈ తాళపత్ర గ్రంథాంతమున (100.B) పుట :

> "సంగీతశాస్త్రం నృత్య రత్నావళి అధ్యాయాలు (8)
> ఆకులు 100 ట్కి తెలుగు లిపిని పుస్తకం 1
> నగర వెంకటసుబ్బయ్య చాతను వ్రాయించినది.
> కార్తీకమాసం 12 తేదీ సంపూర్ణ మయినది.
> గ్రంథ సంఖ్య శ్లోకాలు 1900 ట్కి పు 1 ఆర్యవర్షం
> రవ్‌జాను నెల 25 తేది సమాప్తము."

నాల్గవ అధ్యాయమున కరణ, అంగహారములు వివరింప బడినవి. తరువాత వ్రాత ప్రతియందు దేశీ నృత్య విషయములు ఆరవ అధ్యాయముగా గద్యమున వ్రాసియున్నవి. పిమ్మట ఏడు, ఎనిమిది అధ్యాయములతో గ్రంథము పూర్తియగు చున్నది. కాని 7, 8, అధ్యాయ విషయ వివరణ శీర్షికలు ఆయా గద్యములందు సూచింపబడలేదు.

పంచమాధ్యాయము ఈ తెనుగు లిపియందు వ్యగ్యము. ఈ కావ్య వస్తు ప్రదర్శనా క్రమమును పరిశీలించిన, ఆ లోటు పడిన అధ్యాయము 'రస—భావ' ముల గూర్చి యుండు నేమో ! నృత్యశాస్త్ర వివరణలో 'రస—భావ' విషయావిష్కరణము మేరువూన వంటిది. తదితర ప్రతుల పరిశీలించి రస— భావ విషయముల గూర్చి, జాయసేనాని యెట్లు వ్రాసినది తెలిసికొనవలయును.

షష్ఠాధ్యాయమున వివరించిన విషయములలో పేరెన్నదగిన ముఖ్య ప్రస్తావన దేశీలాస్యాంగముల గూర్చినది. ఇవి ముప్పది మూడుగా వివరింప బడినవి.

(1) సుకలాసం, (2) ఉరోంకణ, (3) భావః, (4) ధరహారం, (5) నర్క్కిర్తు (?), (6) దేశీకారం, (7) నిజాపణం (8) ఢిల్లాది, (9) వపణిః (10) గీతవాద్యత, (11) అభినయ (12) కోమలికా, (13) ఓయాళ, (14) నికిలి, (15) అంగహార, (16) మనోధర్మం, (17) అంగవ్, (18) వివర్తనవ్, (19) ఝుంపక, (20) ముఖరసః (21) విహసి (22) ధనక, (23) తత్థం, (24) ద్వితత్థం, (25) రసవృత్తి, (26) మన్నణిత, (27) అనుమాన, (28) ప్రమాణ, (29) లంఘిత, (30) అంశగతి, (31) సుసంధి, (32) పాదపాట, (33) చండ.

(పై లాస్యాంగముల లక్షణములు కొన్ని వ్రాత ప్రతియందు సలక్షణములుగా లేవు.)

సంగీత రత్నాకరమున ఈ క్రింది పది, దేశీలాస్యాంగములుగా వివరింపబడినవి.

(1) చాలి, (2) చాలివడ (3) లఢి, (4) సూక, (5) ఉరోంగణ, (6) ధసక, (7) అంగహార, (8) ఓయారక, (9) విహసి, (10) మన.

జాయసేనుని (2) ఉరోంకణము, (15) అంగహారము, (21) విహసి, (22) ధనక దేశీ లాస్యాంగముల లక్షణములు శాఘలుని లక్షణములతో సరిపోవుచున్నవి. వ్యత్యాసములకు, లోపించినందులకు కారణములు, ప్రాంతీయత, సాంప్రదాయములే.

జాయసేనాని.

(2) ఉరోంగ (క) ణము.

> ఊర్ధ్వాధః పురతః పశ్చాత్
> స్కంధ యోస్తన యోరపి ।
> ద్రుతం విళంబితం యద్వా
> లలితంతాళ మానతః॥
> పర్యాయాచ్చాలనం యత్ర
> స్యాదుక్తం తదురోంకణం।

పైకి, క్రిందికి, ముందుకు, వెనుకకు స్కంధమును, వక్షః స్థలమును, ద్రుతముగా, విలంబితముగా, లలితముగా, పర్యాయముగా తాళమాత్రము (9") చాలన మొనర్చుట ఉరోంకణము.

శాఘలుడు.

(5) ఉరోంగణము VII. 1211—2.

---

* ఈ తెనుగు లిపి ప్రతిని బ్రహ్మశ్రీయుతులు ప్రొఫెసర్ నిడదవోలు వేంకటరావుగారు నాకు ప్రాప్తింపజేసిరి. గ్రంథలిపిలో గల ప్రతి మరొక్కటి సరస్వతీ మహల్‌లో కలదు.

విలంబేనా విలంబేన
కుచయోరు భుజ శీర్షయోః।
లలితం చాలనంతిర్య
క్తుజ్ఞాః ప్రాహురురోంగణమ్॥

ద్రుతముగా, విలంబితముగా రొమ్మును, భుజశీర్షముల అడ్డముగా, లలితముగా చాలనమొనర్చుట ఉరోంగణము.

జాయ సేనాని
(15) అంగహార.

సమర చాపలతేవాంగి
యష్టిః పార్శ్వనుయోన చేత్।
సవిలాసా మితాత్తాళ
లయానుగ (?) మతిః క్రమాత్॥
హారణా దంతరంగాణా
మంగహార స్తదావతః।

సమరాంగణ మందలి ధనుస్సువలె నర్తకి అంగియష్టిని సవిలాసముగ తాళలయానుసారముగ వంచుట అంగహారము.

సౌఢలుడు VII. 1213.
(7) అంగహార

సతాల లలితోపేతా
క్రమాత్కాయార్థ యోర్నతిః
ధనుర్వదంగ హారఃస్యా
దితి నిఃశంక భాషితమ్॥

తాళ లయలకు సమన్వయించుచు శరీరార్థముల (పై, క్రింది) ధనుస్సువలె లలితముగా వంచుట అంగహారము.

జాయసేనాని
(21) విహసి.

స్మితం వక్త్రస్య విహసి
పద్మస్యేవ మనోహరం.

ముఖమందలి స్మితము, పద్మమువలె మనోహరముగా నుండునది విహసి.

సౌఢలుడు. VII. 1214—15
విహసి.

స్మితం స్యాద్విహసీ యుస్తు
శృంగార రసనిర్భరః।
అభ్యస్తాదన్య ఏవాతి
సూక్ష్మ ప్రత్యగ్రభంగి భాక్॥

శృంగారరసాత్మకమైన చిఱునగవు, సూచితాసాధ్యముగ, లలితమై యుండుట. ఈ నగవు అభ్యాసముచే సకటించునదికాదు.

జాయసేనాని
(22) ధసక

చంచరీక సముద్భుష్ప
గుచ్ఛ తీ లానుకారిణో।
స్తనాధో దేశ ధమసా
దన్యాత్ర స్త్రైవ నర్తకః॥
పాద్యానుప విలాసార్థం
స్తనయో నమనం సకృత్।
మధ్యే మధ్యే ప్రకుర్వీత
నృత్తస్య ధసక స్తథా ॥

తుమ్మెదల దండుచేరి యుండుటచే వ్రాలిన పుష్పగుచ్ఛముల బోలిన స్తనద్వయమును మధ్యమధ్య వంచుట (?)

సౌఢలుడు VII. 1212.

ధసకః స్యాత్సు లలితం
స్తనాదో నమనం లయాత్.

స్తన ప్రదేశమును లాలిత్యముతో వంచుట ధసకము.

ఇందు జాయసేనాని 'అంగహార' మను శబ్దము యొక్క భావమును రమ్యముగా నిరుక్తీయంచినాడు.

హరణాత్ అంతరంగాణామ్ (సామాజికుల) అంగహారః'

లలితముగా, సౌందర్యయుతముగా వివిధాంగ, ఉపాంగ ప్రత్యంగముల విన్యాస మొనర్చు నర్తకి, సహృదయులయంత రంగముల హరించుననుట తథ్యము. కేవలము లోచనా దృష్టులే చాలును. అంతరంగములు ఆకర్షణాజాలముల లోనగుటకు !

జాయసేనాని విస్తారముగ నృత్య ప్రదర్శనముల వీక్షించి తనకు యనుభవ వేదితములగు నృత్యభంగులను సమీకరించి తరతరములవారికి వీటి రహస్యముల నందించుటకై, నృత్య విషయముల శాస్త్ర నిబద్ధముచేసి 'రత్నాకరము'న సంకలన మొనర్చెను. సంగీత రత్నాకరమందు దేశి నృత్యమును గూర్చిన విషయావిష్కరణము లఘువైనది, గౌణమైనది.

షష్ఠాధ్యాయాంతమున దేశిలాస్యాంగముల కనువగు తాళముల గూర్చి, గ్రంథకర్త వర్ణించెను.

శిక్షాపద్ధతి (ఉపశీర్షిక)

సప్తమాధ్యాయ పూర్వభాగ ముఖమున నృత్యవిద్య ప్రారంభింపవలసిన శుభసమయము, నర్తకీ నర్తకుల వయస్సులు, శిక్షణాపద్ధతి, కళావిద్య పూర్తియైన తదుపరి ఆచార్యునకు సమ్మానమును, ప్రదర్శన యోగ్యత ప్రాప్తించునాడు చరమ ప్రబోధముగా గురువు చెప్పవలసిన పంచశీలములు, నేటికిని నర్తన విద్యాభ్యాసము నభిలషించువారికి ఉద్బోధకముగా నున్నవి.

నృత్యారంభమునకు రిక్త తిథులు వర్జనీయములు. మిగిలినవి శుభప్రదములు. బుధ, గురు, శుక్రవారములు, హస్త, శతభిష, పుష్య, అనూరాధ, ధనిష్ఠ, రేవతి, జ్యేష్ఠ నక్షత్ర కాలములు మంగళ సూచకములు.

నాట్య విద్యా శిక్షకు యోగ్యమగు రంగభూమి స్థిరమై, మృదువై, తెలుపుగా గాని, నలుపుగా గాని యుండవలయును. ఈ రంగప్రదేశమునకు, సౌధములు, కేళీవనములు, రమ్య మగు పచ్చిక గల బయళ్లు, శుభమగు మరేవేని స్థలములు యోగ్యములు.

విద్యాప్రాప్తి నభిలషించు నర్తకి ప్రారంభమున 6, 7, 8, 9, (గౌరీ, రోహిణి) సంవత్సరముల వయస్సు గల కన్య లుగా నుండవలెను. వారు అర్ధోరుక (చల్లడములు) వసనాలం కృతులుగ నుండవలెను. వీరికి స్తనోద్గమమై కంచుకధారణము చేయు వయస్సు దాటరాదు.

విద్య నభ్యసించునపుడు గాత్ర సౌష్ఠవ పరిణామ ప్రాప్తికై, మృదువై, నిర్దోషమై, పట్టుకొనుట కనువై మూలమునుండి ఏడు గణువులు గల వేణకాష్ఠమును స్థంభ ములపై కట్టి యుంచవలెను. 1 (**Barre for Ballet Learners**) విద్య నేర్చు కాలమున పై వంశదండమును పట్టుకొని, ఆచార్యోపదేశానుసారముగ మార్గదేశీ నృత్యములలో ప్రథమమున సుకరములైనవి, పిదప క్రమముగా కఠినము లగు నృత్యభంగులను, నిత్యమును స్వల్ప స్వల్పముగా, యథా శక్తిగా నభ్యసింపవలెను.

ప్రయోగములు సిద్ధించినట్లు గుర్తించిన పిదప, గురువు తాళధ్వనులతో, పిదప వక్త్రవాద్యముతో, అటుపైన గీతముతో ఆయా ప్రయోగములను ఛాత్రులచే చేయింప వలెను.

విద్యాశిక్షణ పూర్తియైన పిదప నాట్యాచార్యుని, శుభ దినమున స్వర్ణాంబరాదులతో సత్కరించవలెను.

ఆచార్యుని చరమప్రబోధము

నర్తకి, గీతవాద్య నర్తనమున ప్రౌఢయైన పిదప, పారంపర్యాగతము, అభ్యాస గోచరము నగు సార్థశ్లోక పంచక మున నిబిడీకృతమై యున్న నృత్య విద్యా రహస్యమును ఉత్తీ ర్ణత చెందిన అభినేత్రికి ఆచార్యు డుపదేశము చేయవల యును.

1. గీతాస్యావయ వానంగైః
   భావాన్ దృష్టి విచేష్టితైః।
   హస్తైరర్థం లయా పద్భ్యాం
   వర్ణాన్ పాఠైః ప్రదర్శయేత్॥

2. గీతాక్షర సమం వాద్యం
   ..... గీతమేవచ।
   లాస్యాంగ పాఠహస్తాద్యైః
   తన్మాత్రైః నృత్య మాచరేత్॥

3. ప్రాణేశం భావయంతీ స్వం
   ఆనమంతీ సభాపతిం।
   గీతార్థా పతితాన్ భావాన్
   వ్యంజయన్ త్యనురంజయేత్॥

4. యేషు యేషు ప్రయోగేషు
   ప్రేక్షకాణాం రుచిర్భవేత్।
   .... సమ్యక్ జ్ఞానే గీతకామం
   భంగ్యాతాంస్తాన్ ప్రదర్శయేత్॥

5. రసానాం వినియోగేషు
   యతోహితోః కరోభవే।
   దృష్టిర్మనశ్చ భావశ్చ
   తత యేవ భవేత్ క్రమాత్॥
   రసానాం పునరుత్పత్తిః
   భావైర్భవతి భావితైః।

(1) గీత భాగములను అంగ విన్యాసములతోను, భావ ములను దృగ్విలాసములతోను భావ, పద, అర్థములను హస్తములతోను, లయను పాదములతోను, వర్ణములను (స్వర వర్ణముల) పాఠములతోను ప్రదర్శింపవలయును.

(2) వాద్యము గీతాక్షరాను గుణముగ నుండవలెను ... గీతానుగుణములగు లాస్యాంగ, పాఠ, హస్తాదులతో నృత్త మొనర్పవలెను.

(3) ప్రాణేశుని భావించి సభాపతికి నమస్కరించి, గీతార్థమున నేర్పడిన భావములను వ్యక్తీకరించుచు, (హృద యులను) రంజింపజేయవలయును.

(4) ఏయే ప్రయోగములందు సభ్యులకు అభిరుచి కలదో చక్కగా తెలిసికొని ఆయా ప్రయోగములను ప్రద ర్శింపవలయును.

(5) రసముల వినియోగమున హస్తములబట్టి దృష్టి మనస్సు భావముల కేంద్రీకరించవలయును.

భావములను భావింప రసముత్పన్నమగుచున్నది.

---

1. "Barre" Definition taken from 'BALLET' by Arnold Haskell.

198. Barre : 'A rod running round the walls of a dance-Studio which the pupils hold during their first exercises and while they are being placed. It steadies them taking the place of the partner's hand.

దేశీ(య)నృత్యములు

సప్తమాధ్యాయ ఉత్తర భాగమున పేరణి దేశీ పద్ధతి, ప్రేక్షణము, సూథ, శుద్ధసాలగ, రాసకం, కలవ్, చర్చరి, నాట్యరాసకము, దండరాసకము, చిందు (తు), కందుక నృత్యము, భాండికనృత్యము, ఘటివిశ్రి, చారణ నృత్యము, బహు రూప నృత్యము, కోల్హాటక లేక కోలాటము మొదలగు వానిని గూర్చి జాయనార్యుడు నృత్య రత్నావళియందు వివరముగా తెల్పెను.

ఇందు పేరణి, చారణ, కోల్హాటకములగూర్చి శారఙ్గదేవుడును చెప్పెను. నందికేశ్వరుడు తన భరతార్ణవమున, పేరణి, ప్రేంఖణి, దండలాస్య, కలసములగూర్చి తెల్పెను. పోదరీ కృతులనుండి పోలికలకొఱకై ఈ వ్యాసమున వస్తుప్రదర్శనము చేయబడినది.

పే ర ణీ :

సంగీత రత్నాకరము VII. 1301—1302.

> భస్మాదిశ్వేత లిప్తాంగో బిభ్రన్ముండం శిఖావ్ |
> భ్రాజద్ఘర్ఘరికాజాల జంఘః శరీరపేశలః ||
> పంచాంగ కుశలస్తాల కలాలయ విచక్షణః |
> సభాజన మనోహారియో నృత్యతి స పేరణీ ||
> ఘర్ఘరో, విషయం భావాశ్రయుశ్చక విచారకః |

భరతార్ణవము : పే. 371. శ్లో : 731—732.

> భస్మాది శ్వేత లిప్తాంగో బిభ్రత్కుంఠ శిఖం శిరః |
> భ్రాజద్ఘర్ఘరికా జాలజంఘః శారీరపేశలః ||
> పంచాంగ కుశలస్తాల కలాలయ విచక్షణః |
> సభాజన మనోహారీ నృత్తవ్య ప్రేరణీ మతః ||
> (నందికేశ్వరుడు ప్రాచీనుడు.)

నృత్య రత్నావళి VII అ.

> రజంకో రూపసంపన్నః ప్రద్యోతో ఖ్యాతవంశజః |
> ...... రసికస్తాలవేదీ గమక కోవిదః ||
> ధ్వని శారీర సంపన్నో రాగాంగాది విచక్షణః |
> పంచాంగ కుశలోప్యంగ స్సర్వ భాషావిశారదః ||
> సుముఖః వాద్య విత్ప్రోక్త ప్రస్తావోచితభూషణః |
> గాథాగీత ప్రబంధానాం లాస్యాంతాళవ పద్ధతి ||
> పేరణీ మతః |
> విద్వాన్ ఉత్ప్లుతి పూర్వేషు కరణేషు సలాఘవః ||
> భూషణై ర్భూషితో భాస్వద్భ స్మోద్ధూళితవిగ్రహః |
> శిఖా వాన్ముండిత శిరం దధత్పుస్త ఫణాధరం |
> ఏకేవ రంగయష్టించ కరణోన్యేన చామరం ||
> బిభ్రద్ఘర్ఘరికా జాలే జంఘయో ధృష్టసంయుతే |
> ఏకతో ద్వంద్వ శోవాపి క్రమాత్పూర్వ ప్రవేశితై |
> చతుర్భిరథ వాషడ్భి దష్టాభిర్వస్య యోథకైః ||
> అభితస్పహిత స్వస్యా థథా వై స్తుల్య వేషతాం |
> సమపాదేన వాతిష్ఠన్ భుజంగ త్రాసితేనవా ||
> .... తేయవని కాక్షేపే సతిరంగభువం విశేత్ |

(ఇందలి పాఠము Text—సంస్కరింపవలయును).

పేరణీయనగ ఆహార్యాదివేషము ధరించిన యొకపాత్ర. ఈ నటుని కుండవలసిన గుణసంపత్తి, ప్రయోగమందుండవలసిన వేషరూప మిందు వర్ణింపబడినవి.

పేరణి గుణములు :

రంజకుడు, రూపసంపన్న ప్రద్యోతనుడు, కులీనుడు, రసికుడు, తాళవేది, గమక కోవిదుడు, ధ్వని శారీర సంపన్నుడు, రాగాంగాది విచక్షణుడు, పేరణి ప్రయోగమందుగల పంచాంగము లందు కుశలుడు (నృత్త, కైవార, ఘర్ఘరీ, వికట, గీత) సర్వ భాషా విశారదుడు, సుముఖుడు, వాద్యవిదుడు, ప్రస్తావోచిత భూషణుడు, గాథాగీత ప్రబంధజ్ఞుడు, విద్వాంసుడు, ఎగురుట యందును, కరణముల ప్రయోగమున, లాఘవముగ చేయగల నేర్పరి, భ్రమరీ భంగుల తెలిసినవాడుగనుండు నర్తకుడు పేరణి.

ఈ వేషధారి భూషణముల ధరించవలెను. శరీరమున భస్మము పూసికొని, విగ్రహము కాంతియుతముగ నుండదగును. శిరోముండనయుతుడై, శిఖను మాత్రము కల్గి యుండవలెను.

ఒకచేతితో కుటిలకమును (రంగయష్టి)? రెండవ చేత చామరమును ధరించవలెను. తోటిపాత్రములు ఒక్కొక్కరుగాని, జంటలుగాగాని, వరుసగాగాని రంగముపై క్రమముగా ప్రవేశింపవలెను. వారందరు 4, 6, 8 మంది పేరణిని చుట్టి వలయాకారముగ నుండవలెను.

ప్రవేశ సమయమున సమపాదముసగాని, భుజంగ త్రాసితమున గాని, తెఱను ప్రక్కకుత్రోసి, రంగ ప్రవేశము చేయువలయును.

(తరువాత పంచాంగములు, అందలి ఘర్ఘరమందలి యేడు విభాగములు వర్ణింపబడినవి)

రాసకము

12, 16, 18, నాయికలు వలయాకారముగ (పిండీ భావమున) నృత్య మొనర్చుట. నాయిక ఊరువులు చేలముచే వస్త్ర ధారణమై యుండవలెను (చేల బద్ధోరుకం.) లోపల చేలముగాని అర్ధోరుకముగాని ధరింపవలయును. కార్పాసము (నాలుగుచొక్కా)నుతొడిగి, ధమ్మిల్లముగాని, వేణిగాని కల్గి యుండవలెను.

మంజీరములు, కంకణములు ధరించవలెను. యువ్వనస్త్రీలై, మనోహరముగానుండి, పీవర ఊరుస్తనములు కల్గియుండవలెను. (కటి ?)

వాద్యములతో జంటలుగా యవనిక గర్భమునుండి, పార్శ్వ భాగములనుండి, రంగముపై ప్రవేశింపవలెను.

(ఇచ్చట వ్రాతప్రతియందు మంచి శ్లోకములలో ముఖ్యాక్షరములు లోపించినవి.)

గాయకులు బుతువున కనుగుణములగు రాగములతో గానము చేయుచుండ చర్చరీ మొదలగు ప్రబంధములతోను, ఖండమండల చారులతోను, ముఖ్యలాస్యాంగములతోను, గీతార్థాభినయు మొనర్చుచు చిటికెలబూని లయానుసారముగ, చిక్కని దట్టమగు వివిధములగు బంధములతో నృత్యమొనర్పవలెను.

నాట్యరాసకము [1]

వసంత కాలమున యువ్వనాసవ మత్తలగు నాయికలచే దేశీయములగు దోలగీతికలతో భూపతి చరితమును పదార్థాభినయము చేయు నృత్యము.

దండరాసకము

ఇందు 8, 40, 64, 128 నాయిక పాత్రములు పాల్గొనవచ్చును. మూర (అరత్ని) మానముగల పొడవును, అంగుష్ఠ మాత్రము మందముగల్గి కొనన బంగారుతొడుగులుండి, నునుపుగా, చిత్రవర్ణములతోనుండి, మంగచెక్కతో చేయబడిన దండముల ఇరుచేతులలో ధరించవలెను. అథవా పాలచెట్టు కొయ్యలుగాని, దేశీయ సంప్రదాయాను సరణమగు మరేవేని దారువులు ప్రయోగార్హములు.

వాదకులచే వాద్యములు మ్రోగుచుండ లాస్యాంగ, భ్రమరీ, పాద, చారులతో, ధనురాకారముగ ఈ బృందము తిరుగవలెను. సవ్యాప సవ్యములుగా, చక్రవలయాకారముగ, సశబ్దముగా అయిదు మారులు ఈ దండముల కలుపవలెను. సభనధ్యక్షించియున్న రాజుకోరిక ననుసరించి యథాక్రమముగా ఈ కోలాట 2 నృత్యమును జరుపవలెను. ప్రౌఢనర్తన శిక్షితములగు నృత్యమును ప్రయోగింపవలెను.

భరతార్ణవమున : పే. 378. శ్లో. 745—749.

యత్ర సంభూయ వనితాః పరస్పర మనోహరమ్ ।
దండైర్దండై శ్చ నృత్యంతి నృత్యం తద్దండ లాస్యకమ్॥
మాధ్యమాంగులి వత్స్థూక్ష్మం దీర్ఘంస్యా త్షోడశాంగులమ్।
లాస్యే ప్రాధాన్య మిత్యేతల్లక్షణం దేశికర్తృభిః॥
పాటాక్షరేణ సంయుక్తం భ్రమరీ నృత్యమాచరేత్।
సమస్థానక మాశ్రిత్య పశ్చాత్తాలం వినాయకమ్॥
ప్రేక్షాస్థానక షట్కేన గతిభిశ్చ విశేషతః।
ఆవేక్షైః పాదవిన్యాసై ర్దండ లాస్యం సమాచరేత్॥

ఈ దండభాగములందు వేంచేసియుండు దేవతలు. 749-50

దండమూలే స్థితో బ్రహ్మా దండమధ్యే సదాశివః।
దండాగ్రే మాధవో యజ్ఞే దండశబ్దేతు నారదః॥

చిందు

ఈ దేశి నృత్యము శివోత్సవములందు ప్రయోగార్హము. మృదంగ, శకట (?) కంచుతాళ, కాహళ, వాద్యములు మ్రోగుచుండ, లయానుసారముగ, రుద్రాక్షలు ధరించి, దట్టముగ పూయబడిన త్రిపుండ్రముల ధరించి, శివలెంకలు వరుసలుగా నిలువబడి, సంతోషముతో చంద్రశేఖరునిగూర్చి గానము చేయుచు, యథోచితములగు అంగములతోను, లాస్యాంగముల తోను, పాదగతులతోను, ఎదురెదురుగా నిలుచుండిగాని, వివిధ రూపములగు మండలాకారములుగా నుండి నృత్యమొనర్తురు.

ఈ నృత్యము శివప్రీతికరమైనది. మఱియు కరతాళములతో కూడిన ధ్వనులను, నోటితో తానాను గుణ్యమగు మాటలతోను, చారులు, గతులతో కూడిన పాదచలనములతో, గీతాభినయములతో కూడిన ద్విపదములతోను (వీటినే చిందులందురు) యౌవనవతులు సువేషలై నృత్యమొనర్చుదురు. (వ్రాతప్రతియందు ఈ వర్ణనము కొంత లోపించినది.)

కందుకనృత్యము [3]

పద్మగోమూత్రిక, నాగ, చక్ర, మొదలగు వాద్యములు ధ్వనించుచుండ, దేశీయ నర్తనమందు పేర్కొనబడిన ప్రబం

---

1. ఈ పేరుతో, సాహిత్య దర్పణము, భావప్రకాశము, నాటక లక్షణము, రత్నకోశము ఇత్యాది గ్రంథములలో ఉపరూపకముగా నాట్యరాసకము వర్ణింపబడినది. వీటి సామంజస్యములు శోధనీయములు.

2. కోలాటమను పదమిచ్చట సామాన్యార్థముతో ప్రయోగింపబడినది.

3. కందుక మన బంతి. దీనిని కృష్ణద్వైపాయనుడు 'పీటి' యని ప్రయోగించెనని, నన్నయభట్టారకుడు కందుకము పిండు యని ప్రయోగించెను. రాకుమారులు క్రీడించుచుండ ఆటలాడు చెండు నూతిలో పడెను. వ్యాసుని రచన ప్రకారము ఇయ్యది నీటిపై తేలి యుండగా, ద్రోణుడు తన దృష్టి ముష్టి సౌష్ఠవముతో బాణ రజ్జు నిర్మితముచేసి వెలికి తీసెను. నీటిలో పడిన అంగుళీయకమును బాణ మోక్షములచే పైకి తీయగలనని, అట్లు వారి పతిత ముద్రికను తన శస్త్ర కౌశలముచే పైకి తీసెను. నన్నయభట్టారకుని పిండు బావి నీటిలో మునిగి ఆకాశమున నక్షత్రములు ప్రకాశించునట్లు తారవలె భాసించెను. 'పీటి' ని బంతి యనుట సరికాదేమో !

భర్తృ : I—83 (దైవ)

"యథా కమ్రకపోతేనోత్పతత్యార్య:."

వర్ణించుటలో కందుకము భూమిపై పడి పైకి ఎగురు

ధము (పాట) లను పీవరగారుస్తవ భారవము కల్గి, సునేత్రలు, కాంతి, యౌవన విభ్రమములతో పరస్పరము ఒప్పుచున్న వనితాద్వయము రెండు బంతులతో, నృత్య మొనర్తురు. ఆకందుకములు, బంగారము, వెండి, కంచుతోగాని, కొయ్యతో గాని, చేయబడి, లోపల డొల్లయై, అంతరాళమున ఇనుప గుండు ధ్వనించుటకై గూర్చబడి యుండవలెను. ఆ చెండ్లు ఎగురవేయబడినప్పుడు ఆకాశమును సరోవరమువందలి మీనాబ్జములు సంకలన మొనర్చు రీతి చలించుచుండును. అట్లు ఎగురు కందుకముల లోలాక్షులువీక్షించుచు చారులతో, గతులతో, లలితములగు లాస్యాంగములతో నృత్యమొనర్చెదరు.

ఉల్లలత్కందుక ప్రాప్తి
యావల్లోలాక్షి లీలయా।
రచయంత్యా వివాకాశం
సరో మీనాబ్జ సంకులం॥

నట్లని, నజ్జనుని గూర్చి చెప్పెను.

శ్రీనాథుడు III —95 (శృ. నై) 'కాంచనపు బంతి' యని ప్రయోగించెను. రాజభవనమున కాంచనముతో చేసిన చెండ్లుండుట సామాన్యము. కాంచన మను పువ్వనియు, అట్టి పూలతో బంతిని చేసి, నలునంతటివాని భుజదండమున వేయ ఆ పూలు భగ్నము లగును. బంతికి కాంచనపు రక్షణ కల్గి అంతరాళము శూన్యముగ నుండుటచే నీల నీరజవిభేక్షణ విసరుచే ఆ బంతి మిట్టి బిట్టు రవడికొనెను—ఇందు అదృశ్యుడగు నలుని స్కంధయష్టి బలిష్టతను తెలుపుచున్నది. కాని 'వీటి' యను బంతి కాదనియు, దారు నిర్మితమైన, చిల్లగోడని అర్థనిర్ణయమైనది. జాయప సేన వర్ణితములైన కందుకములు లోన డొల్లలై, అభ్యంతరములందు ఇనుపగుండు కల్గి వందున పైన ఎగురునప్పుడు ధ్వనించుటకు వీలుగా నుండును. ఈ ధ్వని ఎగురవేసిన విసరునుబట్టి బంతి అంతరాళమున చలించునప్పుడు, వివిధ రీతుల గుండ్రముగా తిరుగునప్పుడు లోని ఇనుపగుండు మనోహరముగ శబ్దము చేయును.

"హేమ్నా రూప్యేణ కాంస్యేన రచితాం దారుణాథవా।
అంతశ్చల దయోగోళ నిస్వాన ముఖరీకృతా॥

యామినీ పూర్ణ తిలకా విలాసము : చళ్లపిళ్ల నరసకవి :

రగడ : బంతి బంతులు సాగి పువ్వులబంతి బంతుల తరమి రువ్వుచు
చెండ్లను రువ్వుచుండగా, అవి నేరుగా, (బంతులు సాగి) పోవును

ఆ బంతిపై తారా చిత్రముల రంగుపూత లుండెను.

శ్రీనాథుని కాశీఖండమున : VI ప. 161.

ఒక్కనాడు భవాని యుబుసుపోకకుఁ బైఁడి జలపోసనము కసీసంపుఁ బట్టు
బంతిఁ గుట్టిమ భూమి బాణి పల్లవమున నాస్ఫాలనము చేయు చాడుచుండ.

పైడి జలపోసనము కసీనంపుఁ బట్టు బంతి :
వల్లని చెండుపై హేమపు పూతపూసినట్టి బంతితో..

శ్రీనాథుని శృంగారనైషధమందలి కాంచనపు బంతి, సంపెంగ పూలచెండు గాక, రువ్విన పైకెగరగల్గిన బంగారు పూత గల్గిన కందుకమే.

1255 ఏ. డి. నాటికే జాయసేనాని కందుక నిర్మాణము గూర్చి విపులీకరించెను.

కోలాటము

జాహాళముల, వ్రాగ్గ, పటహముఁ, కాంస్య తాళముల, మర్దళముల, జయగంటల, భేరి, తంపటముల, వాద్య శబ్దముల ప్రయోగ, అంచితాది కరణముఁతో, చిత్రముఁలగు గమనములతో, ఎత్తయిన గడపై యతి దుష్కరములగు భ్రమణములను చేయుచు, ప్రాణ సందేహకరములగు శస్త్రధారాగ్ర నర్తనము చేయుటయు, మెత్తని శరీరముతో మనుష్య దుర్వహములగు భారముల వహించి, పైకి పక్షులవలె ఎగురుట, శస్త్ర చాలనము చేయుట ఈ నృత్య విశేషములు.

సంగీత రత్నాకరము : VII 1330.

భారస్య భూయసో వోఢో ప్రౌఢో భ్రమరికాదిషు।
రజ్జు సంచార చతురశ్ఛురికా నర్తనే కృతీ॥
శస్త్ర సంకట సంపాతపటః కోల్హాటి కోమతః।

సారఙ్గదేవుడు రజ్జు సంచారమును, ఛురిక ప్రహార నృత్యమును, క్రింద పాతరలో నుంచిన శస్త్ర సంకటములపై పతన మగుటయు వర్ణించెను. కాని జాయసేనాని :

ప్రాంశోరు పరివంశస్య భ్రమరై రతిదుష్కరైః।
ప్రాణ సందేహ కరణైః శ్శస్త్ర ధారాగ్రనర్తనైః(?)॥
మనుష్య దుర్వహైర్భారై రుమ్మద్వంగ పరివర్తనైః।
ఉచ్చైః ఖగ వదుస్వి (?) నైః శస్త్రాణాం చాలనాదిభిః॥

అనియే చెప్పెను.

పై చెప్పిన దేశియ నృత్యమందలి పేరణి గూర్చి శ్రీనాథుడు శ్రీ కాశీఖండమున పేర్కొనెను. పేజి. 229. ప. 296

సీ. చాముండి యొనరించు జంపె తాళమునకు
భృంగీశ్వరుడాడెఁబేరణంబు.

శ్రీనాథుని పై కావ్యమున : పే. 373—ప : 169. వ:

కాశికానగరంబు వేశ్య వాటికలోన గర్పూర తిలకనా
గణిక యొకతె

యునవు సాయకుని యాతివ పుష్పబాణంబు లల్లెళు
వాస్థాన రంగభూమిం
గుండలీ నృత్తంబు గోపా లాద్యాచార్య మతభేదముల
దేశిమార్గ సరణి.

ఇందలి కుండలీ (గుండలీ) నృత్తమును గూర్చి సంగీత రత్నాకరమున గౌండలీ విధియని సుదీర్ఘ వర్ణనము కలదు. VII—1273—1301. ఇది కర్ణాటక దేశ సంప్రదాయ మని చెప్పబడినది.

కాని ఈ నృత్యమును గౌండిసీయని జాయసేనాని వచించెను.

కళ్యాణ కటకే పూర్వం
భూత మాతృ మహోత్సవే ।
సోమేశః కౌతుకీ కాంశ్చిత్
భిల్లీ వేష ముపేయుషీమ్॥
నృత్యంతీ మథగాయంతీం
స్వయం ప్రేక్ష్య మనోహరం (మనోరమ)
ప్రీతో నిర్మిత వాంశ్చిత్రే
త్తేగౌండిని విధ మిత్యయమ్॥
స్వతోభిల్లీ మహారాష్ట్రే
గౌండిసీ త్యభిదీయతే ।

పూర్వము కళ్యాణ కటకమున భూత మాతృ దేవతల ఉత్సవమున కౌతుకముతో సోమేశుడు భిల్లీ వేషమును దాల్చి, నృత్యము గానము చేయుచుండ ఒకానొక కాంతను తాను చూచి, చిత్తమునందు నిర్మించుకొనెను. అందుచే ఈ నృత్యము గౌండిసీయని పేర్గాంచెను.

మహారాష్ట్రమున భిల్లస్త్రీని గోండిసీయని పిలుతురు. ఆమె చేయు నృత్యమే గౌండిని యైనది.

శ్రీనాథుని కుండలి (గుండలీ) సారజ్ఞని గౌండలి విధి, జాయసేనాని గౌండిసీ గూర్చి పరిశీలనము చేయదగి యున్నది.

శ్రీనాథ సమేత కవిత్రయము రచించిన వీరగాథ 'పల్నాటి వీర చరిత్ర' 1 అందు పే. 17 — 19 వరకు, 2 పే. 319న గల 72 పంక్తులలో మార్గదేశీ నృత్య ప్రయోగ ప్రదర్శనము ముచ్చటగ వర్ణింపబడినది. స్థలము: మాచెర్ల చెన్నకేశ్వర దేవకులమందలి రంగ మండపము. సభాపతి: నల కామవిభుడు. నర్తకి: కంజలోచన. ఆమె మదన పట్టపుదంతి, మంజులవాణి. ఈమె ఆడిన ఆట ఆసాంతముగ దివ్యదాయుతమగు గేయమున, ప్రదర్శనము నేత్రానురంజకముగనే వర్ణింపబడినది. ఈ ప్రదర్శనము 1178 ఏ. డి. ముందు జరిగినది. ఆనాటికి సారఙ్గదేవుడు, జాయ సేనాని తమ తమ గ్రంథముల వ్రాయలేదు. ఈ భూమిపై అవతరించనులేదు. ఆనాటికే నృత్య సంప్రదాయము ప్రథఃపోషణ కాలమాలమై ప్రజాదరణ పొందినట్లే శ్రీనాథుడు వర్ణించెను. ప్రేరణి, ప్రేంఖణి, శుద్ధ దండిక, కుండలి తదితరములగు నృత్యములు ప్రయోగార్హములుగా యున్నట్లు తెలియుచున్నది. (ఈ 72 పంక్తులు టీకార్థ వ్యాఖ్యానములచే వివరింపవలసి యున్నది.)

'కుండలీ' నృత్యము వేరై యున్నట్లు జాయసేనాని వచించెను. పేరణీ లేక ప్రేరణి 13 వ శతాబ్దికి పూర్వమున్నట్లు తేటతెల్లము. తరువాత కాలమునను గ్రంథములందు వీటినిగూర్చి కథన మున్నది. సంగీతార్ణవ చంద్రికయను గ్రంథము నుండి సంగ్రహముగా వ్రాసిన 3 నాట్య మనోరమయందు పేరణీత్యాది నృత్యములు వివరింపబడినవి. అముద్రితమైన 4 సంగీత నారాయణమను గ్రంథమున, 5 చతురదామోదరుడు వ్రాసిన సంగీత దర్పణమందున ఈ దేశీ నృత్యము వర్ణింపబడినది. అట్టి పేరణిగూర్చి జాయసేనాని విస్తరముగనే వర్ణించెను. కుండలీ నృత్యము, గౌండలీ వేరైనవని నృత్య రత్నావళియందున్నది. ఈ కుండలీ నృత్యమనునది, ఒకానొక 'కుండలి' యను నర్తకి అభినయించినందున, ఆ పేరు వచ్చినదట! ఆమె గౌరీదేవి శిష్యురాలట!

కుండలీ నామ మృద్వంగీ
సుభ్రూశ్రీమ్ దివ్యయోషితామ్
సంగతే కోమలే నృత్తం
శిక్షయా మాస పార్వతీ ।
తన్నృత్తం కుండలీ మాహు
తత్సంబంధాత్ పురాతనా॥

దీని వివరము లింకేమియు జాయనార్యు డివ్వలేదు.

పైన చెప్పిన చతుర దామోదర కృతమగు సంగీత దర్పణమున సప్తమాధ్యాయము నృత్య విషయ సంగ్రహము. ఇం దనేకము లగు దేశీ నృత్య విషయములున్నవి. ఈ కావ్యము 1570 A. D

---

1. ఉమాశేఖర పండితులు పరిష్కరించినది.
2. ఆచార్య పింగళివారు ఇటీవల పరిష్కరించినది.
3. ఒరిస్సా సాహిత్య అకాడమీ ప్రచురణ, 1959. గ్రంథకర్త రఘునాథరథ.
4. తాళపత్ర గ్రంథము. అసంపూర్ణము. లిపి: ఒరియా ఈ గ్రంథము శ్రీమాన్ యస్. శఠకోపన్‌గారు నా కొసంగిరి.
5. గుంటూరు మండల చెరుకూరు వాస్తవ్యుడు మొగలు చక్రవర్తి జహంగీరు ఆదరము పొందెను. (తదుపరి యే పండిత రాయలు దారాషుక్ యొక్క అభిమానపాత్రుడయ్యెను.) సంగీత దర్పణమును తంజాపురిసరస్వతీమహల్ వారు ప్రచురించిరి.

తరువాత వ్రాయబడినది. అప్పటికి ఈ దేశీ నృత్యములు విరివిగా పెరిగినవి. ఈ కవి సంగీత రత్నాకరమును పేర్కొనెను. కాని జాయసేనాని కృతియు లోకమున శార్ఙ్గదేవుని కృతితో విదితముగ నున్నట్లు ఒక వింతయగు సాక్ష్యము గ్రంథ నిబద్ధమై యున్నది.

కాటయ వేముడు 'మాళవిక' నాటకమునకు వ్యాఖ్యానము వ్రాయుచు, ప్రథమాంకమున ఇట్లు వివరించెను.

మాళ పుట్టము : I పేజీ 9.

గణదాసు :—ఇదానీ మేవ పంచాంగాది కాథయ ముప దిశ్య మయా విశ్రమ్య.........

ఇందుకు కాటయ వేముడు పై పంచాంగ యుక్తమగు నృత్యము నిట్లు వివరించెను.

"పంచాంగాని యస్య తత్తథోక్తమ్ ప్రేరణమిత్యర్థః
తస్యాభినయః ప్రయోగస్తమిదానీ మద్యైవోపదిశ్య
శిక్షయిత్వా
ప్రభాతం ప్రకస్తొ వాతో యస్మిన్దేశే సతథోక్తస్తమ్
ప్రేరణ మంగ పంచకయుక్తం సంగీత రత్నాకరే:

"నృత్తం యథా చ కైవారో మర్మరో జాగరం తథా।
గీతం చేతి సమాఖ్యాతం ప్రేరణస్యాంగ పంచకమ్॥

కాటయవేము డుదహరించిన శ్లోకము శారఙ్గదేవుని సంగీత రత్నాకరమునందలిదికాదు. ఈ శ్లోకార్థమే కొద్ది మార్పులో జాయసేనాని నృత్య రత్నావళి యందున్నది.

జాయసేనాని, నృ. ర:
ప్రేరణాంగాని పంచాస్యః నృత్తం కైవారఘర్ఘరౌ
వికటం గీత మిత్యేషాం క్రమాల్లక్ష్మ ప్రచక్ష్మహే॥

ఇందలి కైవారమను పదము జాయసేనాని, పేరణి వర్ణనమందలి పంచ అంగములలో నొక్కటి. నృత్యమున సభాపతిని స్తుతించు కలాపము కైవారము. ఈ పదము అసంస్కృతమైనను, నృత్య పరిభాషా పదమగుటచే, కావ్యకర్త దీనిని సంస్కృతీకరించెను. దేశీ నృత్య విభాగములన్నియు, దేశీయ పదముల (వాడుకలో నున్నమాటల) సంస్కృతముగా చేసియుండవలెను. కైవార పదమునకు జాయ సేనానియే గీర్వాణ పదములతో సమాన స్థాన మిచ్చినట్లున్నది.

సంగీత రత్నాకరమందు ప్రేరణాంగముఁగూర్చిన శ్లోకము సం: ర: VII—1303.

సభా జన మనోహారీ యో నృత్యతి సపేరణీ
ఘర్ఘరో, విషమం, భావాశ్రయశ్చ కవి చారకః
గీతం చేతి సమాచష్టే పంచాంగాని హరప్రియః॥
నందికేశ్వరుని భరతార్ణవమున: పే. 373. శ్లో. 733.

ఘర్ఘరో విషమం భావాశ్రయశ్చ కవి చారకః
గీతం చేతి సమాచష్టే పంచాంగాని హరప్రియః

కవిచారకమే కైవారము. ఈ భిన్నరూపము శబ్దోచ్చారణా స్ఖలనమా లేక వేరు వేరు భాషాపదములో తెలిసికొనవలయును. ఈ అయిదింటిలో మూడే ప్రయోగార్హమని కాటయవేముడు చెప్పెను:

ప్రథిస్తే త్వత్ప్రయోజ్యం స్యాత్కైవారంజాగరం వినా
జాగరమను పేరు పేరణ్యాంగమునకు నూతనమైనది. దీనినే జాయ సేనాని వికటమనెను. నందికేశ్వర శారఙ్గదేవుల, భావాశ్రయ మనిరి. ఘర్ఘరమే మర్మరము. శబ్దానుకరణ పదము.

2

నాట్యశాస్త్ర గ్రంథములందలి దేశీ నృత్యముల పరిశీలించిన వాటి పరిణామము తేటపడగలదు. వీటి సంప్రదాయము భరతుని శాస్త్రమునకన్న ప్రాచీనమైనది. భరతుడు తన నా.శా. మున 6,14 అధ్యాయములలో 'ప్రవృత్తి' యను శీర్షికతో ఈ క్రింది విధముగా చెప్పెను. VI-27—28.

అవంతీ దాక్షిణాత్యాచ తథా చైవార్ధ మాగధీ
పాంచాల మధ్యమాచేత్ విజ్ఞేయాస్తు ప్రవృత్తయః

ఇందు నాలుగు ప్రాంతీయములుగా చెప్పబడినవి. ఆ యా ప్రాంతీయ వేష, భాష, ఆచార, వ్యవహారాది జీవిత గుణాది విశేషముల గ్రహించి నాల్గు విభాగములుగా వర్ణింపబడినవి.

ప్రవృత్తి:

పృథివ్యాం నానాదేశ వేష భాషాచారా వార్తాః ఖ్యాపయతీతివృత్తిః ప్రవృత్తిశ్చ నివేదనే।

అట్లైన నాలుగేనా విభాగములని పూర్వ పక్షము. అందులకు సమాధానము.

సమాన లక్షణశ్చాసౌ ప్రయోగః ఉచ్యతే తత్తుసత్యం,
ఆసాం సమాన లక్షణ ప్రయోగః। కింతు నానాదేశ వేష
భాషా చారో లోక ఇతి కృత్వా లోకానుమతేన వృత్తి
సంశ్రితస్య నాట్య సమయా చతుర్విధత్వ మభిహితం
భారత్యా రభటీ సాత్వతీ కైశికీ చేతు।
వృత్తి సంశ్రితైశ్చ ప్రయోగై రభి హితా దేశాః
యతః ప్రవృత్తి చతుష్టయమభి నిర్వృత్తం ప్రయోగ
శ్చోత్పాదితః

తత్ర దక్షిణాస్త్య స్తావద్బహు నృత్త గీత వాద్యాః
కైశికీ ప్రాయాః చతుర మధుర లలితాంగాభినయాశ్చ
దాక్షిణాత్య ప్రవృత్తి మృదులాలిత్య సుగమ, శృంగార
ముల కాటపట్లు. కైశికీ వృత్తి సంకలితము. కోసల, తోసల, కళింగ,, యవన, ఖస, ద్రావిడ, ఆంధ్ర, మహారాష్ట్ర, వైణ్ణా,

వనవాసిక యనునవి రాష్ట్ర విభాగములు. వింధ్యశ్రేణికి దక్షిణము, దక్షిణ సముద్రమున కుత్తర దేశము దక్షిణ దేశమని నిర్ణయము. ఆయా దేశభాగములందు వృద్ధిచెంది ప్రయోగించిన నృత్య భంగులకే దేశీయను నామాంతరము కల్గెను.

3

నాట్యశాస్త్ర పరిభాష సాహిత్య పరమైనది తెలిసికొనిన, ఈ కళాప్రాశస్త్యము, సర్వ జనీయత తెల్లమగును.

6 నన్నయ భట్టారకుడు, ఆది. 5.

కురు పాండవ కుమారులు ఆడుకొను చెండు (వీటా)—లోహపు బంతి నూతిలో పడినది. అద్దాని ద్రోణాచార్యుడు,

"ద్రోణు డొక్క బాణం బభి మంత్రించి దృష్టి
ముష్టి సౌష్ఠవం బొప్ప."

ఇందు ముష్టి యనగా ధనుస్సును దృఢముగా ముష్టితో పట్టుకొనుట. హస్తాధ్యాయమున గట్టిగా పట్టుకొనటుకు 'ముష్టి' యను అసంయుత హస్తము ప్రయోగార్హము.

జయదేవుని ప్రసన్న రాఘవ నాటకమున I—55

పశ్య పశ్య సుభటైః స్ఫుటభావం
భక్తిరేవ గమితా నతుశక్తిః
అంజలి ర్విరచితో నతుముష్టి
ర్మౌలి రేవ నమితో నతు చాపః

సీతా స్వయంవరమునకు వచ్చిన రాజ నామమాత్రులు, హరవిల్లును ముష్టిచే గ్రహింపజాలక, శక్తిహీనులుగ నుండిరి. వారు ఆచాపముందు మంజూషను భక్తితో సమీపించిరి. ఎట్లు? వారు అంజలి బద్ధులై ఆ చేతులను మౌళియందు చేర్చి, నమస్కరించిరి. ధనుస్సును వంచలేకపోయిరి. 'అంజలి' యనునది సంయుత హస్తము. ఇయ్యది శిరస్సున చేర్చిన దేవతలకు నమస్కరించుట యందు సూచింపబడును. నర్తకి సామాన్యముగా అంజలిపట్టి రంగముపై ప్రథమమున ప్రవేశించును. ఈ రాజవరులు మౌళియందు అంజలి నుంచుటచే, వారి స్త్రైణ గౌణగుణము. వ్యక్తమైనది.

ఈ శ్లోకమును బొడ్డుచెర్ల చిన తిమ్మన 'ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధమందు ఇట్లు తెనిగించెను 7 1—206

ఉ. భావము పల్లవింపఁగడు భక్తియు చూపిరి శక్తిలేదు సం
భావన జేసి రజ్జులు పాణిఘటింపరుముష్టిముద్రయు
స్సీ వదనంబు పంచిరిదె సిగ్గరి భర్గుని విల్లువంపరీ'
భూవర సూనులెల్ల మగపుట్టువఁ బుట్టరె పోల్ర
ముట్టరే! 8

ఈ పద్యమందు 'సిగ్గు' 'మగపుట్టువు' యను పద ప్రయోగములు ఆడువారి పరమైనవే. మూలమందలి 'అంజలి ప్రయోగ ముఖ్యార్థమును తెనుగు నుడికారమున కవిప్రయోగించెను.

యోగ వాసిష్ఠమున I—22—33.

దండ తృతీయ పాదేన ప్రస్ఖలంతీ ముహుర్ముహుః
కాసాశ్వాయు మురజా జరాయోషిత్ ప్రనృత్యతి॥

ఇందు దండ మనునది సంగీత విశేషము. జరాయోషిత 'దండ'ము నాశ్రయించి, పడుచు, లేచుచు నృత్య మొనరించును. ఈ ఆటకు మార్దంగిక శబ్దము కాసశ్వాసాదులు.

I—525—4.

యదిదం దృశ్యతే కించిజ్జగదా భోగి మండలమ్
తత్తస్య నర్త నాగార విహారావతి నృత్యతి.

---

6. పూర్వపు వివరణమున వీటాయన బంతి కాదనియు, నన్నయ కొయ్య ముక్కనే బంతిగా వర్ణించెనను స్ఫురణకు తావున్నది. వ్యాసుని ప్రయోగము వీటా (**Monier Williams**) యనగా లోహపు బంతి యను అర్థమున్నట్లు తెలిపెను. సంస్కృత భారతము 15—28—18 న హఠయోగ మొనరించు విదురుడు జటియై, నోట వీటనుంచికొని నట్లున్నది. రెండర్థములు భారతముననే కలవు.

7. ఆంధ్ర రచయితల సంఘమువారు శ్రీ డా. బి. రామరాజుగారిచే పరిష్కరించి ప్రచురించిరి.

8. ప్రోలు వైవాహిక కలాపములందు చేయు నాక మంగళ ప్రదమగు క్రియ.

కపర్ద కారికలలో "ఆంధ్ర, కర్ణాటక మహారాష్ట్రనామేవ కేవలం" ఇందు వివాహమైన పిదప, చిట్ట చివ్వరిరోజు నాకబలియును, మంగళప్రదమగు కలాపము కలదు. ఇవి ఆపస్తంభుడు చెప్పనివి. ఇవి భిన్నములైనను కపర్ది మతానుసారముగ ఈ నాకబలి ఆంధ్రులు చేయుట కలదు.

"వివాహవ్రతే పూర్ణే శ్వశురగృహే,స్వగృహేవా అభుద్య
స్నాత్వా రాత్రౌ నాకబలిం కుర్యాత్!
గృహమధ్యే విస్తీర్ణ భూమౌ అష్టదశ సంఖ్యాక
రేఖాఽస్తీర్య తిర్యకూర్ధ్వంచ ఆలిఖ్య తత్పరితః
ఏ కోన పంచాశత్ కోష్ఠానాం మధ్యేచతుర్థి క్ష్ణకోణే
షుషట్కోష్ఠానో యథాక్రమం బాహ్యతః పరివృజ్య
త్రయోదశ మార్జయేత్ ......

ఇట్లు గీసిన రంగవల్లికి (ముగ్గుతో రేఖలు గీయుట) ప్రోలు అని తెనుగు దేశీయ వైవాహిక కార్యకలాపము.

ఈ విషయము బ్రహ్మశ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి? మన్నారు కృష యయ్యగారు తెల్పిరి.

ప్రోలు:—"వివాహ కలాపములందు పునీతముగా ఏర్పరచ బడిన స్తంభములు."

Moore Indian Appeals III p 359.
(362, 371)

జగన్మండపమే పశుపతికి. కాలుడే నర్తకుడు. నిరంతర నృత్యమే అతని చేష్ట.

I—25—5.

తృతీయంచ కృతాంతేతి నానుబిభ్రత్ సుదారుణామ్
కాపాలిక వపుర్మత్తం దైవం జగతి నృత్యతి.

దైవము కాపాలికాహార్యాదిక వేషమున నృత్యము చేయుచున్నాడు.

నాట్య పరిభాషను ఉపమాలంకారములకు ఉపయోగ పరచుట, సాహిత్యమందు నిరివిగా చూడనచ్చును.

4

జాయసేనాని సప్తమాధ్యాయ ఉత్తర భాగమున నర్తకుని, నర్తకీ లక్షణములగూర్చి వివరించెను. నర్తకుని సర్వ గుణ సంపదల వర్ణించి, ఇతడు నూతన నృత్య సృష్టి చేయగల సమర్థుడుగా నుండవలెనని చెప్పెను. చెంతనుండి నృత్యము ననుసరించుచు, "నర్తకీ మనసా సార్థ మేకీభావ మిహాగత:" ప్రావీణ్యము కల్గియుండవలెను. అట్లే నర్తకీ లక్షణము లును చెప్పబడినవి. అంతఃపుర పురంధ్రులకు, రాజభవన మందలి భర్తృదారికలకు నాట్య విద్య నేర్పుటకై నర్తకియు నర్తకుని గుణ సంపదయే కల్గియుండవలెను.

తరువాత ముఖరీ, ప్రతి ముఖరీ, వాదబృందము, స్వర రీతి, ముఖ్య గాయకుని, గాయనీ బృందము, సభాపతి, సభ్యుల గూర్చి వర్ణించెను.

ముఖరీ:—పాటలు పాడునప్పుడు తాళధ్వనులను స—మాన ముగా నడుపగల శక్తి సంపన్నుడు. మార్దంగ మార్జన విధుల నెరింగిన శబ్దవేది. వాద్యశ్రుతిజ్ఞతను తెలిసినవాడు. ఇతనియందు ముఖ్యగుణమేమనగా ఛిద్రావరణనైపుణ్యము, **(Covering the loop holes and pit falls during performance)** ప్రయోగమున యనివార్యముగా సంభవించు అకార్యముల సమర్థించగల శక్తిమంతుడుగ నుండుట. ఇతనికి శబ్ద సౌష్ఠవము, గాత్ర స్వరానుగామిత్వము, ప్రస్థానోచిత కైవారత్వము, మార్దంగ చర్మలగ్న హస్తత్వము కల్గియుండవలెను.

ప్రతిముఖరియు ముఖరికి తోడుగా నుండవలయును. (ఇందుమూలము సరిగాలేదు.)

వాత బృంద గణము: వాద్యకారుడు వాద్యములను ప్రయోగమునకై సిద్ధపరచుట. ఇతను శ్రుతి జ్ఞాన పరత్వము, వాద్య గ్రహ మోక్షణములు, తాళయుక్తముగా నెరింగియుండవలెను. ఎదుటి వాద్యగాని ముఖమందు వ్యక్తమగు భావముల నెరింగి, తాను సహాయముగ వాద్యముల ధ్వనింప చేయవలయును.

స్వరరీతి: బృంద మేళవ చాతుర్యము. రసికత, అనురంజనము గమకములందు ప్రావీణ్యము కల్గియుండవలెను. ధ్వనులను గంభీరముగా,మధురముగా, స్నిగ్ధముగా పటుత్వముతో వాయించవలయును. వివిధాలాప నైపుణ్యముకల్గి యుండవలయును.

ముఖ్య గాయకుడు శుద్ధ సాళగ రాగములందు భాషాంగముల యెడ వాద్య గ్రహ మోక్షములందు, దక్షత, ధీరత, నిర్దుష్టత, సర్వ రీతులందు నైదగ్ధ్యము కల్గియుండవలెను.

కామినుల అంగములు మిక్కిలి కోమలములు, మధురము అగుటచే, గాయకులు కన్యలకు సంగీతము ఉపదేశింపవలయును.

గాయనీబృందము సమాన స్వరములతో, స్థానత్రయ గమక చాతుర్యముతో, హెచ్చు తగ్గులులేక ఏకాగ్రతతో గానము చేయవలయును.

నర్తకీ బృందము :

బృందం నారీ మయం సర్వం
అనికార్యం విలాసినా
ద్రష్టుం కౌతుకినాం నృత్తం
శుద్ధాన్తస్త్రీ జనై సహ
రాజ్ఞాం విద్యావతాం । చాగ్రే
వైభవం ఖ్యాపనాయచ॥

శుద్ధాంత స్త్రీలతో కలసి, నృత్య ప్రదర్శనమును చూడగోరిన రాజులయొక్కయు, విద్యావంతుల సమక్షమున తన వైభవమును ప్రదర్శించుట కొరకు విలాసియగు నతడు తన బృందమును నారీమయ మొనర్పవలెను.

పాత్ర భూయిష్ఠమయిన బృందములు అయిదు విధములుగ విభజింపబడినవి.

84 గురువున్న ఉత్తమోత్తమ రంగ స్థలమునకు మితి మీరిన సంఖ్య యగుటచే ఆట పాటలు, రాజోత్సవములలో బహిరంగ ప్రదేశముల, రాజవీధులలో ప్రయోగింపదగును.

32 గురువున్న మధ్యమము· 24 గురువున్న అవర (అపర!)ము. 16 గురువున్న కనిష్ఠము.

ఈ పాత్రము లెవ్వరన, ముఖరీ, ప్రతిముఖరీ, అనుచారకులు, హుడుక్కి వాయించువాడు, దేశీ పాటలపాడు వతడు కాంస్య తాళముల ప్రయోగించు నతడు, ఓతకారులు, శంఖముల పూరించువారు, కాహళముల వాయించువారు, ముఖ్య గాయక గాయనులు, కరటపాదకులు, వాంశికా వాదకులు.

తరువాత సభాపతి, సభ్యుల గుణముల పేర్కొని సప్తమాధ్యాయమును జాయసేనాని ముగించెను.

అష్టమాధ్యాయము—

నృత్యరత్నావళి ఈ అధ్యాయముతో సంపూర్ణమగుచున్నది. ఇందు నృత్య మండపమునకు రాజు వెడలుట, నర్తకాది బృందము నేపథ్యాదిక రచన మొనరించుకొనుట, నాట్య మండపమున ప్రభువు సభాపతియై, సింహాసనాధిష్ఠుడగుట, పరివారము వారి వారి స్థానాసీనులగుట, ఇత్యాది విషయముల

చక్కగా వర్ణింపబడినవి. జాయసేనాపతి స్వానుభవముతో వీక్షించిన విషయములే వర్ణించినట్లున్నది. ఈ భాగ వర్ణనము ఇతర నాట్య గ్రంథములందు లేకపోవచ్చును.

రాజు వెడలుట :

ప్రభువు సాయం సమయమున నృత్య సందర్శనోత్సుకుడై, మనోహరము, ఏకాంతము, చిత్రశోభితమగు నేపథ్య భవనమున **(Tailette & Dreesing parlour)** కర్పూర, అగరు, కస్తూరి, కాశ్మీర (కుంకుమపువ్వు) పన్నీరుతో కూడిన శ్రేష్ఠమగు చందనలిప్తుడై, మల్లికా, కేతకీ, జాతి, చంపకాది పూలమాలల శిరస్సున దాల్చినవాడై, శరచ్చంద్రికా కాంతిహారులగు చీనాంబరముల ధరించినవాడై, మకుటాది పాదాంగుళులవరకు భూషణధారియై యుండగా:—

మంగళైరివ సోత్కంఠైః
కామినీ రూపధారిభిః
శంభోరివ పరాన్ (?) ప్రాప్తైః
అణిమాద్యధి దైవతైః

ఉత్సాహముతో కామినీ రూపము ధరించిన మంగళ దేవతలవలెను, శివానుగ్రహమున సిద్ధములైన అణిమాదుల అధిదైవతములవలెను, ఒప్పుచున్న తరుణీజనము, దృష్టి దోషముల హరించుకొరకై, జ్వలత్కర్పూర దీపములుగల బంగారు పళ్లెరములు రెండు చేతులతో సవిలాసముగా గ్రహించి, కోకిలల వలె పంచమ స్వరమున గానమొనర్చుచు;

(శుద్ధాం గీతి మివ ప్రేక్ష్యం
కుర్వద్భిర్ధ్వాంత కాంతిభిః)

తమ కాంతులచే, తాము గానముచేయు గీతికలను దృశ్యములుగా నొనర్చుచు, నానాతోద్యధ్వనులతో కోమలములగు నృత్యమును చేయుచు, నరపతికి హారతి నీయవలెను.

అంతట రాజేంద్రుడు ప్రహృష్టుడై నర్మసచివులతో సభను ప్రవేశించి, ఆ నృత్య మండపమున;

రత్న సానుతలోత్తుంగ
కల్ప శాఖీవ భూపతిః
సింహాసన మధిష్ఠాయ
నిషీదేత్ విశ్రుతవ్రతః(?)

రత్న సానువులందు (మేరువునందు) కల్పవృక్షమువలె సింహాసనము నధిష్ఠించవలెను. వెనుక బంగారు కల్పవృక్ష ప్రతిమ యుండవలెను. చుట్టును పరివారము కూర్చొనవలెను. స్వర్ణపేటికలో తాంబూలాది వాసన ద్రవ్యముల చేతబూని, చామర గ్రాహిణుల చెంతనే యౌవ్వనవతులుండవలెను.

దివిటీం చేగొని భటులు నిలచియుండవలెను. పూర్వరంగ పూజాదిక కార్యము ముందుదినమే జరపియుండవలెను. ఇంతలో ప్రధాన నర్తకి తన పాత్ర పరివారము, రాజభవనమున నేపథ్య రచనము పూర్తి చేసికొని, సజ్జీభూతులై రంగభూమిపై ప్రవేశింపవలెను.

తరువాత వాద్యముం క్రమముగా ధ్వనింపచేయవలెను. ఈ ధ్వని సుధాధారేణ శింజితముగా నుండవలెను. ఇయ్యది గీత నృత్య విహీనమగుటచే శుష్క వాద్యమని పిలువబడును. **(Back ground music).** ప్రదర్శనమైన పిదప, నటులు కోరిన సువర్ణాభరణాంబరముల వారికి ప్రభువు పారితోషకములుగా నొసంగును. ఈ కావ్య గ్రంథము గూర్చి జాయసేనాని రచించిన చరమశ్లోకము:—

సూచీ ముఖగతి స్యూత
గుణా శిఖర శోభినీ
జాయ సేనాధి నాథేన
నృత్త రత్నావళీ కృతా॥

ఈ 'రత్నావళి' సూచీముఖ (సూదిమొన) గమనమును బట్టి గ్రుచ్చబడిన గుణము (సూత్రము) కలిగి, రత్నములపై భాగములు, కాంతియుతమై యున్నవి. జాయసేనాధినాథునిచే ఈ నృత్య రత్నావళి రచింపబడినది.

ఈ వ్యాస రచన:—

సవిద్యాదర్పతో గ్రన్థ ప్రవృత్తిర్మమ కింత్విదమ్।
విద్వన్మానస వాసాయ గన్తుం పాథేయ మాస్థితమ్॥

సం. ర. VII—1678

[సమాప్తము]

ఉ. నోచిన తల్లిదండ్రికి తనూభవుఁ డొక్కఁడె చాలు మేటి, చే
సాచనివాఁడు, నర్థులకు చాచిన లేదన కిచ్చువాడు, నో
రాచి నిజంబకాని పలుకాడని వాఁడు, రణంబులోన మే
దాచని వాఁడు భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ.

ఎందుకీ జన్మ

శ్రీ అద్దేపల్లి రామమోహనరావు

భగవంతుడు జగత్తనే తన భోగ మందిరంలో
అంటించుకొన్న అగరువత్తి యీ జీవితం
తెల్లని నల్లని అనుభూతుల పొగలతో
క్రమ క్రమంగా కాలిపోతున్నది...

కళ కళకోసమే అన్నట్లుగా
జీవితం జీవితంకోసమే
అనుభూతి అనుభూతికోసమే
అన్నాడొక రసిక రాజశేఖరుడు!

ప్రకృతిదేవి శిరస్సుపై దట్టంగా, అందంగా
మెలిసిపోయే నల్లని మాయావేణికతో
దెబ్బతిని పులకించడమే బ్రతుకు రహస్యం
అన్నాడొక ప్రకృత్యుపాసక చూడామణి!

ప్రభాతంలో పదిదిశల్లో పేరుకొని
రోజు ముందుకు దొర్లుతూ ఉండగా
కరిగిపోయి కంటికి కానరాకుండా
మాయమయ్యే మంచువంటిదా జీవితం?

తనదంటూ తన తర్వాత లేదా ఈబతుక్కి?
తనచివరతానే నిలబడిందా ఈ జీవితం?
అనుభవాల జలపాతంపడుతూ పడుతూ
జీవితపు పర్వతాన్ని తాకకుండా పోవడంలేదు—
ఆకొండని ఒరుసుకొని ఒరుసుకొని
నిగ నిగ లాడిస్తోంది
క్రొత్తవెలుగు తెస్తోంది.

ఆ జలపాతం గ్రీష్మంతో' ఎండిపోతుంది
ఈ నిగనిగల కొండ తన కాంతి చుట్టూ చిమ్ముతూ
అట్లాగే నిలబడుతోంది.

మనిషి కనబడకుండా పోగానే
జీవితం కనుమఱుగు కావడంలేదు-
మిగిలిన మనుష్యుల మనసులలో
జీవిస్తూనే ఉంటుంది!

బ్రతుకు టిసుక బాటమీద
అనుభవాలబండి దొర్లి కనుమఱుగైనా,
ఆబండి చక్రాలు గీసినగీతలు
అందరికీ అట్లాగే కనబడుతూఉంటాయి.

వాటిని ఆధారంచేసుకుని నడిచే
బాటసారులకోసమై బండి
నడవాలి సబబైనమార్గాన
నడపనివాఁడు మోసం చేస్తున్నాడు జగత్తుని!

కళ కళ కోసంకాదు
కళ హృదయంకోసం!
జీవితం జీవితంకోసం కాదు
ఇతర జీవితాల కోసం!

స్త్రీ వర్ణన

మ. గతులింపారఁగ భారతరాష్ట్రి గరిమన్ గాంగేయ కుంభోద్భవ
ప్రతిభన్ సిబ్బెపు గబ్బిగుబ్బ లమరన్ బల్కున్న లాకర్ణరం
జిత లీలం దగనర్జున ద్యుతులచేఁ జెన్నారు లేనవ్వు భా
రతముం బోలి వధూవతం సము జగత్ప్రఖ్యాతమై మించఁగన్.

తెంటూరి రంగరాజు—భానుమతీ పరిణయము.

తిక్కన తెనుఁగుం తెన్నులు
ప్రయోగ విశేషములు

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

కవిబ్రహ్మ తిక్కన వాడిన తెనుగు పలుకుబడులును, వాటి యర్థములును అనేక మీనాడు ప్రచారములో లేవు. అందువలన ఆయన పద్యములు, చప్పున అర్థము కావు. అనువాదము స్వతంత్ర మగుటచేత మూల మెక్కడనో గాని, సర్వత్ర సహాయపడదు. అది యట్లుండగా ఆ మహాకవి ప్రయోగ విన్యాసము సర్వకవి సాధారణమైనది కాదు, అదియొక విశిష్ట ఫక్కి. అన్వయములు చాలవరకు సంస్కృత సరణిలోనుండును. ఆ కారణమున, ఆ యుభయ కవిమిత్రుని రచనలలోని అర్థ సారస్యాదులు, అటు సంస్కృత సాహిత్యముతోను—ఇటు తెనుగు సంప్రదాయములతోను పరిచయ మున్నవారికే గాని, అచ్చము సంస్కృతము, అచ్చము తెనుగు చదువుకొన్నవారికి అంతు పట్టవు.

మరియు తిక్కన, నన్నయ ప్రయోగములను పుణికి పుచ్చుకొని, అందందు పొందుపరుచుచుండును. భట్టారకుని భారత భాగములను పఠించియుండని వారికి ఆ ప్రయోగముల రహస్య మవగతము కాదు.

ఈ యంశములకు తార్కాణములైన పట్టులను కొన్నింటిని నే నీ వ్యాసమున చూపెట్టుచున్నాను. తిక్కన తెనిగింపు తీ రెట్టిదో తెలియుటకు, ఎడనెడ మూలమును గూడ నుదాహరింతును. భాషారాధన ప్రియులగు పిన్నవారికి తిక్కన కవితాశిల్పమును పరిచయ మొనరించుట నా యీ జతనము యొక్క ఉద్దేశము.

1. 'అటు' — 'ఇటు'

అటు—ఇటు శబ్దములకు, అక్కడ—ఇక్కడ అనునవి సాధరణార్థములు.

"అటు యందు సాం ద్రతార్థమై విరాజిలుచుండు."

(ఆం. భా. 3—66)

పై రెండు శబ్దములును తిక్కన రచనలో విశేషార్థములలో ప్రయుక్తములై యున్నవి.

(1) 'మీ రెల్లరును ద మ్మెవ్వరైనను మన వార్త లడిగిరేని
ద్వైతవనంబున మమ్ము విడిచిపోయి రటు యెఱుంగ
మనంగలవారు." (విరా. 1—115)

అటు=తరువాత (అటుపిమ్మట), ఎఱుంగము=వారి సంగతి మాకు తెలియదు—అని యర్థము. (అటు ఇటులు నన్నయ రచనలలో కలవు. క్రమక్రమముగా ద్రుతాంతములుగా మారిపోయినవి.)

"సర్వై రపి వక్తవ్యం న ప్రాజ్ఞాయంత పాండవాః
గతా హ్యస్మా నపాకీర్య సర్వే ద్వైతవనా దితి." (4—5)

అని మూలము.

(2) "కొడుకులు సేయు భక్తి కటు కోటిమడుంగులు
భక్తి నాకు నె ప్పుడుం దగం జేయుచుండు"

(ఉద్యో. 3—187)

'అటు కోటిమడుంగులు=అంతకు కోటి రెట్లు'—అన్న మాట. కొడుకులుచేయు సేవకంటెను కోటిరెట్లుగా, నాకు భక్తి చేయుచుండును=నన్ను సేవించుచుండును — అని యర్థము.

భక్తి సేయు=సేవించు. (శబ్దపల్లవ క్రియ.)
మూలము:—"సర్వైః పుత్రైః ప్రియతరా ద్రౌపదీ మే జనార్దన" (89—44)

(3) "నా, రందరకును సేమం బటు
ముందర లేకున్న నేఁడు మొదలుగఁ గలుగున్"

(ఉద్యో. 1—283)

ఇటుముందర=ఇంతకుముందు.

(4) "వీని, నిం కిటు నెల సమయించువాఁడు
గాఁగఁ బూని పోయె" (ఉద్యో. 3—291)

(ఇంక + ఇటు) ఇంకిటు=ఇకమీఁద, నెల=నెలదినములకు, సమయించు వాఁడుగ=చంపువాఁడుగా (=చంపుదునని), పూని పోయెన్=ప్రతిజ్ఞచేసి పోయెను—అని యర్థము.

'ఇకమీద'—అనుటకు 'ఇంకిటు' అనుటయు, 'నెలకు —నెల దినములలో' అనుటకు 'నెల' అనుటయు, 'ప్రతిజ్ఞ చేసి పోయె' ననుటకు 'పూనిపోయె' ననుటయు ఈనాడు వాడుకలో లేవు.

'వెల' సప్తమ్యర్థమున ప్రథమ. 'వెలయందు' అని వ్యాకరణచేత్యా అర్థము. (కాలాధ్వములకుం బ్రాయికంబుగాఁ బ్రథమ యగు.—బాల. కారక. 25). 'నెలకు—నెల దినము లలో' అని వ్యవహారము.

మూ :—"పునరేవ చ తే నోక్తం వైనతేయేన గచ్ఛతా
మాసే నాన్యేన సుముఖం భక్షయిష్య ఇతి ప్రభో."
(103—16)

అటు—ఇటుల విశేషార్థములకు నన్నయ ప్రయోగములు—"పాండురాజు .... శత శృంగంబున నున్న యవసరంబున నట ముందర ధృతరాష్ట్రునకుం గాంధారి .... గర్భంబు దాల్చి"
(ఆది. 5—98)

"వినవయ్య నహుషుఁడన్ జనపతి నేను మీ
పూర్వజులకు నట పూర్వజుండ" (అరణ్య. 4—119)

'వెలన్'

"నీ వడిగిన పని యేర్పడఁ
గా విను మే నొక్క నెలఁ దెగం జేయుదు నా
నా విధ దివ్యాస్త్రంబుల
లావున నప్పాండవుల బలంబుల వెల్లన్."
(ఉద్యో. 4—411)

ఇక్కడ, 'ఒక్క వెలన్=ఒక వెలయందు' అని సప్తమియే వాడబడినది. 'ఒక్క వెలలో, తెగం జేయుదున్=నశింపజేయుదును'—అని యర్థము.

మూ :—"ముంచేయం యది వాప్రాణి
మహాంతి సమరే స్థితః
శతసాహస్రఘాతీని
హన్యాం మాసేన భారత." (194—14)

'వెలకు' అనుటయును కలదు. (కాల పరిమితియందు నామంబులకుఁ గువర్ణకంబగు. ప్రౌఢ. కారక. 14)

"రెన్నెలలకు—సుతషష్టి సహస్రక ముద్గతమై"
(అరణ్య. 3—57)

"అపూర్వ సభా భవనంబు .... పదునాలుగు నెలలు నిర్మించి" (సభా. 1—14)

ఇందు 'నెలలు' సప్తమ్యర్థమున ప్రథమ.

మూ :—"ఈదృశీం తాం సభాం కృత్వా
మాసైః పరిచతుర్దశైః." (3—38)

2. 'అయ్యది'

"మీర లిందులకు నిప్పుడు వచ్చినదానికిం గతం
బెయ్యది ? నాకు నంతయును నేర్పడఁగా నెఱిఁగింపుఁ
డున్నరూ పయ్యది" (విరా. 1—190)

'ఎఱిఁగింపుఁ డున్నరూ పయ్యది' అనగా, 'ఉన్న రూపు—ఎయ్యదియో అయ్యది యెఱిఁగింపుఁడు' అని యర్థము. కాని, ఆ యర్థమునకు 'అయ్యది' అనుసర్వనామముతో పనిలేదు. 'ఎఱిఁగింపుఁ డున్నరూపు' అనుటయే చాలును. అయినను, అట్లు ప్రయోగించుట అది యొక సంప్రదాయము. అంతే గాని 'అయ్యది' అను పదము ప్రాసబాధ తప్పించుకొనుటకు తెచ్చుకొన్నది కాదు. ఇందుకు నన్నయగారి యీ క్రింది ప్రయోగములు దృష్టాంతములు.

(1) "తనకు హస్తిపురం బది రాజధానిగాన్"
(ఆది. 5—6)

(2) "శిరము కొప్ప నర్చనలుసేసిన పువ్వుల యవ్విధంబునన్." (ఆది. 8—76)

(3) "అనిన మహేంద్రుమవాక్య మను నయ్యమృతమ్మును జేసి" (సభా. 1—28)

3. 'ఏది ప్రొద్దైనను'

"…. …. మత్ప్రియసుతుండు
పాల కేడ్చిన యపుడ చన్పట్టనిచ్చు
నేది ప్రొద్దైన నట్టిగో వెందుఁ గలదు ?"
(అను. 2—427)

ఏది ప్రొద్దైనను=ఏ సమయమునందైనను—(ఎప్పుడు పట్టితే అప్పుడు చన్ పట్టనిచ్చున్=పాలు పితుకనిచ్చును.

చనుపట్టు=పాలు పితుకు (శబ్ద పల్లవ క్రియ)

మూ :—"దేశకాలోప సంపన్నా దోగ్ధ్రీ క్షాంతాతి వత్సలా
స్వాదు క్షీరప్రదా ధన్యా మమ నిత్యం నివేశనే."
(70—15)

4. 'ఏది కారణమున'

"ఏది కారణమున నెవ్వ రిచ్చోట నీ
కేమికీ డొనర్చిరి ?" (విరా. 2—156)

ఏవి కారణమున=ఏ కారణమున.

ఇట్టి విశేషములు పరశ్శత మున్నవి. స్థలాభావముచే నాలుగు మాత్రమే యిందు చూపబడినవి.

జీవునివేదన

శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి

పూర్వము 7, 8 సంవత్సరముల క్రిందట జీవుని వేదన యన్న పేరుతో 'భారతి'యందు ఒకవ్యాసము వ్రాసితిని. తరువాత 'జయంతి' పత్రికలో ఈ విషయమును గురించి కొంత ప్రసంచించితిని.

జీవుని వేదన యన్న మాట చాలమంది నాకర్షించినట్లు కన్పించుచున్నది. కొంతమంది ప్రసిద్ధ రచయితలు కూడ ఈమాటను వాడుకొన్నారు. ఆ శీర్షికలతో పద్యములు వ్రాసిరి. కొంతమంది నే నుద్దేశించిన యభిప్రాయమును లెస్సగా గ్రహించిరి. కొంతమంది కొంత కొంతగా గ్రహించినట్లు కన్పించుచున్నది. కొంతమంది వెక్కిరించినవారు కూడ లేకపోలేదు. ఏమైనను ఈమాట, ఈ సిద్ధాంతము పలువురు సాహితీ ప్రియులను ఆకర్షించినదన్న మాట యదార్థము. జిజ్ఞాసువుల కుపకరించుననియు, సహృదయులకు మనఃప్రీతి కల్గించుననియు, ఈ విషయమును భాస కాళిదాస భవభూతుల నాటక శిల్పము నిమిత్తీకరించి మరికొంత ప్రసంచించుటకై యీ ప్రయత్నము.

ఈ జీవుని వేదన యన్న మాటకు ఒక ప్రత్యేకమైన యర్థము నే నుద్దేశించినాను. ఈ మాటను వాడిన కవి యొక్క యభిప్రాయము కూడ నదియే. యదభిముఖముగ నీ మాట నుపయోగించితినో, తదభిముఖముగనే యర్థము చేసికొనవలయునని పాఠకులకు మనవిచేయుచున్నాను. దాని యర్థమిది. లోకమునందు మనము బహ్వానుభవములను పొందుచున్నాము. ఈ యనుభవము లన్నియు జీవుని వేదనలు కావు. విషయేంద్రియ సన్నికర్షవలన మనస్సు పొందు అనుభూతులివి. ఈ లౌకికానుభూతులయందు జీవునకు ప్రత్యక్ష సంబంధము లేదు. వీనినుండి జీవుని వేదనను విడివరచుటకే ఆ మాటను వాడినది.

ఇంద్రియ ముఖమున జీవునకు బాహిర ప్రవృత్తి కల్గినప్పుడు పొందు ననుభూతి లౌకికానుభూతి. జీవుని వేదన దీనికి సాక్షాత్తు వ్యతిరేకము. జీవుడు జీవసంపుటియందు మగ్నమైనపుడు పొందు ననుభూతి జీవుని వేదన. లౌకికానుభూతి బాహిరము. జీవుని వేదన ఆంతరము. ఒకటి మనసునకు సంబంధించినది. రెండవది హృదయమునకు సంబంధించినది. ఒకటి సాపేక్షకమైనది. రెండవది నిరపేక్షకమైనది. కావ్యానుభూతి యంతయు ఈ నిరపేక్షమైన, హార్దమైన జీవుని వేదనయే. లౌకికమైనది సాపేక్షకమైనది కాదు. కవి లోకములో తా ననుభవించినదే వ్రాయవలయునని, అట్లు వ్రాయుటయే బుజుత్వమని పాశ్చాత్య విమర్శనుబట్టి కొంతమంది వాదింతురచట కవి చేసిన ఉత్ప్రేక్షలు, అతిశయోక్తులు, వీ రేవగింనుకొందురు. వీరి దృష్టిలో కవి భావన యంతయు స్వభావోక్తికి సంబంధించియే యుండవలయును. ఈ స్వభావోక్తి విషయమున కూడ చాల తగాదా లున్నవి. స్వభావోక్తి కలంకారత్వ మెప్పుడు కుదురునన్నవిషయమున సున్నితమైన తీర్పు లున్నవి. అలంకారికులు చెప్పిన స్వభావోక్తి పై నుదహరించిన విమర్శకులు చెప్పెడి లౌకికానుభూతి మాత్రము కాదు. దానియందు కూడ అలౌకికత్వము దీపించినపుడే దాని కలంకారత్వ మొప్పుకొనిరి. స్వభావోక్తిని గురించిన అలంకారిక చర్చ కూడ కావ్యానుభూతి లౌకికానుభూతి కాదని, జీవుని వేదన యనియు ఇందుచే స్పష్టపడుచున్నది గదా. కవి లోకములో ననుభవించినదే చెప్పవలయు ననుట వెర్రిగాని విమర్శ కాజాలదు.

మరి జీవుడు జీవసంపుటియందు మగ్నుడగుటయన్న చిత్తసమాధి పొందుట కదా! ఈ సమాధి యోగశాస్త్రమునకు సంబంధించినది కాని కావ్యమునకు దీనికిని సంబంధ మేమి? అని ప్రశ్న యున్నది. కావ్యరచన కాలమున కవియు, పఠన కాలమున సహృదయుడును యోగులే యని యాలంకారిక నిర్ణయము. శ్రీ అభినవగుప్తపాదులు రస సిద్ధాంతమును యోగశాస్త్రము నవలంబించియే ప్రతిపాదించిరి. అందుచే కావ్యానుభూతి యోగానుభూతి వంటిది. తాను చూచినదే, తిన్నదే వ్రాయుట కాదు. కవి యోగసమాధి పొంది, తా ననుభవించిన అలౌకిక దర్శనమును సహృదయున కందించును. అందుచే సంవిధానక నిర్మాణ మనునది కవి ప్రతిభకు గీటురాయి. కథా శిల్పమున కాయువుపట్టు.

ఎందుచేత ననగా సంవిధానకము సమాధియొక్క పరాకాష్ఠతను నిరూపించును. భావన యెంత గాఢముగా నుండునో సమాధి యంత నిశ్చలముగా నుండును. సంవిధానకము భావనా గాఢతను పట్టించును. పరమ భావుకుడైన కవిగాని సంవిధానకమును నిర్మించలేడు. సంవిధానకమును గురించి విచారించుటకు ముందు వస్తు స్వరూపమును కొంత విచారింతము. వస్తువు నవీనముగా నుండవలెనని యాధునికు లందురు గదా. ఈ నవీనత యొక్క స్వరూప మేమి? ఇది యెట్లు సంపాదితమగును? కవి ఒక వస్తువును భావించి యొక యనుభూతిని పొందును. ఆ యనుభూతి నొక భాషలో ననువదించును. "కవి వర్ణనము, వస్తువు, అనుభూతి—ఈ మూడును వాస్తవికముగా నుండవలెను. అనగా కవి లోకమునం దనుభవించి

నదిగా నుండవలెను. అది లోకమునందు ఒక యదార్థ సంఘటనమై యుండవలెను. ఏదియో స్వప్నదృశ్యమువలె కల్పనా సంభవమై కృత్రిమముగా నుండరాదు. ప్రాచీన కవిత్వమంతయు కల్పనా జగత్తుకు సంబంధించినది. ఆధునికము వాస్తవికము. కేవల వాస్తవిక సౌందర్యమునే పాఠకునకు వ్యక్తీకరింపజేయునది. అట్లు చేయుటయే నవీన కవిత్వము. వర్ణనా సౌందర్యమును సాక్షాత్కరింపజేయునది ప్రాచీన కవిత్వము'' అని ప్రాచీన నవీన కవిత్వములకు మధ్య నొక విభాజక సూత్రమును స్వయముగా నిర్మించుకొని తదనుగుణమైన మార్గములో విమర్శలను కొంతమంది వెలయింప జేయుచున్నారు. నేను చెప్పుచున్న నవ్యత అట్టిది కాదు. కవిత్వమందలి నవ్యత కాలికమైన హద్దులకు లోబడి యుండునది కాదు. నవ్యత యనునది కవి ప్రతిభా సంపాదితము. ప్రతిభ యన్న మాటకు 'అపూర్వ వస్తు నిర్మాణ క్షమా' యని అభినవగుప్తు డర్థము చెప్పెను. ఆకథ ప్రాతదే కావచ్చును. ప్రతిభావంతుడైన కవి దానిని చేపట్టినప్పుడు దానియందు పాఠకునకు హృదయసంవాదము కలిగింపగలడు. తన ప్రతిభ వల్ల దానియందపూర్వత్వము సిద్ధింపజేయుగలడు.

> దృష్టపూర్వా అపిహ్యర్థాః
> కావ్యే రస పరిగ్రహాత్, సర్వే నవా ఇవాభాంతి మధుమాస
> ఇవద్రుమాః.

ఆ చెట్లు దినదినము మనము చూచుచున్నట్టివే యైనను వసంత సంపర్కము వలన వానియందు క్రొత్తదనము దీపించును. అట్లే రస పరిగ్రహమైన వస్తువు ప్రాతదైనను కావ్యమునందు క్రొత్తదై దీపించును. రసము అనగా కవి యొక్క యలౌకికానుభూతి. పూర్వము చెప్పిన జీవ వేదనా స్వరూపమైనది. భావనాయోగముచే సిద్ధించినది. ఈ దృశ్య భావనకు కావలసిన శక్తికే ప్రతిభయని పేరు. కవి భావన కావ్యమునందు గుణాలంకార రూపమున నుండును. ఇందుచే ప్రతిభ గుణాలంకార సంయోజనాత్మకమైనదని యొప్పికొనవలయును. ఇచట గుణాలంకారముపలక్షకములు. కావ్యగత సర్వ శిల్పమునకు గ్రాహకములు. ''వర్ణనా నిపుణః కవిః'', కవయతే వర్ణయతీతి కవిః''.

వర్ణన యనునది కవిలో నుండు అసాధారణ గుణము. ఈ గుణము లేనివా డసలు కవియే కాజాలడు. తేలిన సారాంశమేమనగా వర్ణనచేతనే వస్తువునకు నూతనత్వ మాపాదిల్లునని. అందుచేత వర్ణనా విరహితముగ వస్తు సౌందర్యమును వ్యక్తీకరింపజేయుట యన్నమాట నిల్చునది కాదు.

ఆధునిక విమర్శకు లనుకొనునట్లు కవియొక్క యనుభవము లోకసాధారణమే యైనచో వస్తువునందు నవీనత్వము దీపించుట యన్నది సంభవించదు. కవి యనుభూతి లౌకికము, అతడు తీసికొన్న వస్తువు నవీనము–అన్నవి ఒకదాని కొకటి పొసగని మాటలు. నవీనత యనగా రమణీయత. నిత్య నూతనమైన వస్తువే రమణీయము. అందుచేత నూతనత్వము లౌకికమైనది కాదు.

''క్షణే క్షణే యన్నవతాముపైతి తదేవ రూపం రమణీయతాయాః'' అని మాఘుడు చెప్పెను. ఆ కథ ఏ కాలమునకు సంబంధించినదైనను, ఆ కవి ఏ కాలమున వ్రాసినను ఆ కావ్యమునందా కథ నిత్య నూతనమై విలసిల్లును. ఏతాదృశ నూతనత్వము లోక సాధారణానుభవమువల్ల సంక్రమించునది కాదు. కవి యొక్క అనుభూతి మనము లోకములో అనుభవించునట్టి ఇంద్రియానుభూతి కాదు. ఆ వస్తువును భావించి కవి తన జీవ సంపుటియందు మగ్నుడై పొందిన ఒక అసాధారణమైన యనుభూతి విశేషము. అనగా కవి బాహిర్గమైన వస్తువును పరిష్కరించి, సంస్కరించి తనలోనికి తీసుకొని భావించును. కవి కావ్యమునందు ప్రదర్శించు వస్తువు కవి భావనామహిత మగుటచే ఆంతరము కాని బాహిర జగత్తులో యథాతథముగా సంభవించునది కాదు. బాహిరమైన వస్తువు వట్టి సమిధ. ఆ సమిధను భావనా తైలధారచే సుసంభృతము చేసి కవి జీవుని వేదనయందు హోమము చేయును. కావ్యమందు కవి ప్రదర్శించు వస్తువు ఆ జ్వలించుచున్న సమిధ.

ఇచ్చట మూడు అంతరువులు గమనింపవలెను.

1. లోకమునందలి వస్తువు.
2. కవి భావనాగతమైన వస్తువు.
3. కవి అనుభూతి.

లౌకిక వస్తువు కవి భావనాగతమైన వస్తువునకు గ్రాహకము. అందుచే లౌకిక వస్తువునకు ప్రతిబింబము. బింబవస్తువు లౌకికము. ప్రతిబింబము అలౌకికము. కవి పొందెడి అనుభూతియందు కారణ మగునది ఈ ప్రతిబింబము కాని బింబమైన లౌకిక వస్తువు కాదు. ప్రతిబింబము అలౌకికము కాన దీనికి వ్యంజకమని పేరు. అనుభూతి యలౌకికము గాన దానికి వ్యక్తి యని పేరు. అధునాతన విమర్శకులు వ్యంగ్య, వ్యంజకాది పదములను యథేచ్ఛముగ వాడుచుందురు. కాని ఆ పదములకు అలంకారిక సరణినిపట్టి చెప్పవలసిన యర్థ మిది.

ఈ భేదమును మహాకవులైన భాస కాళిదాస భవభూతులు స్వప్న వాసవదత్త శాకుంతలోత్తరరామ చరిత్రము లందు తమ సంవిధానక నిర్మాణ శిల్పముచే నిరూపించిరి. ఈ నిరూపణయందు కూడ ఈ విభేద ముత్తరోత్తర మున్నత తరముగా నున్నది.

సంవిధానకము కథా నిర్మాణ శిల్పమున కాయువు వట్టని చెప్పితిని. సంవిధానక మన నేమియో కొంచె మాలోచింతము. సామాన్య భాషలో కథ రక్తికట్టు సన్నివేశము

జీవుని వేదన

సంవిధానకము—అనగా కథయందది ప్రధానమైన సన్నివేశము. తక్కినవన్నియు దాని కంగములు. అందుచేత నిజమైన కథ సంవిధానకమే యన్నమాట. పరమ చమత్కార కారణమైన ఏ సన్నివేశమైనను సంవిధానకముగా కవి ఏర్పాటు చేసికొనును. అది దృష్టిలో పెట్టుకొని తక్కిన కథ తీర్చును. కావ్యానుభూతి జీవుని వేదన, జీవునియొక్క ఆంతర జగత్తునందు ప్రతిబింబితమైన వస్తువు నాలంబించుకొని కల్గునది కాబట్టి ప్రధానముగా సంవిధానకమే వస్తువు కాబట్టి కవియొక్క మనస్సు నంతః ప్రవణము చేయుగలిగిన సన్నివేశము లనే సంవిధానకములుగా కవి ఎంచుకొనవలసి యుండును. కాని అన్ని నాటకములను సంవిధానకము లిట్లుండునని చెప్పలేము. సంవిధానకము యొక్క యీ లక్షణమును వ్యాఖ్యానము చేయు పద్ధతిలో భాస కాళిదాస భవభూతులు మువ్వురు మాత్రమే సంవిధానక నిర్మాణమును నడపిరి. ఇట్టి వ్యాఖ్యాన మంత ర్లీనముగా కల్గినవే నిజమైన సంవిధానకములు.

లోకమునందు మనము ఒక నూత్న పురుషుని ఎచటనో చూచినప్పు డొక్కొక్క సందర్భములో మన కేదియో చిత్తముయొక్క అడుగు పొరలలో కదలిక కలుగును. ఏదియో లీలగా గుర్తునకు తగులును. అదేదియో సరిగా మనస్సునకు తగులదు. అది కదలుట మాత్రము జరిగి బహిః ప్రసరణశీలమగు నంతఃకరణమును లోనికి గుంజుకొనును. అప్పుడు మన మొక అనుభూతిని పొందుదుము. ఇట్టి అనుభూతి లోకమునం దెవనికో ఎచ్చటనో జరుగును. ఇది లోక సాధారణమైనది కాదు. ఇంద్రియ మార్గమున పొందునది కాదు. యదార్థ జగత్తున కన్పించిన ఆ నూత్న వ్యక్తి ఆ మనస్సులో కదలిన ఏదియో చెప్పరాని భావమునకు గ్రాహకము. ఈ యనుభూతియొక్క స్వరూప మిది. మరియొక టున్నది. ఒకరికి సహజముగా ఒకరిని చూచిన స్నేహభావము, మరియొకనిని చూచిన ద్వేషభావము కల్గుచుండును. దీనికి బాహిర కారణము లేమియు చెప్పజాలము. ప్రథమ దర్శనములోనే యట్టి భావములు కల్గును. ఒకరికి తీపి మరియొకరికి కారము, భిన్న రుచిర్హి లోకః. అతని కట్లు, ఇతని కిట్లు—కారణము చెప్పజాలము. ప్రత్యక్ష కారణము లేమియు కన్పించనపుడు బుద్ధి వెనుకకు మళ్లి వెదుకుకొనును. అందుచేత నిట్టి సన్నివేశములచేత జీవసంపుటి గతమైన సంస్కారము లుద్బుద్ధములగునని యొప్పుకొనవలెను. అచ్చమైన కవి యీ సన్నివేశముల నూతముగా గొని జీవసంపుటిగతమైన ఆ సంస్కారములను దీపింపజేయును.

భాస కాళిదాస భవభూతులు నిర్మించిన సంవిధానకము లిట్టివి. భాసుడు పంచమాంకమందు సంవిధానక నిర్మాణము గావించెను. పద్మావతీ ప్రీణనమునకై వత్సరాజు సముద్ర గృహమునకు వచ్చి స్వప్నమునందు వాసవదత్తను దర్శించి పలవరించును. రాజు నిద్రించుచుండగా అచ్చటకు వచ్చి పద్మావతి యనుకొని ప్రక్కన పరున్న వాసవదత్త రాజని తెలిసికొని వెంటనే నిలుచుండి రాజుయొక్క స్వప్నభాషణమునకు సమాధానము చెప్పును. రాజుయొక్క శయ్యా ప్రలంబితమైన హస్తమును శయ్యపై సరిగా నుంచి వెడలిపోవును. రాజు వాసవదత్త స్పర్శచే మేల్కొని పోవుచున్న వాసవదత్తను చూచి పట్టుకొనబోయి ద్వారపక్షముచే తాడితుడై ప్రతి నివృత్తుడగును. రాజు చూచినది నిజమైన వాసవదత్తనో లేక కల్పిత వాసవదత్తనో తెలుసుకొనలేదు. రాజు దర్శించినది, మాటలాడినది స్వప్నవాసవదత్తతోనే. స్వప్న వాసవదత్తకు ప్రతీకగా కవి నిజమైన వాసవదత్తను ప్రవేశపెట్టెను. నిజమైన వాసవదత్తను ప్రవేశింప జేయకున్న నాటకము లేదు. రాజు స్వప్నములో వాసవదత్తను చూచుటయుండు నింతే. ఇక్కడ నొక విశేష మున్నది. వాసవదత్త చెప్పు సమాధానములు స్వప్న వాసవదత్త చెప్పు సమాధానములకు గ్రాహకములు. నిజమైన వాసవదత్త స్వప్న వాసనదత్తకు ప్రతీక. దీనిఁబట్టియే యీ నాటకమునకు స్వప్నవాసవదత్త, యని కవి పేరు పెట్టెను. ఇద్దరు వాసవదత్తలు బింబ ప్రతిబింబ భావమును పొంది యున్నారన్నమాట. ప్రతీయమానమగు విప్రలంభము జీవ వేదనా స్వరూపమని భాసు డిందువల్ల వ్యాఖ్యానము చేసినాడు. రాజుయొక్క మనస్సు బహిః ప్రసరణశీలమై లేదు. రాజు పొందినది గాఢ సుషుప్తి కాదు, స్వప్నావస్థలో నున్నాడు. స్వప్న కాలమున జీవుడు ఆంతర చిత్తవృత్తులందు సంచరించును. రాజు నిద్రించుటకు ముందు విదూషకుడు రాజునకు వాసవదత్తను స్మరణకు తెచ్చును. ఈ వాసవదత్త స్మరణము స్వప్నమునందు వాసవదత్తను సాక్షాత్కరింప జేసినది. రాజు పొందిన అనుభూతి స్వచిత్తగతమైన వాసవదత్తాత్మక సంస్కారమును ఆలంబించుకొన్నది. ఈ స్మరణము నిద్ర కవ్యవహిత పూర్వక్షణమున చేసిన వాసవదత్తాస్మరణము వంటిది కాదు. అది జాగ్రదవస్థాగతమైనది. అనగా మనస్సుతో చేసినది. స్వాప్నిక స్మరణము హృదయ సంవాదము కలది. అనగా మనస్సు నిల్చినప్పుడు చిత్తముయొక్క అడుగు పొరలలో జరిగినది. అందుచేత ఈ స్మరణము దర్శన రూపమైనది. రాజిచ్చట వట్టి సంస్కారముగా వాసవదత్తను స్మరించలేదు. సంస్కారమే వాసవదత్తగా రూపొంది దర్శన యోగ్యత్వమును పొందినది. ఈ వాసవదత్త యదార్థ వాసవదత్త కాదు కావున ఈ దర్శనము లౌకికము కాదు. రాజుయొక్క ఆంతరమైన జీవ సంపుటికి సంబంధించినది కావున అలౌకికమైనది. ఆ దర్శనము వలన కలిగిన విప్రలంభానుభవము జీవ చైతన్య స్వరూపమైనది. ఇప్పుడు రాజు స్థానములో కవిని, యదార్థ వాసవదత్త స్థానములో లోకవృత్తమును, స్వప్న వాసవదత్త స్థానములో

కావ్యేతి వృత్తమును విర్చి చూచినచో ప్రాచీనాలంకారికులు చెప్పిన కావ్యానుభూతియొక్క స్వరూపము అర్థమగును. తన సంవిధానక శిల్ప చాతుర్యమువల్ల భాస మహాకవి తాను ఆ నాటకమువందు ప్రతీయమానము చేయదలచుకొన్న కావ్యానుభూతి యొక్క స్వరూపమును కూడ వ్యాఖ్యానము చేసినవాడైనాడు. కాని యీ వ్యాఖ్యానము భాసమహాకవి వ్యంగ్య మొనర్చినవాడే కాని కంఠోక్తిగా చెప్పినవాడు కాదు.

కావ్యానుభూతి స్వరూప మిట్టిదని కంఠోక్తిగా చెప్పిన వాడు కాళిదాస మహాకవి. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల నాటకమునందు పంచమాంకమున సంవిధానక నిర్మాణమును కావించెను. అది శకుంతలా ప్రత్యాదేశ ఘట్టము. ఈ శకుంతలా ప్రత్యాదేశమునకు ముందు హంసపదిక దుష్యంతునుపాలంభించును. ఈ ఉపాలంభనమునకు శకుంతలా ప్రత్యాదేశమునకు మధ్య నొక శ్లోక మున్నది. ఆ శ్లోకమును కావ్యానుభూతి స్వరూప మట్టిదని అభినవగుప్త పాదుడు తన సిద్ధాంతమున కుపోద్బలకముగా చేసికొనినాడు. ఈ శ్లోక ముపాలంభన ఘట్టమునకు, ప్రత్యాదేశ ఘట్టమునకు సమముగ నన్వయించును. ఈ యుపాలంభన ఘట్టము ప్రత్యాదేశ ఘట్టమునకు ఒక ఛాయ వంటిది. ఒక ప్రతీక వంటిది.

దుష్యంతుడు మునులతో వచ్చిన తన భార్య శకుంతలను చూచును. ఆమె యెవ్వ డెట్లున్నది? అవగుంఠనవతియై యున్నది. నాతి పరిస్ఫుట శరీరలావణ్యయై యున్నది. ఎండుటాకులవంటి బుషుల మధ్య కిసలయమువలె నున్నది.

> కాస్విదవగుంఠన వతీ నాతిపరిస్ఫుట శరీరలావణ్యా
> మధ్యే తపోధనానాం కిసలయమివ పాండు పర్ణానాం.

శకుంతలను చూచి దుష్యంతుని మనస్సు అట్టడుగు పొరలలో నొక ఆవేగము ఒక ఉత్కంఠ పైకుబికి వచ్చినది.

ఎవరీమె? ఇది దుష్యంతునిలో ఆమెను చూడగనే పుట్టిన ప్రశ్న. అతని మనసులో నెక్కడనో లీలగా నొక గుర్తు కదలాడినది. కాని యది మనసుపై పొరలలోనికి రాలేదు. అది మనసులో నడుగు పొరలలోనే తిరుగుడు పడుచున్నది. సుళ్లు చుట్టుకొనుచున్నది. ఆ లోపలినుండి ఏదో ఒక బాధ తన్నుకొని వచ్చుచున్నది. ఇది యంతయు 'కాస్విత్' అన్న మాటలో వ్యక్తమగుచున్నది. ఎవరీమె ?—ఎంత ప్రయత్నించినను ఆ గుర్తు పై పొరలలోనికి రాలేదు. ఆమె తాను పూర్వ పరిణీతనని చెప్పుచున్నది. దుష్యంతు డవుననునా? కాదనునా? దుష్యంతుని స్థితి అంతస్తుషారమును చూచిన భ్రమరముయొక్క స్థితి వలె నున్నదట.

> భ్రమర ఇవ విభాతే కుంద మంతస్తుషారం
> నచఖలుపరిభోక్తుం నైవశక్నో మిహాతుం.

దుష్యంతుడు వేత్రవతితో ననును.

> కామం ప్రత్యాదిష్టాం స్మరామి నపరిగ్రహం
> మునేస్తనయాం
> బలవత్తు దూయమానం ప్రత్యాయ యతీవమే
> హృదయం.

ఈమె నా భార్య యని నేను గుర్తుపట్టలేకున్నాను. ఐనను నా హృదయము మిక్కిలి బాధ పొందుచు నవునన్నట్లు చెప్పుచున్నది. అవునని చెప్పలేను. అవు నన్నట్లు చెప్పుచున్నదట. రాజు పడ్డ బాధ బహు విచిత్రమైనదని యిందువల్ల మనకు తెలియుచున్నది. ఈ బాధకు కారణమేమి ? ఇట్టి బాధ రాజు పొందుటకు తగిన కారణ సామగ్రి రాజునకు తెలిసి యేమియు లేదు. రాజు పొందిన బాధ రాజు మనసు పొందినది కాదు. హృదయము పొందినది. అందుచేతనే 'బలవత్తు దూయమానం హృదయం' అన్నాడు. రాజు బాధకు బాహిరమైన శకుంతల కారణ మన్నచో ఆ బాధ మనసు పొందినది కావలెను. అనగా నట్టి స్థితి శకుంతలను గుర్తించినప్పుడే సంభవించును. జరిగిన దేమనగా యదార్థ శకుంతల రాజు యొక్క చిత్తమునందలి యట్టడుగు పొరలలో నున్న శకుంతలను కదలించినది. ఆ లోపలి శకుంతల కదలినదే కాని మనసు లోనికి తేలలేదు. తేలినచో రాజు హృదయము బాధపడ నక్కర లేదు. అట్లు తేలుటకు శాపము పెద్ద బరువై కూర్చున్నది. అందుచేత రాజునకు శకుంతల గుర్తునకు వచ్చినది. రాలేదు. స్పష్టముగా రాలేదన్నమాట. లీలగా గుర్తునకు తగిలి రాజు యొక్క చిత్తమును వెనుకకు లాగినది. రాజు గుర్తును పైకి లాగలేక పోయెను. ఎందుచేత ? ఆ లోపలి శకుంతలమీద మరపు ముసుగు కప్పినది. ఈ బైటి శకుంతల మేలి ముసుగు కప్పుకొన్నది. ఈ శకుంతల—యదార్థ శకుంతల. ఆ మరపు ముసుగు కప్పికొన్న లోపలి శకుంతలకు ప్రతీక. కాళిదాసిచ్చట చేసిన దేమనగా యదార్థ శకుంతలను లోపలి శకుంతలకు ప్రతీకగా చేసి రాజు చిత్తమునందు పొందిన విచిత్రానుభూతిని పరచి చూపించినాడు. ఈ లోపలి శకుంతల నిజమునకు యదార్థ శకుంతలను చూడకముందే హంసపదిక ఉపాలంభనమువల్ల సంతరుద్బుద్ధమైనది. దానికి ప్రతీకగా యదార్థ శకుంతల కన్పించినది. అందువల్లనే 'కాస్విత్' అని ప్రశ్నించుకొన్నాడు. రాజీ ప్రశ్న నెవరి నడిగెను. ఎవరి నడిగిన నెవరు సమాధానము చెప్పెదరు ? తన హృదయమునే అడిగికొన్నాడు. ఆ హృదయ మేమో చెప్పును. దానికి భాష లేదు.

హంసపదికోపాలంభనము ఈ ఘట్టమునకు పూర్వ రంగమును సిద్ధముచేసి పెట్టినది. రాజు మనసున మరపు మేలుముసుగు పడ్డ శకుంతలను కించి దుద్బుద్ధము కావించినది. హంసపదిక నేపథ్యమునుండి గీతము పాడినది.

జీవునివేదన

అభినవ మధులోలుపస్త్వం
తథా పరిచుంబ్య చూతమంజరీం
కమలవసతి మాత్ర నిర్వృతో
మధుకర విస్మృతోస్యే నాంకథమ్.

ఓసి తుమ్మెదా! నీవు క్రొత్త తేనె కొరకు దేవులాడెదవు. అట్లా మావి పూగుత్తిని ముద్దుకొంటివి. ఇప్పుడీ తామర పూవులో దూరినంత మాత్రమున దాని నెట్లు మరచితివో కదా.

ఈ గీతిని విని రాజుత్కంఠితు డైనాడు. ఉత్కంఠితుడు కానేల? ఈ ప్రశ్నయే రాజునకు కల్గినది.

"కింనుఖలు గీతమేవం విదార్థమాకర్ణ్య ఇష్టజన విరహాదృతేపి బలవ దుత్కంఠితోస్మి" అన్నాడు. ఈ యుపాలంబార్థకమైన గీతిని విని ఇష్టజన విరహము లేకున్నను మిక్కిలి వ్యాకులపాటు పొందితి నేలయని. రాజున కిష్టజన విరహము తెలిసి లేదు. తెలిసినదెల్ల హంసపదిక తన్నుపాలంభించుచున్న దనియే. రాజెందు కుత్కంఠ పొందుచున్నాడో మనకు తెలియును. గీతము పోయి రాజు హృదయములో నిద్దుర వోవుచున్న శకుంతలకు తాకినది. రాజుయొక్క హృదయమును జాగరూకము కావించినది. పైన మరపు శాపము. శకుంతలను స్పష్టముగా మెరయనీయలేదు. ఈ యస్పష్టమైన కదలికయే రాజు పొందిన వ్యాకులపాటు. రాజు విన్న గీతమునకు రెండర్థము లున్నవి. ఒకటి హృదయమందు మేల్కొన్న అస్పష్టమైన శకుంతలా వృత్తాంతము, రెండవది మనసునందాడిన హంసపదికా వృత్తాంతము. ఈ రెండు రెండు విభిన్నములైన అనుభూతులు. ఒకటి హృదయము పొందినది. రెండవది మనసు పొందినది. హృదయము పొందిన దలౌకికము. మనసు పొందినది లౌకికము. దేని కది వేరు. హంసపదిక గీతియందు రాజుమనసు గ్రహించిన యర్థము వేరు, హృదయము గ్రహించిన యర్థము వేరు. అందుచేత గీతి హృదయము గ్రహించిన యర్థమునకు వ్యంజ్యకమైనది. రాజు హృదయములో పొందిన యనుభూతి జీవ వేదనాత్మకమైనది. ఇట్లు శకుంతలా వృత్తాంతమును వ్యంగ్య మొనరించుచు రాబోవు ప్రత్యావేశ మహాఘట్టమునకు ఈ శ్లోకము చూళిక పట్టుచున్నది. శకుంతలా ప్రత్యావేశ ఘట్టమును విప్పి చెప్పుటకై కాళిదాసీ శ్లోకము రచించెను. సంస్కృత సాహిత్యమందెచ్చటైనను దీనికి తుల్యమగు చూళిక లేదు. కాళిదాసు నిర్మించిన సంవిధానకము యొక్క స్వరూప మిది. ఈ రెండు ఘట్టములకు మధ్య నొక వ్యాఖ్యా శ్లోకమును కాళిదాసు ప్రవేశ పెట్టినాడు. ఇది తాళపుచెవి వంటిది. దాని నుపయోగించి ఈ రెండు ఘట్టములను తెరచికొని అందలి రత్నములను మనము చూడవలయును. ఆ శ్లోకమును తీసికొని విచారింతము.

రమ్యాణివీక్ష్య మధురాంశ్చనిశమ్య శబ్దాన్
పర్యుత్సుకోభవతి యత్సుఖితోపి జంతుః
తచ్చేతసా స్మరతి నూనమ బోధపూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని.

రమ్యమైన రూపము చూచి, మధురమైన శబ్దమును విని సుఖియైనప్పటికిని మనుజుడు వ్యాకులపడుచున్నాడు. దీనికి కారణమేమి? అతడా సమయమునందు చిత్తమున నాటుకొనియున్న జన్మాంతర స్నేహములను వాని సంబంధము తెలియకుండ చిత్తములో స్మరించుచున్నాడని యర్థము. అనుభవ గుప్తపాదుడు వ్యాఖ్యానించిన దీ శ్లోకమునే. ఇచ్చట చేతసాస్మరతి, అబోధపూర్వం—అను మాటలు జాగ్రత్తగా విచారించదగ్గవి. స్మరణమను మాట కర్థమేమి. ఒక విషయమును పూర్వ మనుభవించినపుడు దానిని తిరిగి గుర్తునకు తెచ్చుకొనుట స్మరణము. దానికున్న సర్వ సంబంధములు మన కస్పష్టముగ భాసించినచో అప్పు డది స్మరణమగును. లోకములో మన మొకనిని చూచితిమి. తిరిగి వానిని చూచినపుడు మనము వానిని 'ఇతడు ఫలానా' యని గుర్తుకు తెచ్చుకొన్నచో అది స్మరణము. కాబట్టి లౌకిక స్మరణమునందు ఈయానుపూర్వి యంతయు కూడియుండును. ఇచ్చట స్మరణ మట్టిది కాదు. 'చేతసా స్మరతి'—హృదయముతో స్మరించుచున్నాడన్నమాట. చిత్తమనగా హృదయము. మనస్సు కాదు. అంతఃకరణ ప్రవృత్తులలో సూక్ష్మతమమైనది చిత్తము. స్థూలతమమైనది మనస్సు. అంతఃకరణముయొక్క బహిః ప్రసరణము మనస్సనియు, అంతః ప్రసరణము చిత్తమనియు చెప్పుకొన వచ్చును. ఏతాదృశ స్మరణకాలమున అంతఃకరణమునకు బహిః ప్రచార ముపశమించెడి దన్నమాట. బహిః ప్రపంచగత విషయము లేవియు నీ స్మరణమం దిప్పుడు విషయములు కావు. పైని చెప్పిన రమణీయ రూపము, మధుర శబ్దము బాహిరములే కాని ఆంతరములు కావుగదా! అందుచే నివి యీ స్మరణమునందు కారణములు కావు. ఇవి కారణములైనచో పొందు ననుభూతి అబోధపూర్వమగుట కుదురదు. పర్యుత్సుక మగుట కుదురదు. ఇవి చేసిన దెల్ల యంతఃకరణమును లోనికి త్రిప్పుటయే.

మరి యీదృశస్మరణములందు విషయము లైనవి యేవియను ప్రశ్న యున్నది. అవి తప్పకుండ ఆంతరములే కావలెను. వానినే భావస్థిరాణి, జననాంతర సౌహృదాని—అని కాళిదాసు చెప్పినాడు. చిత్తమునందున్న జననాంతరముల స్నేహములే అనుభవములు. స్నేహము లనగా సంస్కారములని యర్థము. తాదృశ స్నేహములయొక్క ముద్ర భావమునందు స్థిరపడి యుండును. ఈ ముద్రలే సంస్కారములు. భావన మనగా నిశ్చలాంతఃకరణము. అంతఃకరణమున కేవిధమైన ప్రచారము లేని స్థితి భావము. అనగా జీవుని స్వరూపమని యర్థము. తర్వాత అబోధ పూర్వ మన్న మాట యున్నది. అబోధపూర్వ మనగా వాని సంబంధము స్మరణమునందు తెలియకపోవుట. జన్మాంతర సంస్కారములు చిత్తమునందు సంబంధ హితముగా కుదురుకొని యుండవు. వట్టి సంస్కారములుగనే యుండును. సంబంధ శూన్యముగనుండుని

ఏ సంబంధములేని అచ్చమైన ఈ సంస్కారము లనుభవించుటయే చేతసాస్మరతి, అని కాళిదాసు చెప్పినాడు. ఈ సంస్కారానుభవమునందు జీవునికి స్వరూపావగతి కల్గుచున్నది. ఎందుచేత ననగా నివి జీవుని స్వరూపమునందు నిల్చియున్నవి కాబట్టి. కావున పర్యుత్సుకత్వమనగా నేతాదృశ సంస్కార ముఖమున జీవుడు పొందు స్వరూపావగతి యని యర్థము. ఇదియే జీవుని వేదన.

ఈ వేదన సుఖము కాదు. దుఃఖము కాదు. వాని కంటె విలక్షణమైనది. సుఖము కాని, దుఃఖము కాని సంబంధసాపేక్షమైనది.

పర్యుత్సుకాభవతి యత్సుఖితోపి జంతుః—ఇచ్చట సుఖిత శబ్దమునకు లౌకిక సుఖమర్థము. అపి—అనునవ్యయము పర్యుత్సుకః అను దానిలో సుఖితః అను దానికి గల వైరుధ్యము చెప్పుచున్నది. సుఖమునకు విరుద్ధ గుణము దుఃఖము. మరి యిది లౌకికదుఃఖ మగునా? లౌకికదుఃఖ మైనచో నిది సుఖితుడైన వాని కెట్లు కల్గును. కాబట్టి సుఖితోపి యనుమాట ఇది లౌకిక దుఃఖము కాదని నిర్ధరించుచున్నది. ఈ పర్యుత్సుకత్వము సుఖము కాదు. దుఃఖము కాదు. సుఖమునకు విరుద్ధమైనది. దుఃఖము వంటిది. దుఃఖము కాదు. అనగా నిరపేక్షమైన దుఃఖానుభవము స్వరూపముగా కలది. ఇది జీవునియొక్క స్వరూపము.

జీవుని జీవత్వస్థితి నిరంతర వేదనా స్వరూపమైనది. కారణము లెరుగరాని ఆలంబనములేని—తెల్లములేని ఒకానొక వేదనను జీవుడు నిత్య మనుభవించుచుండును. ఉత్తమ ప్రకృతులం దీ వేదన జాజ్జ్వల్యమానముగా నుండును. అధమ ప్రకృతులందు ఈ వేదన నిద్రాణమై యుండును. మధ్యమ ప్రకృతులయందు కావ్య నాట్యాది భావనమువల్ల మేల్కొలుపబడును. ఈ వేదన పరమార్థతః పరమేశ్వర విరహజన్యమైనది. జీవుడు పరమేశ్వరునితో నభిన్నుడు. ఆ పరమేశ్వర స్వరూప మానందము. జీవునియొక్క స్వరూపము పరమార్థతః ఆనందము. అచ్చటనుండి చ్యుతుడై ఆ యానందమన్న మణిని జీవుడు పోగొట్టుకొన్నాడు. తన స్వరూప మానందమని మరచిపోయెను. ఈ మరపే జీవునికి జీవత్వ సంపాదకమైనది. జీవుడు తనకు తెలియకుండగనే తన యచ్చమైన స్వరూపమునకై యానందమునకై అనగా పరమేశ్వరునకై నిరంతరము వెదకుచుండును. ఆ విచయనమునందు పరమేశ్వర విభూతి చిహ్నములైన రమణీయ రూపములు, మధుర శబ్దములు జీవుని జీవసంపుటిని కదలించి అతనికి పరమేశ్వర విరహమును సాక్షాత్కరింపజేయును. పరమార్థతః జీవునియొక్క పరమేశ్వరాభిన్నతను, నిరవధిక సుఖస్వరూపమును వ్యంజింపజేయును. కాళిదాసు చెప్పిన పర్యుత్సుకత్వ మిట్టిది. భవభూతి చెప్పిన కరుణము గూడ నిదియే.

ఏ యనుభూతి యైనను గాఢముగా ననుభూయమాన మైనపుడు అది కరుణమే యగునని భవభూతి స్పష్టతమముగా చెప్పినాడు. భవభూతి చెప్పిన యీ కరుణము జీవస్వరూప మైనది. భవభూతి నాటకమందు శ్రీరాముడు పొందిన దిట్టి జీవవేదనా స్వరూపమైన కరుణము గాని సామాన్యమైన లౌకిక శోకము కాదు. ఉత్తరరామ చరిత్రమందు రసము కరుణమా? విప్రలంభమా? ధర్మవీరమా? యని విద్వాంసులు వాదోపవాదములు లేవదీసిరి. పెక్కుమంది కరుణమనిరి. కొందరు సీతారాముల సమాగమమును బట్టి విప్రలంభ మనిరి. కొందరు లోకారాధనమందు—అనగా రాజధర్మపాలనమందు శ్రీరామునకున్న స్థైర్యమునుబట్టి ధర్మవీరమనిరి. మూడు వాదములకును ఉపోద్బలకములైన యుపపత్తులు చెప్పుటకు వీలున్నది. మూడు వాదములును బలమైనవే. కాని భవభూతి చెప్పిన కరుణము ఈ మూడింటికి విరుద్ధమైనదికాదు. ఈ మూడింటిలో ఏదో ఒకటి కాదు. భవభూతి చెప్పిన దచ్చమైన రస స్వరూపము. కావ్యానుభూతి స్వరూపము. భవభూతి దృష్టిలోనే రసమైనను దాని స్వభావముచేత కరుణమే. ఈ విషయమును నిర్ధరించుటకే భవభూతి తన మహా నాటకమును నిర్మించెను. భవభూతి తన సిద్ధాంతమును ప్రతిపాదించుటకు సీతారాముల విరహ కథను తీసికొన్నాడు. స్వభావతః సీతారాములకు దివ్యత్వ మున్నది. లౌకికమైన శోకభావమును తీసికొని సీతారాములయం దారోపించి దానియందు దివ్యత్వమును సంఘటించినాడు కవి. మొదలు పెట్టుటతోడనే ఆకసములో మొదలుపెట్టినాడు.

భవభూతి కరుణమును సహృదయానుభవమునకు తెచ్చుట కైనచో నీ కథనే తీసికొన నక్కరలేదు. తీసికొన్నచో నిట్లే వ్రాయనక్కరలేదు. భవభూతిరాము డనుభవించినది లోకములో ననుభూయమానమగు విరహము వంటిది కాదు. అది జీవవేదనాత్మకమైనది. అని నిరూపించుటకే భవభూతి యీ కథను తీసికొనెను. భవభూతిరాము డనుభవించినది శోకము కాదు—కరుణము.

ఈ సిద్ధాంతమును స్థాపించుట కనుగుణముగా భవభూతి తన సంవిధానకమును నిర్మించుకొన్నాడు. ఉత్తరరామ చరిత్రమున తృతీయాంకమున నున్నదీ సంవిధానకము. దీనికి ఛాయాంకమని పేరు. కాళిదాసు శాకుంతల పంచమాంకము వంటిదీ తృతీయాంకము. అచటి సంవిధానకమును తిరుగవేసి చూపించినాడు భవభూతి. ఎదుట కన్పించిన శకుంతలను తిరస్కరించి దుష్యంతుడు పర్యాకులితు డైనాడు. ఎదుట కన్పించని సీతను చూచి శ్రీరాముడు శోకించినాడు. సీతారాము లిద్దరు నచటనే యున్నారు. సీతకు రాముడు కన్పించును. మరి రామునకు మాత్రము సీత కన్పించదు. పంచవటీ దర్శనమున రామునకు సీతా విరహ ముద్దీప్త మగును. రాముడు మూర్ఛిల్లును. సీతాస్పర్శ రాముని ప్రబోధితుని చేయును. ఈ తృతీయాంకము నిట్లు నిర్మించుటలోని ముఖ్య మర్మము స్పర్శ. శాకుంతల మందలి శాపమువంటిదీ స్పర్శ. శాకుంతల మందలి శాపము లేనిచో నుత్తర కథ లేదు. అట్లే స్పర్శ లేనిచో నిట తృతీయాంకము లేదు. ఛాయాసీత లేదు. మూర్ఛితుడైన రాముని ప్రబోధించుటకు సీతాస్పర్శ కంటే వే రుపాయము లేదని భవభూతి కల్పన.

జీవుని వేదన

రామునియందు తక్కిన శీతలోపచారములు పనిచేయవు. ఒక్క సీతా స్పర్శయే రాముని అంగకములకు తెలియును. ఇంకొకటి తెలియదు. అంతటి అవ్యభిచారియైన హృదయము రామునిది. అసలు రమణముయొక్క మర్మ మంతయు స్పర్శ గుణము నాశ్రయించి యుండును. విరాట్పురుషుని స్పర్శ గుణమునుండి కామము పుట్టినది. కామ ప్రేరితమైన రమణ మందుచే స్పర్శయందు ప్రవేశించును. జీవుని యంతఃకరణ మును విషయములకు కట్టివేయు ప్రాణి స్పర్శ గుణము. సర్వేంద్రియ వ్యాపార మీ స్పర్శగుణము నాశ్రయించి యుండును. సర్వేంద్రియ గుణములను స్పర్శ శబ్దముతోనే గీతయందు శ్రీకృష్ణ భగవానుడు నిర్దేశించెను.

రాముడు మూర్ఛిల్లె ననగా రాముని యంతఃకరణ మింద్రియ సన్నికర్ష వదలి సమాధి భావమును పొందియున్న దన్నమాట. రాముని సమాశ్వసితుని చేయక కథ లేదు. దానికై యీ స్పర్శను ప్రవేశ పెట్టినాడు భవభూతి. అందుచేత సంవిధా నక నిర్మాణ మంతయు నీ స్పర్శపైనా ధారపడిన దంటిని. ఈ స్పర్శ యిట్టిది కాబట్టియే మొదటినుండి కథతోబాటే అల్లు కొని వచ్చినాడు కవి. ప్రథమాంకమునందు రాముడనును.

వినిశ్చేతుం శక్యోన సుఖ మితివా దుఃఖ మితివా
ప్రమోహో నిద్రావాకిము విష విసర్పః కిముమదః
తవస్పర్శే స్పర్శే మమహి పరిమూఢేంద్రియ గణో
వికారశ్చైతన్యం భ్రమయతి సమున్మీలయతిచ.

సీతా నీ స్పర్శచే నేదియో చెప్పరాని ఒక యనుభవము నా ఇంద్రియ సమూహమును స్తంభింపజేసి జీవ చైతన్యమును కల్లోల పెట్టును. వికసింపజేయును. ఇది సుఖమో, దుఃఖమో చెప్ప జాలను. ఇది మోహమో, నిద్రయో కావచ్చు. విషవిసర్పము వంటిది కావచ్చు. మత్తు కావచ్చు.

ఇచ్చట సీతాస్పర్శవల్ల రాము డనుభవించినది జీవుని వేదనయని భవభూతి స్పష్టము చేసెను. ఈ స్పర్శవల్ల శరీర మున కొక నిస్తబ్ధత కల్గినది. దీనివల్ల నింద్రియములు పరి మూఢము లైనవి. ఈ స్పర్శవల్ల కలిగిన వికార మంతరవస్థా విశేషము. శారీరకమైన అనుభవము కాదు. మానసికమును కాదు. ఇది చైతన్యరూపుడైన జీవుని కల్లోల పెట్టినది. విక సింపజేసినది. ఈ స్పర్శ ఇంద్రియములను మనస్సును దాటి అంతఃకరణమును దాటి జీవస్వరూపమును తాకినది. అచ్చట నొక పొంగు నొక వికాసము కల్గినది. జీవ చైతన్యమందలి యీ పొంగే యీ వికాసమే జీవుని వేదన. అదియే భవభూతి చెప్పిన కరుణము. సంయోగమునందు ఇట్లు చైతన్యమును భ్రమింపజేయు స్పర్శ తృతీయాంకమునందు మూర్ఛితుడైన రాము నుద్బోధితుని చేయుగల్గినది. అనగా బాహిరమైన శ్రీరా ముని యంతఃకరణము జీవసంపుటిలోని కుపసంహృతము చేయుట, జీవసంపుటియందు ఉపసంహృతమైయున్న యంతః కరణమును ఇంద్రియ సన్నికర్షమును పొందింప జేయుట ఈ రెండు పనులు చేయగలదీ స్పర్శ. అందుచేతనే 'భ్రమయతి సము న్మీలయతిచ' యన్నాడు.

సీతా సంయోగ వియోగముల రెంటను రాము డనుభ వించినది జీవుని వేదనయే. తృతీయాంకము మొదలుపెట్టు చునే ఈ సంగతిని స్పష్టపరచినాడు భవభూతి. తృతీయాంక మంతయు మహా శోక ప్రవాహము. జీవ వేదనా ప్రవాహము. అంకమంతయు నగ్నిమయమైన సృష్టి. అంకము మొదట నొక శ్లోకము చివర నొక శ్లోకము కట్టలు కట్టి ఈ రెండు కట్టలమధ్య ఈ వేదనాగ్నిని ప్రవహింపజేసినాడు భవభూతి. మొదట మురళ యనును.

అనిర్భిన్నో గభీరత్వాత్ అంతర్గూఢ ఘనవ్యథః
పుటపాక ప్రతీకాశో రామస్య కరుణోరసః.

రాముడు పైకి నెమ్మదిగ కన్పించినను లోలోపల నే యగ్నిచే విపచ్యమాను డగుచునే యున్నాడు. సీతావియోగజన్యమైన రామశోకము నిరంతరానుభవమువల్ల కరుణరసమైనది.

రాముని శోకము జీవసంపుటియం దనుభూయమాన మగుచున్నది. పైకి వెళ్ళగ్రక్కుటకు వీలులేనిది. అందు చేత జీవసంపుటియందే విపచ్యమానమైనది—పుటము పెట్టిన బంగారమువలె నంత రనుభూయమానమైన రామశోకము లౌకిక మాలిన్యము నపగతము కావించు కొన్నది. జీవసంపుటి ప్రవిష్టమై కరుణరసముగా మారినది. పుటపాక ప్రతీ కాశో రామస్య కరుణారసః అనగా నర్థ మిది. ఈదృశ కరుణమునకు సతీ వియోగము కారణము కాదు. వ్యంజకము కాదు. సీతా వియోగ మిప్పుడు రామునకు క్రొత్తగా కలుగలేదు. సీతావియోగ జన్య మైన అనుభూతి జీవసంపుటియందు లీనమై యున్నది. పంచవటీ దర్శన మా లీనమైయున్న వేదనను పైకి లాగినది. అనగా పంచవటీ దర్శనముచే స్మర్యమాణమైన సీతా వియోగ వృత్తాంతము హృదయవిపచ్యమాన మగు జీవవేదన నుద్దీ ప్తము గావించినది. అందుచేతనే,

"అంతర్లీనస్య దుఃఖాగ్నేః" అని భవభూతి యన్నాడు. అంతః ప్రసరణశీలమైన అంతఃకరణమును రాము డతి ప్రయ త్నముగా బహిః ప్రసరణము కావించుకొనుచు వచ్చుచున్నాడు. పంచవటీ దర్శనమున హృదయము సంక్షుబ్ధమై అంతః కరణము జీవసంపుటియందు మగ్నమైనది. ఇదే రాముని మూర్ఛ. అంతర్హితయై యున్న సీతాస్పర్శ రాము నుజ్జీవితుని చేసినది. అనగా జీవసంపుటి మగ్నమైన అంతఃకరణమును ఇంద్రియ సన్నికర్ష పొందించినది. పంచవటిలో ప్రవేశించినది మొదలు రాముని మనస్సున సీత యాడుచునే యున్నది. ఆ సర్వ ప్రదేశములందు సీతా పరిచయ ముద్ర నిండియున్నది. ఈ దృశ సీతాపరిచయ ముద్ర రాముని మనోగతమైన సీతా చ్ఛాయ నుద్బోధించినది.

పంచవటీ పరిచిత ప్రదేశ జ్ఞాపిత సీతయే నిజమునకు ఛాయాసీత. ఆ ఛాయాసీతకు ప్రతిగా సత్యసీతను ప్రవేశ పెట్టి అంతర్హితను గావించినాడు. రాముని వియోగాగ్నిని రగులించిన సీత రామ మనస్సృష్టమైన ఛాయాసీత. ఆ పరిచిత ప్రదేశములందు మరుగుపడి యున్నది. అసలు సీతచేయి రాముడు గ్రహించినను తర్వాత నది తన మనస్సృష్టి యనుకొన్నాడు. సత్య సీత కూడ అంతర్హితయే. అయినను ఛాయాసీతకు ప్రతీకగా అంకము మొదటి నుండి తుదిదాక నిర్వి బహు విచిత్రమైన సంవిధానకమును సృష్టించినాడు భవభూతి.

వట్టి మనస్సృష్టి సీతనే నిరూపించినచో కరుణరసమున కంత యుద్దీప్తి వచ్చెడిది కాదు. సీతారాములు సమ్ముఖమం దనుభవించుచున్న విరహము సంవిధానక సృష్టికి కారణమైనది. అంకాంతమున సీతారాములు విడిపోవుచున్నారు.

“కియచ్చిరంవా మేఘాంతరేణ పూర్ణచంద్ర దర్శనం” ఈ మేఘము దైవము పట్టిన తెర. ఇదే సంవిధానకము. సర్వ విధానకములందీ తెర యుండవలసినదే. ఇచ్చట సంకాంతమందు కవి మఱొక శ్లోకము వ్రాసి రెండవ కట్టు కట్టెను.

ఏకోరసః కరుణయేవ నిమిత్త భేదా
ద్భిన్న భిన్న పృథగివాశ్రయతే వివర్తాన్
ఆవర్త బుద్బుద తరంగమయాన్ వికారాన్
అంభో యధా సలిలమేవహి తత్సమస్తం.

కరుణ యొక్కటియే రసము. నిమిత్త భేదములవల్ల శృంగారాది రూపమున వేరువేరుగ కన్పించును. అది యూరక కన్పించుట మాత్రమే. నీరు సుళ్లు, బుడగలు, తరంగములుగా కన్పించినను యదార్థముగ సర్వము నీరే.

కరుణ మనగా నిమిత్త నిరపేక్షమైన శోకమని యర్థము. ఇది జీవుని యొక్క స్వరూపము. ఏ భావమైనను ఏదో యొక రంగు వేసిన శోకము మాత్రమే. అందుచే ఏ భావమైనను ప్రపంచితమైనప్పుడు జీవుని జీవత్వస్థితి యందు తాడిత మొనర్చుచుండును. జీవుని జీవసంపుటి నూచముట్టుగ కదలించి వైచును. జీవునకు స్వస్వరూపమనుభవమునకు దెచ్చును. ఈ శోక భావమునకే కరుణ మని పేరు. ఇదియే జీవుని వేదన. ఆయా భావములు ప్రపంచితములైనపుడు వాని రంజనము బడి శృంగారాది నామ వ్యవహారము కలుగవచ్చును. కాని స్వభావమున జీవుని వేదనయే. ఇచ్చటః వేదన యన జీవ చైతన్యమందు కలుగు దీప్తి. దీని స్వరూపము పరమేశ్వర విరహము. ఆ విరహమునందును పరమేశ్వరుని వెలుగు నిండియున్నది. అందుచేత నదొక దివ్యానుభూతి. ఈ మూలభూతమైన శోక భావమును జీవ స్వభావమును సాగగొట్టి కావ్యానుభూతి స్వరూపము స్పష్టతమముగా చెప్పినవాడు భవభూతి. సంవిధానక నిర్మాణమునందు—భాస కాళిదాస భవభూతులయందు సాజాత్య మున్నది. ఒకరికంటె నొకరు సంవిధానక నిర్మాణ శిల్పమునందు పరిపూర్ణత్వము సాధించినారలు. భాసుని శిష్యుడు కాళిదాసు. ఆయన శిష్యుడు భవభూతి.

భానుమతి

సీ. గజయాన కేలు సౌగంధి కాహారణంబు
శృంగార తిలకంబు చెలువనుదురు
కలకంఠి మైతావి కర్పూర మంజరి
కావ్యప్రకాశంబు కాంతపలుకు
మగువ హాసంబు “చమత్కార చంద్రిక”
సతిరూపలంకార సంగ్రహంబు
మీనలోచన కొప్పు మేఘసందేశంబు
రసకళిక మనోజ్ఞ రదనమోవి
గీ. యువిదమోము ప్రబోధ చంద్రోదయంబు
గాఁగ జగములు చదువులు గాగణించు
ఓమి యాశ్చర్యమని లోకులెల్లఁ బొగడ
నలరు వేడుక నిపుడు నయ్యలరుఁ బోఁడి.

రెంటూరి రంగరాజు—భానుమతీ పరిణయము.

తీవ్రవాద నాయకుడు

శ్రీ బాలగంగాధరతిలక్

శేషయ్య మున్సిపాలిటీవాళ్ల రోడ్లన్నీ తిరుగుతూంటాడని చెప్పడానికి అతని పైజామాలు నిదర్శనం.

ఆ రోడ్లమీద దుమ్ము మాంచి ఒత్తుగావుండి, అడుగు పెట్టగానే ఝామ్మని రేగిపోవడం మున్సిపాలిటీవారి బుద్ధి కుశలతకి నిదర్శనమైనట్టు.

శేషయ్య ఇలా తిరగడంవల్లనే రోడ్లరిగిపోయి, దుమ్ము లేస్తోందని ఒక కౌన్సిలర్ విమర్శకులకి చెప్పిన జవాబు.

పాపం శేషయ్యకి తిరగడమేపని. ఆకలేసినప్పుడల్లా శేషయ్య తిరుగుతూంటాడు. అదేమిటోకాని, రోజూ శేషయ్యకి ఆకలేస్తుంది.

ఎప్పుడూ కడుపునిండా తినడానికి వీలు దొరకదు కాబట్టి ఎప్పుడూ ఆకలేస్తూనే ఉంటుంది. అందుకే ఎప్పుడూ తిరుగుతూంటాడు.

ఆ వూళ్లో ఉపాధ్యాయులు భూ పరిభ్రమణాన్ని శేషయ్యతో పోల్చిచెప్పడంవలన విద్యార్థులకి చటుక్కున అర్థమైపోతోందని ప్రతీతి.

ఇటు శ్రమిక లోకానికీ, అటు ఉద్యోగానికీ సంపాదనకీ నోచుకోని, స్థిరత్వంలేని, ఏమీ చెయ్యలేని, ఎందుకూపనికిరాని శేషయ్యలాంటి నిరర్థకపుశక్తి ఒకటి చిన్నరకం మధ్యతరగతి కుటుంబాలలో బయల్పడుతుంది.

శేషయ్య స్కూలుఫైనల్‌వరకూ చదువుకున్న వాడేనని వదంతి కూడా వుంది. మధ్య మధ్య ఇంగ్లీషు మాటల్ని ఉద్యోగపర్వంలో తిక్కన పద్యాల్నీ గుబగబా అనేస్తాడనీ, ఒక్కొక్కసారి నిశితంగా తెలివి తేటల్ని ప్రదర్శిస్తాడనీ కొందరు చెప్పుకుంటూ ఉంటారు.

అయితే అతనెందుకు వృథాగా ఏ సంపాదనా, ఏ పనీ లేకుండా ఉండిపోయాడు? ఈ ప్రశ్నకి దేశంలోని నిరుద్యోగం మీదా మనస్తత్వాలమీదా కొందరు నిపుణుల్ని కమిటీ కింద వేసి, పరిశీలన చేయిస్తే తప్ప సమాధానం దొరకదు.

శేషయ్యకి ఓ విధవ అక్కగారూ, తల్లీ ఉండేవారు. ఇతని సంపాదనా చాతుర్యానికి తట్టుకోలేక తల్లి పరలోకానికి చెప్పుడు చెయ్యకుండా వెళ్ళిపోయింది. అంతకన్నా గప్‌చిప్‌గా అక్కగారు ఒకనాటిరాత్రికి రాత్రి ఎవడితోనో లేచిపోయింది.

ఆరోజున శేషయ్య చాలా విచారంగా ఉన్నాడు. అక్కగారు చేసిన అప్రతిష్ఠ పనికికాదు—తను కూడా ఆడదైవుంటే ఎవడేనా లేవదీసుకుపోనుకదా అని.

ఇప్పుడు శేషయ్య లోఫర్.

ఇదివరకు ఎరిగున్నవాళ్లూ, పాత స్నేహితులూ, దయా హృదయులూ ఎప్పుడేనా ఏదేనాఇస్తే తీసుకుంటాడు, తింటాడు, నిద్రపోతాడు. లేనిదే తిరుగుతూంటాడు, అర్థం లేకుండా.

అదేకాదు, అతను మంచివాడు కూడా. దొంగతనం చెయ్యడు, తన కివ్వలేదని ఒకర్ని నిందించడు, మోసం చెయ్యడు, దబాయించడు. ఆ రోడ్లమీద అలాగ తిరగనిస్తోన్నందుకు అందరికీ కృతజ్ఞత తెలుపుతున్నట్టు ఉంటాయి అతని కళ్లు.

ఇటువంటి పరమ దరిద్రుడియొక్క అవసరం ఎవరికీ ఉంటుందని మనం కలలో కూడా అనుకోం. అయితే తిరపతికి మాత్రం ఇతనిలోని గర్భిత శక్తిని—Potential కనిపెట్టే గౌరవం దక్కింది.

ఆ వూళ్లోవున్న తీవ్రవాద సంస్థ కార్యదర్శి తిరపతి. సమ్మెలూ, నిరసన ప్రదర్శనాలూ, ఎర్ర జెండాలూ, నల్లజెండాలూ కొట్లాటలూ, నినాదాలూ ఇవన్నీ తిరపతి కార్యదీక్షా ఫలితాలు. అతడు అశాంతిని రేపుతాడు. మంచులోంచి మంట పుట్టించగలిగిన తీవ్రవాది.

ఆకలితో ఉన్నవాడు, ఆస్తిపాస్తులు లేనివాడు, నిరాశ అంచులమీద నడుస్తూన్నవాడు—ఈవేళో రేపో కాస్త ట్రెయినింగుతో బ్రహ్మాండమైన తీవ్రవాదిగా సోషలిస్టో, కమ్యూనిస్టో, బోల్షివిస్టో—ఏదో ఒకటి అయిపోయే సావకాశం వుందని తిరపతి దృఢాభిప్రాయం. అందుకే శేషయ్యతో స్నేహం చేశాడు. రోజూ అతనికి ఎన్నో చెప్పేవాడు. ప్రపంచంలో రెండే వర్గాలున్నాయన్నాడు. ఈ రెండింటికీ, పాముకీ, ముంగిసకీఉన్న ఆజన్మవైరం లాంటిది ఉంది అన్నాడు.

చారిత్రకంగా ఆధారాలు చూపించాడు. రష్యా—చైనా దేశాలలో ప్రజా విప్లవాన్ని చిత్రించాడు. చివరికి తన భావ బీజాలు అతనిలో అంకురస్థితికి వచ్చాయన్న సమయాన, 'మా సంస్థలో—పార్టీలో చేరు శేషయ్యా. నీ హక్కులకోసం, నీ వేలాది సోదరులకోసం నడుంకట్టి అగ్రగామివై నడు, నడిపించు' అని ఆవేశంగా హెచ్చరించాడు.

తిరపతి ఉపన్యాసం గంటన్నరసేపూ విన్నాక, శేషయ్య తల గోక్కుంటూ తాపీగా 'సర్లెండి. మా మాధవుణ్ణి కలుసుకుని వాడు కూడా మంచిదే అంటే చేరుతాలెండి. ఏదో మీరింతగా అడుగుతూంటే......' అంటూ నసిగాడు.

తిరపతి నివ్వెరపోయాడు. ఒక రాజకీయమైన ఆదర్శం కోసం, దేశంకోసం ఇంతగా తను చెపితే, ఇదేదో మొహమాటం

అభినయించే శేషయ్యని చూడగానే తిరపతి జన్మకంతటికీ సరిపోయేటంత విస్మయం కలిగింది. అందులోనూ శేషయ్య చెప్పిన మాధవుడు ధనవంతుడు. ఆ వూళ్లోకల్లా ధనవంతుడు. తిరపతి లేచి, శేషయ్య మొహంమీద మొహంపెట్టి గట్టిగా కంఠ నాళాలు ఉబ్బేటట్టుగా 'రియేక్షనరీ—పెటీబూర్జువా' అని అరచి గబగబా వెళ్ళిపోయాడు. ఆ మాటలలోని అర్థమూ విందా ఏమిటో తెలియకపోయినా తిరపతికి ఎందుకు కోపం వచ్చిందా అని ఆలోచించుకుంటూ ఇంకా తలగోక్కుంటూనే రోడ్డు పట్టాడు శేషయ్య.

మాధవుడితండ్రికి ఇన్‌కమ్‌టాక్సువాళ్ల లెక్కల ప్రకారం సాలుకి యాభైవేల రూపాయిలు తక్కువ కాకుండా ఆదాయం. ఇదికాక, పన్నులకీ, ప్రభుత్వపు కన్నులకీ దొరకని ఆదాయం ఎవరికి తోచిన రీతిని వాళ్లు అంచనా వేస్తూంటారు. ఇంత శ్రీమంతుడైన మాధవుడూ, శేషయ్యా స్నేహితులవడానికి కారణం వీళ్లిద్దరూ ఆ అవూరి స్కూల్లో ఫేలౌతూ, ప్యాసవుతూ ఏడెన్మిదేళ్లు కలిసి చదువుకోవడమూ—కలిసి వేరు సెనక్కాయలూ, బటానీలు కొనుక్కు తినడమూలాంటి సంఘటనలు. ఇప్పు డిద్దరికీ పాతిక సంవత్సరాల వయస్సు దాటినా, వారి మధ్య అంతరం బాల్యంలోకన్నా ఎక్కువైనా, ఎప్పుడోకాని రోడ్డుమీదతప్ప, కలుసుకోకపోయినా, శేషయ్యకి మాధవుడంటే అభిమానమూ, నమ్మకమూ కూడా.

కారు ఆపుచేసి, మాధవుడు పిలుస్తాడు. శేషయ్య ఓ నిముషం ఆకల్నీ, బాధల్నీ మరచిపోయి, నవ్వుతూ దగ్గరగా వెళతాడు.

'ఏరా శేషూ! బాగున్నావా' అంటాడు మాధవుడు.

'ఆఁ రోడ్లమీద యిలా చక్కర్లు కొట్టుతున్నావు'.

'నీ పనే బాగుందిరా'.

'అదేం?'

'మానాన్న డబ్బివ్వడురా. కొట్లల్లో కాఫీ హోటళ్లలో అప్పులు రెండువేలు. ఫ్రెండ్సుకి అయిదారువందలు ఇవ్వాలి. పెట్రోలు బంక్‌కి ఆర్నెల్లనుంచి కానీ ఇవ్వలేదు. ఛీ ఛీ ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోందిరా'.

శేషయ్య అటువంటి సమయంలో మిత్రుడిమీద నిజంగా జాలిపడేవాడు. 'మీ నాన్నకింత కరుకుతనం పనికిరాదు' అనేవాడు.

'మా నాన్న! రాక్షసుడు. విలన్. రావణాసురుడు. హిరణ్యకశిపుడు' అని తిడుతూ కారు స్టార్టుచేసి వెళ్ళిపోయేవాడు మాధవుడు.

......నాలుగైదు నెలల అనంతరం శిథిల గృహావశేషమైన ఒక గదివంటిదాంట్లో నిదరిస్తూన్న శేషయ్యకి తననెవరో పిలుస్తూన్నట్టనిపించి, కళ్ళు నులుముకుని బయటికి వచ్చాడు. మాధవుడు కార్లోంచి అమాంతం దుమికి, శేషయ్యని కావలించుకుని, 'శుభవార్తరా శేషూ' అన్నాడు.

శేషయ్య అర్థమైనట్టు నవ్వి, 'ఎప్పుడురా లగ్నం?' అని అడిగాడు.

'ఛఛ—పెళ్లీ గిళ్లీకాదు. నా డియర్ ఫాదర్ చచ్చిపోయాడు. ఈ వేసవికి ఊటీ వెళ్లాంకదూ. అక్కడ సడన్‌గా, హాయిగా కళ్ళు మూశాడు. ఒరేయ్ శేషూ, రాయిలా అలా నిలబడ్డావేంరా?—కంగ్రాచ్యులేషన్సు చెప్పక' అన్నాడు మాధవుడు శేషయ్య భుజాల్ని కుదుపుతూ.

బెదురుగా 'కంగ్రాచ్యులేషన్సు' అన్నాడు శేషయ్య.

'ఇంక పెళ్ళి విషయం చూడుభాయ్. నాలాంటివాడికి పెళ్ళి ఆటంకమేకాని, సుఖంలేదు. నలుగు రమ్మాయిలకి ప్రామిస్ యిచ్చి, వేర్వేరుగా లొంగదీసుకున్నాను—పెళ్ళని తెలిస్తే నలుగురూవచ్చి ఇంటిముందు సత్యాగ్రహం చేస్తారు. వాళ్లనెలా వదలించుకోవడమా అని బ్రహ్మాండమైన మానసిక పరిశ్రమ చేస్తున్నాను' అని ఓసారి ఆగి, మాధవుడు మళ్లీ యిలా అన్నాడు.

'ఈ శుభ సమయంలో ఆబాల్యమిత్రుడివైన నీకు ఎన్నడూ మరచిపోలేని ఒక బహూకృతి—ఒక అనుభవరూపంలో ఇవ్వదలిచాను. రా నాతో కారు ఎక్కు'.

శేషయ్య తన మాసిన గడ్డాన్నీ, పైజామాల్నీ చూసుకుని, సందేహిస్తూ, 'ఎందుకూ, ఎక్కడికీ?' అన్నాడు.

'నీకు అవన్నీ అనవసరం. నేను చెప్పినట్టు చెయ్యి' ఆజ్ఞాపించాడు మాధవుడు.

శేషయ్య ఏనాడూ మాధవుణ్ణి కాదనలేదు.

కారు సెలూన్ దగ్గరా, రెడిమేడ్‌షాపు దగ్గర ఆగి, బయలుదేరేసరికి శేషయ్య రూపం సర్వాంగసుందరంగా అభినవంగా సూట్, బూట్, హేట్‌తో దర్శనీయంగా తయారయింది. ఈసారి కారు ఓ పెద్ద హోటల్‌ముందు ఆగింది.

'ఇదిగో శేషూ. రెండవ అంతస్తులో నీకోసం ఎయిర్ కండిషన్డ్ గది ఒకటి తీసుకున్నాను. ఈ మూడువందలూ నీ దగ్గర ఉంచుకో. నాల్గవరోజునాటికి నీ దగ్గర పైసా కూడా ఉండకూడదు. ఈ హోటలులో నీకు సర్వ సౌఖ్యాల్నీ, భోగాల్నీ ఎప్పుడు కోరినా పళ్లెంలోపెట్టి అందిస్తారు. హాయిగా, కులాసాగా అనుభవించు' అంటూ మాధవుడు మూడువందల రూపాయిల నోట్లు శేషయ్య కోటుజేబులోపెట్టి విష్‌చేసి వెళ్ళిపోయాడు.

తెల్లబోయి నుంచున్న శేషయ్యని ఇద్దరు హోటల్ జవాన్లు గౌరవంగా, భక్తి శ్రద్ధలతో నడిపించుకు వెళ్ళి లిఫ్ట్ ఎక్కించి రెండవ అంతస్తులో ఒక పెద్ద గదిలో దిగవిడిచారు

చలువరాయి చప్టాలో, చల్లదనంఇచ్చే రంగులతో నిగనిగ మెరిసే సామగ్రితో టెలిఫోన్, రేడియోగ్రాములతో వేడి, చల్లని కుళాయిలతో, కిటికీలకి సిల్కు తెరలతో పువ్వుల కుండీలతో ఎవరో సౌఖ్యం అనే భావాన్ని భౌతికంగా తర్జు

మూచేసి, నాలుగు గోడలమధ్యా బంధించినట్టనిపించింది శేషయ్యకి.

మంచంమీద వాలగానే డన్‌లోపిల్లో మెత్తని పూవుకి తన్నొక దేవకన్య మెత్తగా మత్తుగా కౌగలించుకుంటూన్నట్టు అనుమానపడి, ఫక్కున నవ్వేశాడు.

'రోజుకీ గదికి అద్దె ఎంత?' అని అడిగాడు శేషయ్య.

'నలభై రూపాయలు' అన్నాడు బోయ్.

ఉలిక్కిపడి 'నాకు తాగేందు కేదేనా కావాలి. షాంపి షాంపి.......' అని పేర్లు తెలియక తికమకపడ్డాడు శేషయ్య.

రక రకాల పానీయా లతని ముందుకువచ్చి పడ్డాయి.

'నాకు తినేందు కేదేనా కావాలి' అన్నాడు శేషయ్య.

నానా విధ భక్ష్యాలూ అతని ఎదుట సాక్షాత్కరించాయి.

'అబ్బ, వొళ్లు నొప్పులుగావుంది. నిద్ర వస్తోంది' అనుకున్నాడు శేషయ్య తనలో తాను.

ఒక ఓఢ్ర మంగలి వళ్లు పట్టగా, రేడియోనుండి చక్కని పాటవింటూ కలలుకంటూ నిద్రపోయాడు శేషయ్య.

సాయంత్రం టాక్సీలో పార్కుకీ, ఊరు శివారుకీ థియేటర్‌కీ వెళ్లాడు. ఎక్కడా అతనికి అమితమైన గౌరవం. ఒకచోట జనం గుంపులుగాచేరి, గారడీ ప్రదర్శనాన్ని చూస్తున్నారు. అటువంటి వీధి ప్రదర్శనాలు చూడడం బాగా అలవాటయిన శేషయ్య కారాపి, అక్కడ దిగాడు. ఎవరో అడిగారు.

'అయ్యా తమ రెవరు. ఎక్కడ ఉంటున్నారు?'

'దేవేంద్రాహోటల్, రూమ్ నెంబరు 18' అన్నాడు శేషయ్య.

అంతే. జనం పాయలుగా విచ్చిపోయారు. జనం పీతల్లా ముడుచుకుపోయారు. కొందరు 'సలాం' అన్నారు. కొందరు నమస్కరించారు. పక్కనున్న టీ దుకాణంవాడు గబగబా ఓ కుర్చీ తీసుకువచ్చి వేశాడు. శేషయ్యకి వెర్రి ఆనందమూ, గర్వమూ కలిగాయి.

రాత్రి వెన్నెలలో **Roof – garden** లో భోంచేశాడు. సగం సగం బట్టల్ని ధరించి, ఉద్రేకపరిచే నాట్యాన్ని చూస్తూ బీరునీ వైన్‌నీ తాగాడు. తూలుతూ గదిలోకి వచ్చాడు. కాలింగ్ బెల్ నొక్కాడు.

'చిత్తం' అన్నాడు నౌకరువచ్చి.

'కావాలి' అన్నాడు శేషయ్య.

'ఏమిటిసార్'

'వాళ్లు'.

'ఎవరుసార్'.

'పిల్లలు'.

కాసేపట్లో కృత్రిమమైన నవ్వుల్ని కురిపిస్తూన్న ఒక తైనాతీ వచ్చాడు. ఆల్బమ్ ఒకటితీసి, చూపించాడు. ఆశగా, ఆబగా అన్ని బొమ్మలూచూసి ఒక బొమ్మమీద వేలు పెట్టి 'యిది' అన్నాడు శేషయ్య.

'యాభై రూపాయలు' అన్నాడు తైనాతీ'

'ఆల్‌రైట్' అన్నాడు శేషయ్య.

అందానికీ అలంకారానికీ, కృత్రిమత్వానికీ ఆడదానికీ, పశుత్వానికీ ప్రేమకీ మధ్యగల వ్యత్యాసం తెలియని శేషయ్య ఒక అపరిచిత వ్యభిచారిణి కౌగిలిలో సొమ్మసిలి నిద్రపోయాడు. మూడు రోజులూ ఎప్పుడూ ఎరుగని ఆనందాన్నీ తృప్తినీ గర్వాన్నీ అత్యున్నతస్థాయిలో పొందిన శేషయ్యకి తల తిరిగిపోయింది. వివేకం తప్పిపోయింది. అధికారమూ, సౌఖ్యమూ తన జన్మహక్కు అనుకున్నాడు—తనే సౌఖ్యమూ, అధికారమూ అంటే అనుకున్నాడు.

మూడవరోజు రాత్రి పండ్రెండు గంటలకి మూడవ బొమ్మ శేషయ్య గది విడిచి వెళ్ళిపోయింది. నిద్ర మత్తులోఉన్న శేషయ్యకి తెల్లవారగానే తాను గది కాళీచేసి తన పాత తాటాకు ఇంటికి వెళ్ళిపోవాలన్న జ్ఞానం చటుక్కున తేలుకాటులాగ చుర్రుమంది.

ఎవరో ఒక పెద్ద నిచ్చెనవేసి, ఎత్తుకి మరీ ఎత్తుకి ఎక్కించేసి, ఉన్నట్టుండి దభాల్న కిందకి తోసేసినట్టయింది శేషయ్యకి. అతనిబుర్ర తీవ్రంగా పని చెయ్యడం మొదలు పెట్టింది. భయమూ బాధా నిర్వేదమూ కలిగాయి. పళ్లు బిగించాడు. తల పట్టుకున్నాడు. ఎయిర్ కండిషన్డు గదిలో కూడా అతనికి చెమటలు పట్టాయి. తెల్లవారేవరకూ ఆలోచిస్తూ, గదిఅంతా కలయవొక్కాడు.

ఏడుగంటలకి—ఉదయం—హొటలు విడిచి రోడ్డుమీద అడుగుపెట్టాడు. మాధవుడు నవ్వుతూ ఎదురొచ్చాడు. 'ఏరా, ఎలాగవుంది?' అన్నాడు.

కోపంగా మాధవుణ్ణి ఆపాదమస్తకం పరీక్షించి 'హుం' అన్నాడు శేషయ్య.

'ఏమిట్రా యిదీ' అన్నాడు మాధవుడు.

'చంపేస్తా'.

'ఎవర్ని'.

'నిన్ను'.

'ఆ—'అంటూ ఒక్క అడుగు వెనక్కివేశాడు మాధవుడు.

'ప్రపంచంలో రెండే రెండు వర్గాలు. ధనికులూ, పేదలూ. వీరిమధ్య ఎప్పుడూ ఎడతెగని వైరం. జాగ్రత్త మాధవ్! ఇంతమంది దరిద్రుల్ని విస్సహాయుల్ని నీచుల్ని తయారు చేసిన నిన్నూ, నీలాంటివాళ్లనీ క్షమించేదిలేదు. మువ్వంటే నాకు వైరం. పీక దాకా ద్వేషం, అసహ్యం'—అంటూ గబగబా వెళ్ళిపోయాడు శేషయ్య.

మాధవుడు తెల్లబోయి చూస్తున్నాడు. మాధవుణ్ణి చూసి, ప్రత్యుత్థానం చేసేందుకు వచ్చిన హోటల్ మేనేజరు శిలా సదృశుడైపోయాడు.

శేషయ్య తిన్నగా తీవ్రవాద సంస్థ కార్యాలయానికి వెళ్ళాడు. అక్కడ కుర్రవాణ్ణి జుట్టు పట్టుకుని ఊపుతూ, 'ఏడీ తిరపతి ఎక్కడ' అని గర్జించాడు. కుర్రాడు భయపడి ఓగది చూపించాడు. శేషయ్య విసురుగావెళ్ళి, 'తిరపతీ, నీ సంస్థలో చేరాను. నా పేరు రాసుకో' అన్నాడు.

తిరపతి గుడ్లప్పగించి చూస్తున్నాడు.

శేషయ్య పిడికిలి బిగించి, గాలిలో వూపాడు. 'ఈ ధనిక వర్గాన్ని నాశనం చెయ్యడమే నా జీవితాశయం. నల్లుల్లాగ నలిపి పారేస్తాను. విప్లవం నాధ్యేయం. హింస నా సాధనం. ద్వేషం నా రక్తం' అని అరిచాడు.

ఆలస్యంచేస్తే తననే చంపేస్తాడేమో అన్నంత తొందరలో గబుక్కున శేషయ్యపేరు రాసేసి సభ్యత్వపు రసీదు శేషయ్య కిచ్చాడు తిరపతి.

'ఇప్పుడు నేనేం చెయ్యాలి'—అడిగాడు శేషయ్య.

'సాయంత్రం మీటింగ్. అక్కడికి రా' అన్నాడు తిరపతి. మీటింగులో శేషయ్య ఉపన్యాసం విన్నవాళ్ళ ఒళ్ళు జలదరించి, కంగారుపడిపోయారు. అతనేం చెప్పాడో సరీగా ఎవరికీ తెలియదుకాని, చూపులూ, మంటలూ, శ్మశానాలూ, గద్దలూ, రక్తమూ మొదలైన భయంకరమైన మాటలు చాలా చాలా వినిపించి, చాలామంది చప్పట్లు కొట్టేశారు.

నాటినుంచీ ఎక్కడ చూసినా శేషయ్య. పోస్టర్లు అంటిస్తూ శేషయ్య, మీటింగులతో శేషయ్య, సమ్మెలలో శేషయ్య.....

ఓసారి ఎవడో ఒక ధనవంతుడితో మాట్లాడినందుకు ఒక సభ్యుడిని సాచి లెంపకాయ కొట్టాడు శేషయ్య.

ఇంకోసారి ఓ సినిమాతార బొమ్మని జేబులో దాచుకున్నందుకు ఒక యువకుణ్ణి వాళ్ల సంస్థ కార్యాలయం గదిలో పైవాసానికి తాడుకట్టి రాత్రంతా వేలాడతీశాడు శేషయ్య.

శేషయ్య కఠినంగా అయిపోయాడు. నిరంతర ధనిక ద్వేషం ఒక మహోన్నతంకింద కొనసాగిస్తున్నాడు. అందుకే మేడల్నీ మోటారు కార్లనీ ఫస్టు క్లాసురైలు పెట్టెల్నీ కూడా చూడడు. గట్టిగా కళ్ళు మూసేసుకుంటాడు. అందమూ, ఆనందమూ, కళలూ—ఈమూడూ తీరికగల ధనవంతులకే కాబట్టి నాటి ప్రసక్తి కూడా రానివ్వడు. ఎప్పుడూ కొరకొరలాడుతూ పడు నూర్తున్న కొరకంచులా ఉంటాడు.

శేషయ్యముందు తిరపతి నీరసించిపోయి, తక్కువ రకపు సంస్కరణవాదిలా అందరికీ కనిపించాడు.

శేషయ్య చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ ప్రభువుడైపోయాడు. కొన్నాళ్లకి జిల్లా అంతటికీ ఏకైక తీవ్రవాద నాయకుడుగా గుర్తించబడ్డాడు.

శేషయ్య కళ్లల్లో ద్వేషం స్పిరిట్‌లా నీలంగా మండుతూంటుందనీ, ఇప్పటికీ అతనికి రాత్రుళ్ళ కలల్లోకి 'హోటల్లో మూడు రోజులూ, మూడు బొమ్మలూ' వచ్చి ఉలిక్కిపడుతూంటాడనీ మాధవుడు అందరితోనూ అంటూంటాడుట!

కూరలవంటు

సీ. పులుసోర చేఁదునుప్పును దీపు నొగపును
గణుతింపఁ బానాధికములు గాక
చిముడంగఁ బొఅక, చిక్కనై యిగురకఁ
గాటువోవక, మఱి కలఁతపడక
యుడికి యూనుడుకకయుండి నీర్కమ్మక
బసరువేయక పరిపాటి చెడక
సంబారములతోడి సంబంధ మెడలక
పొగపుకాసిన విరిపోటుగాక

గీ. వింతలై జిహ్వకును రుచుల్ విస్తరిల్ల-దగు పదార్థంబు వెల్లడఁదాము తామ
భోక్తలకు భోజనాసక్తిఁ బొడమఁజేయ-నిండు వేడుకఁ గూరలు వండు నేర్తు.

పెదపాటి యెఱ్ఱన కుమార నైషధము.

అలభ్యమగు

అన్నమాచార్య రామాయణము

శ్రీ వేటూరి ఆనందమూర్తి

తాళ్లపాక చిన్నన్న తానురచించిన 'అన్నమాచార్య చరిత్ర ద్విపద'లో తన తాతగారగు అన్నమాచార్యుని రచనలను ప్రస్తుతించుచు నీ క్రింది విధమున వివరించెను.

> "సారస నేత్రుపై సంకీర్తనములు
> పరసత్యమును దాళసముఖముల్ గాఁగ
> సరసతంత్రములు ముప్పది రెండువేలు
> ప్రవిమల ద్విపద ప్రబంధరూపమున
> నవముగా రామాయణము,......
>
> ....

ప్రతిలేని నానా ప్రబంధముల్ చేసి "(అన్నమా. చరిత్ర. పు 46—47) ఇందు అన్నమాచార్యుడు ద్విపద రామాయణ ప్రబంధ రచయితగాఁ బ్రస్తుతుడయ్యెను. ఈ రామాయణమును 'ప్రవిమల ద్విపద ప్రబంధ' రూపమున 'నవముగా' రచించెననుటలో విశేషించి వీరి రచన లక్షణబద్ధమైన దనియు, నంతకుముందు వేరొక ద్విపద రామాయణ రచన యుండగా దీనిని వీరు క్రొంగ్రొత్తగా ప్రతిభామయముగా వివరించినారనియుఁ గూడ నూహింపనగుచున్నది. అన్నమాచార్యుని ద్విపద రామాయణము నేడు కానరాదుకాని రామాయణకథ ప్రసక్తములు సంకీర్తనము లనేకము లున్నవి [1]. అన్నమయ్యగారి రచనలన్నియు శ్రీ వెంకటేశ్వరస్వామి వారికే యంకిత మవ్వటనుబట్టి యిదియు నా స్వామికే యంకితమై యుండు ననవచ్చును. దుర్లభమగు నీ ద్విపరామాయణ ప్రబంధము నుద్ధరించుట తెలుగువారి పనియై యున్నది !

తెలుగు దేశమున రామాయణ ద్విపద కావ్యములు' గ్రంథకర్తృ నామాదికములు తెలియదగిన ఒకకొన్ని తంజావూర్, మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములం దున్నవి. వీనిలో కొన్ని ముద్రితములు— కొన్ని యముద్రితములు.[2] ఇవికాక ఆద్యంతములు శిథిలములై కర్తృత్వ విషయాదిక మగోచరముగను, సంశయాస్పదముగను గల రామాయణ ద్విపద రచనా భాగములును, రామాయణ కథాప్రసక్తములగు ద్విపద గ్రంథద్విభాగములునుగూడా నొండు రెండు గలవు.[3] వీనినెల్ల పరస్పరముపోల్చి పరిశీలించినచో వేయే పంక్తులేయే కవుల గ్రంథము లందలివో కొంతవరకెఱుగుట కవకాశ మేర్పడును. మనకు లభ్యములై సుప్రసిద్ధములగు రామాయణ ద్విపద కృతులలో రంగనాథ రామాయణము, కట్టావరదరాజు రామాయణము, భోసల ఏకోజీ రామాయణము ముఖ్యముగా పేర్కొనదగినవి. ఆంధ్ర విశ్వకథా పరిషత్తువారు రంగనాథ

---

1. చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక— పుట69—70. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

2. ద్విపద రామాయణ కృతులలో కాలక్రమము ననుసరించి యెఱుగదగిన వాటిలో మొదటిది రంగనాథ రామాయణము (13 శతాబ్ది— ముద్రితము), తరువాతిది అన్నమాచార్య రామాయణము (15 శతాబ్ది—అలభ్యము), ఆ తరువాతిది కట్టావరద రాజు రామాయణము(16 శతాబ్ది—ముద్రితము), అటుతరువాతిది భోసల ఏకోజీరామాయణము (18 శతాబ్ది—అముద్రితము) పేర్కొనదగినవి.

3. మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున సంఖ్య 981 నుండి 1008 వఱకు గల గ్రంథములన్నియు రామాయణ సంబంధముగలవే. వీనిలో కొని స్పష్టంగా రంగనాథ రామాయణ భాగములే. అయినను వీనిలోగొన్నిట రంగనాథ రామాయణమున గానరాని పాఠభేదములు గలవు. ద్విపద రామాయణములను గూర్చిన సమగ్ర పరిశీలనము గావించువారీ క్రింది వానిని పరిశీలించిన కొంతవిషయము తెలియగల దనుకొందును. సంఖ్యలు 990, 996, 1005.

ఇక తంజావూరు సరస్వతీ మహలు పుస్తక భాండాగారమందు సంఖ్య 335 మొదలుకొని 352 వఱకును గల ప్రతులన్నియు రామాయణ ద్విపదలే. వానిలో 336 నుండి 350 వఱకు నన్నియు రంగనాథ రామాయణ ద్విపదభాగములు.

351— కట్టా వరదరాజు రామాయణము

352 భోసల ఏకోజీ రామాయణము.

356— విభీషణబుద్ధి యను గ్రంథభాగము కూడ చాలవఱకు రంగనాథ రామాయణ రచనగనే కానవచ్చుచున్నది. కాని పాఠభేదము లధికముగ నున్నవి.

మదరాసులోని పై 990 సం. గల ప్రతిలో తొలుత తాళ్లపాక

రామాయణమును పరిష్కరించి శుద్ధ ప్రతిని ప్రకటించి పాఠాంతరములను, ప్రక్షిప్తములైన వానిని గుర్తించి యనుబంధములలో ప్రకటించిరి. 4 ఆటు పిదప కట్టా వరదరాజ రామాయణము తంజావూరు సరస్వతీ మహలు లైబ్రరీ పక్షమున ప్రకటితమైనది. 5 దీనిని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు తంజావూరులోని 351 సం. గల ఏకైక ప్రతినిబట్టి పరిష్కరించి, ప్రకటించినారు. ఇక మూడవది అముద్రితమై, తంజావూరు గ్రంథాలయమందే 352 సంఖ్యతోగల ఏకోజీ రామాయణము. కావున తాళ్ళపాకవారివిగా ననుమానింపదగిన ద్విపద గ్రంథ భాగములేవేని లభ్యము లగుచో వానిని పై మూడు గ్రంథములతో జాగ్రత్తగా పరిశీలించిన యెడల అన్నమాచార్యుని రామాయణమును గూర్చిన వివరణము కొంత తెలియగలదు. కాని ఇందులో కూడ కొన్ని చిక్కులున్నవి. రంగనాథ రామాయణమునందలి వనుకొను ద్విపదలు కొన్ని వరదరాజ రామాయణములోనివిగా కానవచ్చుచున్నవి. 6 ఇక తాళ్లపాకవారి ద్విపద పంక్తు లెన్ని పైని పేర్కొనబడిన రామాయణ గ్రంథములందు లీనమైపోయినవో! వరదరాజు రామాయణాదులకు ప్రత్యంతరములు కూడ లేమిచే నిది యొక చిక్కు సమస్యగనే మిగిలిపోవుచున్నది.

ఆంధ్ర విశ్వ కళాపరిషత్తువారు ప్రకటించిన రంగనాథ రామాయణమున కడపటి రెండు అనుబంధముల నిచ్చినారు. అందు రెండవ యనుబంధమున రంగనాథుని రచనలో చేరిపోయి, పలు ప్రతులలో గానరాని, ఇతరేతర కవి కృత గ్రంథ రచనా భాగములు ప్రకటింపబడినవి. ఆ యా భాగములలో కొన్ని చరణములు 16 వ శతాబ్దములో రచితమైన వరదరాజ రామాయణమునందలివని తత్పరిష్కర్తలు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు తమ పీఠికలో వివరించిరి. లట్లే అన్నమార్య కృత రామాయణ ద్విపదలు కూడ కొన్ని కొన్ని యందుండి యుండవచ్చునని వా రభిప్రాయపడిరి. ఇందలి యథార్థ్యము అన్నమాచార్యునిదిగా ననుమానింపదగిన గ్రంథ భాగ మెచటనేని లభ్యమయినపుడు వ్యక్తము కాగలదు. కాని, యున్నంతలో ముద్రితమగు రంగనాథ రామాయణమున పరిశిష్టమున నీయబడిన ద్విపదలలో అష్టమహిషీ కళ్యాణకర్తయగు తాళ్లపాక చిన్నన్న చెప్పిన ద్విపద లక్షణము ననుసరించిన పంక్తులు కొన్ని యుండుండ కను పోలేదు. అందందు తాళ్లపాకవారి పలుకుబడి తీరును లేకపోలేదు. మచ్చునకు రంగనాథ రామాయణము—రెండవ యనుబంధమునందలి పుటలు 686(22—20), 702 (131—13), 704 (151—9), 725 (288—3), 736 (310—2), 738 (312—19), 746 (315—23), 752 (354—18), 753 (369—16) పరిశీలింపదగును. పైని పేర్కొనబడిన ద్విపదలలోని లక్షణము, భాష, వైష్ణవభావన, అవతార ప్రశంస మున్నగు నంశములు గుర్తింపదగినవి. పై యుదాహరణములలోని పలుకుబడి, రచనారీతి, భావ సంపద అన్నమాచార్యుని రామాయణసంబంధి సంకీర్తనములందు పుష్కలముగా కానవగును. (చూ. సంకీర్తనముల సంపుటములు 2, 8, 11) కవితా స్వరూపమునుబట్టి, వీనిలో గొన్నియేని తాళ్ళపాకవారి ద్విపద పంక్తులు కాగూడదా ననవచ్చును.

శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు తమ వరదరాజ రామాయణ పీఠికలో 'తంజావూరి పుస్తకశాలలో 335 సంఖ్యగల 'రామకథ' యను ద్విపదభాగ మీ యన్నమయ్యగారి ద్విపద రామాయణములోనిది కావచ్చును. (పుట—32) అని వ్రాసిరి. దాని యందు గ్రంథ గ్రంథకర్తృ నామములు తెలిసికొనుట కాధారములులేవు. ఎవరి కంకితమీయబడినదో కూడ తెలియరాదు. 'రామకథ'లో ప్రపంచితమైనది రామాయణగాథకాదు. రామాయణ కథాప్రసక్తముగా రామ సుగ్రీవుల సంభాషణమున నడుమ సాగిన కపోత కథయే ఆందలి ఇతివృత్తము. విభీషణుడు శ్రీరాముని శరణుజొచ్చి నప్పుడు సుగ్రీవు డభ్యంతరము చెప్పు సందర్భమున నీ యితివృత్తము ప్రపంచితమైనది 7. ఈ గాథయే

నారి ఉషాపరిణయ ద్విపద యున్నది. దాని తరువాతనున్న రామాయణ రచన లన్నమయ్యదగు నాయని పరిశీలించితినిగాని, యందలి ద్విపదలు చాలవరకు రంగనాథ రామాయణమునందలివిగానే గోచరమైనవి. ఆ ప్రతి విలేఖకుడు రఘునాథ అనువాడు తాళ్లపాకవారి ఉషా పరిణయముతోబాటు రంగనాథుని ద్విపదనే వ్రాసికొనెను కాబోలును.

4. రంగనాథ రామాయణము—ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు ముద్రణము (1942) పరిష్కర్త—శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి.

5, వరదరాజ రామాయణము—తంజావూరు సరస్వతీ మహలు, గ్రంథమాల సం. 12. ముద్రణము 1950. పరిష్కర్త శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు.

6. చూ. వరదరాజ రామాయణ పీఠిక—ప్రథమ సంపుటము పుట 36.

7. సంస్కృత రామాయణమున నీ కపోత వృత్తాంతము స్మరింపబడిన దంతే.

'శ్రూయతేహి కపోతేన శత్రుశ్శరణ మాగతః
అర్చితశ్చ యథా న్యాయం స్వైశ్చ మాంసైర్ని మంత్రితః
సహితం ప్రతి జగ్రాహ భార్యా హర్తార మాగతమ్
కపోతో వానర శ్రేష్ఠ కిం పునర్మ ద్విధో జనః
శ్రీ రామాయణే—యుద్ధకాండే—అష్టాదశస్సర్గః
24—25

ఇందుదాహృతమగు కపోత వృత్తాంతమే (మహాభారత శాంతి

అలభ్యమగు అన్నమాచార్య రామాయణము

'కపోత వాక్య' మను పేరున మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున నాలుగైదు ప్రతులు విభిన్న కర్తృకములు కానవచ్చుచున్నవి.[8] కాని, నే జూచినంతవరకు నీ రచనయు నా రచనలును వేరుగా నున్నవి. దీనికర్త ఎవరోమరి! రచన చదివి చూడగా తాళ్లపాకవారిది కాదగునేమో యనదగియే యున్నదికాని, వారి రామాయణమున నీ యితివృత్త మింత విస్తృతముగా నుండియుండునా యని యొక సందేహము కల్గును. ఇది రామాయణమున వైష్ణవ పరమ ధర్మమగు శరణాగతిని వివరించు కథా సందర్భము గావున గోవింద రాజీయాది రామాయణ వ్యాఖ్యలీ పట్టున విపులముగా విశదీకరించినట్లే తాళ్ళపాకవారును దీని నింతగా విస్తరించి వ్రాసియుండరాదా యని సమాధానము చెప్పుకొని సందేహనివృత్తి చేసికొనవచ్చును.[9] పైగా నీ గ్రంథారంభము, ముగింపు 'కపోత వాక్య' మను పేరున గల ఇతర గ్రంథములందువలె కృత్యాద్యంత మర్యాదలతో లేక ప్రధాన రామాయణ కథకు నదుక దగినట్లే యున్నది. కావున నీ గ్రంథము వానివలె నొక స్వతంత్ర ప్రబంధముగాక, రామాయణ కావ్యాంతర్భాగమే కాదగుననుటలో దోషములేదు. ఇదమిత్థముగ నిది అన్నమయ్యగారి రామాయణ రచనా భాగమే యని నొక్కి చెప్పగల ప్రబల సాక్ష్యమిందు లేకున్నను, నేడు మనకు లభ్యము అగుచున్న రామాయణ ద్విపదలం దీ ద్విపదలను బొప్పించుటకు వీలులేని విధమున వాని వాని రచనా ప్రణాళిక లుండుటనుబట్టియు 10 లందీ ద్విపదలు లేకుండుటనుబట్టియు ఈ గ్రంథభాగము వేరొక రామాయణమునందలి దనుట నిక్కమనవచ్చును. అట్టి దేది యని ప్రశ్నించుకొనినపుడు అన్నమాచార్యుని రామాయణమే కాదగునని సమాధానము తోచును. ఇది యూహా మాత్రమే.

ఈ రామకథలోని ద్విపద పంక్తులే కొన్ని యిపుడు ముద్రితమగు కట్టా వరదరాజు రామాయణమున గొన్ని పాఠభేదములతో కానవచ్చుచున్నవి. మచ్చునకు---

"రవి లేని దినము సారథిలేని రథము
........లేని పరువు మాలిమిలేని యో...
తమిలేని వలపు చిత్తములేని కొలుపు
....
మితిలేని ప్రియము గామిడిలేని యూరు
సతిలేని గృహము నిస్సారంబుగాదె" (రామకథ)

చూడుడు—వరదరాజ రామాయణము (పీఠిక—పుట52)

"రవిలేని దినము సారథిలేని రథము
కవిలేని కీర్తి, యంకములేని పోటు
ప్రతిలేనివాదు తీర్పరిలేని సేవ
ధృతిలేని తెగువ కూరిమిలేని చెలిమి
సతిలేని గృహము వాసనలేని పూవు
ధృతిలేని కొలువు కోయిలలేని వనము;"

రామకథా గ్రంథకర్తృత్వ విషయ మెట్లున్నను ఇతరేతర కవికృత రచనా భాగములు కొన్ని వరదరాజ రామాయణము నందును ప్రవేశించిన వనుట కిదియే తార్కాణము. ఈ రామకథ శ్రీ విమదవోలువారూహించినట్లు, పైన నేను వివరించినట్లు అన్నమాచార్య కృతమే యగుచో నిట్టివే మరికొన్ని తాళ్ల పాకవారి రామాయణ ద్విపదలు వరదరాజ రామాయణము

పర్వాంతర్గతమగు కపోతోపాఖ్యానమే) ఈ తెల్గు కృతియంద వివరింపబడినది.

కాని రంగనాథ రామాయణమునం దీ వృత్తాంతము భిన్నముగా నున్నది.

"అర్కజ! ఇతడు మేలోట గీడోట తర్కింపనేటికి ధర్మంబు ద్రోవ శరణని వచ్చిన శత్రువునైన—బరికింపగా రాచపాడి రక్షింప, నొక కపోతము డేగ యుద్ధరి దరుమ—వికల భావంబున వేగంబవచ్చి శిబి మాటుసొచ్చె జొచ్చిన డేగయడుగ శిబితను విప్పి వెచ్చెరగున్న గాచె"

(రం. రామా. యుద్ధ. పుట 349)

ఈ యుదాహరణమువలనను శరణాగతి ధర్మ ప్రతిపాదనమునకుపూర్వోదాహరణమే తగినది—మూలానుసారియు. వరదరాజ రామాయణ మందీ పట్టున సంగ్రహమగు కపోతోపాఖ్యానమే పది పండ్రెండు ద్విపదలలో వర్ణితమై యున్నది.

8. సంస్కృత రామాయణమున ప్రస్తావింపబడి, మహా భారతమున విస్తరింపబడిన కపోతోపాఖ్యానమే రామాయణ కథా సంబంధిగా 'కపోత వాక్య' మను పేరున తెలుగు దేశమున ప్రచారమునొందినది. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున సం. 1035 నుండి 1039 వరకుగల గం 'కపోత వాక్యము' అను ద్విపదకృతు లందలి యితివృత్తము గూడ నిదియే. వి లేఖకర్త లెవరో ఓబళయ్య, వెంకటగిరి ప్రభృతులు. ఇందు 1038 సంగల గ్రంథకర్త కందాళ వరదాచార్యుల శిష్యుడట. ఈ కపోత వాక్యమే తంజావూరు సరస్వతీమహలునందున కూడ సం. 294 నందున్నది. అవియు నిదియు నొక్కటే.

9. రామాయణ సారమంతయు నీ విభీషణ శరణాగతి ఘట్టమునందే కలదని విజ్ఞులందురు. అందుకే దీనిని శరణాగతి కావ్యమనియు నందురు. తెలుగుదేశపు రామాయణములందు దేశీయాభిమానమును పురస్కరించుకొని మూలమున గానరాని కథా వర్ణనాంశము లెన్నో చేరి, గ్రంథము పెద్దదైనది. అట్లే రామాయణ కథా సారమును పిండిపోయు నీ కథయు వీరి రచనయందు చేరి గుణాధిక్యమునే కల్గించి యుండవచ్చును.

10. కపోతోపాఖ్యానమును గూర్చిన వెనుకటి లఘుజ్ఞాపి కనుచూచునది.

నందణగియుండువనియు భావింపవచ్చును. 11 ఈ సమస్యలెల్ల తొలగుటకు అన్నమాచార్యుని రామాయణమేని లభింపవలెను, లేదా వరదరాజ రామాయణమునకు ప్రత్యంతరములేని లభింపవలెను. అప్పుడుగాని యథార్థము వెల్లడికాదు.

అన్నమాచార్యుని రామాయణమునకు సంబంధించినదగునో కాదోగాని చిన్నన్న వ్రాసిన అష్టమహిషీ కళ్యాణ ద్విపద కథామధ్యమున ప్రథమాశ్వాసాంతమున 'భాగవత రామాయణ' మను పేరుతో కొంత గ్రంథ భాగమున్నది. రామాయణ సంబంధముగం తాళ్లపాకవారి ద్విపద పంక్తు లగుటచేత నించుక వివరించుచున్నాను. బలరామకృష్ణులు గోగోప గణములతో సంచరించుచుండగా శ్రీదామ నామధేయుండైన గోపాలకుండు ధేనుకాసుర సంహరణార్థమై వారిని సమీపమందలి తాళ వనమునకు గొంపోయిన సందర్భమున నీ వృత్తాంతము గలదు. ధేనుకు డా వనమున ఖరాకారుడై, శూరులగు తన జ్ఞాతులతో వర్తిల్లుచుండెను పురాణకథ ననుసరించి ఖర నామ సామ్యమున లంకేశ్వరు ననుజన్ములను, ధేనుకుని వధించిన బలరాముని పేరులోని రామనామ సామ్యమున దశరథరాముడును స్ఫురించి చిన్నన్న ఈ పట్టును భాగవత రామాయణమను పేరున చమత్కారముగ నిర్వహించియుండును. ఈ కథతో రామాయణమునకుగల సమన్వయ మిందే తప్ప సంస్కృత భాగవతమందుగాని, పోతన భాగవతాంధ్రీకరణమందుగాని, కానరాదు. భారతాంతర్గత రామాయణముండగా, భాగవతాంతర్గత రామాయణస్ఫూర్తి యేల ఇందు రారాదని తలచియే చిన్నన్న దీని నిట్లు నిర్వహించెనో, లేక తాతగారి రామాయణ ద్విపదల ప్రభావమునకు లోగి యే యిట్లు పరిష్కరించెనో తెలియదు. ఆ రామాయణ కథా సమన్వయ మీ క్రింది విధమున గలదు.

భాగవత రామాయణము:

"ఈ లంకయందు నయ్యింద్రారిబంధు
జాలంబు తను గొల్వ జగదేకవీర
యామహారిపుఁ జంపి యచట సుత్తాల
భూమిజామృత ఫలంబును నీవకొనుచు—
ననుడు రామానుజుం డా రామచంద్రుఁ
డనయంబు హర్షించి.............
అరితమ్ము గనుగొని యభయ మన్నంత
నరిది నీ లంకకు నధిపు జేసెదము
అనుచు నగాలి బిట్టగలంగ........
*   *   *
రామ సైన్యం బిట్లు రణకేళి సలుప
*   *   *
అతికాయ వజ్రదంష్ట్రనర రోమ
శత మాయ ఘనబాహు శాలి భుజంగ
రోమ ధూమ్రాక్ష విరూపాక్ష ఖడ్గ
రోమ వృశ్చిక రోమ లుధిరాక్ష మేఘ
నా దన రామ రాంతక దేవజిన్మ
హాదర భయద విద్యుజ్జిహ్వ శౌర్య
భీకర దైతేయ బృందంబు వెడలి—
*   *   *
ఖర భావహితుఁ డురాక్షస లోక విభుఁడు
కరముగ్రముగరాము గదియ నవ్విభుఁడు
పంక్తి కంధరశి రోభాగముల్ దునియఁ
బంక్తిగాఁ బటు కదంబములు వేయుచును.
*   *   *
ప్రతిన విభీషణ పట్టంబుగాఁగ
నామోదమున దిక్కులం దదర్భూమి
భూమిజాధిక ఫలపుంజంబుతోడ
వను జన్మ తోడ భృత్యాళి సేవింప
వనరాశి గడచి............
*   *   *
భట కోటితో బనార్భట కోటితోడఁ
బటు తర నిజ నివాసము ప్రవేశించె
(చూ. అష్టమహిషీ పుటలు 54—58)12

ఈ రీతి నీ ద్విపద (భాగవత) రామాయణ పంక్తు లిందలి కథా సందర్భమున చమత్కారముగ పొసగింపబడినవి. ఇందు బలరాముడు రాముడు. ఖరాకారుడు ఖరసోదరుడు. తాలవనము లంక. భూమిజ భూమిజామృతఫలంబు. ఈ సమన్వయము సరిగానే యున్నదికాని, యా విభీషణు డెవ్వరో! భాగవత పురాణమున ధేనుకునితోబాటు అతని బంధుగులు, సోదరులు, ఖరదైత్య భటులు సందరును మడసినట్లున్నది. కథా సమన్వయమునకై చిన్నన్న యిందు విభీషణు నొకనిని చిత్రించెనేమో. ఏమైనను

11. వరదరాజు అన్నమాచార్యునకు తరువాతి కాలము వాడు. ఇరువురును కడప మండలము వారే. శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులే. వైష్ణవాభిమానము చే మత ప్రచారమునకై రామాయణరచన గావించినవారే. వరదరాజు తన గ్రంథమున అన్నమాచార్యుని స్మరింపకున్నను నాతడు అన్నమయ్యగారి రచనల నెరిగిన వాడనియే తలపవచ్చును. కావున కొన్ని పోలికలుండవచ్చును. కాలక్రమమున అన్నమాచార్యుని రామాయణ ద్విపదలును వరదరాజు రామాయణమందు ప్రవేశించి యుండవచ్చును.

12. తి. తి. దేవస్థానమువారు 1937లో ప్రకటించిన అష్ట మహిషీ కళ్యాణ ద్విపద కావ్యమునం దచ్చు తప్పు లధికముగా నున్నవి. దీనిని చక్కగా పరిష్కరించి మరల ప్రకటింపవలసిన యవసర మెంతేని గలదు. పై ద్విపద పంక్తులచ్చులో నున్నట్లే ఉదాహరించితిని.

అలభ్యమగు అన్నమాచార్య రామాయణము

ఇందీ రామాయణ కథాంశములతోఁ గూడిన ద్విపద పంక్తులుండుట గమనార్హము.

తెలుగున రామాయణ కథాసాగరాభిముఖమై ప్రవహించిన ద్విపద వాహినులెల్ల నేకమై తుదకు వేరుసేయరాని విధమున కలసిపోయినవి. ఈ ద్విపద రామాయణముల విషయమింత కలగాపులగ మయిపోవుటయు, దేశమున వానికి గల్గిన ప్రాచుర్యమునే వెల్లడించుచున్నది. అన్నమాచార్యకృత రామాయణము నేడు నమగ్రముగ గుర్తింప రాకుండుట మన దరుదృష్టమే. శతకోటి ప్రవిస్తరమై, మహాపాతక నాశనమైన రఘునాథుని దివ్య చరితమును అన్నమయ్య సంపూర్ణ రామాయణముగానే విస్తృతముగానే విరచించియుండును.

ఇతఁడే పరబ్రహ్మ మిదియె "రామకథ"
శతకోటి విస్తరము సర్వ పుణ్యఫలము
ధరలో రాముఁడు పుట్టె—ధరణిజఁ బెండ్లాడె
అరణ్యవాసులకెల్లా—అభయ మిచ్చె
సారిది ముక్కు చెవులు చుప్పనాతికి గోసె
ఖర దూషణులను ఖండించివేసె.

కినిసి వాలి జంపి—కిష్కింధ సుగ్రీవు రిచ్చె
వనధి బంధించి దాటె—వానరులతో
కవలి రావణ కుంభ—కర్ణాదులను జంపి
వనిత జేకొని మళ్లి—వచ్చె నయోధ్యకు.
సౌమిత్రియు భరతుఁడు—శత్రుఘ్నుఁడు గొలువఁగ
భూమి యేలె కుశలవ—పుత్రులఁగాంచె
శ్రీమంతుఁడై విలిచె—శ్రీ వేంకటాద్రిమీఁద
కామించి విభీషణులం—కకు బట్టముగట్టె.

(అన్నమా. అధ్యాత్మ. 11—224)

స్థూలముగా నిదియే వీరి రామాయణ రచనా ప్రణాళికగావచ్చును. శరణాగతి కావ్యమని ప్రసిద్ధిగాంచిన రామాయణమునందలి రహస్యముల నెల్ల వీరి రచన నిక్షేపించుకొనియుండును. అయినను వీరి యనువాద పద్ధతి పూర్వ రామాయణానువాదములందువలెనే స్వతంత్రమై దేశియతతో తొణికిసలాడుచుండుననియే తలతును. ఇట్లూహించుటకు నేడు లభ్యములగుచున్న అన్నమాచార్యుని రామాయణ సంకీర్తనములే ముఖ్య కారణములు.

వీరి రామాయణము నుద్ధరించుటకై ఆంధ్రదేశము ప్రయత్నించునుగాక!

భావజచంద్రులు

క. నీ వెంత వేడుకొన్నను
గేవల పాతకుల కేలకృప పుట్టుమదిన్
దేవుడు 'నహి' గురువు 'నహి'
భావజచంద్రులకు వికచ పద్మ దళాక్షీ.

—ముత్తరాజు—పద్మావతి కల్యాణము.

సంస్కృత వాఙ్మయమున గర్భకవిత్వము లేదా?

శ్రీ ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యుడు

విద్వాన్ శ్రీ రావూరి దొరస్వామిశర్మగారు 'తెలుగుభాషలో ఛందోరీతులు,[1] అను తమ గ్రంథరాజమున–'సంస్కృత వాఙ్మయమున చిత్రబంధ కవితలు గలవు, గాని గర్భ కవిత ఎందును గానరాదు. గర్భకవిత తెనుంగు ఛందోరీతిలోని ప్రత్యేక ప్రక్రియ యనవచ్చును[2] అని వ్రాసియున్నారు.

పై యభిప్రాయము సరి కాదని కవికాల సర్వజ్ఞ హేమచంద్రుని కావ్యాను శాసనము[3]నందలి ఈ క్రింది యుదాహరణము ననుబట్టి తెలియుచున్నది.

1 వర్ణచ్యుతం యథా—

చం. 'సిత నృశిరః స్రజా రచితమౌళి శిరోమణిమౌక్తికై స్తథా

శిఖిరుచిరోర్ధ్వదృక్ పృథులలాటతటే
తిలకక్రియా చ సా,
స్ఫుట వికటాట్టహాసలలితం వదనం స్మిత
పేశలం చ తద్
అభినవ మీశ్వరో వహతి వేష మహో!
తుహినాద్రిజార్ధయుక్?

(అత్ర గౌరీశ్వర వర్ణనే సిద్ధచ్ఛన్దసి ప్రతిపాద మాద్యాక్షర ద్వయపాతే అన్త్యాక్షర సప్తకచ్యుతౌ చ ఈశ్వర రూపవర్ణన మేవ ప్రమితాక్షరావృత్తేన.

యదివా, ఆద్యాక్షర సప్తకచ్యుతౌ అన్త్యాక్షరద్వయపాతే చ గౌరీ వర్ణనం ద్రుత విలమ్బిత వృత్తేన).

పై శ్లోకమున గర్భితములగు ప్రమితాక్షరా వృత్తమును (ఈశ్వర వర్ణనము) ద్రుత విలంబిత వృత్తమును (గౌరీ వర్ణనము) ఈ క్రింద నుల్లేఖింపబడుచున్నవి. ఈశ్వర రూప వర్ణనము:

(ప్రమితాక్షరా వృత్తము)

'నృశిరఃస్రజా రచితమౌళిశిరో
రుచిరోర్ధ్వదృక్ పృథులలాటతటే,
వికటాట్టహాస లలితం వదనం
నవ మీశ్వరో వహతి రూప మహో?

గౌరీవర్ణనము: (ద్రుత విలంబితమ్)

'రచితమౌళి శిరోమణి మౌక్తికైః
పృథులలాటతటే తిలకక్రియా,
సలలితం వదనం స్మితపేశలం
వహతి వేష మహో!తుహినాద్రిజా?[4]

ఆచార్య హేమచంద్రుడు క్రీ. 1088 వ వత్సరమున అవతరించి, పరస్సహస్రసమానజీవి యై (84 వర్షములు జీవించి) క్రీ. 1172 వ సంవత్సరమున అస్తమించెను.

ఇదం ప్రథమముగా నన్నిచోడుడు కుమారసంభవమున బంధగర్భకవితల రచించె ననియు, అయినను మనకు తెలిసినంతవరకు మొట్టమొదట గర్భ కవిత్వమును చెప్పిన ఆంధ్ర లాక్షణికుడు కావ్యాలంకారచూడామణిని నిర్మించిన విన్నకోట పెద్దన కవియే యనియు శ్రీ దొరసామి శర్మగారు వ్రాసియున్నారు. (379 పు.) ఈ పెద్దన కాలము క్రీ. 1407 ప్రాంతము. అందువలన కావ్యాలంకారచూడామణికంటె ఇంచుమించు 250 సంవత్సరములు పూర్వుడగు హేమచంద్రుని గ్రంథములో మనకు గర్భ కవిత్వమునకు లక్ష్యము కనబడు చుండగా, గర్భ కవిత తెనుగు ఛందోరీతిలో ప్రత్యేక ప్రక్రియ యనుట విశ్వసనీయము కాజాలదు.

పై యుదాహరణము ఘూర్జర దేశమునకు జెందిన ప్రాచీన మహాకవియగు హేమచంద్రసూరి గ్రంథము

---

1. వెల్డన్ప్రెస్, మదరాసు (క్రీ. 1962)
2. నవమ ప్రకరణము (పుట: 379)
3. S. M. Jain Vidyalaya edition- Vol. I, chap. V 473v'322p. (Bombay) 1938.
4. ప్రసంగాను ప్రసక్తముగా ఇట నొక విశేషమును పేర్కొనదగును. పై గర్భస్థ శ్లోకములు రెండింటికిని మాతృభూతమగు 'సిత నృశిరః స్రజా' అను శ్లోకము సంస్కృతమున బహువిరళమగు చంపక మాలావృత్తము. వివిధ ఛ్ఛందో గ్రంథము లందు చంపకమాల కనేక నామాంతరములుకలవు. 1.చంపకమాలిక, 2. చిత్రలత, 3. ధృతశ్రీ, 4. పంచకావళి, 5. రుక్మవతి, 6. రూపవతి, 7. శశివదన, 8.సరసి, 9. సలిలనిధి, 10. సిద్ధి. సంస్కృత సారస్వతమున అపూర్వమగు చంపకమాలను కూర్చిన నా వ్యాసము కాలాంతరమున ప్రకటింపబడును.

నుండి యుల్లేఖింపబడెను. క్రి. శ. 19వ శతకమునకు జెందిన తెలుగునాటి సంస్కృతకవి కావ్యమునుండి ఉదాహరణము చూపబడును. చతుశ్చిత్ర గర్భ—శ్రీరామాయణ సంగ్రహమను మహా కావ్యము. పద్య గద్యాత్మక మగు నీ కృతి యందు 30 సర్గములు కలవు. కర్త నిట్టల ఉపమాక వేంకటేశ్వరకవి, విశ్వనాథ కామాంబా తనయుడు. విశాఖ పట్టణ మండలమునందలి విజయ నగర ప్రాంతములకుఁ జెందినవాఁడు. నిరుపమాన చిత్ర కవితా ప్రజ్ఞ కలిగిన శేముషీ సింధువు. ఈయన రామాయణ సంగ్రహము చిత్రగర్భ కవిత్వములకు నిలయము. ఇందు రామ కవచ స్తోత్రము, రామాయణ సంగ్రహముకాక, గౌరీ కల్యాణము, శ్రీ రంగాది క్షేత్ర మహాత్మ్యము, భగవ దవతార చరిత్రము, ద్రౌపదీ కల్యాణము అను నాలుగు కావ్యములిముడ్పఁ బడినవి. బాలకాండమునం దీ చిత్ర పద్ధతినే కవి ఆత్మ వృత్తాంతమును కొంత తెలిపియున్నాఁడు. బాలకాండమునందలి ప్రతి శ్లోకాద్యాక్షరమును వరుసగా వ్రాసిన రామ కవచమగును. ఈ కాండమునందలి ప్రతి పద్యమునను రెండవ పాదము లందలి మొదటి యక్షరములనుగూర్చి చదివిన కవి వృత్తాంతము తెలియును.

"అథాస్య కాండస్య ఆద్య పద్య ద్వితీయ పాదాదిమ వర్ణమారభ్య అంత్య పద్యద్వితీయపాదాది వర్ణ పర్యంతం తైర్వర్ణైరుదిత చిత్రాణి —

శ్రీ నిష్టలోపమాక శర్మణా, విశ్వనాథ తనయేన కామాంబాలతా ప్రసవేన జాయా ద్వయజాతసార—విశ్వనాథ రామ భద్ర రామాది పుత్రవతా చ రామపాదకమల యుగ సంచార లోల మానసేన విబుధ చరణ కంజసేవినా, భవతమోఽరుణోఽయ శ్రీరామాయణసంగ్రహోనామ భూతకాలచరితోరచితో బభూవ'5

గద్యము:—

"ఇతి చతుశ్చిత్ర గర్భే శ్రీ రామాయణ సంగ్రహ బాల కాండే షష్ఠస్సర్గః".

బాలకాండమునందలి ఆరుసర్గల యందలి మొత్తము పద్యములు: 687. గ్రంథ సంఖ్య: 733. శేషవర్ణములు: 281. బాలకాండమున సర్వ శ్లోక చతుశ్చిత్ర వర్ణముల గ్రంథ సంఖ్య 85. శేష వర్ణములు: 28.

యుద్ధకాండ పుష్పిక: 6

'ఇతి చతుశ్చిత్ర గర్భ రామాయణ సంగ్రహే ఉపమాక వేంకటేశ్వర శర్మణా విరచితే యుద్ధకాండే ఏ కోన త్రింశః సర్గః

యుద్ధకాండమునందలి పద్యముల మొత్తము: 1738. గ్రంథసంఖ్య: 1786. శేషాక్షరములు: 28. బాలాదిషట్కాండముల యందలి సర్గములు 68. షట్కాండములలోని శ్లోకములు: 3736. షట్కాండములయందలి గ్రంథములమొత్తము 4112. శేషాక్షరములు 24.

1. గౌరీకల్యాణము : పార్వతీ పరమేశ్వరుల పరిణయమును చిత్రించు గర్భస్థ కావ్యము. రామాయణ సంగ్రహమున అయోధ్యాకాండ మొదలు యుద్ధకాండము వరకు గల పద్యముల యందలి మొదటి యక్షరముల వరుసగా కూర్చినచో గౌరీ వివాహ కథ అగును.

పుష్పిక :

'శ్రీ కాంతాకాంత ప్రచోదిత మానస కవి విరచిత నానా విచిత్ర కుక్షి శ్రీ రామాయణ సంగ్రహాయోధ్యకాండ ప్రథమ పాదాద్య క్షర ప్రభృతికథనకాండగత శ్లోకాద్యక్షరావధి క్రమ నియమితాక్షరైః ఉదిత గౌరీ వివాహాఖ్యం ఇదం చరితమ్ 7

2. శ్రీ రంగాది క్షేత్ర మాహాత్మ్యము:—త్రయోదశ ప్రధాన దివ్య క్షేత్రముల వైభవము, మహత్వమును ఈ గర్భస్థ కావ్యము వర్ణించును. అయోధ్యకాండ మొదలు యుద్ధకాండ వరకుగల శ్లోకముల ద్వితీయ పాద ప్రథమాక్షరముల వరుసగా వ్రాసిన ఈ కావ్య మేర్పడును.

పుష్పిక:—

"ఇతి చతుశ్చిత్ర గర్భ శ్రీ రామాయణ సంగ్రహాయోధ్యా కాండాద్య శ్లోక ద్వితీయ పాదాద్యక్షర మారభ్య, యుద్ధకాండాంతిమ శ్లోక ద్వితీయ పాదా ద్యక్షర పర్యంతం చతుర్వర్గ—ధర్మార్థ ప్రదానామ్. ఉపమాక వేంకటేశ్వర విరచితానామ్ ఆద్య శ్రీరంగ పురు షోత్తమ—రామేశ్వరా విముక్త-సింహాచల—కాంచీ-సాకేత-ద్వారకా-మధురా-శేషాచల-ప్రయాగ-గౌతమీ-భద్రాచలాభిదాన-త్రయోదశ ప్రధాన దివ్యక్షేత్ర తీర్థ పురీ మహిమోపేతాః త్రిషష్టి శ్లోకాః"8

3. భగవదవతార చరిత్రము:—

అయోధ్యాకాండ మొదలు యుద్ధకాండము వరకుగల శ్లోకముల యందలి మూడవ పాదముల ప్రథమాక్షరముల క్రమముగా కూర్చినచో ఈ కావ్య మేర్పడును. ఇందు శ్రీ మహావిష్ణువు వివిధావతారములు వర్ణింపబడెను.

4. ద్రౌపదీ కల్యాణము:—

అయోధ్యాకాండ మొదలు యుద్ధకాండవరకు గల శ్లోకములయందలి నాల్గవ పాదముల ప్రథమాక్షరములు క్రమముగా కూర్చినచో ఈ కావ్య మేర్పడును. ఉపసంహారము:

'ఇదంద్రౌపదీ మంగళం నాథునిత్యమ్, చతుశ్చిత్రగర్భంతు రామాయణస్థమ్'

పైని ఉదాహరించిన ఆచార్య హేమచంద్ర—వేంకటేశ్వర కవుల రచనలనుబట్టి గర్భ కవిత్వము చిరకాలము క్రిందటనే సంస్కృత సారస్వతము వెలసినదనియు, ఇది తెనుగు ఛందోరీతిలోని ప్రత్యేక ప్రక్రియ కాదనియు తెలియుచున్నది.

---

5. A Triennial Catalogue of Mss - Vol. IV. Part I - Skt. B. (R. No, 3375; pages 5032 (A. D. 1928)-Madras,

6. Ibid - p. 5033.

7. Ibid. p. 5034.

8. Ibid. p. 5035.

గ్రంథములు - గ్రంథకర్తలు :

ప్లేటో ఆదర్శ రాజ్యం

ఒక సమీక్షకుడు

మహర్షులు, మహాత్ములు ఒక దేశమునందే యవతరింపరు. జ్ఞానమొకదేశముయొక్క సొమ్మెగాదు. అఖండ ప్రపంచ చరిత్రను సింహావలోకనము చేసినచో సర్వయుగములందు, సమస్త దేశములందు మహర్షు లవతరించిరనియు, జ్ఞానధార, తత్త్వసమీక్ష కొనసాగినదనియు తెలియును. కాల గమనమును బట్టి చూచినచో నొకదేశము మఱొకదేశముకంటె ననేక పరిస్థితులనుబట్టి, ముందుగా నాగరకము గావచ్చును. విజ్ఞానము ప్రోదిసేయవచ్చును. అంతమాత్రమున ఆదేశము నొసటనే ప్రొద్దు పొడిచినదని, శేషదేశములన్నియు ననాగరకదేశములని పొంగిపోయి, మిన్నుముట్టరాదు—సత్యాన్వేషకులయినవారి విషయమిది. విభిన్న సంస్కృతులను తక్కెడలోపెట్టి తూచునపుడు మన మా యా సంస్కృతులు విశ్వజనీన జ్ఞానాభివృద్ధి కెంతగా దోహదము చేసినవను దానినే ముఖ్యముగా గమనింపవలయును. స్వజాతీయ దురభిమాన ద్పృక్పథమునకు తల యొగ్గరాదు. తల యొగ్గితిమో దోషైక దృక్కుల మగుదుము. ఈ విధముగా నొక సిద్ధాంతమును జేసికొనినగాని, మనకు భారతీయులకు యవన దేశ సభ్యతా విశేషము లర్థముగావు. కళారంగమున, తాత్త్విక రంగమున యవనదేశము (Greece) సైతము ప్రశంసనీయమైన సంస్కృతి పాదుకొల్పినది. ఒకనాడు యవన సభ్యతావాణి పాశ్చాత్య ప్రపంచమును సమ్మోహ పరచినది. ఏ కళా విద్యారంగము లందు విచారమున కుపక్రమించినప్పటికి పాశ్చాత్య దేశ విమర్శకులు మున్ముందుగా ఏథెన్సు నగరమునకు ప్రయాణము కట్టవలయును.

అట్టి యవన దేశములో మహర్షు లెందరో యవతరించిరి. శాస్త్ర చర్చలు చెలరేగినవి. కళలు విరిసినవి. ఒక మహా సంస్కృతి విరాడ్రూపము ధరించినది. యవన మహర్షులెన్నో యుత్తమ గ్రంథములు రచించిరి. విద్యా పరిషత్తులు వెలకొల్పి, విజ్ఞానమును వెదచల్లిరి. సమకాలీన శోచనీయ పరిస్థితులు వారిలో తత్త్వ విచారమును పెంపొందించినవి. స్వదేశీయుల యజ్ఞానమునకు వగచి వారికి జ్ఞానచక్షువు ప్రసాదింప ఈ మహర్షు లెంతో యావేదన పడిరి. సమకాలీనులు వారి నీసడించిరి. ఒకనిని విషముపెట్టి బలవన్మరణముపాలుచేసిరి. మఱొకనిని ప్రవాసమునకు బంపిరి. అయినను యవనర్షులు జంకలేదు. సమకాలీన సమాజమును సంస్కరింపవలయునను సత్సంకల్పముగల యా మహర్షులు చర్చలుచేసిచేసి యూర్ధ్వ లోకముల కెగబ్రాకిరి. వారు దివికి భువికి సూత్ర పట్టిరి. వారి గ్రంథములు దివ్య రాజ్యమునకు నిశ్రేణు లయినవి. తత్ఫలితముగా వారి గ్రంథములలో నొకానొక త్రికాలా బాధితమయిన, దేశకాలావధులను తిరస్కరించిన సత్యము గూడు కట్టుకొన్నది. దేశములు పురోగమింపవచ్చును. సంస్కృతుల వేర్పాటు పొసగవచ్చును. కాలము మారవచ్చును. ఆ గ్రంథములందు ప్రతిపాదింపబడిన సిద్ధాంతము లనంతర యుగములవారి తిరస్కారమునకు బాత్రము గావచ్చును. ఒకకొన్ని చర్చ లేవగింపు కల్గింపవచ్చును. కాని, యా గ్రంథములను గొల్ల కూటము చేసికొన్న దివ్య సత్యమును మాత్రము త్రోసిరాజనలేము. జిజ్ఞాస చిగురొత్తించు "సత్తు–చిత్తు" ఆ గ్రంథములలో నున్నంతకాలము, ఆ "సత్తు—చిత్తు" ననుభవించుశక్తి ప్రపంచ నాగరికులలో నున్నంత కాలము ఆ గ్రంథములు ధ్రువ తారలే. అట్టి యుజ్జ్వల ధ్రువ తారలయిన గ్రంథములలో "రిపబ్లిక్" ఒకటి. దానిని సృష్టించిన మహర్షి ప్లేటో. వేదా కర్మయోగి గ్రంథమునకు "ప్లేటో ఆదర్శ రాజ్యం" అను పేరుతో ఆంధ్రానువాదముకూర్చి మన కందించినవారు డాక్టర్ జి. వి. కృష్ణారావుగారు. బెంజమిన్ జోవెట్ చేసిన యాంగ్లానువాదమును మూలగాగొని జి. వి. కృష్ణారావుగారు తెనుగు చేసిరి.

ప్లేటో మహర్షి (క్రీ. పూ. 427—348) సోక్రటీసు శిష్యుడు. బోడ్డున మాణిక్యముతో బుట్టినప్పటికి, ఆముష్యాయణుడయినప్పటికి, కాలానుగుణముగా అవకాశమునుబట్టి ప్లేటో రాజ్యపాలకుడు గాలేదు. మరి తత్త్వ శాస్త్రమువైపు మొగ్గినాడు. "సోక్రటీసుయొక్క తత్త్వానుసంధాన విధానము, ధర్మైకదృష్టి ప్లేటో జీవితాన్ని దిద్ది తీర్చాయి. అతని జీవితానికి పరమ లక్ష్యమైపోయాయి." జి. వి. కృష్ణారావుగారు "జేగంటలు" లో ప్లేటో జ్ఞాన విడంబనమును గూర్చి యుదాత్తముగా వ్రాకుచ్చిరి. బెంజమిన్ జోవెట్‌కు ప్లేటో ఈ విధముగా కన్పించినాడు.

"He was the greatest metaphysical genious whom the world has seen; and in him! more than in any other ancient thinker, the germs of future knowledge are contained." "He is the

(ప్లేటో ఆదర్శ రాజ్యం. అనువాదం:—జి. వి. కృష్ణారావు, పి. హెచ్. డి. ప్రచురణ సంస్థ:—సాహిత్య ఎకాడెమీ పక్షమున—సాహితీ కేంద్రం, తెనాలి. ప్రాప్తిస్థానములు:—సాహితీ కేంద్రం, తెనాలి (లేక) సాహిత్య ఎకాడమీ, న్యూఢిల్లీ—1. మూల్యము పది రూపాయలు).

father of idealism in philosophy, in politics, in literature. And many of the latest conceptions of modern thinkers and statesmen, such as the unity of knowledge, the reign of law, and the equality of the sexes, have been anticipated in a dream by him." ఎట్టి గంభీర విషయమును చర్చించుచున్నప్పటికి, దానిని ప్లేటో మధురాతి మధురముగా, తర్కబద్ధముగా యుక్తి సహముగా గ్రంథస్థము చేయును. ఆయన రచించిన గ్రంథములు మధుర కావ్యములు. ఆ మధుర కావ్యములలో అగ్రశ్రేణికి చెందినది "రిపబ్లిక్" మన సంప్రదాయ పరిభాషలో జెప్పికొనవలయునన్నచో ఉపనిషత్తులు, ధర్మ శాస్త్ర గ్రంథములు, చాణక్యుని యర్థశాస్త్రము సర్వము రాశీభూతమయినచో ఏ స్వరూపము బహిర్గతమగునో, ఆ స్వరూపమును పోలునదే "రిపబ్లిక్". దీనినిగూర్చి జోవెట్ ఈ క్రింది విధముగా జెప్పినాడు.

"But no other Dialogue of Plato has the same largeness of view and the same perfection of style no other shows an equal knowledge of the world or contains more of those thoughts which are new as well as old and not of one age only but of all. No where in Plato is there a deeper irony or a greater wealth of humour or imagery or more Dramatic power. Nor in any other of his writings is the attempt made to interweave life and speculation or to connect politics with philosophy. The Republic is the centre around which the other Dialogues may be grouped; here philosophy reaches the highest point (Especially in Books V, VI, VII) to which ancient thinkers ever attained."

అట్టి "రిపబ్లిక్"లో బదిప్రకరణము (Ten Books) లున్నవి. విషయ ప్రాధాన్యమునుబట్టి యా పది ప్రకరణముల నయిదు ప్రకరణములుగా చేయవచ్చును. ఆ య్యైదు ప్రకరణము లివి: 1. ప్రథమ ప్రకరణమునుండి ద్వితీయ ప్రకరణము సాబాలు వరకు న్యాయ విచారణము ప్రధానము. న్యాయమునుగూర్చి బహుళ ప్రచారమందున్న సర్వ సామాన్య సిద్ధాంతములు, కుతార్కిక సిద్ధాంతములు ఖండింపబడెను. 2. ద్వితీయ ప్రకరణోత్తర భాగమునుండి చతుర్థ ప్రకరణాంతముదాక తాత్త్విక పరిపాలితమగు ఆదర్శ రాజ్యము నిర్మింపబడినది. ఉత్తమ విద్యా విధాన వర్ణనము కలదు. 3. పంచమ ప్రకరణమునుండి సప్తమ ప్రకరణము తుది వరకు న్యాయ విచారణముకంటె ధర్మ దర్శన చర్చ యధికము. సాంఘిక రాజకీయ సిద్ధాంత చర్చలు వెనుకంజ వేసినవి. వైయక్తికమగు వార్జవ విచారణము ప్రారంభమయినది. సమాజపరమయిన వైవాహిక విధానము నిర్దేశింపబడినది. 4. అష్టమ నవమ ప్రకరణములలో బహువిధ రాజ్యావతార పతన హేతువులు నిర్ణయింపబడినవి. వ్యక్తి నిష్ఠమగు లాలసప్రవృత్తి, నియంతృసరణి సమీక్షింపబడినవి. 5. దశమ ప్రకరణములో తత్త్వశాస్త్ర కవితా సంబంధము నిశ్చితమయినది. ఆదర్శ రాజ్యపౌరునకెట్టి యూర్ధ్వగతు లొనగూడునో యొక జానపద గాథనుబట్టి వర్ణింపబడినది. ఈ విధముగాగాక సమస్త గ్రంథమును స్థూలముగా రెండుభాగములు చేయవచ్చును. పంచమప్రకరణము వరకు యవన సంస్కృతి సాధారణలక్షణములగు నైతిక ధార్మిక సిద్ధాంతములనుబట్టి యేర్పడు రాజకీయ వ్యవస్థ వర్ణింపబడినది. శేషగ్రంథములో ఈ సాధారణ రాజకీయ వ్యవస్థ యెట్లు సాధారణమయిన యాదర్శ రాజ్యవ్యవస్థగా పరిణమించునో వివరింపబడినదనవచ్చును. ఈ యాదర్శ రాజ్యమే ప్రధానము, లనుత్తమమును. తదితర రాజ్యవ్యవస్థలన్నియు' పతనచిహ్న గర్భితములు. అరిష్ట దాయకములు. ఈ విధముగా ఎట్టి సమాసలక్షణములులేని సాధారణ రాజ్య వ్యవస్థను, ఆదర్శ రాజ్యవ్యవస్థతో ముడిపెట్టుట ప్లేటో మహర్షివంటి కారణ జన్మునకే సుసాధ్యము. కానిచో న్యాయ విచారముతో ప్రారంభమయిన ఈ గ్రంథ మాదర్శ రాజ్య పౌరునకు ప్రాప్తించు నానుషంగిక ఫలవర్ణనముతో నెట్లు పరిసమాప్తి గాంచును. "రిపబ్లిక్" తర్కబద్ధమయిన, సరసమయిన సంభాషణములు గలది. ఎక్కడను అంధవిచారముగాని మూఢవిచారములు గానిలేవు. సునిశిత బుద్ధి వైభవమునకు ప్రతిపుట సాక్ష్యము. ఈ మధురకావ్యములో సరససల్లాపము లాలపించిన పాత్రలు ఆరు. సోక్రటీస్ గురుపీఠ మధిష్ఠించెను. మిగిలినవారు సిఫాలస్, పాలిమార్కస్, థ్రాసిమాకస్, గ్లాకన్, ఎడిమాంటస్. వీరిలో కొందరు చారిత్రక వ్యక్తులు. ఆ పాత్రలన్నియు ప్లేటో మహర్షికాలమునాటి బహు విధములయిన, బహుజనాదృతములయిన సిద్ధాంతములు ప్రతిపాదించును. ఒక్కొక్క పాత్రయొక్కొక్క సిద్ధాంతమునకు మూర్తి కల్పనమా యనునట్లుండును. ఇట్టి పాత్రలతో సోక్రటీస్ చర్చలుచేసి తత్త్వమును తరచి చూచుచున్నాడనినచో, ప్లేటో తన కాలమునాటి విభిన్న సిద్ధాంతములను ఢీకొని, ఖండించి చరమసిద్ధాంతము స్థాపించుచున్నాడనియే యర్థము.

జోవెట్ ఆంగ్లానువాదము సరళ సుందరమయినట్టిది. చక్కని పలుకుబడి గలట్టిది. మూలగ్రంథ మెట్లుండునో యవనభాషా విద్వాంసులకే తెలియును. కాని జోవెట్ ఆంగ్లానువాదమును జూచినపిదప "రిపబ్లిక్" అంగాంగిభావ సంయుక్తమును, రససిద్ధి పొందిన మహాకావ్యమనియు, అసామాన్య తర్కబద్ధమై, నిశిత మేధాసంపత్తి కాలవాలమనియు, అవ్యాప్త్యతి వ్యాప్తి దోషముల కగపడ నట్టిదనియు తేటతెల్లమగును. జోవెట్ గ్రంథమును, కృష్ణారావుగారి యను

వాదములు దగ్గరపెట్టుకొని చూచినగాని, యాంధ్రానువాద కర్త పడినశ్రమ పడసిన విజయము తెలియదు. "ప్లేటో ఆదర్శరాజ్య" మందలి యే పుటను పరిశీలించినను అది జోవెట్ గ్రంథభాగమునకు సాటియగుచున్నది. ఆంగ్లభాషా కారకము వేరు. ఆంధ్రభాషా కారకమువేరు. భాషా సంప్రదాయమందు వాక్యవిన్యాసమందు, నుడికారము నందాంగ్లాంధ్ర భాషలకు సామ్యములేదు. అట్టిచో యవన భాషనుండి యనువదించు నపుడు జోవెట్ ఎంతకష్టపడెనో, ఆ యాంగ్లభాష నుండి యనువాదము చేయునపుడు కృష్ణారావుగారుకూడా నంతే శ్రమింప వలయును. శ్రమించిరికూడ. ఆంధ్రభాషా సంప్రదాయము కాపాడుకొనుటలో నేమి, యాంగ్లపదములకు సమానమైన— సమస్తార్థము నియ్యగల, ప్రకరణోచితమైన భావము ప్రకటింపగల— యాంధ్ర పదముల నెన్నుకొనుటలో నేమి కృష్ణారావుగారు కృతకృత్యులైరని యే నిష్పక్షపాతముగా చెప్ప వచ్చును. ఆంధ్రానువాదము కత్తిమీది సామే. కాని యాసా ములో ఆంధ్రానువాదకర్త యిసుమంతయు గాయపడలేదు. సెబాసనిపించుకొనిరి.

"రిపబ్లిక్"లోని కొన్నికొన్ని యాంగ్లపదముల భావ మును దాను సృష్టించిన తెలుగుమాటలు సంపూర్ణముగా నొసగ వేమో యను తలంపుతో గాబోలు కృష్ణారావుగారు బ్రాకెట్లలో నా యాంగ్లపదములనుదహరించిరి. ఇది మంచిపోకడ. మూల గ్రంథములో చర్చచేయువారు తమ వాదమునకు బలము నొసగుటకై ప్రసిద్ధ యవనుల వాక్యములనుట్టంకించిరి. కృష్ణారావుగారా వాక్యములను పద్యములలో నిబంధించిరి. పద్య ములు సరళములు, రచనమునకు నిలయములు. అన్నిటికంటె నీ యాంధ్రానువాదమునకు వన్నెవెట్టినట్టిది శిష్టవ్యావహారిక భాషతో కూడిన, సభ్యప్రపంచ మాననీయమైన శైలి. ఈ శైలి కవితాశక్తి గర్భోత్పన్నమైనట్టిది. గ్రాంథికాంధ్ర భాషా సహాయమ్ములతో వచనవచనంబులు. "నీతిచంద్రిక" రచించిన వాడు చిన్నయసూరి. శ్రీ. వి. కృష్ణారావుగారు నిర్మించిన "ప్లేటో ఆదర్శరాజ్యము" శిష్ట వ్యావహారిక భాషతో కూడిన "నీతి చంద్రిక". భాషా భేదమున్నను, ఇతివృత్త తారతమ్యమున్నను వక్తృ భావానుకూలముగా, ప్రకరణోచితముగా వాక్య నిర్మాణ మొనర్చుట, శబ్దాను సంధానము చేయుట, తత్సమ పదములు తెలుగు పలుకుబళ్లు నుపయోగించుట మున్నగు శిల్పపరిష్కార సృష్టియంతయు అటు "నీతి చంద్రిక"లో, ఇటు "ప్లేటో ఆదర్శ రాజ్యము"లో సమానమని నా మనవి. కృష్ణారావుగారి యనువాద నైపుణ్య సౌందర్యమును దిఙ్మాత్రముగా చూపుటకై భిన్నభిన్న ఘట్టములను చూపవలసియుండును. ఎల్లయెడల ప్రతి పదమునందు వారి శ్రమ ఫలించినదని ద్యోతకమగును. చదువ మొద లిడినంత వీడబుద్ధి వొడమని, తరంగ ప్రాయముగా ఆలో చనలు రేకెత్తించు అనువాదముచేసిరి కృష్ణారావుగారు. మూల మునకు త్రిగుణ వ్యవహితమగు అనువాదమైన నేగాక ! దర్శనము కవిత్వము మేళవించినదేగాక ! కృష్ణారావుగారు బహువిధములుగా విజయముసాధించి, తెలుగు నాటుగల యెరుక గలవారి కృతజ్ఞతకు పాత్రులైరి. అనువాదమేగాక పుస్తక ముద్రణముగూడ ముచ్చటగా నున్నది. ముద్రణము నొక కళయే యను సత్యమును మనవారింకను గుర్తింపలేదు. అట్టిచో అక్షర స్ఖాలిత్యాది దోషరహితమగు "ప్లేటో ఆదర్శ రాజ్యము" ముద్రణ సౌభాగ్యము చూచినపుడాహ్లాదము కలుగును. ముద్ర ణము ముచ్చటగానున్న యీ గ్రంథమునకు, విజ్ఞాన ప్రచా రార్థము సాహితీ ఎకాడెమీ పక్షమున ప్రచురిత మైనట్టి దానికి మూల్యము పదిరూపాయలుండుట యెక్కువయేమో యని చెప్పక తప్పదు.

రంప

ఉ. రంప పరాయిమూక జొరరాని రహస్యపుఁగొంప, క్యాన్నిబల్
గుంపులటొంప, కోయదొరకూటువ దుంప, విరోధిగుండె వా
లంప, పితూరిదారుల గలంపఁగ వచ్చెడు తెల్లవారికిన్
కంపన నించిమించుతట కాపద జేసెడు శంప గౌతమిన్

తూర్పుగోదావరీ మండలమున నేజాన్సీభాగము ఎనుబదేండ్ల క్రిందట రంప పితూరీ జరిగినది. అప్పుడు పన్నాల సీతారామ బ్రహ్మశాస్త్రులవారు చెప్పినదిది. (1822—1904) వీరు కందుకూరి వీరేశలింగము పంతులుగారి యాంధ్ర గీర్వాణ గురువులు.

నన్నయ - ఇష్టదేవతాస్తుతి

శ్రీ నిడుదవోలు వేంకటరావు

ఈనాడు మనము ప్రాచీనాంధ్ర సాహిత్య కావ్యప్రబంధము లను కేవలము సారస్వత విమర్శ దృష్టితోడనే పరిశీలించుట సర్వజన విదితము. పాశ్చాత్య విమర్శన పథకము ననుసరించి, మన మలవరచుకొన్న నవ్య సంస్కారదృష్టి, మన సాహిత్య గ్రంథముల పైపై మెఱుగులు చూపగలదేమోకాని, అతి గంభీరమును, ఆ సాహిత్య సౌధ నిర్మాణమునకు మూలాధారమగు నాధ్యాత్మిక, యోగ, మత, విద్యా సంప్రదాయ విశిష్టతల నేమాత్రము ప్రదర్శింప సమర్థముకాదు—అట్టి విశిష్టతకు గ్రహించుటకు గ్రంథములను కూలంకషముగ పఠించుటయు, శబ్దార్థముల సర్వంకషముగ నెరుంగుటయు ప్రధాన సాధనములు.

తెలుగున కావ్యావతారికలన్నియు, నిష్ట దేవతాస్తుతితో ప్రారంభమగుచున్నవి. కాని మన మా దేవతా స్తుతులను సాధారణముగ చదువనే చదువము. వానిని విస్మరించుటయే యొక విమర్శన లక్షణము. ఆ దేవతా స్తుతి పద్యములలో ప్రతి పద్యము నందును నెంతయో యర్థము నిక్షిప్తమై యున్నది. ఆ యా దేవతా స్తుతులలో వారి వారి మాహాత్మ్యములేగాక, వారిని గూర్చిన యపూర్వాద్భుత విషయము లెన్నియో మన కవులు నిరూపించియున్నారు. మన ఇష్ట దేవతా స్తుతులు మత విజ్ఞానమేగాక, నా యా దేవతలకు సంబంధించిన పౌరాణిక విజ్ఞానమును పద్య రూపమున ప్రదర్శించుచున్నవి. భారతీయాధ్యాత్మిక విజ్ఞాన ప్రతిబింబములైన యిష్టదేవతా స్తుతులలో మొదట నన్నయ ఇష్టదేవతా స్తుతినిగూర్చి ఇందు తెలుపుచున్నాను.

"కావ్య విమర్శనలో యమునికన్నా నిర్ఘృణు"1 డని యోగ్యతా పత్రము గడించిన కీ. శే. కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి గారిప్పటికిరువది మూడేండ్ల క్రిందట ప్రకటించిన నన్నయ భట్టారక చరిత్ర మొదలుకొని, నేటివరకు నన్నయను గూర్చి వ్యాసములు, వాద ప్రతివాదములు, చర్చలు, ప్రత్యేక గ్రంథములు, పద్యములు వెలువడుచునే యున్నవి. ఇవి యన్నియు నన్నయ భారతమునందు మన కభిరుచి గల్గింపలేదు. నన్నయ కవితా గుణములనుగాని, భాషా విశేషములనుగాని, యభివ్యక్తము చేయలేదు. సరికదా—సంప్రదాయ సిద్ధముగా కవులు, నన్నయనుగూర్చి తెలిపిన విషయములనైన ప్రదర్శింపలేదు. అందలి ముఖ్య లక్షణములు రెండు. 1 వ్యక్తిగతాభిప్రాయములు. 2 విపర్యాసములు—నన్నయనుగూర్చి వెలువడిన యొక బృహద్గ్రంథము. నుండి పై యభిప్రాయములను బలపరచుటకు ఇష్ట దేవతా స్తుతిని గూర్చిన యంశము నుద్ధరించుచున్నాను.

"నన్నయ భారతము"2 అను గ్రంథమున పై విషయమును గూర్చి ఇట్లు గలదు.

"కావ్య రచనారంభమున నిర్విఘ్న పరిసమాప్తికై నన్నయ "హరిహరాజ గజానన నార్క షడాస్యమాతృ సరస్వతీగిరి సుతాదిక దేవతాతతికి" నమస్కృతి యొనరించెను. శ్రీ వాణీ గిరిజాః" అనునది రాజరాజు కావించిన యాశీస్సు. ఇది యవతారిక యారంభము. ఇది నన్నయ కావించిన ప్రార్థన. భారత మహా కావ్యమున కారంభము. ఇందు నన్నయ త్రిమూర్తులకును, వారి భార్యలకును, గణపతికిని, సూర్యునికిని, కుమార స్వామికిని నమస్కార మొనరించెను. నన్నెచోడుని కుమార సంభవమున గూడ నారంభమున నీ దేవతలందరును స్తుతింపబడి యున్నారు. తరువాతి కవుల యవతారికలలో త్రిమూర్తులయు, దత్కాంతలయు, గజాననునియు స్తుతులేకాని, యర్క షడాననుల స్తోత్రము లుండవు. ఒక్క చేమకూర వేంకటకవి మాత్రం తాను సూర్య వరప్రసాదియగుటచే, సూర్యుని స్తోత్రమును ప్రత్యేకము గావించెను. నన్నయ షడాననుని పేరు పేర్కొనుటకు గారణ మున్నది. చాళుక్యులు స్వామి మహాసేన పదానుధ్యాతులు. వారి శాసనములలో "స్వామి మహాసేన పాదానుధ్యాతానాం చాళుక్యానాం" అనుమాట కనుపించును. ప్రభువంశమున కా దేవుని యెడల భక్తి గౌరవములు దలచియు, స్వయముగా దన కాతని యెడల గల భక్తిని పురస్కరించుకొనియు నన్నయ షడాస్య నామమును గూడ నా వేలుపుల పేరుల నడుమ జొప్పించి యుండును."

(నన్నయ భారతము—నన్నయ యవతారిక పుట 690—691)

పై యుద్ధృతాంశమున విమర్శనీయములగు విషయములు చాల గలవు.

(1) "నన్నయ" హరిహరాజ గజాన నార్క షడాస్య మాతృ సరస్వతీ గిరిసుతాదిక దేవతా తతికి నమస్కృతి' జేసినాడు. అనునది ఇందు గిరి సుతాదిక దేవతా తతిలో "ఆదిక"3 అన్న దాని కర్థమేమో విచారింపబడియున్నది!

---

1. ఇది గిడుగు రామమూర్తి పంతులుగారి వాక్యము.

2. ఇది శ్రీ డాక్టరు దివాకర్ల వెంకటావధాని ఎమ్. ఏ. పి. హెచ్. డి. గారిచే రచితమైనది—ఆంధ్ర వాఙ్మయారంభ దశ "అను వారి" పి. హెచ్.డి. థీసిస్"లోని ద్వితీయభాగము—ముద్రణము 1960.

ఇందలి భాషా విషయము లీ వరకే విమర్శనకు గురియైనవి. చూడుడు—"నన్నయ భారతము" శ్రీ వి. రామకృష్ణ రావుగారి వ్యాసము—భారతి—నవంబరు 1962. పుటలు 73—76.

3. గిరి సుతాదిగ—అని ప్రాచీనుదొరవారి పాఠము.

(2) "శ్రీ వాణీ గిరిజా:" అనునది రాజరాజు కావించిన యాశీస్సు"[4]

(3) "నన్నెచోడుని కుమార సంభవమునగూడ నారంభమున నీ దేవత లందరు స్తుతింపబడియునారు" ఈ వాక్యమెంత మాత్రము సరికాదు. చూడుడు:

<u>నన్నయ</u>	<u>నన్నెచోడకవి</u>
హరి	విష్ణువు
హర	శివుడు (శివపారమ్యవాదిగాన తొలిగా శివుని స్తుతించినాడు 3 పద్యములు.)
అజ	బ్రహ్మ
గజానన	గణనాథుడు
అర్క	సూర్యుడు
షడాస్య	షణ్ముఖుడు.
మాధవ (లక్ష్మీయని యర్థము)	ఈ స్తుతిలేదు
సరస్వతీ	భారతి
గిరిసుత	నగజాత
మన్మథస్తుతిలేదు	మన్మథుడు

పై వివరణ ననుసరించి నన్నయ దానిలో మన్మథ స్తుతి లేదు. నన్నెచోడకవి కృతిలో లక్ష్మీస్తుతిలేదు.

(4) తరువాతి కవుల యవతారికలలో త్రిమూర్తులయు, దత్కాంతలయు, గజాననుని స్తుతులేకాని, యర్క షడాననుల స్తోత్రము లుండవు" అనునది. ఇది సమూలముగా నసంబద్ధము—తరువాతి కవులలో సూర్య షడాననస్తుతులు లేకపోలేదు. చూడుడు:

తెలుగు కావ్యములలో సూర్యస్తుతులు[5]

1. కేతన (క్రీ. శ. 1250) దశకుమార చరిత్రమున[6] తిక్కన కభ్యుదయము సమకూర్పు నిష్టదేవతాస్తుతిలో సూర్యుడు కలడు.

"మేదురతేజో రాజిత
రోదో వివరుండు కొట్టరువు తిక్కనికిన్
వేదత్రితయాత్మకుడగు
నాదిత్యుం డొసగుగాత మభ్యుదయంబుల్"

కేతన తక్కిన కృతులగు ఆంధ్ర భాషా భూషణమున[7] విజ్ఞానేశ్వరమున[8] "శ్రీవాణీ గిరిజేశ దంతిముఖ రాజీ వాప్తులం గొల్చి" అను దానిలో రాజీవాప్తుడు అనగా సూర్యుడు. ఇందు 'శ్రీవాణీ గిరిజేశ' అనునది నన్నయ శ్రీ వాణీగిరిజా అను దాని ననుసరించినది స్తుతియేగదా!

2. మంచెన (క్రీ.శ. 1260) కేయూర బాహు చరిత్ర

చ. కరిముఖు డశ్వినుల్, శ్రుతులు కంజసముద్భవు మోము లాంబికే
శ్వరు ముఖముల్ తదాత్మజుని వక్త్రములాది మునీంద్ర మండలం
బురగ పతుల్ గ్రహంబులు—ఇచ్చుట గ్రహంబులు—అనగా సూర్యుడు స్తుతింపబడి నాడు "సూర్యాదీనాం నవగ్రహాణాం" అని శ్రుతి.

3. మడికి సింగన (క్రీ. శ. 1400) పద్మ పురాణము (ఉత్తర ఖండము)న సూర్యస్తుతి గావించియున్నాడు.

సరసిజభవ భవ విష్ణులు
పరువడి దన బింబమునవె ప్రతిభాసితులై
తిరిగెడు త్రిభువన దీపకుం
బరమాత్మునిగా భజింతుం బంకరుహాప్తున్"

మడికి సింగన పద్మపురాణము క్రీ. శ. 1885 లో నిర్దుష్టముగ ముద్రితమైనది. కాని, యా కృతిని గూర్చిన విమర్శనలే వాఙ్మయ చరిత్రలయందుం గానరావు.

4. సింగన జ్ఞాన వాసిష్ఠ రామాయణమున[9] సూర్యస్తుతి గలదు.

గీ. ఉదయవేళ విరించియై యొప్పుదాల్చి
పట్టపగలెల్ల రుద్రులై ప్రజ్వరిల్లి
మా ప్రహరిమూర్తియైన తామరలయనుగు
భూరితేజంబు మాకిచ్చి ప్రోచుగాత (1—4)

ఆంధ్ర వేదాంత వాఙ్మయమున తొలి గ్రంథమగు దీనిని గూర్చి విమర్శలేదు.

5. జక్కన విక్రమార్క చరిత్ర (క్రీ. శ. 1400)

చ. హరిహర నీరజాసన సుఖావహమై నిమిషార్థ మాత్రలో
నిరువది రెండు నూరులకు నెక్కుడు నిర్వది యోజ నంబులే

---

4. ఈ వాక్యము వీరిదికాదు—చూడుడు: కుమార సంభవ విమర్శనము—శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు. మద్రాసు విశ్వ విద్యాలయ ప్రచురణ, 1937 పుటలు 220.

5. ఇవి కాలక్రమము ననుసరించినవి.

6. దశకుమార చరిత్ర. క్రీ. శ. 1926 లో ద్వితీయ ముద్రణ మందిన వెనుక తిరిగి ముద్రితము కాలేదు. ఇందలి పలుకుబళ్లు కొన్ని నిఘంటువుల కెక్కలేదు. తిక్కన సోమయాజి కృతియైనను సుపరిష్కృత ముద్రణ భాగ్యమున కీ ప్రశస్త కృతి నోచుకొనలేదు.

7. విజ్ఞానేశ్వరము—క్రీ. శ. 1896 వెనుక దీనికి ద్వితీయ ముద్రణమే లేదు. శ్రీ చిన్నయసూరి దీనిని నామూలాగ్రముగ పఠించి యెన్నియో పదములను తన నిఘంటువున నిచ్చియున్నాడు.

8. కేయూర బాహుచరిత్ర—ఇదియు సుపరిష్కృతముగా బహు విశేషములతో ముద్రింపదగిన యుత్తమ కావ్యము.

9. దీనిని కీ. శే. వేదము వేంకటరాయశాస్త్రులవారొక్కరే ముద్రించిరి. ఈ వాసిష్ఠ రామాయణమును—సంపూర్ణముగ మద్దూరి పాపయ్య అను మహనీయు డాంధ్రీకరించి యున్నాడు.

యురదము లీలవోలె జన నంబర వీథినారతంబు వా
సురథము సన్మనోరథము చొప్పడ నీవుత సిద్ధమంత్రికిన్''

ఇది సూర్యస్తవమే. సూర్య రథ వర్ణనమును పై పద్యము నందలి తాత్పర్యము శ్రీనాథ మహాకవి కాశీ ఖండమున వ్రాసిన ఈ క్రింది పద్యమువలన దెలియ గలదు.

గీ. రెండు వేలును నిన్నూట రెండు యోజ
నంబు లర్ధనిమేష మాత్రంబునందు
నంబరంబునఁ బాఱుతీవ్రాంశు రథము
సలిపె బహు కాల మిట్టిదే నియతి మహిమ''
(1—35)

ఇది వింధ్య పర్వతము సూర్యుని రథము నడ్డగించు ఘట్టమున నునది.

6. కొరవి గోపరాజు (క్రీ. శ. 1440) సింహాసన ద్వాత్రింశిక.

''ప్రవిమలుఁడని గ్రహరాజని
సవితా ప్రియుడని జగత్ప్రకాశకు డనియున్
భువి విక్రమార్క నృప సం
భవ కారణుఁడనియు లోక బాంధవుఁదలఁతున్''

పై పద్యమున ''కవితాప్రియు'' డనుటవలన మయూర మహాకవి కుష్ఠురుజాపీడితుడై సూర్యుని లోకోత్తరమైన కవితచే మెప్పించి నిరామయుడైన విషయము సూచితమగుచున్నది.

7. ఏనుగు లక్ష్మణకవి (క్రీ. శ. 1720) జాహ్నవీ మహాత్మ్యము.

1. ''ఫాల తటంబునందుఁ గర పంకజముల్ ఘటియించి మ్రొక్కెదన్
హేళికి, భానుమాలికి, శ్రుతీడిత సద్గుణ పాళికిం గృపా
శాలికి, నంధకారవన సంతత కీలికి రోగ శైల దం
భోళికి, భక్తి సన్నవవిధి ముఖ్యసురాళికి లోకపాలికిన్.

2. రామేశ్వర మహాత్మ్యమున—

అగదంకార విభుం ద్రిమూర్తిమయుఁబద్మాప్తుం ద్రయీ విగ్రహున్
జగదానందకరున్ విభాకరుఁ దమస్సంహారు సర్వేశ్వరున్
త్రిగుణాత్మున్ వివిధాగమాంత విదితున్ దివ్యాసురారాధితున్
భగవంతుం గరుణా నిశాంత హృదయున్ భాస్వంతు సేవించెదన్

3. రామవిలాసమున—

సంకుచితార విందముఖ సంగత లక్ష్మినిఁ దోడి తెచ్చి ని
శ్శంక విహార సజ్జన విశాల గృహంబుల నిల్పు బుద్ధి చే
పంకజకోశముల్ కిరణ పంక్తులచే వికసింపజేయు న
ప్పంకజ మిత్రు వేదనుతి పాత్రు పవిత్ర చరిత్రు గొల్చెదన్.

ఈ మూడవ పద్యము సంస్కృతమున మయూర మహాకవి రచించిన సూర్య శత కమందలి ఈ క్రింది శ్లోకము ననుసరించినది.

శ్లో. భక్తి ప్రహ్వాయ దాతుం ముకుళపుట కుటి కోటర క్రోడ లీనాం
లక్ష్మి మాకృష్టు కామా ఇవ కమల వనోద్ఘాట నంకుర్వతేయే
కాలా కారాంధకారా ననపతిత జగత్సాధ్య సధ్వంస కల్యా
కల్యాణంవ: క్రియాసుకిసలయ రుచయస్తే కరా భాస్క
రస్య—2 శ్లోకము

8. బొడ్డుచెర్ల చెన్నకృష్ణకవి (1830—1890)

చ. సతతము కర్మసాక్షియయి సర్వసు పర్వులకెల్ల మేటియై
శ్రుతి గణరత్న పేటియయి సూరిజనస్తవ వార్ధ్యమూర్తియై
వితత ఘృణి ప్రభాళి పృథివీస్థలి వెల్ల వెలుంగజేయుచా
తత కరుణా సముద్రుడు పతంగుడు కోర్కులు మాకు నీవు
తన్—నార దోపశ్లోక సంవాదము —
ముద్రణము 1888.

ఈతడు సతీ బాల బ్రహ్మేశ్వరీ పరిణయమను ప్రబంధము రచించియున్నాడు.

9. మండపాక పార్వతీశ్వరశాస్త్రి (1833—1897)

ఉ. ప్రామినుకుల్ నిజాకృతిగ భాసిలుచుం గమలోదయార్ఘచ
ర్యా మహనీయుఁడై నరకహారి గురున్నతి వర్ధనుండువై
వేమరు శ్రీధరుండ వెడు విశ్రుతి గాంచి వెలుంగువే వెలుం
గా మయముల్ వెలార్చి తమమార్చి క్రమమ్ముగ మమ్ము గావుతన్.

కృష్ణాభ్యుదయము 14 పద్యము 1897 ముద్రణము.

10. కాకాని వెంకట నరసమ్మ యను కవయిత్రి (1858—1913) తన శ్రీకృష్ణ కందార్థములు అను గేయ శతకమున ప్రథమమున సూర్య స్తుతి యిట్లు గావించినది.

చ. ఉదయన గొద్ది వుండగుచు నొయ్యన పశ్చిమ భూరంబు
నడుమల కాంతి లోకముల జల్లుచు బోయెడు వాడు నిత్యుడున్
సదమల యోగి హృత్సరసి జాప్తుడు పద్మ హితుండు మాకిలన్
సదమల భోగ భాగ్య సుఖ సంతతు లెప్పుడు నిచ్చిప్రోవుతన్

1913 లో విద్యా నిలయ ముద్రాలయమున రాజ మహేంద్రవరమున ముద్రితము.

11. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు (క్రీ. శ. 1880—1950) ముసలమ్మ మరణము అను ఖండ కావ్యమున (క్రీ. శ. 1900) సూర్యస్తుతి కావించిరి.

శా. ప్రాహ్ణం బందున భంగ శోణమయుతన్ బ్రహ్మన్విడంబించిమ
ధ్యాహ్నం బందు ప్రచండ దీధితుల రుద్రు ప్రక్రియం బొల్చిసా
యాహ్నంబందు ననంత శాంతత ననంతాధీశువింబోలి
ర్వ్యాహ్నంబుల్ వెలుగొందు భాస్కరుద్రి మూర్త్యాత్మక
మది న్నిల్పెదన్—5వ పద్యము.

ఇట్లు తెలుగు కృతుల యవతారికలలో సూర్యస్తుతి కనవచ్చుచుండగా "ఒక్క చేమకూర వేంకటకవి మాత్రము తాను సూర్య వరప్రసాది యగుటచే సూర్యుని స్తోత్రమును ప్రత్యేకముగావించెను" అని యెట్లు వ్రాయబడినదో దురూహ్యము.

షడాననస్తుతులు

షడానన స్తోత్రము అనగా కుమారస్వామి స్తవము. ఇది నన్నయ నన్నెచోడుల కృతులయందేగాక, ఇతర కవి కృతుల యందును గానవచ్చుచున్నది.

1. కేతన—దశ కుమార చరిత్ర.

"జనకుఁడు పంచవక్త్రుఁడనిశంబును వెన్నిన ప్రాపుతోడఁ బు
ట్టిన గణనాథుఁడింక నొకడే నను బోర జయించునంచు బెం
పొనర నమర్త్య శత్రువుల నోర్చి వెలింగెడు నామయూరవా
హనుఁడు మయూర సన్నిభ మహాకవిఁ దిక్కనిఁ గాచుఁగావుతన్.
(1—6)

ఇందు కేతన షడానన స్తుతి యారవ పద్యముగనే యొనర్చుట యెంతయు సముచితమై యున్నది.

2. మంచెన కేయూర బాహు చరిత్రమున లంబికేశ్వరు మొగములే తదాత్మజుని వక్త్రములు అనుచో షడాననుఁడు సూచితుఁడు.

3. చిమ్మపూడి అమరేశ్వరుఁడు—విక్రమసేనము—

'చనవుగ రెండు వక్త్రములు చన్నుల పాల్గ్రుడువంగ నొక్కమో
మున నగ నొక్క యాననము ముద్దు నటింపగ నొక్క యాస్యము
న్గనగ నిదేమి పల్కుడని యాలపనంబున బెక్కులింపుచు
బ్బున నగు షణ్ముఖుండెలమి బొంగి త్రిశక్తుల మాకు నీవుతన్

4. జక్కన—విక్రమార్క చరిత్ర.

"అనతులై నుతించు చతురానన ముఖ్యుల కోర్కె దీర్ప బం
చానన దివ్యమూర్తికి షడాననుడై జనియించి యా సహ
స్రానను సంస్తవంబునకు నందని శక్తిధరుండు సానుకం
పాననుడై నృపేంద్ర సచివాగ్రణి సిద్దన జూచు గావుతన్

5. కొఱవి గోపరాజు:—సింహాసన ద్వాత్రింశిక

"రుణ్మద పరివృత సురగణ
తృణోన్మోచను సురశరణ్యు ధృత శక్తి ఫణి
ద్విణ్మయు వాహను హరినిభు
షణ్ముఖు నభిముఖునిగా ప్రశంసింతు మదిన్.

ఇందును కృత్యాదిని షడాననస్తుతి యారవ పద్యము గావే యుండుట విశేషము.

6. బైచరాజు ముమ్మయ —

మ. తమకముతోడ తల్లియును దండ్రియు నొక్కట ముద్దు వేడనం
భ్రమమునవచ్చి తల్లి ముఖ పద్మను దండ్రి ముఖంబులై దునే
గను తన యారు మోములను గైకొని ముద్దిడుమేటి వేలుపుం
గొమరుఁడు నాదువాణికి నకుంఠిత శబ్దము లిచ్చు గావుతన్.
—విష్ణు కథా నిధానము వ్ర. ర. 386 ప.

7. అప్పకవి—

మ. జనకుని గొల్వవచ్చు నల చామర కర్ణుని తేజి సందివా
హను ముకుటాహిగాంచి భయమంది పిఱిందికి బోవజూచినన్
దన శిఖి మావుఁడీకొలిపి దాని భయంబు హరించి పూర్వజా
తునకు ముదం బొనర్చు గుహు డర్థర శక్తి మహాస్ఫురింపఁజేసెన్.
—అప్పకవీయము (1—23)

8. కోటి రఘునాథ నాయకుఁడు—

చ. అయ్యకు ప్రేమ పెద్ద కొడుకన్న పయోధర కాంక్ష ఎచ్చెదీ
వియ్యెడకుం పదీయుకచ మెల్లనఁ దర్గతి గేరుసంచుఁడా
నయ్యభవక్త్ర నీకు కడకంచి గిరీంద్రుని కన్య పంటిపా
లయ్యనఁద్రావు బాలు మది నుంచెద వాంఛితముల్ ఫలింపగన్.
—పార్వతీ పరిణయము (1—6)

(నన్నెచోడ మహాకవివంటి యుద్దండ కవిరాజు చేపట్టిన కుమార సంభవమును, నాతని వెనుక నా కథను సరసముగ జాలి వార్తా చమత్కార యుక్తముగ రచించి, కావ్య రసికుల నాకర్షించిన ఈ కృతిని నేటి విమర్శకు లెరుంగరని చెప్పవచ్చును.

పై నన్నయ భారతమున నీ రెండు స్తుతులనుగూర్చిన విమర్శనము మాత్రమే ఈ వ్యాసమున గలదు. మన మింకను పరిశీలించిన మఱికొన్ని లభింపగలవు. పరిస్థితు లిట్లుండగా, నొక సిద్ధాంత గ్రంథమున నిట్టి విపర్యాసములుండుట శోచనీయము![10]

మన ప్రాచీన కావ్య ప్రబంధములందలి ప్రతి పద్యము నెంత జాగరూకతతో పరిశీలింపవలయునో సూచించుటకు మాత్రమే ఈ వ్యాస ముద్దేశింపబడినది.

నవీన విమర్శకు లీ దృక్పథముతో భారతాది గ్రంథముల బరీక్షించి, యందలి నూతన విషయములను సమీక్షించి, సాహిత్య విమర్శనము పెంపొందింప జేయ వేడికోలు.

---

10. ఇంకను నీ గ్రంథమున నీ సందర్భమున గ్రంథకర్త ముఖ్యముగ చెప్పి యుండవలసిన మన్మథ స్తుతినిగూర్చి మఱి యొక మాఱు తెలిపెదను.

లేఖలు

అముద్రిత ఆంధ్ర నానార్థ నిఘంటువు

అయ్యా!

మన భాషలోవున్న నిఘంటు సంఖ్య స్వల్పాతి స్వల్పం. ఉన్నవి కూడా అసమగ్రంగా ఉన్నవి. ఈ సూత్రం ప్రతి నిఘంటువుకు పడుతుంది.

భాషలో కావ్యా లనంతంగా ఉన్నప్పుడు, ఏకావ్యంలో ఏమూల, ఏశబ్దం వాడబడిందో పరిశోధించి, నిఘంటువులో చేర్చడమే కష్టమైనప్పుడు, అముద్రితంగా, అలభ్యంగా అనేక గ్రంథాలు, కావ్యాలున్నప్పుడు అందులో శబ్దాలు నిఘంటువులో కెలా ఎక్కటం? ఈవిధంగా మన నిఘంటువులు అసమగ్రంగానే ఉంటూ వస్తున్నవి.

ఇదిలా ఉండగా మార్చి (1963) నెలలో పై శీర్షికతో ఒక వ్యాసం వచ్చింది. సాహితీ జిజ్ఞాసువులకు ఆ వ్యాసమందలి విషయం పరమాహ్లాదంగా ఉంటుందనడంలో అతిశయోక్తి ఏముంటుంది?

అది నానార్థ నిఘంటువట. అందు 51 ఆట వెలదులు, 294 కందములు నున్నవట. అదివరకున్న నిఘంటువులలో లేని పదాలు చాలా వున్నవట—ఇంతకంటె కావలసిందేముంది? పైగా అందులోవున్న ఇంకొక విశేషం ఏమిటంటే—మన నిఘంటువుల్లో వృక్షనామమేదైనా వచ్చిందంటే—వాళ్ళకు మాత్రం ఏం దెలుస్తుంది గనక—వృక్ష విశేషమని వ్రాయటం. అలాగే జంతు విశేషమని—ఈ పద్ధతి కన్పిస్తుంది. ఆ వ్యాసకర్త శ్రీ హస్నాబాద నాగలింగయోగిగారు సంపాదించిన ఆ తాళపత్ర ప్రతిలో కేవలం జంతు విశేషం, వృక్ష విశేషం—అని తప్పించుకొనిపోకుండా ఆ చెట్టో, మెకమో ఏదో దాన్నిగూర్చిన వివరాలు కూడా వున్నవట. ఇట్టి గ్రంథాలు సత్వరం ముద్రింపబడటం అత్యావశ్యకంగా తోస్తుంది ప్రతి సాహిత్యజిజ్ఞాసువుకు.

ఆ నిఘంటువును వ్రాసిందెవరో ఆ తాళపత్ర ప్రతియందు దొరకలేదుట. కాని, నేటికి 107 సం. ల క్రితం వ్రాయబడిందని మాత్రం అందులో ఉందట. ఈ నాటి కది బైట పడింది. దాన్ని బైటకు తెచ్చినందుకు నాగలింగయోగి గారికి ఆంధ్రులు కృతజ్ఞులు.

ఆ నిఘంటువులోని కొన్ని పద్యములు వా రుదాహరణగా ఇచ్చారు. అవి మొత్తం 15. అందులో ఆట వెలదులు 2. కందాలు 13.

ఆ నిఘంటుకర్త తాను చేతిమీదుగా వ్రాసుకొన్నదో, ఆ ప్రతి, లేక ఆయన వ్రాసుకొన్న ప్రతికి ఎన్నో పుత్రికయో మనకేమీ తెలియదు. కాని, ఆ పద్యాలు వ్రాసిన కవికి, లేక ఈ ప్రతిని వ్రాసుకొన్న వ్రాయసకానికి ఛందోజ్ఞానం పూజ్యం. శబ్దజ్ఞానం అంతకుముందే లేదు. ఆటవెలది, కందముల లక్షణమే సరిగా తెలియదు. కొన్నిశబ్దముల కర్థతాత్పర్యము లియ్యబడివున్నవి. వాటిని క్రమంగా నిరూపించటం మంచిదనుకుంటాను.

ఇక్కడొక చిన్న మనవి. ఈ వ్యాసం ఆ వ్యాసకర్తకు సంబంధించినదికాదు. ఆ నిఘంటుకర్తకు సంబంధించినది. ఇది కాక, ఇట్టి నిఘంటువులు అవశ్యం ముద్రింపబడాలని ముందే మనవి చేసినానుకదా. అట్లా చేయటానికి ఆ వ్యాసకర్తలుగాని, మరెవ్వరైనా తత్ప్రయత్నంలోవుంటే చాలా పరిష్కరించాల్సి ఉంటుందని సూచన చేయడానికిది వ్రాయటం. అంతకన్న ఏమీ లేదు.

రెండు ఆట వెలదుల్లోనూ ఒక పద్యంలో ఒక్క పాదానికి మాత్రమే యతి పాటించబడింది.

శ్వేతమనగ తెలుపును శ్వేతము యెరుపును—మిగిలినవన్నీ యతులు లేనివే.

13 కందపద్యాలకుండే ఇరవైయారు యతుల్లోనూ పదకొండు మాత్రమే యతులు పాటించబడినవి.

ఇక ప్రాసలు:—ఒక పద్యంలో ప్రాస కూడా లేదు.

బరహియున—

బర్హియునన్—

బరహియున—

బర్హియునన్—

ఛందో దోషాలు:—

''చమరి మృగము ననగ తెల్లవెంట్రుకల మృగము''

''శ్వేతమనగ తెలుపును, శ్వేతము యెరుపును''

ఇందొక్కొక్కఅక్షర మెక్కువగావుంది. రెండవదానిలో 'ను' తీసివేయవచ్చు. పై దానిలో వెంట్రుక—వెండ్రుక—కాబోలు.

కందపద్యంలో బేసిగణము జగణముండరాదుగదా. మాణవుడన బమ్మచారి.

కల్హారంబన కలువలు—ఈ పద్యం నాలుగవ పాదం.

కల్హార మనంగ పుష్పాడికిని పేరయ్యెన్—

ఇందు బేసిగణం జగణమేకాక, ఛందస్సు కూడా తప్పింది. పోనీ ''కల్హార మనంగ పుష్పాడికిని పేరయ్యెన్—'' ఇట్లా పఠించినా 7 వ గణం సగమౌతున్నది. యతి లేదు.

ఇక శాబ్దిక దోషాలు:—

6. లాంశంబన—ఆడెటివారున్

(1) నానార్థ శబ్దములకును

....

....

మానుగ శబ్దార్థములను మరి దెలుసు నుమీ

(2) ఏ శబ్దములు వచ్చిన—(శబ్దంబులు కాబోలు)

యా శబ్దంబులును నన్నియంతయు తెలునున్—

(ఇందులో అన్నీ—యంతయు—అర్థమేమిటో?) ఇట్లు న్నవి.

(1) కురువకవన

కురువక.........కూకటియానూ—ఇందులో ఈ 'నూ' దీర్ఘ మెట్లు వచ్చిందో తెలియదు.

వ్యర్థ శబ్ద ప్రయోగం, పునరుక్తులు కుప్పలు తెప్పలు.

మానుగ జదివిన దీనిన్

మానుగ శబ్దార్థములును మరి దెలుసుకుమీ

ఈ ప్రాస యతులకు ఈ నిఘంటుకర్త పద్దపాట్ల కిది నిదర్శనం.

హరులన గుఱ్ఱములగునూ

హరులన పగ్గముల పేరును హరులన శత్రుల్

(ఇందు'ను' ఎక్కువ—శత్రుల్ కాబోలు)

అరియన్న శబ్దానికి శత్రువన్న అర్థముందిగాని 'హరి' శబ్దానికున్నదా. ఇట్లాంటివాటికి ఉదాహరణకావాలి. (లేక హరించు వాడని చెప్పుకోవాలి. ప్రతివాడుహరించగలడా)

శశిబంధు డనగ కుందేలు—ఈ శశి బంధు శబ్దాని కిచ్చిన అర్థాలు విచార సహ్యములు.

శశిబంధు డనంగ రాజా చూడు ధరిత్రిన్—శశిబంధు డనే రాజుకథ ప్రసిద్ధంగావుంది. మరి ఈ శశిబంధు డెవరో? ఎవరో ఒకరుండకపోరు. కాని, ప్రసిద్ధి ననుసరించికదా చెప్పాలి. శకట సాధురేఫ సాంకర్యం, అర్ధబిందువులు పాటించకపోవటం, యతులు, ప్రాసలు, ఛందస్సు, శబ్దములు, అర్థములు—వీని యన్నింటిలోనూ దోషాలు కన్పిస్తున్నవి. ఇచ్చింది 15 పద్యాలు, 30, 40 దోషాలు. సంధి దోషా లనేకం. మరి ఇట్టి నిఘంటువు ప్రామాణికంగా అంగీకరింబడడమెలా? ఇది పరిష్కరణ దుస్సాధ్యంలాగా కన్పిస్తుంది.

దీన్నెవరైనా ప్రచురించే ప్రయత్నంలోవుంటే వారి కిదొక సూచన.

కరీంనగర్ తుమ్మపూడి కోటీశ్వర రావు.

ప్రౌఢకవి మల్లన పోతన కుమారుడా?

అయ్యా!

శ్రీ విమర్శ కాగ్రేసర దీపాల పిచ్చయ్యశాస్త్రిగారిచే సంపాదితమైన "చాటుపద్య రత్నాకరము"న 54 పుటలో "ప్రౌఢకవి మల్లన" అను శీర్షిక క్రింద "ఈ మల్లన బమ్మెర పోతనామాత్యుని కుమారుడగు ప్రౌఢకవి మల్లనయే" యని వ్రాసియున్నారు. కాని ప్రౌఢకవి మల్లన దాక్షాయణీ పరిణయము, రుక్మాంగద చరిత్రము అను రెండు ప్రౌఢ ప్రబంధములను వ్రాసియున్నాడు. ఈతని గోత్రాదికముల విట్లు తెలియుచున్నది.

కం. మనమున సేవింపుదు—ను
జ్జనకుని శ్రీవత్స గోత్ర సాగర చంద్రున్
ఘను బోతయమంత్రీశ్వరు
ననయంబును భక్తి నమ్మళాంబా ప్రియునిన్॥

ఈ పద్యమునుబట్టి శ్రీవత్స గోత్రమనియు, అమ్మళాంబ పోతయలు తల్లిదండ్రులనియు తెలియుచున్నదికదా!

ఇక పోతన కుమారుడగు మల్లన గోత్రము 'కౌండిన్యస' తండ్రి పోతనామాత్యుడు. ఈ మల్లనకు ప్రౌఢకవియను బిరుద మున్నట్లు కనపడదు. పై రుక్మాంగద చరిత్రలోని పద్యమువలన ప్రౌఢకవి మల్లన పోతనకుమారుడగుటలేదుకదా! కావున శ్రీ శాస్త్రి గారు తమ "చాటు పద్య రత్నాకరము"లో వ్రాసినది పొరపాటేమోయని తోచుచున్నది.

కొమాండూరి రామానుజాచార్యులు.

అర్యా!

కేంద్రప్రభుత్వ సాహిత్య అకాడెమీవారు 1962 వ సంవత్సరమున తెలుగు భాషలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి "మధ్యాక్కరలు" అన్న గ్రంథాని కైదు వేల రూపాయలు బహుమతి నిచ్చిరని మునుందు వినియుంటిమి. ఆ బహుమతి వారు స్వీకరించిరని కూడ తెలిసికొంటిమి.

సాహిత్య అకాడమీవా రిదివరలో కిచ్చిన పుస్తకముల విశిష్టత మాట కేమిగాని ప్రస్తుతము విశ్వనాథవారి బహుమతి గ్రంథము మాత్రము మావంటివారి కత్యాశ్చర్యము కలిగించినది. బహుమతికి పంపబడు గ్రంథముల రచనా విశేషములే గాక, గ్రంథ ప్రచురణాది విశేషములు గూడ చర్చింపబడునని వినుచున్నాము.

విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షాది మహాకావ్యములుండగా, ఈ చిన్ని మధ్యాక్కరల పుస్తకమున కీపెద్ద బహుమతి యెట్లు వచ్చినదో అది మాకు దురూహ్యముగా నున్నది. ఏ పత్రికయందు నీ మధ్యాక్కరలు మొదట ప్రకటితములైనవో, ఆ 'భారతి' పత్రిక గూర్చి 'భారతి స్థాయి పడిపోయినది' అని స్పష్టముగా విశ్వనాథవారు నిందించియున్నారు. కాని నేడా "స్థాయి పడిపోయిన పత్రిక" లో ప్రకటితములైన పద్యములనే బహుమతి గ్రంథముగా రూపొందించుట చిత్రముగా నున్నది. కేవలము బహుమానము కొరకు నీ 'మధ్య" "అక్కరలు" అక్కరకు వచ్చినవి కాబోలు.

గ్రంథము మాటకేమి—గాని గ్రంథము పేరు 'మధ్యాక్కఱలు" అని శకటరేఫముగా వారు వ్రాసిరి. నన్నయ మండి, నేటివరకు, సరళముగా నున్న మధ్యాక్కరను, వీరు పరుషముగ—'ఱ' గా నిర్ధారించినారు. దీని భావమేమి తిరుమలేశ ? నన్నయను మించవలయుననియా ? చిన్నయను కించ పరుచవలె ననియా ?

హైదరాబాదు ఒక పాఠకుడు.

హిమాలయ రాజ్యాలు

'పరిశీలక్'

భారతదేశానికి ఉత్తర దిక్కున హిమాలయ పర్వత శ్రేణులు పెట్టని కోటలవలె ఉన్నాయని ప్రతిచరిత్ర పుస్తకం చెబుతుంది. హిమాలయాలవల్ల భారతదేశానికి ప్రకృతిసిద్ధమైన రక్షణ, భద్రత కలిగిందని చరిత్రకారు లందరూ చెబుతారు. కాని చరిత్రను పర్యాలోకన చేసి చూస్తే 2500 బి. సి. లో ఆర్యులు మొదలుకొని, 16 వ శతాబ్దంలో మొగలాయిల వరకు భారతదేశంమీద దండెత్తి వచ్చిన వారంతా (పర్షియనులు, గ్రీకులు, పార్థియనులు, స్కిథియనులు, హూణులు, అరబ్బులు, పఠానులు, అహోములు, దుర్రానీలు) ఉత్తరదిక్కు నుంచే వచ్చారు. పోర్చుగీసువారు, ఇంగ్లీషువారు మాత్రమే సముద్రమార్గాన వచ్చారు. చివరకు ఈనాడు కమ్యూనిస్టు చైనా దురాక్రమణ ప్రమాదం కూడా ఉత్తర దిక్కునుంచే, అందులోను హిమాలయాల నుంచే ఆరంభమైనది. కనుక భారతదేశానికి ఉత్తరదిక్కున ఉన్న హిమాలయ పర్వతశ్రేణులు ప్రకృతిసిద్ధమైన రక్షణను, భద్రతను దేశానికి ఇవ్వటం లేదని ఇప్పటికైనా మనం గ్రహించడం మంచిది.

ఇతర యుగాలలో సంగతి ఎలా ఉన్నా బ్రిటిష్ యుగంలో మాత్రం భారత ఉత్తరదిక్కు భద్రతకు హెచ్చు శ్రద్ధ చూపారు. అందులో సామ్రాజ్యరక్షణ దృష్టి అనేది బ్రిటిష్‌వారికి ఉండవచ్చు. అయినప్పటికి అది భారత రక్షణ వ్యూహానికి, రక్షణ ఏర్పాట్లకు పునాదులు వేసింది. అది కూడా ఆ కాలపు రాజకీయ పరిస్థితులకు, ఇరుగు పొరుగు రాజ్యాల పోటీకి అనువుగా ఉంటూ వచ్చింది. ఈనాడు వలెనే ఆనాడు కూడా భారతదేశానికి ఉత్తరదిక్కున ఒకవైపున చైనా మరొక వైపున రష్యా ఇరుగు పొరుగు రాజ్యాలుగా ఉండేవి. అప్పుడు బర్మా కూడా భారతదేశంలో అంతర్భాగంగా ఉండేది. బ్రిటిష్ సామ్రాజ్యాధికారం ఢిల్లీలోను, జారు చక్రవర్తుల సామ్రాజ్య వైభవం మాస్కోలోను అఖండంగా సాగుతూ ఉండేది. చైనాలో మంచూవంశ పతనం తర్వాత బలమైన కేంద్ర ప్రభుత్వం ఏర్పడలేదు. అక్కడ పాశ్చాత్య రాజ్యాల ప్రాబల్యం నెలకొన్నది. కనుక చైనా పోటీ అనేది బ్రిటిష్ ప్రభుత్వానికి లేకుండా పోయింది. రష్యా మాత్రమే భారత దేశం గురించి బ్రిటన్‌తో పోటీపడుతూ వచ్చింది. ఇందులో ఫ్రాంను రష్యాలు ఏకమైనాయి. ఈ సామ్రాజ్యశక్తుల వ్యూహాలకు ఆఫ్ఘనిస్తాన్ కీలకమైనది. ఆఫ్ఘనిస్తాన్ ద్వారా భారత దేశంమీద పలుకుబడి సంపాదించాలని రష్యా చేసిన ప్రయత్నాలను బ్రిటన్ నిరోధించింది. ఆఫ్ఘన్ యుద్ధాలు జరిగాయి. ఆఫ్ఘన్ సింహాసనానికి వారసత్వపు పోటీలు వచ్చాయి. రష్యాలో జారు చక్రవర్తుల స్థానే లెనిన్ నాయకత్వాన బోల్షివిక్‌లు అధికారానికి వచ్చారు. అయినప్పటికి రష్యా—బ్రిటన్‌ల మధ్య ఆఫ్ఘనిస్తాన్‌కు సంబంధించిన పోటాపోటీలు తప్పలేదు. అటు రష్యను మనస్సులో ఫుంచుకొనే, దానిని ప్రతిఘటించే యోచనతోనే భారతదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వం భారత వాయువ్య సరిహద్దులను కట్టుదిట్టం చేసింది. హిమాలయాలలోని ఖైబర్, బొలాన్ కనుమల వరకు సైనికంగా అవసరమైన రహదార్లు వేయడం, రక్షణ శ్రేణుల ఏర్పాటు, సైనిక స్థావరాల నిర్మాణం వంటివి కొనసాగించింది. రాజకీయమైన వ్యూహాలతో డ్యూరెండ్ రేఖను ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దుగా నిర్ణయించింది. వాయువ్య సరిహద్దు రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. సింధు, పంజాబు రాష్ట్రాలను ప్రత్యేకంగా అభివృద్ధిచేసి, సైనిక వ్యూహానికి అవసరమైన ఆర్థిక వసతులను సమకూర్చింది. అంతేకాదు, అటు రష్యా, చైనాలకు ఇటు భారతదేశానికి మధ్యగా హిమాలయ రాజ్యాలను (కాశ్మీర్ నేపాల్, భూటాన్, సిక్కిం, టిబెట్) "బఫర్ స్టేట్సు" గా నెలకొల్పి వాని ద్వారా ఉత్తర పరిహద్దులలోని తెగలను అదుపాజ్ఞలలో ఉంచింది. ఇలా హిమాలయ సరిహద్దుల రక్షణకు బ్రిటిష్‌వారు సుమారు అర్ధశతాబ్దం కృషిచేసి, ఒక సైనిక వ్యూహాన్ని, రాజకీయ విధానాన్ని రూపొందించారు. ఇది ఆసియాఖండం మొత్తం భద్రతకు అనువైనదిగా ఉద్దేశించారు. కమ్యూనిస్టు చైనావల్ల సంభవించిన దురాక్రమణ ప్రమాద నిరోధానికి కూడా ఇదే ఉత్తమ పథకమని పాశ్చాత్య రాజ్యాలు ఇప్పటికీ విశ్వసిస్తున్నాయి.

అయితే బ్రిటిష్‌వారు భారతదేశంనుంచి వైదొలగడం వల్ల సంభవించిన రాజకీయ పరిణామాలవల్ల హిమాలయ సరిహద్దులకు సంబంధించిన సైనిక, రాజకీయ వ్యూహం సడలిపోయింది. పాకిస్తాన్ అవతరణ, అందులోను పశ్చిమ పాకిస్తాన్ అనేది భారత వాయువ్య సరిహద్దులలో నెలకొనడంతో, బ్రిటిష్‌వారి వ్యూహానికి కీలకమైన ఆ భాగం వేరు రాజ్యమైపోయింది. అక్కడ కూడా ఆఫ్ఘనిస్థాన్, బెలూచిస్థాన్ వగైరాలలో పఠానులవల్లను, సోవియట్ రష్యా వ్యూహాల వల్లను ఆశించినంత భద్రత పాకిస్థాన్‌కు సమకూరలేదు. కాశ్మీర్ వివాద మనేది కూడా కొత్తగా ఏర్పడడంతో ఈ భాగపు హిమాలయ సరిహద్దులలో కొత్త సమస్యలు అనేకం రాజకీయంగాను, సైనికంగాను ఏర్పడ్డాయి. అయితే పాకిస్తాన్ మాత్రం పశ్చిమ రాజ్యాలతో స్నేహంగా ఉంటూ బ్రిటిష్ పాలన నాటికి పథకం ప్రకారం రక్షణను, భద్రతను సమకూర్చుకొనడానికి ప్రయత్నిస్తూ వస్తున్నది.

భారతదేశం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా మారింది. బ్రిటిష్ పాలనలో వలె ఇప్పుడు చైనా బలహీనమైనదిగా లేదు. కమ్యూనిస్టు భావ ధోరణి కలిగిన బలమైన కేంద్ర ప్రభుత్వం చైనాకు ఏర్పడింది. ఈ రాజకీయ పరిణామం హిమాలయ సరిహద్దుల పరిస్థితిని తలక్రిందులు చేసింది. పాకిస్తాన్ అవతరణతో సోవియెట్ రష్యా అనేది భారతదేశానికి సరాసరి పొరుగురాజ్యం కాకుండా పోయింది. ఇలాంటి రాజకీయ పరిణామాన్ని బ్రిటిష్ పాలకులు వూహించి, ఖైబర్—బొలాన్ కనుమల వరకు చేసిన రక్షణ ఏర్పాట్లు వంటివి చైనా భారత దేశాల మధ్య సింహద్వారాలుగా ఉన్న హిమాలయ కనుమలలో చేయలేదు. ఆ లోపాన్ని స్వతంత్ర భారతదేశం పూర్తిచేసుకొనవలసి వచ్చింది. కాని కమ్యూనిస్టు చైనా మిత్ర ధోరణిని నమ్మి, దానితో శత్రుత్వం భవిష్యత్తుకు మంచిదికాదని విశ్వసించి, స్వతంత్ర భారత ప్రభుత్వం అనుసరిస్తూ వచ్చిన విధానాలు కారణంగా అలాంటిది గత పదిహేను సంవత్సరాలుగా జరుగలేదు. చివరకు కమ్యూనిస్టు చైనా చేతుల్లో భారతదేశం తొలి దెబ్బను తినవలసి వచ్చింది. చిరకాలం నుంచి వస్తున్న హిమాలయ సరిహద్దులకు భంగం కలిగింది. ఇది రెండు రకాలుగా సంభవించింది. ఒకటి సైనికమైనది. రెండవది రాజకీయమైనది. సైనికమైన భంగపాటువల్ల కొన్ని వేల చదరపుమైళ్ల భూభాగాన్ని భారతదేశం కోల్పోయింది. రాజకీయమైన భంగపాటువల్ల హిమాలయ రాజ్యాల సానుభూతిని కూడ భారతదేశం కోల్పోతూ వచ్చింది. ఇందుకు ప్రధాన కారణాలు రెండు. బ్రిటిష్ పాలకులు రూపొందించిన "బఫర్ స్టేట్స్" విధానాన్ని స్వతంత్ర భారతదేశం అనుసరించక పోవడం మొదటి కారణం. ఈ విధానాన్ని అనుసరించి ఉంటే టిబెట్‌ను కమ్యూనిస్టు చైనా కబళించేది కాదు. కమ్యూనిస్టు చైనా సైన్యాలు ఇంత త్వరగా భారత హిమాలయ సరిహద్దులలోకి చొచ్చుకొని వచ్చేవి కాదు. భారత వాయువ్య సరిహద్దులను రష్యానుంచి రక్షించడానికి ఆఫ్ఘనిస్థాన్ ఎంతగా కీలకమైనదో, భారత, ఉత్తర సరిహద్దులను కమ్యూనిస్టు చైనా నుంచి రక్షించడానికి టిబెట్ అంతగా కీలకమైనదన్న యోచన భారత రాజకీయ నాయకులకు లేకపోవడం వల్లనే ఈ దుష్పరిణామం సంభవించింది. కనీసం పాకిస్తాన్ వలె పశ్చిమ రాజ్యాలతో సైనిక ఒప్పందాన్ని, లేదా పొరుగునవున్న బర్మా పాకిస్తాన్‌లతో ఏదో ఒక రకమైన స్నేహ ఒప్పందాలను, హిమాలయ సరిహద్దుల భద్రతకు బ్రిటిష్‌వారు రూపొందించిన పథకంలో అంతర్భాగంగా చేసుకొని ఉన్నా, ఇంత త్వరగా హిమాలయ సరిహద్దులలో దురాక్రమణ ప్రమాదం ముంచుకు వచ్చేది కాదు. కనీసం జమ్మూ—కాశ్మీర్‌కు ఇచ్చిన ప్రాధాన్యాన్ని టిబెట్‌కు ఇచ్చి ఉన్నా పరిణామాలు మరొక రకంగా ఉండేవి. ఇవేవీ కాకుండా కమ్యూనిస్టు చైనా కేంద్ర ప్రభుత్వం ఉనికిని, వ్యక్తిత్వాన్ని రాజకీయ శక్తిని 20 వ శతాబ్దపు చరిత్రలో ప్రధానమైన పరిణామంగా భారత రాజకీయ నాయకులు భావించి దాని మిత్రత్వం కోసం నమ్రతతో వ్యవహరించినందువనే హిమాలయ రాజ్యాలలోని పరిణామాలను నిర్లక్ష్యం చేశారు. అందుకు చక్కని ఉదాహరణ నేపాల్.

బ్రిటిష్‌వారు ఏర్పరచిన హిమాలయ రాజ్యాలలో నేపాల్, భూటాన్, సిక్కిం లు ప్రధానమైనవి. వీనిలో కీలకమైనది నేపాల్. బ్రిటిష్ పాలనలో నేపాల్ ఒక రక్షిత రాజ్యంగా ఉన్న మాట నిజం. 1816 లో బ్రిటిష్‌వారు నేపాల్‌ను వోడించి తమ "ప్రొటెక్టరేటు" గా ఉండే ఏర్పాటును చేసుకున్న మాట నిజం. కాని భారతదేశంనుంచి బ్రిటిష్‌వారు వైదొలగిన తర్వాత నేపాల్ స్వతంత్ర రాజ్యంగా అవతరించింది. 1950 లో భారత్—నేపాల్‌ల మధ్య జరిగిన ఒడంబడిక ద్వారా ఇది ధృవీకరించారు. విడివిడిగా రాయబారులను నియమించుకున్నారు. సంస్కృతి రీత్యా భారత్—నేపాల్‌ల మధ్యసన్నిహిత సంబంధం కలదని, అవి ఏక ఖండానికి చెందినవని చెప్పకోవచ్చు. గ్రంథాలు వ్రాసుకోవచ్చు. కాని రాజకీయంగా భారత్—నేపాల్‌లు రెండూ రెండు రాజ్యాలు. అందులో నేపాల్ చిన్న రాజ్యం. ఆ భావం దానికి నిరంతరం ఉంటుంది. దానిని గమనించి మరింత జాగ్రత్తగా వ్యవహరించవలసిన బాధ్యత "అగ్రజుని" వంటి భారతదేశంమీద ఉంది. కాని ఆచరణలో అలా జరగనందున నేపాల్ భారతదేశాలమధ్య సన్నిహిత సంబంధాలు నానాటికి దూరమౌతూ వచ్చాయి.

ఇందులో తొలి ఘట్టం. నేపాల్‌లో రాజరికం ఉండని, దాని అభిప్రాయానుసారం రాజ్యపాలన జరగాలనే గుర్తింపుతో భారత అధికారులు ప్రవర్తించకపోవడం. ప్రజా పరిపాలన పేరుతో రాజా అభీష్టానికి విరుద్ధమైన ప్రజా ప్రతినిధులనే వారి పాలన జరపాలని కోరడం, రాజును కాదని, రాజుకంటె ప్రజానాయకులు ప్రధానమని వారితో సరాసరి వ్యవహరించడం వగైరాలన్నీ యీ ఘట్టంలో అంతర్భాగాలే. నేపాలీ కాంగ్రెస్ అనేది నేపాల్‌లో బలం కలిగిన రాజకీయ పక్షంగా ఉంది. స్వేచ్ఛగా జరిగిన ఎన్నికలలో అది రాజ్యానికి వచ్చి 18 నెలలు పాలించింది. ఆ కాలంలోనే శ్రీ కొయిరాలా సోదరులవేవారి రాజకీయాలు నడిచాయి. రాజరికం పూర్తిగా పోవాలనే నినాదం కూడా బయలుదేరింది. ఈ పరిణామాలను గ్రహించిన మహేంద్ర రాజా శ్రీ బి. పి. కొయిరాలా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశాడు. రాజ్యాంగంలోని కొన్ని భాగాలను రద్దుచేసి, రాజ్యపాలనను స్వయంగా చేతబట్టాడు. 1960 డిశంబరులో ఇది జరిగింది. నాటినుంచి భారత్—నేపాల్‌ల మధ్య సంబంధాలు దూరమౌతూ వచ్చాయి. నేపాలీ కాంగ్రెసు ఆధ్వర్యాన నేపాల్‌లో పార్లమెంటరీ ప్రభుత్వ స్థాపనకు ఆందోళన ప్రారంభమైంది. అరెస్టు కాకుండా తప్పించుకొనడానికి కొందరు నేపాలీ కాంగ్రెసు నాయకులు భారతదేశానికి పారిపోయి వచ్చారు. వారిని అరెస్టుచేసి ఇవ్వమని నేపాల్ కోరింది. కాని అలా భారతప్రభుత్వం చెయలేదు. అందువల్ల భారత

ప్రభుత్వం మద్దతుతో నేపాలీ కాంగ్రెసు ఉద్యమం, హింసా కాండ సాగుతున్నదని నేపాల్‌రాజు విశ్వసిస్తూ వచ్చాడు. అయితే గత నవంబరులో కమ్యూనిస్టు చైనా దురాక్రమణ ప్రారంభ మైనప్పుడు నేపాలీ కాంగ్రెసు నాయకులు తమ ఉద్యమాన్ని విరమించారు. కమ్యూనిస్టు చైనా దురాక్రమణ దృష్ట్యా మహేంద్ర రాజు అధికారాన్ని బలపర్చ దలచామని ప్రకటించారు. మహేంద్ర రాజు అధికారానికి తిరుగు లేదని ధృవపడింది. అక్కడితో నేపాల్‌లో రాజరికం—ప్రజోద్యమం—ప్రజా పరిపాలనకు సంబంధించిన ఘట్టం ముగిసింది.

ఇంతకంటె ప్రధాన మైనది రెండవ ఘట్టం. అది నేపాల్ సార్వభౌమాధికారానికి, స్వాతంత్ర్యానికి సంబంధించినది. నేపాలీ కాంగ్రెసు ప్రతినిధులు రాజ్యం చేసినప్పుడు కూడా దీనికి సంబంధించిన వివాదం ఉంది. నేపాల్ సార్వభౌమాధికారాన్ని భారతదేశం నామమాత్రంగా గుర్తిస్తున్నది. కాని, ఆచరణలో నేపాల్ తన రక్షణ క్రింద ఉన్న చిన్న రాజ్యంగా భావించి వ్యవహరిస్తున్నదనే భావం నేపాల్ ప్రజలకు ఉంది. దానికి తగ్గట్టుగానే భారత ప్రభుత్వాధికారులు కూడా తాము సూచించిన విధంగా నేపాల్ వ్యవహరించితీరాలన్నట్టుగా ప్రవర్తించారు. దీనిని నేపాలీలు నిరసిస్తున్నారన్న గుర్తింపు ఆలస్యంగా ఢిల్లీకి కలిగింది. నేపాలీలకు గల ఇందుకు సంబంధించిన అసంతృప్తిని తొలగించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నించవలసింది. అందుకు సహాయపడగల నేపాలీ కాంగ్రెసు ప్రభుత్వము శ్రీ బి. పి. కొయిరాలా నాయకత్వాన ఖాట్మండూలో రాజ్యం చేస్తున్నది. చివరకు కమ్యూనిస్టు చైనా దురాక్రమణ ప్రమాదం తప్పదనుకున్న సమయంలో నైనా ఇందుకు కృషి జరుగవలసింది. కాని ఇదేదీ జరగక పోగా 1959 నవంబరులో ప్రధాని శ్రీ నెహ్రూ లోక సభలో ప్రసంగిస్తూ ''నేపాల్ లేదా భూటాన్‌లపై ఎలాంటి దురాక్రమణ జరిగినా, అది భారతదేశంపైన జరిగినట్టుగానే భావించగలము'' అని ప్రకటించడంతో భారతదేశం పట్ల నేపాలీలకు గల అసంతృప్తి పూర్తిగా బయటపడింది. నేపాల్ సార్వభౌమాధికారాన్ని స్వాతంత్ర్యాన్ని భారతదేశం కాదంటున్నదని నేపాల్ ప్రతిపక్షాలు వ్యాఖ్యానించాయి. ''అవసరమైతే నేపాల్ స్వతంత్రంగా వ్యవహరించగల హక్కును కలిగివున్నది కాని'' ఇప్పటి పరిస్థితులనుబట్టి ఢిల్లీకి అవసరమైన సహాయాన్ని నేపాల్ చేయగలదని ప్రధాని శ్రీ కొయిరాలా కూడా ప్రకటించవలసి వచ్చింది. భారత—చైనాల మధ్య వివాదంలో నేపాల్‌ను ''తటస్థంగా'' ఉంచదలచిన రాజు మహేంద్రకు ఈ పరిణామాలు నచ్చలేదు. ''భారత దేశ శత్రువులందరూ నేపాల్‌కు కూడా శత్రువులే'' అన్న ధోరణిలో వ్యవహరించడం నేపాల్‌లోని పలుకుబడికల కొన్ని వర్గాలకు ఇష్టంలేకపోయింది. ఆ సందర్భంలోనే, ఈ భావానికి అనువుగానే కొయిరాలా ప్రభుత్వాన్ని రద్దుచేసి, మహేంద్ర రాజు స్వయంగా అధికారం స్వీకరించారు. నేపాల్ తన శ్రేయస్సుకోసం స్వతంత్రమైన వైదేశికనీతిని అనుసరించగలదని అలా చేసే హక్కు దానికి కలదని మహేంద్ర రాజు భారత ప్రభుత్వ నాయకులకు స్పష్టం చేశారు. దానికి తగ్గటుగనే గత రెండు సంవత్సరాలలోను అటు చైనాతోను, ఇటు పాకిస్తాన్‌తోనూ స్నేహసంబంధాలను నెలకొల్పుకున్నారు. ఇలా నేపాల్ తన స్వతంత్రాధికారాన్ని నిలబెట్టుకొనడంతో దాని ప్రభావం భారతదేశంమీద ఎంతగా ఉండగలదో గ్రహించడానికిగాను నేపాల్—చైనా—పాకిస్తాన్ సంబంధాలను ఈ సందర్భంలో ఉదాహరించడం అవసరం.

నేపాల్ తన తాటస్థ్యాన్ని నిలబెట్టుకొనడానికిగాను ముందుగా చైనాతో సరిహద్దు ఒడంబడిక చేసుకొంది. దీనికి సంబంధించిన అధికార పత్రాలమీద సంతకాలు జరిగాయి. మహేంద్ర రాజు మొదలు రకరకాల నేపాల్ అధికారులు, మంత్రులు పెకింగుకు వెళ్ళి వచ్చారు. ఈ రాకపోకలు, స్నేహం కేవలం సరిహద్దు స్థిరీకరణతో ఆగలేదు. ఖాట్మండూ నుంచి లాసాకు (టిబెట్ రాజధానికి) పెద్ద రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు జరిగింది. లాసా నుంచి పికింగ్‌కు ఉన్న రహదార్లతో ఇది కలుస్తుంది. ఈ రోడ్డు నిర్మాణంలో సహాయ పడడానికి పెక్కుమంది చైనా నిపుణులు సహాయంగా వచ్చారు. దీనికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా చైనా ఇస్తున్నది. ఈవిధంగా చైనా—నేపాల్‌ల మధ్య రాకపోకల వసతులనేవి ముందుగా పెరుగుతున్నవి. నేపాల్‌లో సిమెంటు పరిశ్రమ వంటివి నెలకొల్పడానికి చైనా సహాయపడగలదనే వార్తలు కూడా వచ్చాయి. మొత్తంమీద రాజకీయ స్నేహానికి మాత్రమే కాక, వర్తక, వాణిజ్యాలు, పారిశ్రామికాభివృద్ధికి కూడా చైనా—నేపాల్‌లు సయోధ్యను ఏర్పరచుకుంటున్నవని దీనినిబట్టి చెప్పుకోవచ్చు. అంతేకాదు, నేపాల్‌లోని గూర్ఖాలు సైనికులుగా జగత్ప్రసిద్ధి చెందారు. ఈనాటివరకు బ్రిటన్ తన సైన్యంలోకి కొందరు గూర్ఖాలను రిక్రూట్ చేసుకొనే ఏర్పాటు ఉంది. కాని ఇకనుంచి ఆ ప్రయత్నాన్ని బ్రిటన్ విరమించడమే కాక, మిగులుగా ఉన్న గూర్ఖా సైనికులను విడుదల చేస్తున్నది. ఇలాంటివారి నందరినీ తమ సైన్యంలో చేర్చుకొనడానికి కమ్యూనిస్టు చైనా ప్రయత్నిస్తున్నది. చివరకు లోకసభలో వినవచ్చిన ప్రశ్నలనుబట్టి భారతదేశం నుంచి నేపాల్ దిగుమతి చేసుకుంటున్న పెట్రోలు వగైరాలు టిబెట్ ద్వారా చైనాకు చేరుతున్నవనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇది నిజమైనా కాకపోయినా చైనా—నేపాల్‌ల మధ్య సర్వ విధాలా సన్నిహిత సంబంధాలు నెలకొన్నమాట నిజం.

పోతే నేపాల్ తాను స్వతంత్రంగా వ్యవహరించగల ననడానికి నిదర్శనంగా పాకిస్తాన్‌తో కూడా స్నేహసంబంధాలను పెంచుకున్నది. ఇందులో వర్తక వాణిజ్యాభివృద్ధి కీలకమైనదిగా ఉంది. నేపాల్ ఎగుమతులలోనూటికి 95 వంతులు భారతదేశానికి పోతున్నవి. మిగిలినవి టిబెట్టుకు చేరుతున్నవి. భారత్—నేపాలుల మధ్య వ్యాపార ఒడంబడిక కూడా ఉంది.

కలకత్తా రేవు ద్వారా నేపాల్ వర్తక వాణిజ్యాలు జరుగుతూ ఉన్నాయి. కాని పాకిస్తాన్‌తో చేసుకున్న ఒడంబడిక ద్వారా నేపాల్ తన ఎగుమతి దిగుమతులకు కొత్త ఏర్పాట్లు చేస్తున్నది. తూర్పు పాకిస్తాన్ మీదుగా రవాణా ఏర్పాట్లను ఉద్దేశిస్తున్నది. నేపాల్ వాణిజ్యమంత్రి శ్రీ చిదానంద్ ఝా చేసిన ప్రకటన ప్రకారం నేపాల్—పాకిస్తాన్‌ల మధ్య రాకపోకలు జరిగే సరుకులు తూర్పు పాకిస్తాన్ సరిహద్దులోని రాధికాపూర్ అనే చోటనుంచి పశ్చిమ పాకిస్తాన్‌లోని వాగ్ అనే చోటనుంచి భారతదేశంలో ప్రవేశిస్తాయి. భారతదేశం మినహా ఇతర దేశాలకు నేపాలీ సరుకులు హెచ్చుగా ఎగుమతిచేసి, ఆయా దేశాల నుంచి అవసరమైన సరుకులను దిగుమతి చేసుకొనడమనేది నేపాల్ ప్రభుత్వం వాణిజ్యవిధానంగా ఉందని కూడా అధికార ప్రకటన జరిగింది. 1963 జనవరిలో జరిగిన నేపాల్—పాకిస్తాన్ ఒడంబడిక ప్రకారం ఢాకా—ఖాట్మండూల మధ్య సరాసరి విమాన సర్వీసు కూడా ఆరంభమైంది. ఈవిధంగా నేపాల్ తన స్వతంత్రాధికారంతో తూర్పు—పశ్చిమ పాకిస్తాన్‌ల మధ్య "వారధి" గా పాకిస్తాన్‌తో వర్తక వాణిజ్య సంబంధాలను పెంచుకున్నది.

ఈవిధంగా రెండేళ్లలోను నేపాల్‌రాజు మహేంద్ర అటు చైనాతోను, ఇటు పాకిస్తాన్‌తోను స్నేహ సంబంధాలను పెంచుకొనడంలోను ఆయనకు గల శక్తి సామర్థ్యాలు, దక్షత ప్రస్ఫుట మయ్యాయి. ఈ ఏర్పాటు పరోక్షంగాను, ప్రత్యక్షంగాను భారతదేశాన్ని నష్టపరచేవి కావచ్చు. భవిష్యత్తులో నేపాల్‌కు కమ్యూనిస్టు చైనా వల్ల రాజకీయ ప్రమాదాలు సులభంగా సంభవం కాగలవని భారత రాజకీయ వర్గాలు హెచ్చరించవచ్చు. భారతదేశాన్ని నమ్మకద్రోహం చేసిన కమ్యూనిస్టు చైనా అటు నేపాల్‌కు, ఇటు పాకిస్తాన్‌కు కూడా సులభంగా అవసరాన్నిబట్టి ద్రోహం చేయగలదని స్వానుభవంతో జోస్యం చెప్పవచ్చు. కాని యిక్కడ మన మొక సంగతి మాత్రం గుర్తించక తప్పదు. ప్రపంచంలోని రెండు అగ్రరాజ్య కూటాల (పశ్చిమ రాజ్యాలు, కమ్యూనిస్టు రాజ్యాలు) మధ్య తటస్థంగా ఉండాలనే విధానాన్ని నెహ్రూ ప్రభుత్వం ఇంతకాలంగా అనుసరిస్తున్నది. ప్రపంచ రాజకీయాల దృష్ట్యా కాక, భారతదేశం ఉనికి, భౌగోళిక అవసరాల దృష్ట్యా ఇలాంటి విధానాన్ని అది అనుసరించవలసిన అవసరం లేదు. అయినా అది అనుసరించింది. కమ్యూనిస్టు చైనావల్ల రాగల ప్రమాదాలను గురించి పశ్చిమ రాజ్యాలు ముఖ్యంగా అమెరికా స్వానుభవంతో చేసిన హెచ్చరికలను కాదన్నది. చివరకు ఫలితాన్ని అనుభవించింది. కాని నేపాల్ పరిస్థితి అది కాదు. ఒకవైపున చైనాకు, మరొకవైపున భారతదేశానికి మధ్య చిన్న రాజ్యంగా నేపాల్ ఉంది. దాని ఉనికి, భౌళిక పరిస్థితుల దృష్ట్యా తటస్థ విధానాన్ని అనుసరించడం తప్పనిసరి. అందుకు నేపాల్ ప్రయత్నించడం సహజం. తటస్థ విధానాన్ని తన వైదేశిక నీతికి మూలసూత్రంగా ఉంచుకున్న భారత ప్రభుత్వం తన పొరుగున ఉన్న "చిన్న నేపాల్" తటస్థ విధానం అనుసరించడాన్ని హర్షించలేకపోవడం అసహజం. కేవలం చైనా, భారత దేశాలతో మాత్రమే కాక, పాకిస్తాన్‌తో కూడా స్నేహంగా ఉండడం, వర్తక వాణిజ్యాలను పెంపొందించుకొనడం కూడా నేపాల్ ఉన్న పరిస్థితులను బట్టి సమర్థనీయం.

ఈ విషయాన్ని ఇప్పుడిప్పుడే భారత ప్రభుత్వం గ్రహించినట్లు కనిపిస్తూ ఉంది. స్వతంత్ర భారతదేశం, స్వతంత్ర నేపాల్‌ల మధ్య సమాన ప్రతిపత్తితో మాత్రమే స్నేహసంబంధాలు నెలకొనడం సంభవం కాగలదని, నేపాల్‌లో ఎలాంటి ప్రభుత్వం ఉన్నా అది నేపాల్ రాజుకు సంబంధించిన అంశమే కాని, భారత ప్రభుత్వానికి ఎలాంటి జోక్యం ఉండరాదని నేపాల్ జాతీయ వాంఛను భారతప్రభుత్వం అంగీకరించాలని భారత రాజకీయ నాయకులు గుర్తించడానికి రెండు సంవత్సరాలు పట్టింది. ఇంతకాలంగా ఢిల్లీ పోయిన పెత్తందారీతనపు పోకడలు హిమాలయ సరిహద్దులలోని మరొక సోదర రాజ్యాన్ని దూరం చేసుకొని, తెచ్చుకున్న నష్టాలు ఆకళింపుకు వచ్చాయి. టిబెట్‌ను కోల్పోవడం మాత్రమే కాక, నేపాల్‌ను కూడా దూరం చేసుకొనడంవల్ల భారతదేశ భద్రతకు తగిలినదెబ్బ యిప్పటితో తీరేది కాదు. అయినప్పటికి తిరిగి నేపాల్‌తో స్నేహ సంబంధాలు నెలకొల్పడానికి భారతప్రభుత్వం ప్రయత్నించడం హర్షనీయము. దేశ వ్యవహారాల మంత్రి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి స్వయంగా ఖాట్మండూకు వెళ్లి నేపాల్ రాజుతోను, ప్రజా నాయకులతోను సమాలోచనలు కొనసాగించి, మహేంద్ర రాజును ఢిల్లీకి ఆహ్వానించి వచ్చారు. నేపాల్ ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో, స్నేహ భావంతో భారతదేశం అర్థంచేసుకొన గలిగిందని నేపాల్ అధికార వర్గాలకు నచ్చజెప్పారు. ఏప్రిల్ నెలలో మహేంద్ర రాజు న్యూఢిల్లీకి రాగలరని వార్తలు వస్తున్నాయి. వీటన్నింటివల్ల నేపాల్—భారతదేశాల మధ్య ఏర్పడిన అపోహలు తొలగిపోయి తిరిగి స్నేహ సంబంధాలు నెలకొనగలవనే ఆశించవచ్చు.

నేపాల్‌రాజు మహేంద్ర యువకుడైనా రాజకీయ చతురుడు. మంచి దూరదృష్టి కలవాడు. తాను స్వతంత్రంగా వ్యవహరించగలనని భారతదేశానికి నిరూపించడంతో ఆయన కమ్యూనిస్టు చైనాకు సన్నిహితమైనట్లుగా కనిపించారే కాని, ఆచరణలో ఆయన నేపాల్‌లో చైనా అనుయాయులకు చోటివ్వని రాజ్యాంగ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ముందుగా నేపాల్‌లో 14 ప్రాంతీయ పంచాయతీలను, (మునిసిపాలిటీలు, తాలూకా బోర్డులు వంటి వాటిని) ఏర్పాటుచేసి, వానినుంచి 90 మంది ఎన్నికయ్యే పద్ధతి ప్రవేశపెట్టారు. ఆరు వర్గ సంఘాల నుంచి 15 మంది, పట్టభద్రుల నుంచి నలుగురు ఎన్నికౌతారు. 16 మందిని రాజు నామినేట్ చేస్తాడు. ఇలా 125 మందితో నేపాల్ పార్లమెంటు ఏర్పడుతున్నది. ఏప్రిల్

14 మంది ఇది పనిచేస్తున్నది. దీనిలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఉన్న వర్గాలను ప్రవేశపెట్టలని నేపాల్‌లోని చైనా సానుభూతిపరులు చేసిన ప్రయత్నాలను మహేంద్ర రాజు త్రోసిరాజన్నారు. తాను నామినేటు చేయవలసిన 16 మంది లోను దురాశాపరులైన రాజకీయ నాయకులకు చోటు లేకుండా చేశారు. నేపాల్ వైదేశిక నీతికి తగిన విధంగానే పార్లమెంటులోను, ప్రభుత్వంలోను నేపాల్ స్వాతంత్ర్యాన్ని కాపాడగల వర్గాలకు మాత్రమే చోటిచ్చారు. ఇలా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే నేపాలి కాంగ్రెసుమీద నిషేధం తొలగించగలరని. జైళ్లలోని రాజకీయ ఖైదీలను విడుదల చేయగలరని వినవస్తున్నది కూడా. ఇలా అటు చైనా, పాకిస్తాన్‌లతో స్నేహ సంబంధాలను అధికారపూర్వకమైన ఒప్పందాల ద్వారా కట్టుదిట్టం చేసుకొని, అంతరంగికంగా దేశంలో రాజకీయ వ్యవస్థను సుస్థిరం చేసుకున్న తర్వాత మహేంద్ర రాజు భారతదేశంతో సమాలోచనలకు, మిత్ర సంబంధాలు బలపరచుకొనడానికి సిద్ధపడుతున్నాడు. ఇందులో ఆయనకు గల భావాలను భారతదేశం గౌరవించి, గుర్తించి వ్యవహరించడం భారతదేశ భద్రతక్కు అవసరం!

హిమాలయ రాజ్యాలలో రాజకీయాలవల్ల కాక "రాజు వివాహంవల్ల" కలవరం తెచ్చింది సిక్కిం రాజ్యం. పూర్వ కాలంలో రాజుల వివాహాలకు, రాజ్యాల కలయికకు సంబంధం ఉండేది. రాజ్య తంత్రంలో వివాహాలు కూడా అంతర్భాగాలుగా ఉండేవి. అంతగా కాకపోయినా, కొంతవరకైనా రాజుల వివాహాలలో రాజకీయ ఛాయలు నేటికీ గమనార్హాలుగా ఉన్నాయి. అందువల్లనే సిక్కిం మహరాజకుమారుడు (వయస్సు 40) ఇరవైమూడేళ్ల వయస్సు గల అమెరికన్ వనిత మిస్ హోప్ కుక్‌ను మార్చి నెలలో వైభవంగా వివాహమాడాడు. ఇది ఆయన రెండవ వివాహం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిగిన తరువాత తొలి భార్య 1957 లో మరణించింది. సిక్కిం మహరాజ కుమారుడు అమెరికా వనితను వివాహమాడడం తగదని సిక్కింలోని కొన్ని వర్గాలు ఆందోళన చేశాయి. సిక్కిం రాజ్యం ఇక "అమెరికా కాలనీ" అయినట్లుగా కొందరు వ్యాఖ్యానించారు. సిక్కిం మహారాజా శ్రీ న్యాంగియాల్ (వయస్సు 70) ఇంకా జీవించి ఉన్నాడు. ఆయన పెద్ద కుమారుడు మరణించినందున రెండవ కుమారుడు శ్రీ గ్యాల్‌సేరింపోచీ రాజ్యభారాన్ని నిర్వహిస్తున్నాడు. ఆయనే అమెరికా వనితను వివాహమాడాడు. సిక్కిం ప్రజలలో నూటికి 70 మంది నేపాలీలు. సిక్కిం దేశీయులను లెప్చాలు అంటారు. వారు అల్ప సంఖ్యాకులుగా ఉన్నారు. నేపాలీల సంఖ్యాబలాన్ని తగ్గించాలనేది సిక్కిం రాజ్యపాలనకు కీలకంగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకు సంబంధించిన రాజకీయాలు కూడా లేకపోలేదు. దానికి తోడు యిప్పుడు జరిగిన రాజకీయ వివాహం సిక్కిం భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలను తెచ్చిపెడుతుందో తెలియదు. కాని సిక్కిం సరిహద్దులలో కమ్యూనిస్టు చైనా తన సేనలను కేంద్రీకరిస్తున్నదనే వార్తలు వస్తున్నాయి. చైనా ఇంత వరకు సిక్కిం హద్దులలోని ఏ భాగాలు తనకు రావాలని కోరలేదు. లడక్‌లోను, నీఫాలోను మాత్రమే విశాల భూభాగాలు తనకు రావాలని కోరుతూ వచ్చింది. బహుశా ఇకనుంచి సిక్కింలో కూడా రావాలని కోరినా కోరవచ్చు. అందువల్లనే సిక్కింలోని పరిణామాలు కూడా గమనార్హాలు.

మరొక హిమాలయ రాజ్యం భూటాన్. 1949 లో భారత్—భూటాన్‌ల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం భారత ప్రభుత్వానికి భూటాన్‌లో కొన్ని అధికారాలు, అవకాశాలు ఉన్నాయి. నేపాల్‌కు ఉన్నంత స్వతంత్ర ప్రతిపత్తి, సార్వభౌమాధికారం భూటాన్‌కు లేనిమాట నిజం. భూటానులో కూడా భూటానీల సంఖ్యాబలం తక్కువ. నేపాలీల సంఖ్యాబలం హెచ్చు. దీనికి సంబంధించిన రాజకీయాలు కూడా ఈ రాజ్యంలో ఉన్నాయి. ఈమధ్య భూటాన్ రాజుకు తీవ్రమైన సుస్తీ చేసింది. దీని ప్రభావం ఈ రాజ్యంలో ఎలా పనిచేస్తుందో చెప్పలేము. కాని భూటాన్‌లో స్టేట్ కాంగ్రెస్ అనే ప్రజాసంస్థ ఉంది. దాని నాయకుడు శ్రీ డి. బి. గురంగ్ ఈమధ్యను గ్యాంగ్‌టాక్ (రాజధాని) నుంచి ఒక ప్రకటన చేస్తూ ప్రజా ప్రభుత్వం, పంచాయతీరాజ్య స్థాపనకు తగిన ఏర్పాట్లు జరగాలని కోరాడు. ఇదీ నేపాల్‌లోని ఏర్పాట్ల ప్రభావమని వేరుగా చెప్పవలసిన అవసరంలేదు. భూటాన్ ప్రధానమంత్రి శ్రీ జిగ్మేదోర్జీ పరిపాలనా పద్ధతులను కూడా ఈయన విమర్శించాడు. మొత్తంమీద చెప్పుకోవాలంటే భూటాన్‌లో రాజకీయ పరిస్థితులు కూడా, చైనా ప్రమాదం దృష్ట్యా అవసరమైనంత సంతృప్తికరంగా లేవని దీనినిబట్టి చెప్పుకోవలసి ఉంటుంది.

నేపాల్, సిక్కిం, భూటాన్‌ల వంటి హిమాలయ రాజ్యాలు కాకపోయినా, హిమాలయ రాజ్యాలుగానే భావించదగిన ప్రాంతాలు ఆ వరసలోనే మరి రెండు ఉన్నాయి. అందులో ఒకటి నీఫా. రెండవది నాగరాష్ట్రం. కమ్యూనిస్టు చైనా దురాక్రమణ కారణంగా సరిహద్దులలోని ఈ రెండు భాగాలలోని పరిస్థితులు కూడా గమనార్హాలుగా ఉన్నాయి. భారతదేశానికి పదిహేను సంవత్సరాలనాడు స్వాతంత్ర్యం సిద్ధించినా, నీఫా అనేది ఎక్కడ ఉన్నదో, దాని పరిస్థితులు ఏమిటో దేశ ప్రజలలో చాలామందికి తెలియదు. బోమిదిల్లా, తవాంగ్ వంటి కీలకమైన సరిహద్దు స్థావరాలు ఇక్కడ ఉన్నాయనేది యుద్ధ వార్తలవల్ల తెలుసుకోగలిగారు. నీఫా ఒక "మ్యూజియం" గా ఉండిపోయింది. దేశంలోని ఇతర ప్రాంతాలవారిని "పర్మిట్" లేనిదే నీఫాలోకి భారత ప్రభుత్వం రానివ్వలేదు. చివరకు భారత సైన్యాలు కూడా అక్కడ లేవని పార్లమెంటులోని అస్సాం పి. ఎస్. పి. సభ్యుడు శ్రీ బారువా ఆరోపించారు. చివరకు నీఫాలో అవసరమైన రోడ్లను కూడా నిర్మించలేదన్నారు. చైనా దురాక్రమణను నివారించడానికి అపూర్వకాలంలో టిబెట్ ఎలా

"బఫ్ఫర్" గా ఉపయోగించిందో, ఇప్పుడు "నీఫా" అలా ఉపయోగ పడుతుందని విజ్ఞప్తి చేశారు. ప్రధాని శ్రీ నెహ్రూ ఈ ఆరోపణలను కాదని నిరాకరించినప్పటికీ, "నీఫా" అభివృద్ధికి భారత ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకొన గలదని హామీ యిచ్చారు. అయితే ఏనాటికైనా "నీఫా"ను అస్సాంలో విలీనం చేయాలన్న ధోరణి ఆ ప్రాంతపు రాజకీయ నాయకులలో కానవస్తున్నా, అందుకు ఇప్పుడు త్వరపడడం మంచిది కాదని అందరూ అంగీకరిస్తున్నారు.

"నీఫా"ను అనుకొని, అస్సాం రాష్ట్రంలో అంతర్భాగంగా ఉన్నది నాగభూమి. స్వతంత్ర భారతదేశం ఆది నుంచి నాగజాతి తిరుగుబాట్లను ఎదుర్కొంటూ వచ్చింది. ఈ తిరుగుబాటుదార్లకు నాయకుడు ఎ. జడ్. ఫిజో బ్రిటన్‌కు పారిపోయాడు. నాగజాతివారిలో లిబరల్ నాయకుల ఆధ్వర్యాన "నాగరాష్ట్రం" నిర్మాణానికి భారత ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయినా తిరుగుబాట్లు దౌర్జన్యాలు ఆగలేదు. ఈ తిరుగుబాటుదార్లకు కమ్యూనిస్టు చైనా గూఢచారులకు సంబంధం కలదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితులలో విప్లవ నాయకుడు శ్రీ ఫిజో బ్రిటన్‌లోని మైకేల్ స్కాట్ అనే మత గురువు ద్వారా భారతదేశం చేరడానికి, ప్రధాని నెహ్రూను కలుసుకొనడానికి ప్రయత్నిస్తూ వచ్చాడు. దౌర్జన్యాలు విరమిస్తే శ్రీ ఫిజోను కలుసుకొనగలనని ప్రధాని నెహ్రూ ఈ నెలలో చేసిన సూచన నాగజాతి లిబరల్ వర్గాలకు ఆందోళన కలిగించింది. వచ్చే ఏడాది నాగరాష్ట్రానికి ఎన్నికలు జరుగనున్నాయి. ఆ ఎన్నికలలో తాను కూడా పాల్గొని, అధికారాన్ని చేబట్టి, అయిదేళ్ల అనంతరం "నాగ రాష్ట్రం" సర్వ స్వతంత్రం కావాలని కోరడం "ఫిజో" వ్యూహంగా ఉంది. ఇందుకు అనుకూల వాతావరణాన్ని భారత ప్రభుత్వం కలిగిస్తే, శ్రీ ఫిజోను భారతదేశానికి రానివ్వడం జరిగితే, నాగభూమిలో కూడా సరికొత్త రాజకీయ పరిణామాలు సంభవం కావడం తథ్యం.

ఈవిధంగా కాశ్మీర్ మొదలుకొని నాగభూమి వరకు గల ఏడు హిమాలయ రాజ్యాలలోని పరిస్థితులు, పరిణామాలు కల్లోల భరితంగాను, కమ్యూనిస్టు చైనా సైనికంగా తెచ్చే దురాక్రమణ కంటె ప్రమాదకరంగానూ ఉన్నాయి. హిమాలయ సరిహద్దులలో భారతదేశంవైపు ఉన్న ఈ పరిస్థితులను అవతల చైనావైపు పరిస్థితులతో పోల్చి చూచినప్పుడు కమ్యూనిస్టు చైనా రాజకీయ చక్రబంధం పూర్తిగా బోధపడగలదు. గత రెండు సంవత్సరాలలోను బర్మా, నేపాల్, పాకిస్తాన్‌లతో చైనా సరిహద్దు ఒడంబడికలు చేసుకున్నది. టిబెట్టును తన అదుపు ఆజ్ఞలలో ఉంచుకున్నది. అఫ్గన్‌స్థాన్‌ను, రష్యాను గూడా సికియాంగ్, సైబీరియా ప్రాంతాలలో సరిహద్దుల స్థిరీకరణకు ఆహ్వానించింది. ఈవిధంగా కమ్యూనిస్టు చైనా తన భౌగోళిక సరిహద్దులను స్థిరపరచుకొని, భారతదేశంతో ఉన్న సరిహద్దుల కోసం రాజకీయ, సైనిక వ్యూహాలు పన్ని వ్యవహరిస్తున్నది. కనుకనే భారతదేశం కూడా సైనిక సన్నాహాలతోపాటు హిమాలయ రాజ్యాలతో కలిసి రాజకీయ వ్యూహాలను కూడా పన్నడం అవసరమవుతున్నది. ఇందుకుగా ఏవిధంగా చూచినా, తిరిగి బ్రిటిషువారి పద్ధతులు (బఫ్ఫర్ రాజ్యాల నిర్మాణం, సరిహద్దు తెగలకు సైనిక తర్ఫీదు యిచ్చి ప్రత్యేక సైనిక దళాల నిర్మాణం, సైనికావసరాల దృష్ట్యా రహదార్లు, స్థావరాల ఏర్పాటు) అనుసరణీయంగా ఉన్నాయి. భారత ప్రభుత్వ లక్ష్యం "సోషలిస్టు పద్ధతి సమాజ స్థాపన" కనుక బ్రిటిష్ సామ్రాజ్యవాద పద్ధతులు స్వతంత్ర భారత దేశానికి తగవని రాజకీయ నాయకులు వాదించవచ్చు. కాని భారత ఉత్తర సరిహద్దులలో పరిస్థితులు దేశంలో సోషలిజం స్థాపన కంటే దేశం మొత్తం భద్రతకు, స్వాతంత్ర్యానికి ప్రమాదం తెచ్చేవిగా ఉన్నవని హిమాలయాలకు అవల నుంచి పూర్వ కాలంలో వలె 24 నెలలు, 24 రోజులలో కాక, 24 గంటలలో పరాయి సైన్యాలు ముందుకు చొచ్చుకొనివచ్చే పరిస్థితులు ఏర్పడి ఉన్నాయని గుర్తించినప్పుడు భారత ప్రభుత్వ రాజకీయ లక్ష్యాలు, సాంఘిక యోచనలు, సైనిక వ్యూహాలు ఎంతగా మార్పు చెందాలో అర్థం చేసుకోవచ్చు.

చ. పారిపోరి మేఁకమాంసములు బొక్కుచు నిక్కుచు సోమయాజివై
సురపురి కేగి రంభకడఁ జొక్కుచు సోలుచుఁ గామయాజివై
ధరణికి డిగ్గియింగ్లిషుకడ దాస్యము సల్పుచు కర్మయాజివై
సారెఁ దిరుగాడు కాని మిము జూడఁడయా శరభాంక లింగమా.

ఉ. గట్టిగ యేవురార్వురను గండడ సేయక, యేడ్గురింతులన్
గొట్టక, ముగ్గురిండ్లు చెడఁగూల్చక యూరక ముక్తులౌదురే
బొట్టులు, బోనముల్, భుజము, పొక్కులు వింతగ వెట్టినామముల్
బెట్టుదు రింతె కాని యివి పేరుకయా శరభాంక లింగమా.

—శరభాంకుడు.

కలగూరగంప

మంచెన కవితా శిల్పము

"రావు"

ప్రాచీనాంధ్ర కథా కావ్యములలో ప్రశస్తమగు కేయూరబాహు చరిత్రమును[1] రచించిన కవి అవధానము మంచిరాజు.[2] తంజావూరి పుస్తక భాండాగారమునగల సంకలన లక్షణ గ్రంథములలో M. 327 (D. 706) సంఖ్య గల లక్షణ గ్రంథమున నిట్లు గలదు.

అవధానము మంచిరాజు కేయూర బాహు చరిత్ర.

"రాజ కళా సరోజ వనరాజమరాళి యుపాయ సాయక
ప్రాజిత శాపశింజిని పరాక్రమ సంప్రాప్త వైరి భూపతి
శ్రీజనయిత్రి ధర్మపరి శిక్షిత వర్తన మేదినీ ప్రజా
రాజ గళత్సు ధారన తరంగిణి యాతని బుద్ధి యారయున్."

ఈ పద్యముముద్రిత కేయూర బాహు చరిత్రమున ప్రథమాశ్వాసము 66 వ పద్యముగా నున్నది.

మంచెన యే యవతారికలో నిట్లు చెప్పుకొన్నాడు.

క. స్థాయి రసము శృంగారం
బై యలవడ కథలు నీతులై యడవెడరా
గేయూర బాహు చరిత్రము
సేయుము నీ "వాంధ్ర కావ్య శిల్పము" మెఱయన్.

"సేయుము నీ వాంధ్ర భాష శిల్పము మెఱయన్" అను పాఠము సరికాదు. వ్రాతప్రతి పాఠము "ఆంధ్ర కావ్య శిల్పము" అనియే.

ఈ శిల్పమున ద్వితీయముగా ద్వితీయపద్యమువందే యెట్లు ప్రదర్శించినాడో చూడుడు.

చ. కరిముఖుఁడశ్వినుల్, శ్రుతులు, కంజసముద్భవు మోము, లంబికే
శ్వరు మొగముల్, తదాత్మజుని వక్త్రము, లాది మునీంద్ర మండలం
బురగపతుల్, గ్రహంబులు, పయోరుహనాభుఁడు, తారకంబులున్
పారిపారి నెల్ల సంపదలు పొలవు గుండని కిచ్చుగావుతన్.

తెలుఁగున నిష్ట దేవతాస్తుతిలో ప్రత్యేక ప్రత్యేకముగా నా యా దేవతలనుగూర్చి పద్యము లుండును. కాని, యొక్క పద్యములోనే నా యా లవతాస్తుతు లన్నింటిని వెట్టిందిమిడించి యున్నాడో వినుడు. ఇం దిష్ట దేవతాస్తుతితో సంఖ్యాలంకార మున్నది.

			సంఖ్య
1.	కరిముఖుడు—గణపతి — ఏకదంతుఁడు		— 1
2.	అశ్వినులు—అశ్వినీదేవతలు—ఇద్దరు కవలు		— 2
3.	శ్రుతులు—వేదములు — మూఁడు		— 3
4.	కంజసముద్భవు మోములు	బ్రహ్మముఖములు—నాలుగు—	4
5.	అంబికేశ్వరు మొగములు	ఈశ్వరుని ముఖములు ఐదు—	5
6.	తదాత్మజుఁడు (కుమారస్వామి) వక్త్రములు	కుమారస్వామి ముఖములు ఆరు	6
7.	ఆది మునీంద్ర మండలము	సప్తమహర్షులు. ఏడు	— 7
8.	ఉరగపతుల్—అష్టనాగములు ఎనిమిది		— 8
9.	గ్రహంబులు—నవగ్రహములు—తొమ్మిది		— 9
10.	పయోరుహనాభుఁడు—విష్ణువు. ఈతని యవతారములు పది—పది		— 10

తారకములు—నక్షత్రములు—అసంఖ్యాకములు.

11. నన్నయ చేసిన యిష్టదేవతాస్తుతిలో "హరిహరాబ్జగజాననార్క షడాస్యమాతృ సరస్వతీ గిరి సుతాదిగ దేవతాతతి" యను పద్యగరగమునగల, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు నిందు గలరు. గజాననుడు గలడు. గ్రహములు అనుటచే సూర్యుఁడు—కంజ సముద్భవు మోము లనుటచే సరస్వతి—పయోరుహ నాభుడనుటచే పద్మ నివాసిని—లక్ష్మి—అంబికేశ్వరు డన్నప్పుడు గిరిసుత ఇందు సూచితులైరి. తక్కిన "దేవతాతతికి" తారకములు నక్షత్రము—లన్నియు దేవతా స్వరూపములే.

ఇక సంఖ్యా పద్ధతి ననుసరించిన—విష్ణువు దశావతారములు—సంఖ్యాపర గణనము—'దశ' పది నుండి లెక్కిం

---

1 కేయూర బాహు చరిత్ర తొలుత క్రీ. శ. 1902 లో 'సరస్వతి' అను పత్రిక యందు ప్రకటితమై యావెనుక క్రీ. శ. 1960 వరకును లభ్యము కాకుండెను. ప్రసిద్ధ పరిశోధకులు, ప్రస్తుతము వేంకటేశ్వర విశ్వ విద్యాలయమున వాంధ్రోపన్యాసకులుగానున్న శ్రీ తిమ్మావఝ్ఝల కోదండ రామయ్య, ఎమ్. ఏ., బి.ఒ.యల్., గారు దీనిని పునర్ముద్రణము గావించిరి.

2 'మంచెన' అనునది సరియగు రూపము.
శ్రీ రమణుండు మంచెన పండితయ్య
గారి

బసవ పురాణము పుట 117.

తురు. తెలుఁగు కావ్యములలోను శాసనములలోను దశశత—దశ లక్ష—దశకోటి యిట్లు దశసంఖ్యతో ప్రారంభము. అసంఖ్య లనంత ములు—విష్ణుమూర్తి యనంతుడు—విశ్వమంతయు విష్ణు మయము—"సర్వం విష్ణుమయం జగత్" అని సూక్తి—"విశ్వం వేవేష్టి వ్యాప్నోతీతి విష్ణుః" అని వ్యుత్పత్తి.

పౌరాణిక విజ్ఞానము.

ఏకదంతుఁడు :— గణపతి యేకదంతుఁడగు కథయు గజానను డగుటయు గూడ తెలియవలెను.

అశ్వినులు:— దేవ వైద్యులు—యమడలుగా జన్మించిరి.

బ్రహ్మ ముఖములు:—తొలుత యైదు ముఖములు. శివుడు బ్రహ్మ పంచమ శిరమును ఖండించినాడు.

ఈశ్వరుని ముఖములు:— ఈశాన్య, అఘోర, వామదేవ, తత్పురుష, సద్యోజాత ముఖములు. ఈ ముఖోద్గతములైనవి పంచ బ్రహ్మ సూక్తులు. ఇది శైవ సాహిత్యమున ప్రచురము.

విష్ణువు దశావతారములు:—మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, భృగురామ, రామ, బలరామ, కృష్ణ, కల్కియవతారములు (బౌద్ధావతారము తరువాత చేరినది).

ఈ పది యవతారములు, సృష్టిక్రమమును—మానవా విర్భావమును—మానవ సమాజ వికాసమును సూచించును.

వేద శాస్త్ర సాహిత్య విజ్ఞానము.

1. అశ్వినులని చెప్పుట వైద్య శాస్త్రము.
2. శ్రుతులు—ఋగ్యజుస్సామములు—వేద విజ్ఞానము.
3. కుమారస్వామి మొగములారును షడంగములను, షడ్దర్శనములను తెలుపును.
4. అష్ట నాగములలో శేషు డుండుటవలన—వ్యాకరణ శాస్త్రము.
5. నవగ్రహములు—జ్యోతిశ్శాస్త్రము నవ గ్రహములు చెప్పుటచే "సూర్యాదీనాం నవగ్రహాణాం" అని సూర్యుని స్తుతి సూచితము.
6. "తారకంబులున్" అని చెప్పుటచే సమస్త దేవతానీకము కృతిపతిని బ్రోచుగాక యనియు, తారకములవలె కృతి పతి యశస్సు తారకా మండలము వలె నిత్య ధవళాయమానమై ప్రకాశించుగాక యనియు కవి హృదయము.

పై పద్యమున "పరిపరి" యనునది, "పునః పునః" అను సంస్కృత శబ్ద వికృతి—మాటి మాటికిని యని యర్థము.

"మంచెను కరిముకురంబున పంచాక్షరిలో శివ ప్రపంచము భంగిన్" అనునట్లుగా నొక్క పద్యముననే ఇంతటి శిల్పము, విజ్ఞానము సంతరించి, మంచెన కవుల నెందరినో మించినాడు.

మన ప్రాచీన కావ్యములనెంత జాగరూకతతో, శ్రద్ధతో పఠించి, యవగాహన చేసికొనవలెనో చూపుటకు మాత్రమే ఈ చిన్ని వ్యాసము.

స్త్రీ వర్ణన

సీ. ఉత్తుంగ కర్కశ వృత్త్య స్తనంబుల
నద్వైత భావన యతిశయిల్ల
నత్యంత శూన్యతా యత్తమధ్యంబున
నాస్తిక తత్త్వంబు విస్తరిల్ల
స్నిగ్ధారుణాధరముగ్ధాధరంబునఁ
బ్రాభాకరా పూర్వశోభ దొలక (దొలఁక)
విటమనోపి దళన స్ఫుట కటాక్షంబులం
భేద సిద్ధాంతంబు పెంపుమిగుల
గీ. మేనవైశేషిక ప్రథ గానఁబడఁగ-నొప్పుదురు వారకామిని లప్పురమునఁ
దలఁప కేవల కామశాస్త్రంబె గాదు-నిఖిల శాస్త్రంబులును నిందు నెగడుననిన.

—ముమ్మయ-విష్ణుకథానిధానము.

గ్రంథ విమర్శనము

భారత విజయము

(ఆరంకముల నాటకము. కర్త: విద్వాన్ బులుసు వేంకటేశ్వరులు. ఎం. ఏ. ఆంగ్లభాషోపన్యాసకులు. పీఠికాపుర రాజా ప్రభుత్వ కళాశాల. కాకినాడ. ప్రకాశకులు : బి. వి. అండ్ సన్స్, రామారావుపేట, కాకినాడ. వెల : రు. 2 —)

నాటకాన్ని చదివిన మీదట దీనిని సమీక్షించడం అవసరమా అన్నదే ఒక సమస్య అయింది. ఈ నాటకం వ్రాయడంలో కవి ఉద్దేశ్యము (కవి హృదయం) ఏమోగాని, ఆయన, ఆయన చిత్రించిన పాత్రలు కూడా నవ్వులపాలు అవడం తథ్యం. 1962 లో కూడా ప్రభుత్వ విద్యాలయాలలో బాధ్యతాయుతమైన పదవులలో ఉన్నవారు, కేంద్ర సాహిత్య అకాడమీవారి బహుమతిని (అనువాద గ్రంథానికి) పొందినవారు ఇలాంటి రచన చేయడం అనూహ్యం. పాఠకులు నేడిలాంటి రచనలు కూడా వస్తున్నాయని తెలుసుకొనడం కోసం దీనిని సమీక్షించవలసి వస్తున్నది.

"జాతీయ సమైక్య స్థాపనలో చైనా దురాక్రమణము నెదుర్కొనుటలో భారతదేశము సాధించిన విజయమును సమీక్షించు ఆ రంకముల నాటకము." ఈ "భారత విజయము. వీరు ఈ నాటక రూపేణా చేసిన సమీక్షలో అందరి కళ్ల ముందు నేడు జరిగిన జరుగుతున్న అసలు సంఘటనలు ఏవీ లేవు. ఈ నాటకములో ఉన్న పాత్రలు సమకాలిక నాయకులు. భారత అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, భారత ప్రధాన మంత్రి. ప్రధానమంత్రే కథానాయకుడు. వీరుగాక ఇంకా యిద్దరు సహచర మంత్రులు, కవులు, రాయబారులు (వీరు భారతీయులు కారేమో అన్నట్లు) మరి "ఇరువురు భారతీయులు" కూడా దర్శన మిస్తారు. నాయకు డంటూ ఒక డున్నప్పుడు నాయకి లేకపోతే నాటకం చిన్నబోయి, కేవలం పోతు పేరంటాళ్ల బృందంతో (సూత్రధారుడు, సర్వ పక్ష సభా ప్రతినిధులు ఎనిమిది మందితో సహా పురుష పాత్రలు ఇరవైతో) నిండిపోయి నాటకం రక్తికట్టక రసాభాసగ మారే ప్రమాదం ఉన్నది కాబట్టి ఒక నాయకిని కూడా ప్రవేశ పెట్టారు. ఈవిడే లక్ష్మీసమానురాలైన శ్రీమతి ఐక్య లక్ష్మి. (క్షమించాలి. నాటకంలో ప్రత్యేక్షంగా గాని, పరోక్షంగాని పెళ్లి పీటల దృశ్యం ప్రసక్తే లేదు కాబట్టి ఈవిడను లక్ష్మీసమానురాలైన శ్రీమతి అని పిలువడం ఎంతవరకు సబబో చెప్పలేము.) ఐక్యలక్ష్మి ఒక్కతే ఐతే అన్ని హంగులతో వి:హవేదనాభావ విజృంభణను ప్రదర్శించడానికి మంచి అవకాశం ఉండదు కాబట్టి, ఈ "లక్ష్మి" ఇద్దరు చెలికత్తెలతో సహా తయారవుతుంది. నాటకం నడచినకొద్దీ ఈ 'లక్ష్మీదేవి" లక్ష్మీవ్రత కల్పంలో వచ్చినట్లు ధనలక్ష్మిగా, ధాన్యలక్ష్మిగా, సౌందర్యలక్ష్మిగా, సౌఖ్య లక్ష్మిగా, రాజ్యలక్ష్మిగా ఇంకా ఇంకా సహస్రనామస్తోత్ర వర్ణనలను అందుకుంటుంది. ఇంతకూ ఈవి డెవరో ! పరాయి స్త్రీ మాత్రం కాదు. చైనా సాగించిన దండయాత్ర ఫలితంగా భారత ప్రజలలో ఏర్పడిన సమైక్య స్వరూపిణి. ఈవిడ విరహవేదనాది విచిత్ర విషయాలకు తర్వాత వద్దాము.

నాటకకర్త నాందీ గీతాలాపనలోనే సూత్రధారుడిచేత "ధర్మ ప్రతిపాదకుండు విబుధాశేష ప్రపూజ్యుండు లోకాధారుడు విరోధి నిర్దళన శౌర్య స్థైర్య వీర్యుండు, సుస్వాధీనేంద్రియుడు ఆత్మశోధన కళాపారీణుడై ఒప్పు శ్రీ రాధాకృష్ణుడు రుక్మిణీ రమణుడు" అని దధిప్రయోగ 'నమస్కారబాణం' వేయించారు. దాంతో "ఒక్క రక్తపుబొట్టు భూమిపై బడకుండా, ఒక్క తల అయిన గరకు గత్తుల నరుకబడకుండగనే తలవని తలంపుగా స్వాతంత్ర్యము సంపాదించుకొన్న..." భారతమాత అదృష్ట గాథ (ఇదే నాటక ఇతివృత్తం) ప్రారంభమవుతుంది. మేధానిధి, తత్త్వశాస్త్ర పారంగతుడు, సౌమ్య స్వభావుడు, విశ్వవిఖ్యాత విజ్ఞానవేత్త యామెకు (భరతమాతకు) అధ్యక్షుడైనందుకు "సూత్రధారుడు ఆమె అదృష్టాన్ని శ్లాఘిస్తుండగానే, తెరలోపలి నించి "హో ఘాతుక కిరాతకులారా ! కృతఘ్నులారా ! వినుడు !" అంటూ ఒక పెడబొబ్బ వినిపిస్తుంది. అదెవరిదో కాదు, భారత ప్రధానామాత్యునిదే !

".... చైనీయుల బాధ్యతారహిత దుర్వ్యాపార దుష్కృత్య దుర్మద దుస్తంత్ర దురాక్రమణోద్ధతి నడంపన్, బుద్ధి చెప్పంగ నెమ్మది మువ్మాటికి నిశ్చయించి" నట్లుగా ప్రధానమంత్రి చైనా ఘాతుకులను, కిరాతకులను, కృతఘ్నులను హెచ్చరిస్తూ :

"జననము నందితిన్ భరతజాతిని సత్యము ధర్మమున్
　　　　దయన్
వినయము శాంతి మైత్రిని వివేకము నోర్మి సహింప
　　　　నాకును
గ్నన గడు రంగరించి కృప గూరిమిబెట్టిను భార
　　　　తాంబనే
మనియెడు పంతకాల మది మానక నవ్వరించి
　　　　యుండెడిన్.

అని స్వగతంగా ఒక పద్యం ప్రేక్షకుల మీదికి విసురుతూ రంగస్థలి మీద ప్రవేశిస్తారు ప్రధాని.

ఇంతటితో ఆగక ఇలా ప్రబోధిస్తారు :—

మును నీ భారతభూమి నేలిరి మహా పుణ్యాత్ములై ధీరులై
ఘన రాజర్షులు వీర శాంతియుత మార్గంబందు నా దారినే
చనియున్నార లశోకు డాదియగు రాజన్యుల్ సదా నేను వా
రినె యాదర్శముగా గణింతు భరతోర్వీసేవ గావింపగన్:

వెంటనే మిత్రద్రోహులైన చైనావారిని,
విడువము, మీ దురాక్రమణ వెంటనె మీరు త్యజింప కున్నచో
రుడు మది బుద్ధిగల్గి మను డొప్పుగ వెన్కకు బొండు పోని చో
నడుగిక వేయజాల రిది యార్య పవిత్ర ధరిత్రి మా ప్రజల్
పాడుతురు మిము మాదమూన పోడిమి మీ కిక, సిగ్గు చేటుగన్.

అని మరొకసారి గద్దిస్తారు ప్రధాని. ఇలా నాటకంలో మొత్తం 18 పద్యాలు పాడుతారు.

"మా భారతజాతి నిర్విక్ర పరాక్రమ మింక మీరు రుచి చూడగలరు. మేము సహజముగా శాంతికాముకులము. మమ్ము దురాక్రమణచే మీరు రెచ్చగొట్టుట కొరివితో తల గోకికొను టే ...... మే మెుకరి జోలికి బోము. అక్రమముగా నొకరు మా జోలికి వచ్చిన సహింపము. మీ రవలంభించిన దురాక్రమణ పద్ధతి అన్ని విధముల అక్రమము. అన్యాయమునకు దాత్కాలిక విజయము వచ్చిన వచ్చుగాక, శాశ్వత జయము న్యాయముదే ...... పరకాంతా, పరాక్రమణదోషము లెట్టివారినైన గట్టి కుడుపక విడువవు. ఒకవంక అకారణ యుద్ధాగ్నిజ్వాలలు రేపుచు మరియొకవంక సంధి రాయబారములు నడుపు మీ చాకచక్యమును మీరే మెచ్చుకొనవలయును." అని శాప వాక్యాలు పలికి నాటకం నడిపింపడానికి కర్తవ్యోన్ముఖు లవుతారు కథానాయకుడు ప్రధాని.

ఆయన మధ్యమధ్య "నడకను, జ్ఞప్తిని కుడికన్ను అదురుటను అభినయించి అధ్యక్ష, ఉపాధ్యక్ష మహాశయుల సందర్శనాభిలాషులై రంగస్థలంలోనే ఆసీనులై ఉన్నవారిని కలుసుకుంటారు. వా రుభయులు ఆనంద పారవశ్యంలో ఇచ్చే ఆశీర్వాదాలు అందుకుంటూ :

తొల్లిటి ధర్మరాజునకు దోడయి యెప్పుడు నీడయై కృపన్
నల్లరితోపదేశ నయసంగతి గూర్చిన కృష్ణు నట్లు మీ
రెల్లపుడున్ ననున్ గనగ నెంతయొ ధైర్యము పూని నేను నా
యుల్లమునన్ దలంతు మిము నొప్పుగ నూతనశక్తి నందుదున్.

అని ధైర్యం తెచ్చుకుంటారు. ప్రపంచమంతా చైనానే గర్హిస్తున్నదని చెప్పి ధైర్యాన్ని మరింత వృద్ధి చేసుకుంటారు.

భారతమాత దివ్య పద పద్మములన్ భజియించుచుండు టే
కోరికగాగ తత్సుఖముకోసమె త్యాగము లెన్నొనే మన
స్సార నొనర్చియుండు నెడ నస్మదభీష్ట ఫల ప్రపూర్ణతన్
భారతమాత శాత్రవుల బారగ ద్రోలి సుఖించు గావుతన్.

అని గత త్యాగాలను ఒకసారి స్మరించుకుంటారు.

"నిదుర పోవను నే నొక్క నిమిషమైన
తిండి తిన నింక భారత దేశమాత
క్రూర చైనీయులన్ బారద్రోల జాలి
శాంతి నలరారు దాక విశ్రాంతిగొనను

అని శపథం చేస్తారు. ప్రధానామాత్య ప్రవేశదృశ్యమైన దీనితో ప్రథమాంకం సమాప్తమవుతుంది.

రెండవ అంకంలో 'ఐక్యలక్ష్మి' చెలికత్తెలతో విరహ వేదనతో సాక్షాత్కార మవుతుంది.

మొదటి చెలి : సఖి ! ఇంక నెంతకాలమే ?
ఐక్యలక్ష్మి : ఏమి ?
మొదటి చెలి : ఈ ఒంటరిపాటు.'

ఐ. ల : మీ రుండనే యున్నారు గదా ! ఒంటరిపా టెట్లగును ?

రెండవ చెలి : ఉండవలసినవా రుండవలయును గాని మే మున్న నేమి లాభము ?

ఐ. ల : ఏమి హాస్యములే !

మొ. చెలి : ... అఖిల కళల నారి తేరితివి, సర్వాంగ సౌందర్యము సంతరించుకొంటివి, జాతి యైక్యమునకు నిరంతర కృషి చేయుచు నీకై విరహతాపమున మగ్గు భారత ప్రధాన మంత్రిని బరిణయమాడి రత్నము రత్నమున జేరిన ఛనిపించు

ఐక్యలక్ష్మి : నే నాతనిని వెదకికొనుచు బోనా ?

మొ. చె : చెలి ! రత్న మెుకరిని వెదకికొనుచు బోనక్కర లేదు. రత్నమునే అందరు వెదకికొనుచు వత్తురు, అతడు నీకై పలవించుచున్నాడు.

అంతట ఐక్యలక్ష్మి భారత ప్రధానామాత్యుని గుణగణాదులను చెలికత్తెలు వర్ణించగా విని సంబరపడతుంది. అతి పవిత్రమై, సస్యశ్యామలమై, సర్వ సౌందర్య శోభితమైన భారతభూమి ఆ మహానాయకుని పుట్టినిల్లని కూడా ఐక్యలక్ష్మికి చెలికత్తెలు విడమర్చి చెబుదురు. "యావత్ప్రపంచనేతలను మే మెరుగుదుము. వారిలో నీకు వలసిన గుణములు తక్కువ. భారత ప్రధానమంత్రి అదృష్టము మంచిది" అంటారు చివరకు ప్రధానామాత్యుడి పుట్టినిల్లు భారత దేశం అని కూడా చెప్పించుకోవలసిన ఈ ఐక్యలక్ష్మి జన్మస్థానం భారతదేశం కాదేమో అనే సందేహం కలగడం సహజం.

ఇలా చెలికత్తెల పలుకులు వినినకొద్దీ తన మనసు ప్రధానామాత్యుని మీదికి పరుగులిడుతున్నట్లు ఐక్యలక్ష్మి చెప్పుకుంటుంది దీనితో రెండవ అంకం సమాప్తం. విష్కంభం ప్రారంభ మవుతుంది.

గ్రంథ విమర్శనము

"ఇద్దరు భారతీయులు" ప్రవేశించేది ఈ విష్కంభ సన్నివేశంలోనే. "ఒక్కమాటలో చెప్పవలెనన్న అమెరికా అధ్యక్షుని సతీమణితో మన ప్రధాన మంత్రి చేయి చేయి కలిపి విహార యాత్రకు వెడలినాడన్న (అమెరికా సందర్శన సందర్భంలో) ఆ అధినేతకు, ఆతని సతీమణికి మన ప్రధాన మంత్రిపై నెంత గౌరవమో తెలియుటలేదా ?" అంటాడు ఈ ఇద్దరు భారతీయులలో ఒకరు. ఇలాంటి వికృతమైన అభిరుచిని ఏమనాలి? ఇదే భారతీయ తాత్వికదృష్టి కాబోలు.

ఇక మూడో అంకం న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయ దృశ్యం. శత్రువును ఎదుర్కొనడానికి ప్రజలు ధనకనక వస్తు వాహనాలను కురిపిస్తున్నందుకు హర్షిస్తున్న ప్రధానమంత్రి రంగభూమి మీద కన్పిస్తారు. ప్రజలకు తనపై అపారమైన గౌరవ మున్నందుకు మురిసిపోతూ వారి ఋణం ఎలా తీర్చుకోడమా అని లోలోన మథనపడు తుంటాడు.

ప్రపంచమును సమైక్యపరచి శాంతిభద్రతలను స్థాపించి మానవత్వమును నిల్ప యథాశక్తి ప్రయత్నిద్దామని ఉద్దేశించినా పౌరుషానికి దైవం తోడుకానిదే లాభంలేదని ఒకవైపు కొంత నిర్వేదం చెందుతూ మరొకవైపు "సమైక్యలక్ష్మి విమలపాణిగ్రహణమున గాని తమ కోరిక తీరదని" ప్రధాని ప్రకటించుకుంటారు. దేశదేశాల రాయబారులు తమ తమ ప్రభుత్వాలు పంపిన అనుకూల లేఖలు అందజేయడంతో కొంత వూరట చెందినట్లు కనిపిస్తారు. ఐక్య అరబ్, ఘనా అధ్యక్షుల సంధి సూత్రాలను చైనా తిరస్కరించిన ప్రసక్తి వస్తుంది.

"కుదుటపడెన్ మనంబది, అకుంఠిత ధైర్యముకల్గెనా కెటో
ఒదవు సమైక్యలక్ష్మి యిక, వోర్మివహించుచు నింట గెల్చి యా
పిదపనె రచ్చ గెల్చెదను...వీరరణం బొనరించి దుష్ట దు
ర్మదులగు శత్రులన్ దునిమి మాన్యముగా విజయంబు
గాంచెదన్."

చతుర్థాంకమంతా భారతాధ్యక్షుని అధ్యక్షతను సర్వపక్ష మహాసభ జరగడంతో పూర్తి అవుతుంది. సభలో పాల్గొన్న ఎనిమిది పక్షాల ప్రతినిధులు నేటి అవాంతర స్థితిలో పాలక వర్గంతో తీవ్ర భేదాభిప్రాయా లున్నప్పటికీ, ప్రభుత్వాన్ని తాము బలపరుస్తామని ప్రకటిస్తారు. అధ్యక్షులవారి గీతాశ్లోక ప్రబోధంతో సభ జయప్రద మవుతుంది. ప్రధానామాత్యుడు సభా విజయాన్ని మహాప్రసాదంగా స్వీకరించి కర్తవ్య నిరూఢుడ నవుతా నంటారు.

కవికుమారుల మృదుమధుర గానాలాపాల మధ్య ఐదో అంకంలో ఐక్యలక్ష్మి "చెలులారా ! ! ఈ భారత రాజధాని ఎంత మనోహరము" అంటూ చెలులతో ప్రత్యక్షమై రెండు పద్యాలు విసిరి "భరతధాత్రి జనియించు వారలె ధన్యులుకదా!" (ఈ గ్రంథకర్తలాంటివారు కూడ భరతధాత్రి జనింతురు). అని సంతోషంతో పొంగిపోతుంది. ఏకాంతంగా ఏదో ఆలోచించుకుంటున్న ప్రధానమంత్రిని చూచి, ఆయనకు మాత్రం తాము కనుపించకుండా తన "తిరస్కరిణీ విద్యను" ప్రయోగించి ఒక దివ్య తేజోరూపంలో తన అంశను ప్రధానమంత్రి మీద ప్రయోగిస్తుంది. ఇక్కడ ఐక్యలక్ష్మి, చెలికత్తెల వింతు సంభాషణ కేవలం చిరస్మరణీయం. (57 వ పేజీ)

"ఐక్యలక్ష్మి :—చెలులారా ! అదే భారత ప్రధాన మంత్రి ప్రాయమున ముదుసలి యయ్యు ప్రజ్ఞను పడుచువాడై యేకాంతముగ నేదో యాలోచించుచున్నాడు. ఇదే యదను. నేను నా యంశ నాతనిలో ప్రవేశింప జేసెదను. అతడిక విజయ పరంపర సాధింపగలడు.

రెండు :—పోవుదము.

మొద :—మంచిది నడు.

రెండు :—మన మాతని కెదురేగిన నాతడు మనల గనగొనడా ? మన మాతని యెదుటబడుట మంచిదగునా ?

మొద :—చెలియన్నమాట నిజమే.

ఐక్యలక్ష్మి :—మీరు జంక నక్కరలేదు. నా తిరస్కరిణి విద్యచే మనల నాతడు కనుగొన జాలకుండును. మన మాతనిం గనుగొనవచ్చును.

మొద :—బాగు, బాగు. సరి. నడువుడు.

ఐక్యలక్ష్మి :—చెలులార చూడుడు. ఇదే తేజోరూపమున నా యంశ నాతనిపైకి బంపుచున్నాను. మీరు చూచుచున్నారు కదా !

రెండు :—అదిగో ! దివ్యజ్యోతి ! చూచుచున్నాము. సఖి! జయము జయము.

మొదట :—ఆహా కన్నులు మిరిమిట్లు గొలుపుచు నా కటాక్ష దీధితి అదిగో ! భారత ప్రధానమంత్రి నావేశించుచున్నది.

ఐక్యలక్ష్మి :—ఆవేశించినది.

రెండు :—ఇపు డాత డేమనుకొనుచున్నాడో విందము.

(ప్రవేశము. దూరమున ప్రధానమంత్రి.)

ప్రధాని :—నేనీ క్షణమున ఒడలు తెలియని ఆనంద మనుభవించుచున్నాను. కవిపుంగవులు వచ్చి మంగళగాన మాలపించి వీరత్వ స్ఫోరకమగు ఉద్బోధ మొనరించి వెడలిరి. ఐక్యలక్ష్మి ఆవహించినటు న్నది. హృదయము కలకదేరినది ...." ఈ ధోరణిలో పూర్తవుతుంది పంచమాంకము.

"ఏమిది ! నేటి నడిరేయినుండి యుద్ధ మాపివేయుదురుట" అని సహచర మంత్రులతో ప్రధాని ప్రారంభించిన సంభాషణతో ఆరంభమయ్యే షష్ఠాంకము, "భారతమాత శాంతి సుఖ సౌభాగ్యము గాంచి నిరంతరాయమేపారుత ! భారత ప్రజలు వాంఛితసిద్ధి గడింత్రు గావుతన్" అని ప్రధాని పాడే భరతవాక్యంతో అధ్యకులవారి తథాస్తు వచనంతో నాటకం సమాప్త మవుతుంది.

ఇదీ ! ఈ నాటకము చేసిన భారత విజయ సమీక్ష.

—భార్గవ

తెలుగు రచయితల సభ

అఖిలభారత తెలుగు రచయితల ద్వితీయ మహాసభ; ప్రత్యేక సంచిక. ¼ క్రౌను సైజున మొత్తం 250 పుటలు. వెల: నాలుగు రూపాయలు. ప్రచురణ : మహాసభ సంపాదక వర్గము, రాజమండ్రి.

1963 జనవరి 4, 5, 6 తేదీలలో రాజమహేంద్రవరములో అఖిలభారత స్థాయిని తెలుగు రచయితల మహాసభ జరిగింది. ఆ మహాసభలో డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారు ఆవిష్కరణము చేసినదే ఈ సంచిక. మార్చి నెలలో వెలువడింది. అప్పటికీ యిప్పటికీ యింత ఆలస్యమైనందుకు, మహాసభ విశేషాలు, కార్యదర్శి నివేదిక, మహాసభలో వివిధ విభాగాలకు అధ్యక్షత వహించిన ప్రముఖుల ప్రసంగ వ్యాసాలు చేర్చారు. 65 శీర్షికలు గల యీ వ్యాసముల సంపుటిలో 50 రచనలు తెలుగులోను, రెండు తెలుగు లిపిలో నున్న సంస్కృతములోను, 12 ఇంగ్లీషులోను ఉన్నవి. చివర తిరిగి తెలుగులో ప్రతినిధులలో "ఎవరెవరో" తెలియజేసే సంగ్రహ సూచికలో 254 గురు రచయితల గూర్చిన వివరణ మున్నది.

ఈ సంచిక సంధానకర్త "కనక్‌ప్రవాసి", సంపాదకులు తెలికిచెర్ల వేంకటరత్నంగారలు. అధిక ప్రయాసతో దీనిని సమకూర్చినట్లు ప్రతి పుట వ్యక్తపరుస్తున్నది. ప్రకటనలు కూడ పుష్కలముగా లభించినట్లు 42 ప్రకటనకర్తల అకారాది సూచిక తెల్పుచున్నది. మహాసభలో పాల్గొన్న రచయితల ఛాయా చిత్రాలు విడివిడిగాను కలిసి కట్టుగాను కూడ ప్రకటించారు. ఇంగ్లీషులోను, తెలుగులోను మహాసభల గూర్చి సమీక్ష ముందు వెనుకలలో ముద్రించినారు. ఈ తెలుగు రచయితల సంచికలో తెలుగు శాఖకు ఉపన్యాసములు, ప్రసంగములు మొదలయినవి ప్రకటించిన పిదప, మొదటి రచన ఆస్థానకవి శ్రీ కాశీ కృష్ణాచార్యులుగారి సంస్కృతాశీర్వాదము, చివరి రచన శ్రీ సుదర్శనగారి సంస్కృత—ఆశంసనమ్.

రాజమహేంద్రవరమును గూర్చి శ్రీనాథకవి భీమఖండము, కాశీఖండములలో చెప్పిన సీసపద్యములతోపాటు, చిలుకూరి వీరభద్రశాస్త్రిగారి పద్యములు కూడ మున్నవి. ప్రస్తుత యుద్ధ పరిస్థితులను ప్రతిబింబించే రచనలలో దాశరథీ రచించిన స్వాతంత్ర్యరక్ష, జమదగ్ని ఆవాహనము చెప్పదగి యున్నవి. మిగిలిన పద్య రచనలలో "జ్యోతిర్మయి" అని కరుణశ్రీ రచించిన పద్యములు, 'దారిచూపు దయాజ్యోతీ' యని జి. పుల్లమాంబ "**Lead Kindly light**" అను గీతమునకు చేసిన స్వేచ్ఛానువాదము చదువదగినవిగా మున్నవి. రచయితల ప్రత్యేక సంచికలో పద్యముల ప్రకటన అవసరమా యని కొందరికి తోచవచ్చును.

గద్య వ్యాసములలో ఆలోచనల పురికొల్పు వ్యాసములు చాల సేకరించినారు. ముఖ్యముగా సి. నారాయణరెడ్డిగారు ఇంగ్లీషు కవిత్వములో కాల్పనికోద్యమం (రొమాంటి సిజమ్ అని వారి భావన) గురించి వ్రాసిన వ్యాసం, ఆధునిక సాంఘిక నాటకాలలో అనుకరణ గురించి పోరుంచి యజ్ఞన్నశాస్త్రి గారి వ్యాసం, సనత్సుజాతీయము, భగవద్గీత, తన భారతములో తిక్కన చూపిన విధానము గూర్చి రామకోటిశాస్త్రి గారి వ్యాసము, ఖండకావ్య సంకలనములు గురించి శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి వ్యాసం, నన్నయ అక్షరరమ్యత గూర్చి వి. వి. యల్. నరసింహారావుగారి వ్యాసము, ఆలోచనలు పురికొల్పేవిగా ఉన్నవి. ఇతర భాషా సాహిత్యాలను వాటి ప్రభావాన్ని పరిచయం చేసే వ్యాసాలు కొన్ని వేయడం సముచితంగా ఉన్నది. వీనిలో ఆధునిక కన్నడ నవల గూర్చి కె. సుబ్బిరామప్ప, తెలుగుపై హిందీ ప్రభావం గూర్చి పిశిపాటి సూర్యనారాయణగారు, వంగసాహిత్యం తెలుగులోకి వస్తూన్న తీరుతెన్నులు గూర్చి 'స్ఫూర్తిశ్రీ' తెలుగు—ఒడియా గూర్చి పురిపండా అప్పలస్వామిగారల రచనలు ఎన్నో క్రొత్త విషయాలు తెలియపరుస్తున్నవి. తెలుగులో ఆధునిక ఛందస్సుగూర్చి శ్రీసంపత్కుమార, రాయలనాటి కథా కథన కౌశలము గూర్చి శ్రీ దివాకర్ల వేంకటావధాని, ఆధునిక విజ్ఞాన పరిమితత్వం గూర్చి వసంతరావు వేంకటరావుగారలు వ్రాసిన వ్యాసాలు పరిశోధనాత్మకమైనవి. రచయితల సమస్యలు చర్చించే వ్యాసాలలో తెలుగు పుస్తకముల ప్రచురణ గూర్చి మహీధర జగన్మోహనరావుగారు వ్రాసిన వ్యాసములు కొన్ని కఠోర సత్యములు నిష్ఠురమైన నిజం చెప్పినట్లున్నవి. రచనలపై బ్రతకడం గురించి కనక్‌ప్రవాసి, సాహిత్య—సంస్థలు సమస్యలు గూర్చి శ్రీ పోతుకూచి సాంబశివరావు రచయితలకు ముఖ్యమైన మరికొన్ని విషయాలు చర్చించారు. ఇంగ్లీషు వ్యాసాలలో రాయప్రోలువారు దేశభక్తి కవిత్వము గురించి వ్రాసిన వ్యాసం, అమరేంద్ర కథానిక గూర్చి చేసిన సమీక్ష, బుచ్చిబాబు నవలల్లోని సామాజికత గూర్చి చేసిన చర్చ, దిగజారిపోతున్న అభిరుచుల గూర్చి ఆచంట జానకిరామ్ వెలిబుచ్చిన ఆవేదన ముఖ్యముగా చదవ దగినవి. కాన్ఫరెన్సు విశేషాలు—పోతుకూచి సూర్యనారాయణగారు రిపోర్టు చేసిన పద్ధతి సంగ్రహ రూపములో సమగ్రత ప్రదర్శించినది.

తెలుగు రచయితల మహాసభకు వెళ్లినవారు, వెళ్లనివారు తప్పక చూడవలసిన ప్రత్యేక సంచిక. ఈ సంచిక పైకి చూడడానికి అంత ఆకర్షణీయంగా లేకపోయినా లోపల ఆలోచనాత్మకమైన విషయములు తీర్చి దిద్ది ప్రకటించినందుకు దీనికి కారకులైనవారు అభివందనీయులు.

విరివాన

హిందీలో బిహారీ కవి వ్రాసిన "సత్‌సయీ" అనే పద్య కావ్యమునకు తెనుగు అనువాదము. రచయిత : చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి. ప్రచురణ : లక్ష్మీనారాయణ గ్రంథమాల, 24 ఏ, రాధాంబా నివాస్, తాండవరాయగ్రామణి వీథి, తండయారుపేట, మద్రాసు—21. 1/8 క్రౌను సైజున 260 పుటలు. వెల : మూడు రూపాయలు.

గ్రంథ విమర్శనము

బిహారీ కవి హిందీ సాహిత్యములో రీతి కాలమునకు చెందినవాడు. ఇది రచించి మూడువందలయేండ్లయినను, హిందీ భాషలో మిక్కిలి విఖ్యాతిగన్న గ్రంథము. ఇది ఏడు వందల పద్యములలో శాలివాహన గాథా సప్తశతి వలె చాటువులతో నడిచిన శతక గ్రంథము. గాథా సప్తశతివలె దీనిలో శృంగారరసమే ప్రధానము. ఇందలి యితివృత్తము, రాధాకృష్ణుల శృంగారలీలా విలాస వర్ణనము. అలంకార శాస్త్ర గ్రంథముల చెప్పిన లక్షణములు గల నాయికా నాయక భేదములు, అవస్థా భేదములు ఉపలక్షించుకొని, ఒక్కొక్క పద్యములో ఒక్కొక్క అర్థాలంకారమును తెలియపరచిన లక్షణ గ్రంథము వంటిది. దీనినే 'రీతి' కావ్యమని హిందీలో పిలుతురు. బిహారీ రచనపైన ఎన్నో వ్యాఖ్యానములు వచ్చినవి. ఈ కవి గ్వాలియర్ సంస్థానములో 1594 లో జన్మించి, అమేర్ ఘడ్ పాలకుడైన రాజా జయసింహుని ఆస్థానము నలంకరించి, రాజు పనుపుననే యీ సత్సయి రచించినట్లు చెప్పుకొనెను. ముందు రాజదర్శనము దొరకక తికమక పడి యీ క్రింది పద్యము వ్రాసి పంపెనట.

పుప్పొడి హుళక్కి—పూదేనె మొదలె కల్ల
పూర్ణ వికసన మంతకుమున్నె సున్న
ఇట్టితతి మొగ్గకే పెట్టు కట్టు వడితి
తేటి ! నీ గతి ముందెట్లు తెల్లవారు ?

ఈ పద్యము విని రాజు కవికి దర్శనమిచ్చి యిట్టి పద్యము లెన్ని వ్రాసిన అన్ని సువర్ణము లిత్తునని వాగ్దానము చేసెనట. కవి 700 పైనే పద్యములు వ్రాసెనట. ఇదొక కథ. సరస శృంగారరస భూయిష్ఠమైన యీ సప్తశతిలో హాలుని గాథల పోలికలు, అమరుకములోని పద్యముల పోలికలు విరివిగా కనుపించును. దీనిపైన వెలువడిన వ్యాఖ్యానములలో లాలా భగవాన్‌దీన్ రచించిన బాలబోధినీ వ్యాఖ్య ననుసరించి, పద్యములు పద్యములుగాను, అవతారికా వివరణములను గద్యములుగాను అనువాదకులు రచించినారు. 'బిహారీ' శైలిలోని మార్దవము చెడకుండ అట్టి తేటదనము, తీయదనము తేరుకొనునట్లు చల్లా లక్ష్మీనారాయణశాస్త్రిగారు తెనుగుచేసి తెనుగుదనము దీపింపజేసినారు. దీపకాలంకారమును చూపు ఒక పద్యము మచ్చునకు

ప్రియుని పలు నొక్కులకుఁ గంది వెలది యధర
మతివ ! యెరుపెక్కి దొండపండయ్యె నేమొ !
పెదవి దడవుచు, దుడుచుచు విఱిచికొనుచు
నద్దమున జూచికొనుచుండు నహరహమ్ము.

కావ్య మంతయు ఇట్టి శైలిలోనే నడిచినది.

కావ్యమునకు మొదట బిహారీ కవిని పరిచయముచేయు పీఠికను ముట్నూరి సంగమేశముగారు రచించినారు. ఇది 'రీతి' కాల సాహిత్యముపై చక్కని సమీక్ష. ఇంక కవిగారు తెనుగు అనువాదమునకు 'విరివాన' యని పేరు పెట్టినందులకు ఏడు పూల జల్లులుగా మొగలిపూలు, మల్లెపూలు, తామరపూలు, పొగడపూలు, సంపెంగపూలు, జాజిపూలు, గులాబీపూలు అని విడదీసి వేశారు.

ఇట్టి శృంగార గ్రంథమును రసికు లెల్లరూ చదివి ఆనందించగలరు. అట్టివారికి "బుధజన పాదరేణువు" గా కవి గారు చేసిన మనవి ఆలకించండి.

పాయని భక్తి రాధికను
    పంకజనేత్రుని, కృష్ణ నాయికా
నాయకుల౯ బొనర్చి—రచ
    న౯ బచరించిన మా బిహారి భా
షాయుత పద్య సప్తశతి
    జక్కని చిక్కని వాణి లక్ష్మి నా
రాయణశాస్త్రి ఆంధ్రమున
    వ్రాసె—జవుల్ గొను డింక పాఠకులు.

సంక్రాంతి ముగ్గులు

పెద్ద కథ. రచన : ఇనుకపల్లి లక్ష్మీనరసింహాశాస్త్రి. ప్రచురణ: నవ్యభారతి ప్రచురణ. 760, హిమాయత్ నగర్, హైద్రాబాద్—29. పుస్తకము 1/8 క్రౌను సైజులో 47 పుటలు. వెల : 90 నయాపైసలు.

బహుజన పత్రిక నుండి పునర్ముద్రితమైన యీ పెద్ద కథ ఇద్దరు స్త్రీల చరిత్రను గురించినది. ఒకతె మంగ, రెండవ ఆమె లలిత. ఇద్దరూ—భర్తలతో కాపురం చేస్తున్న వనితలే. సంక్రాంతికి పుట్టింటికి వచ్చి—తిరిగి కాపురానికి వెళ్లడమా, మానడమా అనే మీమాంసలో పడి—విడాకులా ఆత్మహత్యా అని నిర్ణయం చేసుకోలేక, ఎందుకయినా భర్తతో కాపురమే నిశ్చయించుకొని తిరిగి వెళ్లినవాళ్లు. ఈ కథ చెప్పడంలో, రచయిత ఎదుట, ఆ యిద్దరు పాత్రలూ ప్రత్యక్షమైనట్లు, అందులో రెండవది అయిన లలిత, మొదటి స్త్రీ అయిన "మంగ" లాగ అతని చేతుల్లో బొమ్మలాగ ఆడలేనని చెప్పి, చివరికి మొదటి స్త్రీ లాగే చేస్తుంది. ఆమె అతన్ని చెయ్యి పట్టుకుని ఆపేసిందిట. త్రుళ్లిపడి ఎవరు నువ్వు అని మనసులో అడిగాడుట. దానికి లలిత సమాధానం "నేనే—నువ్వు వ్రాస్తున్న లలితను" అంటుంది. దానికి సమాధానం చివరి పుటలో—ఆత్మశక్తితో ధైర్యంగా భవిష్యత్తులో నమ్మకంతో ముందుకి సాగిపో—విడాకుల చట్టాన్ని—దాన్ని అమలు చేసుకోవలసిన దౌర్భాగ్యులకు వదలివెయ్యి—అని సలహా యిస్తాడు. లలితకు మెచ్చుమాటలు చేసి—ఏం చెయ్యాలో తనకు తెలుసునని వెళ్లిపోతుంది. కాగితాలు దగ్గరకు తీసుకుని గబగబ నవల పూర్తిచేశాను అని కథకుడు ముగిస్తాడు. ఈ కథ—పత్రికలో వేసింది కాక పుస్తకరూపం దాల్చవలసిన అవసరం కన్పించదు. "నువ్వు వ్రాస్తున్న లలితను నేనే" వంటి వాక్య నిర్మాణము చేసే రచయిత ఎటువంటి భాష వ్రాస్తారో దీనినిబట్టి వూహించుకోవచ్చును. ఇలాంటి రచయితలు, నవలలు, కథలు వ్రాసేదానికంటె తెనుగు వాక్యాలు బాగా వ్రాయడం నేర్చుకోవడం మంచిదనిపిస్తుంది ఈ కథ చదివితే.

అనుభవానికి హద్దులు

రచన : చంద్రమౌళి. ఆంధ్ర విశ్వసాహితి అనుబంధ ప్రచురణ—'ఆంధ్రజనత' నుండి పునర్ముద్రితమైన యీ నవల పుస్తకరూపంలో 1/8 క్రౌను సైజున 132 పుటలు. వెల: రూపాయిన్నర.

ఈ నవల రచయిత మొదటి రచన కాకపోయినా ప్రచురణ పొందిన తొలి రచన యిదేనట. "మూడు నాలుగు ఇతర భాషలలో ఉన్న పరిచయాన్ని అభివృద్ధిచేసి సాహిత్యసేవ చేయాలనే ఆకాంక్ష" ఉన్నట్లు అట్టమీద బొమ్మ క్రింద పరిచయం చేస్తూ వ్రాసుకున్నారు. అలాంటి ఆకాంక్ష ఉన్నందుకు, మూడు, నాలుగు యితర భాషల పరిచయంతోబాటు ముందుగా తాను రచనలు సాగించే తెనుగు భాషతో మంచి ప్రవేశం కలిగించుకోవడం అవసర మనిపిస్తుంది. ఈ చిన్న నవలలో ప్రతి పంక్తిలోను వర్ణక్రమ దోషాలు కొల్లలుగా వచ్చినపుడు అవన్నీ వీరు పరిచయం చేసిన ఆఖరి పాత్ర ముద్రారాక్షసుడి తప్పులుగా పరిగణించలేము కదా! 'యౌవ్వనం', 'సుస్థీ', 'మెలకువ', 'కాకండా' 'ఆతృత' లాంటివి లెక్కకు మిక్కిలిగా నున్న స్పెల్లింగు తప్పులు ఈ కాలపు పాఠకులకి దిద్దుకోవడం కష్టమే. రచయిత—నవలలో వచ్చే పాత్రలను పరిచయం చేశారు కాని—నాటకాని కైతే అలాంటి పాత్రల సూచిక ఈయవచ్చు కాని, నవలలో అది గడుసుతనం అనిపించుకోదు. పైగా—కథ అంతా—కథానాయకుడు ప్రసాద్ స్వగతంలో 'ఫ్లాష్‌బ్యాక్' లో—స్వప్న విభ్రాంతిగా చూపించాడు. కాలానికి సరిహద్దులు కట్టే నవలా రచనలో ఈ రెండూ కూడా అంత తెలివైన పనులు కావు. పైగా రాబోయే కథలోని గమ్మత్తు పట్టి యిచ్చేస్తాయి. "బ్రాహ్మలం బాబు ఒక అణా డబ్బులు ధర్మం చెయ్యండి" అని బిచ్చ మడిగిన ఒక పేదరాలిని యింటికి తీసికొనివచ్చి ఆదరించిన ఒక గృహస్థు "దాహం" అవీ యిచ్చి మేము బ్రాహ్మలం కాము అని చెప్పబోతాడు. ఆమె దేవూరు అంటే చీరాల అంటుంది. చీరాలలో చిరకాలం క్రితం తనకు తెలిసిన స్నేహితుడు సత్యం, ఆ సత్యాన్ని పెంచి పెద్దది చేసిన దత్తత తల్లి వర్ధనమ్మ జ్ఞాపకం వస్తారు. అతని కన్నులముందు వెనుక చరిత్ర, సినీమా చక్రంలాగ తిరిగిపోతూ కడచిన అనుభవాలు జ్ఞాపకానికి తెస్తాయి. ఆ యనుభవాలన్నీ అనేక రకాల స్త్రీలతో. ఆ స్త్రీలతో అనుభవాలకి కారకుడైనవాడు ప్రసాద్‌కి మరొక స్నేహితుడు ప్రకాశం. ఇతడూ, అతడూ, మరొక సుకుమార్ మెడికల్ రిప్రజెంటేటివ్స్. మందులమ్ముకొంటూ అనేక నగరాల సంచారం చేయడంలో వారికి అనేక స్త్రీలు పరిచయం అవుతారు. ముఖ్యంగా యావజ్జీవం బ్రహ్మచారిగా ఉండిపోయిన ప్రకాశానికి రకరకాల స్త్రీలతో అనుభవం కలుగుతుంది. కొందరితో అనుభవాలకి హద్దు లేర్పడ్డాయి. ఆ కొందరిలో హాస్పిటల్ నర్స్ ప్రభావతి, స్టూడెంట్ ఉష, భర్తచాటు పతివ్రత సరస్వతి, ఇలాంటివాళ్లంతా ఉంటారు. వీళ్లంతా పరిస్థితుల ప్రభావం పొందిన వనితలు. వీరితో పరిచయం ప్రేమానుభవాలు ప్రసాదుకి కూడ కలుగుతాయి. ఇవన్నీ తప్పించుకొని చివరికి 'రాజ్యం' అనే పేల్సు గరల్‌ను కలుసుకొని ఆమెను తన జీవన భాగస్వామిని చేసుకొంటాడు.

ఈ కథ సభ్యత చెడకుండా కథకుడు బాగానే చెప్పుకొనిపోయాడు. దీనిలో పరిచయమైన స్త్రీలు, పురుషులు ఆధునిక సమాజంలో మధ్యతరగతి మంచితనానికి మచ్చుతునకలు. అయినా వారి అనుభవాలు హద్దుమీరి చెడ్డ చేయిస్తాయి. ఈ నవలలో కథ—పూర్వ స్మృతి లాగున ఉత్తమ పురుషైక వచనంలో చెప్పించేదానికంటే అనగనగా ఒక రాజు అనే ధోరణిలో చెప్పిస్తేనే బాగుండేది. ప్రస్తుత స్వరూపంలో 'నవల' అనేదానికంటే పెద్ద కథ అనడం మంచిది.

"తన రచనలు చదివినవాళ్లంతా నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలు తెలియజేయమని అతని కోరిక" అని పుస్తకం వెనుకట్టమీద వ్రాశారు కనక—ఈయన నవలలు కథలు వ్రాసేముందు—తెలుగు పలుకుబడిని, తెనుగులో సంభాషణలను తాము వ్రాసింది ఒకసారి తామే చదివి చూచుకొంటే మంచిదనిపిస్తుంది.

నేటి సమాజము—ఆ సమాజములో తిరుగుతున్న సభ్యజనం ఎలాగ పతనమై పోతున్నదీ చిత్రించిన యీ నవలలో అనుభవాలకి హద్దులు పెట్టుకున్నందుకు రచయితను అభినందించాలి.

శ్రీ వాత్సవ.

గ్రంథ పరిచయము

1. వెన్నుపోటు: వల్లూరి వెంకట రత్నమాచార్యులు బి. ఏ. (భాషా ప్రవీణ) చైనా యుద్ధసంబంధ రచన. 8 పుట లభిప్రాయములు, 12 పుటలు పద్యములు. ప్రాప్తిస్థానము: సాహిత్య సేవా సదనము, కోనేటిపురము—వయా భట్టిప్రోలు—రేపల్లె తాలూకా. వెల 25—న. పై.
2. రత్నమాల: శారదా రచయిత సమితి, రాజాం (విశాఖ జిల్లా) వారి ప్రకటితము. పలువురి పద్య రచనలు—32 పుటలు. వెల: అమూల్యము. ప్రతులకు సమితి చిరునామా.
3. బంగారు. కే. సభా. వచన రచన, 5 శీరికలు. రమణా పబ్లిషర్సు—హైరోడ్, చిత్తూరు. పుటలు 58. వెల: 1—25 న. పై.
4. శ్రీ మాలా. సంస్కృతము. తిరుక్కోవలూరు మహాస్వామి శ్రీ కుమార ఆది వరహాచార్య రచితము, చీరాల. 49 శ్లోకములు టీకా తాత్పర్యములతో ముద్రితము. పుటలు 49. వెల అమూల్యము. ప్రతులకు డి. వి. రాఘవస్వామి, ఆరండల్‌పేట, 4వ లైను, గుంటూరు—2 అని వ్రాయవలెను.

గ్రంథ విమర్శనము

5. క్షయాధిమాస నిర్ణయః—సంస్కృతము—నాగరలిపి. జ్యోతిశ్శాస్త్ర విషయికము—పిడపర్తి చిన కృష్ణ మూర్తిశాస్త్రి ప్రణీతము. వెల తెలియదు. ప్రతులు వలయువారు గ్రంథకర్త, జ్యోతిష పండితుడు, గవర్నమెంటు మహారాజ సంస్కృత కళాశాల, విజయనగరము అని వ్రాయవలెను.

6. బ్రహ్మ విచారము. వేదాంతపారీణ కవి శేఖర విద్యానాథ మిన్నికంటి గురునాథశర్మ విరచితము. వేదాంత విషయికము. వచనము. పుటలు: 148. వెల: 3 రూ. దొరకుచోటు: గ్రంథకర్త, బ్రాడీపేట, 5 వ లైను, 15 అడ్డరోడ్డు, గుంటూరు—2.

"బ్రహ్మ విచారము" అను ఈ గ్రంథము గంభీరమైన వేదాంతార్థమును ప్రతిపాదించునది. కాబట్టి గ్రంథకర్త ప్రశ్నలు సమాధానముగ మూలమున—వేదాంత విషయము లను సరళముగ, సముచిత సులభశైలిని పాఠకలోకమున కందిచ్చియున్నాడు. ఇది యెంతయు మెచ్చదగినది. వేదాంత విషయములు ప్రపంచించుటకు కొంత యధికారము, ప్రామాణికత యావశ్యకము. ఈ రెండును ప్రస్తుత గ్రంథకర్తలగు శర్మగారి కడ పూర్తిగా నున్నవని చెప్పవచ్చును.

7. ఓదార్పు. కర్త నల్లూరు వేంకట రత్నమాచార్యులు, బి. ఏ. ప్రస్తుత పరిస్థితుల ననుసరించిన 23 పద్యముల కృతి. దీనిపై అభిప్రాయములు 8 పుటలు. వెల: 25 న. పై. గ్రంథకర్త, కోనేటిపురము, వయా భట్టిప్రోలు, రేపల్లె తాలూకా, గుంటూరుజిల్లా.

8. గీతాంజలి. అనువాదకుడు, ఇలింద్ర రంగనాయకులు. ప్రిన్సిపాలు, యస్.యస్ అండ్ యన్. కళాశాల, నరసారావుపేట, వచన గీతికలు. వెల: 2 రూ. ప్రకాశకులు మారుతీ బుక్ డిపో, గుంటూరు—1.

9. మహా శివరాత్రి మహాత్మ్యము. పశు వైద్యాచార్య, వైద్యరాజ డాక్టరు గొర్రెపాటి వెంకట నరసయ్య. వచనము. కథ ప్రసిద్ధము. పుటలు 20. వెల: 25 న. పై. దొరకుచోటు శ్రీ కదళీపుర గ్రంథమాల, పెద కళ్లేపల్లి, కృష్ణాజిల్లా.

10. సమరగీతి. కవితా సంకలనము. సమీకర్త: వే. నరసింహారెడ్డి. ప్రస్తుతాత్యవసర పరిస్థితుల కనుకూలముగ మహాకవుల, కవుల పద్య రచన లిందు గలవు. పుటలు: 61. వెల: 1—25 న. పై. ప్రతులకు: నాగార్జున బుక్‌డిపో, నారాయణగూడ, హైదరాబాదు.

11. సఫల జీవనము: తిపిర్నేని లక్ష్మినారాయణ. ప్రసిద్ధ తత్త్వవేత్త జేమ్సు ఎలన్‌గారి యాంగ్ల గ్రంథమునకు స్వేచ్ఛానువాదము. వచనము. 52 పుటలు. వెల: 1 రూ. ప్రతులకు: రామకృష్ణ గ్రంథమండలి, పటమట, విజయవాడ—6.

12. జీవనపథము. రచయిత: తిపిర్నేని లక్ష్మినారాయణ. విఖ్యాత తత్త్వవేత్త జేమ్సు ఎలన్ భావములకు తెనుగున వచనానువాదము. 87 పుటలు. వెల : రూ. 1.25 న. పై. ప్రచురణ కర్తలు: వేంకటరామా అండ్‌కో, విజయవాడ.

13. మన గురుదేవుడు. రచయిత: కొండూరి వీరరాఘవాచార్యులు. శ్రీ విరాట్పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర. వచనము. 152 పుటలు. వెల: 2 రూ. ప్రకాశకులు, బ్రహ్మంగారిమఠం, కందిమల్లయపల్లె.

14. ముకున్దమాల: కులశేఖరాళ్వారు. సంస్కృతమునకు నాంధ్ర పద్యానువాదము. కీ. శే. భట్టారం మల్లికార్జున కవికృతము. కుమారి దేవతా చెంచు సరస్వతి ఎమ్. ఏ. పరిచయము గలది. వెల: 0—50 న. పై. ప్రచురణకర్త: వేలనూతల శ్రీకృష్ణమూర్తి, మూలపేట, నెల్లూరు.

15. వేంకటేశ ప్రపత్తి. చల్లా లక్ష్మినారాయణశాస్త్రి రచితము. ఇందు వేంకటేశ ప్రపత్తి, వేంకటేశ్వర శతకము, అష్టోత్తర శతనామావళి, పద్మావతీస్తుతి, మంగళాశాసనము, పద్యములలో నున్నవి. అన్నీ వేంకటేశ్వరా మకుటము గలవి. వెల: 60 న. పై. ప్రాప్తి స్థానము: 24—ఏ, రాధాంబా నివాసము, తాండవరాయ గ్రామణివీధి, తండియార్పేట, మద్రాసు—21.

16. ఉన్నమాట. రచయిత: జోస్యము జనార్దనశాస్త్రి. "ఉన్నమాట జోస్యమన్నమాట" అని గ్రంథకర్త పేర నంకితమైన ఆటవెలది పద్యములు. లోకవృత్తము దెలుపునవి. పుటలు: 147. వెల: 2 రూ. ప్రాప్తి స్థానము: జోస్యము జనార్ధనశాస్త్రి, తాడిపత్రి.

17. కాళిదాస సమీక్ష. మహాకవి కాళిదాసును గూర్చిన సంస్కృతాంగ్ల వ్యాసముల సంపుటి. శ్రీ తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయమువా రేర్పాటుచేసిన 'కాళిదాస సమీక్ష' సమావేశమున విద్వాంసులు చేసిన యీ క్రింది యుపన్యాసము లిందు గలవు.

సంస్కృత భాష

1. ఆంధ్రాస్థాన కవి కాశీ కృష్ణాచార్యులవారి యధ్యక్ష వచనము.

2. పండితరాజ డి. టి. తాతాచార్యులవారి యుపన్యాసము. అధ్యక్ష వచనము.

సంస్కృతాభిభాషణములు


1. పి. వి. సుబ్రహ్మణ్యశర్మ. మేఘ సందేశము.

2. కే. దక్షిణామూర్తి. రఘువంశము.

ఆంగ్ల భాష

3. డాక్టరు కె. సి. వరదాచార్యులుగారి యుపన్యాసము, అధ్యక్ష వచనము.

మా వ్యాసకర్తలు



శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి

కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా ఈదుల మద్దాలి గ్రామములో 1918 లో జన్మించారు. విద్యార్హతలు—యం. ఎ. సంస్కృతము. యం. ఎ. తెలుగు. విద్వాన్. పి. ఒ. యల్. (అలంకార) పి. ఒ. యల్ (ద్రావిడభాషాశాస్త్రము.)

వీరు రచించిన భువన విజయము 1954 లో ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు నిర్వహించిన నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందినది. 1956 లో ఈ విశ్వవిద్యాలయంవారు నిర్వహించిన నవలా రచనల పోటీలో కూడ వారి "గృహరాజు మేడ" కు ప్రథమ బహుమతి వచ్చినది. మల్లికార్జున శతకము, రాజరాజేశ్వర శతకూలను కూడ రచించిరి. వీరి ప్రధాన రచన "జీవుని వేదన."

శ్రీ శ్రీరామమూర్తిగారు ప్రస్తుతము కరీంనగరం ప్రభుత్వ కళాశాలలో ప్రధాన సంస్కృతాంధ్రాధ్యాపకులుగా ఉన్నారు. అలంకారశాస్త్రము, అద్వైత వేదాంతము అంటేవారికి అభిమానము హెచ్చు. సాహితీ వ్యాసంగము వీరి ప్రధానవ్యాపకము.

గమనిక :—మార్చి సంచికలో ఆదివిష్ణువుగారి తండ్రి పేరు లింగయ్యగారు అని ఉంది, అది పొరపాటు. వారి తండ్రి పేరు శ్రీ నాగయ్యగారు.



నాట్యాచార్య శ్రీ జగన్నాథ్ శర్మ

1819లో జన్మించారు. బాల్యంనుంచి గురుకుల క్రమాగత విద్యగా నాట్యకళను అభ్యసించారు. 1916 లో కర్నాటక హంపీ విజయనగర్‌కు చెందిన శ్రీమంతు శ్రీ రంగదేవరాయలవారికి అంకితముగ, వారి పూర్వులు అళియరామదేవరాయలు (1565) వారి ఏలూరు భిల్లేదారు తోదరమల్లరామ మంత్రి రచించిన "స్వరమేళ కళానిధి" అనే సంస్కృత సంగీత లక్షణ గ్రంథాన్ని ఆంధ్రీకరించారు. అందుకు ఆ ప్రభువు సత్కరించి "బాల భారత" బిరుద ప్రదానం చేశారు. 1919 లో కళింగ విజయనగరం మహారాజుగారి సంగీత కళాశాల స్థాపించిన నాటినుంచి దానిలో పనిచేశారు. 1914 నుంచి 1916 వరకు ఆంధ్రోద్యమ ప్రచార సంచార కార్యదర్శిగాను, 1916 నుంచి 1919 వరకు గ్రంథాలయోద్యమంలో సంచార కార్యదర్శిగాను పని చేశారు. కొంతకాలం శ్రీ బులుసు సాంబమూర్తిగారికి సహోద్యోగిగాను, ప్రజా సేవా రంగంలో కుడిభుజంగాను ఉన్నారు. 1923 లో కాకినాడలో అఖిల భారత జాతీయ కాంగ్రెసు 38 వ మహాసభ జరిగినప్పుడు విజయనగర సంస్థానంవారి అనుమతి మీద ఆ మహాసభ ఆహ్వాన సంఘ కార్యాలయంలో శిరస్తాదారుగా పని చేశారు. విద్యాభిలాషకు అడ్డు తగులుతున్నందున అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగాఉండిపోయారు. గ్వాలియర్ మహారాజా కుటుంబానికి నాట్యోపాధ్యాయులుగా "ఉషాకిరణ్" రాజ ప్రసాదంలో ఉన్నారు. 1954 లో ఏకైక కుమారుడు భారతి (వయస్సు 35) మరణంతో "ప్రచ్ఛన్న జీవితం" ఆరంభించారు. ప్రస్తుత నివాసం తూర్పు గోదావరిజిల్లా, రామచంద్రపురం. డబ్బైఏండ్లు నిండినా, ఇప్పటికీ విద్యార్థిని అనే వీరిభావం. "తెలియనప్పుడు తెలిసికొనుట, తెలిసిన సంస్కృతిలో మునిగి పోకుండుట" అనేది జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.